



# మనసులో మాట

KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక






ప్రచురణ:-విశాఖపట్నం:- పబ్లిషర్ కంచర్ల ఉపేంద్ర :- సంపుటి:1 సంచిక: 144 బుధవారం 14 జనవరి 2026:- ఎడిటర్ కంచర్ల అచ్యుతరావు:-పేజీలు 22 :- వెలరూ/ 7-

శ్రీకాకుళం : విజయనగరం : విశాఖపట్నం: తూర్పుగోదావరి : పశ్చిమగోదావరి : కృష్ణా: గుంటూరు : ప్రకాశం : నెల్లూరు : కర్నూలు: కడప: హైదరాబాద్


## ప్రారంభానికి సిద్ధంగా ప్రధాని కార్యాలయం

**సర్వాంగ సుందరంగా రూపు దిద్దుకున్న కొత్త ఆఫీస్**

**సేవాతీర్థ్‌లోకి త్వరలోనే మారనున్న మోడీ**



ఢిల్లీలో ప్రతిష్టాత్మక సెంట్రల్ విస్టా ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన ప్రధానమంత్రి కొత్త కార్యాలయం ప్రారంభానికి సిద్ధ మైంది. రైసినా హిల్ సమీపంలో అత్యాధునిక సౌకర్యాలతో రూపుదిద్దుకున్న ఈ భవన సముదాయంలోకి ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెలలోనే మారే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. నిర్మాణ దశలో 'ఎగ్జిక్యూటివ్ ఎన్‌క్లేవ్' గా పిలిచిన ఈ సముదాయానికి కేంద్ర ప్రభుత్వం 'సేవా తీర్థ్' అని నామకరణం చేసింది.

3



# చంద్రబాబుకు భారీ ఊరట

## స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో కీలక పరిణామం

## కేసును కొట్టేసిన విజయవాడ ఏసీబీ కోర్టు

**స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో నిధుల దుర్వినియోగం ఆరోపణలతో కేసు**

**ఈ కేసులో 53 రోజుల పాటు జైల్లో ఉన్న చంద్రబాబు**

**అమరావతి :** స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు భారీ ఊరట లభించింది. ఈ కేసులో ఆయనతో పాటు మరో 36 మందిపై నమోదైన క్రిమినల్ కేసును విజయవాడలోని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం సోమవారం కొట్టివేసింది. కేసులో ఎలాంటి సాక్ష్యాధారాలు లభించలేదని, ఇది 'మిస్టేక్ ఆఫ్ ఫ్యాక్ట్' (వాస్తవ దోషం) అని నిర్ధారిస్తూ రాష్ట్ర నేర పరిశోధన విభాగం (సీఐడీ) దాఖలు చేసిన తుది నివేదికను న్యాయస్థానం ఆమోదించింది. ఈ నిర్ణయంతో నిందితులపై ఉన్న అభియోగాలన్నీ రద్దయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో ఇదే కేసులో 2023 సెప్టెంబర్ 9న చంద్రబాబును సీఐడీ అధికారులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ఆయన సుమారు 53 రోజుల పాటు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు. అనంతరం హైకోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. చంద్రబాబు గతంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్

మిగతా 2 లో

## సందడిగా నారావారిపల్లె

### పలు అభివృద్ధి పనులకు చంద్రబాబు శ్రీకారం

### ఉత్సాహంగా పాల్గొన్న ముఖ్యమంత్రి కుటుంబం

**ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన చంద్రబాబు**

**ఆటలు, రంగువల్లులతో అలరించిన పోటీలు**

**గెలుపొందిన వారికి బహుమతుల ప్రదానం**





## ఉగ్రవాదానికి తెగిస్తే గట్టిగా బుద్ధి చెబుతాం

**ఆపరేషన్ సిందూర్‌లో భూతల దాడులు**

**భద్రతా సవాళ్లను ఎదుర్కోవ డంలో సంసిద్ధత**

**షక్సాగామ్ వ్యాలీ ఎప్పటికీ భారత్‌లో భాగమే**

**మీడియా సమావేశంలో ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర**

3



# అగ్నికి ఆహుతైన గిరిజన పల్లె

## సార్లంకపల్లెలో 38 ఇళ్లు భస్మం

**కాకినాడ జిల్లా రౌతులపూడి మండలంలో ఘోర అగ్నిప్రమాదం**

**క్షణాల్లో బూడిదైన పూరిళ్లు.. నిరాశ్రయులైన 120 మంది గిరిజనులు**

**పండుగ కొనుగోళ్లకు వెళ్లి వచ్చేలోపే శ్మశానంగా మారిన గ్రామం**

**కట్టుబట్టలతో మిగిలిన గిరిజనులు**

**కాకినాడ :** కాకినాడ జిల్లా మన్యంలోని మారుమూల గ్రామం సార్లంకపల్లెలో అగ్నిప్రమాదం పెను విషాదాన్ని నింపింది. సోమవారం సాయంత్రం సంభవించిన ఈ ప్రమాదంలో నిమిషాల వ్యవధిలోనే 38 పూరిళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. కేవలం మూడు పక్కా ఇళ్లు మినహా ఊరంతా భస్మీపటలమైంది. ఫలితంగా 120 మంది

మిగతా 2 లో

## బాధితులకు సీఎం చంద్రబాబు భరోసా

తక్షణ సాయం, పక్కా ఇళ్లు

నిరాశ్రయులైన 33 గిరిజన కుటుంబాలు

బాధితులకు రూ. 25 వేల తక్షణ సాయం ప్రకటించిన సీఎం

ప్రతి కుటుంబానికి పక్కా ఇళ్లు మంజూరు చేయాలని ఆదేశం

గ్రామంలో పర్యటించి బాధితులను పరామర్శించిన ప్రజాప్రతినిధులు

2


## బెంగళూరులో దారుణ ఘటన

**కామంతో యువతిపై టీనేజర్ దాడి**

**తిరస్కరించడంతో చంపేసి ఇంటికి నిప్పు**

**దర్యాప్తులో బయటపడ్డ అసలు వ్యవహారం**

బెంగళూరులో దారుణ ఘటన వెలుగు చూసింది. పక్కింట్లో ఉన్న ఓ అమ్మాయిపై బలాత్కారానికి పాల్పడ్డ ఇంటర్ విద్యార్థి, ఆమె తిరస్కరించడంతో కత్తితో పొడిచి చంపాడు. అంతేగాకుండా ఇంటిని తగులబెట్టాడు.



4

## ఆరోగ్య రంగానికి రూ.567 కోట్ల గ్రాంట్


### వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ వెల్లడి

**అమరావతి :** 15వ ఆర్థిక సంఘం సిఫార్సు మేరకు రాష్ట్రంలో ఆరోగ్య రంగానికి రూ. 567 కోట్ల గ్రాంట్‌ను కేంద్రం విడుదల చేసిందని ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఇవి ఆఖరి విడత నిధులని ఆయన తెలిపారు. గత 19 నెలల్లో ఆరోగ్య రంగానికి 48 శాతం నిధులు తమ శాఖ వెచ్చించిందని వివరించారు. మంగళవారం రాజధాని అమరావతిలో ఉన్నతాధికారులతో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ వ్యయంపై



మిగతా 2 లో

## వీధి కుక్కల బాధ్యత రాష్ట్రాలదే!



ఒక్క కరిచినా అందుకు బాధ్యత వహించాల్సిందే

అందుకు విధించే జరిమానాలకు సిద్ధంగా ఉండండి

వీధి కుక్కలకు ఆహారం పెట్టేవారు కూడా దోషులే

సుప్రీం కోర్టు ఘాటు హెచ్చరిక

3

## పది నిముషాల ఛాలెంజ్‌కు చెక్

### గిగ్ వర్కర్లపై ఒత్తిడి తగ్గించే విధంగా కీలక నిర్ణయం



క్విక్ కామర్స్ ప్లాట్ ఫామ్‌లైన బ్లింకిట్, జెప్టో, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ సంస్థలకు '10 నిమిషాల డెలివరీ' విధానం తొలగించాలని కేంద్ర ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది.కేంద్ర కార్మిక మంత్రి మన్సుఖ్ మాండవీయ.. బ్లింకిట్, జెప్టో, స్విగ్గీ సహా ఇతర క్విక్ కామర్స్ ప్రతినిధులతో సమావేశమై డెలివరీ భాగస్వాముల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని చర్చించారు.

# చంద్రబాబుకు భారీ ఊరట

మొదటి పేజీ తరువాయి

ద్వారా రూ.3,300 కోట్ల ప్రాజెక్టులో అవకతవకలు జరిగాయని, తద్వారా ప్రభుత్వ ఖజానాకు రూ.300 కోట్లకు పైగా నష్టం వాటిల్లిందని గత ప్రభుత్వం ఆరోపించింది. ఈ ఆరోపణల నేపథ్యంలోనే సీఐడీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. తాజాగా కేసును మూసివేయడానికి ముందు తమ వాదనలు వినాలంటూ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ కె. అజయ్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను కూడా కోర్టు తోసిపుచ్చింది. సీఐడీ నివేదిక సంతృప్తికరంగా ఉందని భావించిన న్యాయస్థానం, కేసును పూర్తిగా మూసివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఈ కేసులో చంద్రబాబు సహా మొత్తం 37 మంది నిందితులు పూర్తిగా అభియోగాల నుంచి విముక్తి పొందారు.

# సందడిగా నారావారిపల్లె

**పలు అభివృద్ధి పనులకు చంద్రబాబు శ్రీకారం**

**ఉత్సాహంగా పాల్గొన్న చంద్రబాబు కుటుంబం**

**ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన చంద్రబాబు**

**ఆటలు, రంగువల్లులతో అలరించిన పోటీలు**

**గెలుపొందిన వారికి బహుమతుల ప్రదానం**




**తిరుపతి :** సంక్రాంతి పండుగ సందర్భంగా స్వగ్రామం నారావారిపల్లిలో సీఎం చంద్రబాబు నాయుడు పలు ముఖ్యమైన ప్రాజెక్టులను ప్రారంభించడంతో పాటు శంకుస్థాపనలు చేశారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి అక్కడికక్కడే ఆదేశాలు ఇచ్చారు. ముఖ్యంగా రంగంపేట – భీమవరం నుంచి లింగేశ్వరాలయానికి వెళ్లే తారురోడ్డును సీఎం ప్రారంభించారు. అలాగే చంద్రగిరి మండల ప్రజలకు సాగునీరు.. తిరుమల, తిరుపతికి తాగునీరు అందించేందుకు నీవా బ్రాంచ్ కెనాల్ నుంచి కల్యాణ్ డ్యామ్‌కు కృష్ణా జలాలను తీసుకురావడానికి రూ.126 కోట్లతో మూలపల్లి చెరువు వద్ద శంకుస్థాపన చేశారు.స్వర్ణ నారావారిపల్లి అభివృద్ధిలో భాగంగా అధునాతన సాంకేతికతను ఉపయోగించి 4.2 కోట్ల రూ–పాయలతో నిర్మించిన 33/11 కేవీ సబ్ స్టేషన్‌ను సీఎం ప్రారంభించారు. అలాగే ప్రకృతి వ్యవసాయ మోడల్ ప్లాంటేషన్, డ్రోన్‌ను ఉపయోగించి మందులు పిచికారీ చేయటాన్ని ప్రారంభించారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నూతన భవనానికి ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం చేశారు. ఎస్వీ యూనివర్సిటీ, మహిళా యూనివర్సిటీ, రుయా ఆసుపత్రులకు సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాలను సీఎం చంద్రబాబు ప్రారంభించారు. కాగా.. సంక్రాంతి సంబరాల్లో పాల్గొనేందుకు సీఎం చంద్రబాబు కుటుంబ సభ్యులతో కలిసి స్వగ్రామం నారావారిపల్లికి విచ్చేశారు. చంద్రబాబుతో పాటు ఆయన సతీమణి నారా భువనేశ్వరి, కుమారుడు మంత్రి నారా లోకేశ్, కోడలు నారా బ్రాహ్మణి తదితర కుటుంబ సభ్యులు గ్రామస్థులతో కలిసి సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటుచేసిన వినోదాత్మక క్రీడలు, ముగ్గుల పోటీలు, రంగవల్లులు అందరినీ ఆకట్టుకున్నాయి. ముగ్గుల పోటీలతో పాటు క్రీడా పోటీలను చంద్రబాబు దంపతులు ఆసక్తిగా తిలకించారు. పోటీలలో గెలుపొందిన చిన్నారులకు ఈ దంపతులు బహుమతులు అందజేశారు. నారావారిపల్లికి చుట్టుపక్కల ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పిల్లలు క్రీడల్లో పాల్గొన్నారు. ఒక్కో స్కూల్ పిల్లలతో వేరు వేరుగా చంద్రబాబు దంపతులు గ్రూప్ ఫొటో తీసుకున్నారు . అందరితో పాటు నారా, నందమూరి కుటుంబాలకు చెందిన పిల్లలు గ్రామీణ క్రీడల్లో పాల్గొన్నారు. వీరిలో గెలుపొందిన వారికి అందరితో పాటు బహుమతుల ప్రదానం చేశారు. చంద్రబాబు ఇంటి ముందర ఉన్న గ్రౌండ్లో పోటీలు నిర్వహించి.. బహుమతులు అందజేశారు. ముఖ్యంగా సీఎం మనవడు నారా దేవాన్ష్ తన స్నేహితులతో కలిసి వివిధ గ్రామీణ క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొని అందరినీ మురిపించాడు. క్రీడా పోటీల్లో పాల్గొన్న వారికి బహుమతులు ఇచ్చిన అనంతరం.. ఇంటికి వెళ్లే క్రమంలో దారి పొడవునా అర్జీలు స్వీకరించారు. ముఖ్యమంత్రికి అర్జీలు ఇవ్వడం కోసం పొరుగు జిల్లాల నుంచి ప్రజలు తరలివచ్చారు. అర్జీలు స్వీకరించడమే కాకుండా పరిష్కారం కోసం అక్కడికక్కడే సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారు. ఈ కార్యక్రమాలతో నారావారిప్లలెలో సంక్రాంతి సంబరాలు మరింత ఉత్సాహంగా మారాయి. గ్రామ ప్రజలు కూడా ఉత్సవాల్లో పాల్గొన్నారు. చంద్రబాబు కుటుంబం వారితో కలసి ముచ్చటించారు.



# కోనసీమలో కోడిపందాల జోరు

**ఆత్రేయపురంలో సంబరాలు**

**కాకినాడ :** గోదావరి జిల్లాల్లో ప్రాంతాల్లో భోగి రోజున కోడి పందాలు వేయడం ఒక ఆనవాయితీగా వస్తుంది, పౌరుషానికి ప్రతీకగా ఉండే కోళు పోటీలో ప్రాణాలను పణ్ణంగా పెట్టి పోరాడుతాయి, ఈ పోటీలను చూసేందుకు ప్రజలు ఆసక్తి కనబరుస్తారు. పోటీలో పాల్గొనే కోళ్లపై పందాలు కాస్తారు. తాహత్తుకు మించి మితిమీరిన పందాలు కాయడం వలన కలిగే అనర్థాల వలన పందాలు కాయడంపై నిషేధాంక్షలు ఉన్నాయి. హిందూ మత ఆచారాల ప్రకారం, సూర్య భగవానుడు ధనస్సు రాశి నుంచి మకర రాశిలోకి ప్రవేశించే సమయాన్ని 'మకర సంక్రాంతి' అంటారు. ఈ పండుగకు సరిగ్గా ఒక రోజు ముందు 'భోగి' పండుగను జరుపుకుంటారు. ఈ పవిత్రమైన రోజున తెల్లవారుజామునే నిద్ర లేచి భోగి మంటలు వేస్తారన్న విషయం మనందరికీ తెలిసిందే.. అదే విధంగా చిన్నారులపై భోగి పళ్లను పోస్తారు. భోగి రోజు సాయంకాలం సమయంలో బొమ్మలకొలువును కూడా జరుపుతారు. కోనసీమలో సంక్రాంతి వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇక, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా ప్రారంభం అయ్యాయి. ఈ సంబరాల్లో భాగంగా మూడు రోజుల పాటు వివిధ రకాల పోటీలు నిర్వహించనున్నారు. జాతీయ స్థాయి పడవల పోటీలు జరగనున్నాయి. అంతేకాదు.. కోనసీమ రుచులు గురించి తెలుపుతూ ఫుడ్ ఫెస్టివల్ కూడా జరగనుంది. తొలిరోజు ఈత పోటీలు, రంగవల్లులు, ఫుడ్ ఫెస్టివల్ ఆకట్టుకుంటున్నాయి. జిల్లా కలెక్టర్ మహేశ్ కుమార్, ఎస్పీ రాహుల్ మీనా, ఎమ్మెల్యే బండారు సత్యనందరావు పోటీలను ప్రారంభించారు.



# అగ్నికి ఆహుతైన గిరిజన పల్లె



మొదటి పేజీ తరువాయి

గిరిజనులు నిలువనీడ లేక కట్టుబట్టలతో రోడ్డున పడ్డారు.సంక్రాంతి పండుగ కోసం సరకులు కొనుగోలు చేసేందుకు గ్రామస్థులంతా సోమవారం సాయంత్రం సమీపంలోని తుని పట్టణానికి వెళ్లారు. అదే సమయంలో గ్రామంలో ఒక్కసారిగా మంటలు చెలరేగి దావానలంలా వ్యాపించాయి. ఊళ్లో ఉన్న కొద్దిమంది ప్రాణాలు చేతపట్టుకుని పరుగులు తీశారు. అగ్నిప్రమాద సమాచారం అందుకున్న బాధితులు గ్రామానికి చేరుకునే సరికి తమ ఇళ్లు, సర్వస్వం బూడిద కుప్పలుగా మారడంతో గుండెలవిసేలా రోదిస్తున్నారు.సార్లంకపల్లె మారుమూల ప్రాంతంలో ఉండటంతో సహాయక చర్యలు అందడం ఆలస్యమైంది. సుమారు 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న తుని నుంచి అగ్నిమాపక యంత్రం వచ్చేలోపే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. విషయం తెలిసిన వెంటనే ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ గ్రామానికి చేరుకుని బాధితులను పరామర్శించారు. ప్రభుత్వం తరపున తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఉండి అధికారులను సమన్వయం చేస్తూ గిరిజనులకు భరోసా కల్పించారు.

**బాధితులకు సీఎం చంద్రబాబు భరోసా...**

కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం సార్లంకపల్లె గ్రామంలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ దుర్ఘటనలో 26 గిరిజన గుడిసెలు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. ప్రమాదం కారణంగా 33 కుటుంబాలు నిలువ నీడ కోల్పోయి నిరాశ్రయులయ్యాయి. అటవీ ఉత్పత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న ఈ కుటుంబాలు సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలాయి. ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు. అధికారులతో మాట్లాడి బాధితులకు అన్ని విధాలుగా అండగా నిలవాలని ఆదేశించారు. తక్షణ సహాయంగా ప్రతి బాధిత కుటుంబానికి రూ.25,000 నగదు అందించాలని, ఇల్లు కోల్పోయిన ప్రతి ఒక్కరికీ పక్కా గృహం మంజూరు చేయాలని స్పష్టం చేశారు. బాధితులకు తాత్కాలిక వసతి, ఆహారం అందించే ఏర్పాట్లు చేయాలని సూచించారు. సీఎం ఆదేశాల మేరకు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, కాకినాడ ఎంపీ తంగళ్ల ఉదయ్ శ్రీనివాస్, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బొజ్జి రెడ్డి గ్రామాన్ని సందర్శించారు. బాధితులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. ప్రభుత్వ సాయంపై భరోసా ఇచ్చారు. తహసీల్దార్ ఎస్వీ నరేశ్ మాట్లాడుతూ, 33 కుటుంబాలకు రూ.25 వేల చొప్పున నగదు పంపిణీ చేసినట్లు తెలిపారు. బాధితులందరికీ పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం వారికి ఆహారం, ఇతర నిత్యావసరాలు అందించే పనులు కొనసాగుతున్నాయని వివరించారు. ప్రమాదానికి గల కారణాలపై అధికారులు విచారణ జరుపుతున్నారు.

# ఆరోగ్య రంగానికి రూ. 567 కోట్ల గ్రాంట్



మొదటి పేజీ తరువాయి

మంత్రి సత్యకుమార్ సమీక్షించారు. అనంతరం మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ.. మిగిలిన నిధుల విడుదల కోసం కేంద్ర ఆర్థిక శాఖతో తక్షణమే చర్చించాలని ఉన్నతాధికారులను ఈ సందర్భంగా ఆదేశించారు. పూర్తి స్థాయిలో కేంద్ర సాయం సాధించాలని వారికి మంత్రి స్పష్టం చేశారు. ఈ కూటమి ప్రభుత్వ హయాంలో 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం పెరగడంపై కేంద్రం సంతృప్తి వ్యక్తం చేసిందన్నారు. ఏపీలో ఎన్డీయే ప్రభుత్వ కృషిని ఈ సందర్భంగా కేంద్రం గుర్తించిందన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు పూర్తి స్థాయిలో పొందిన జాబితాలో ఆంధ్రప్రదేశ్ మూడో రాష్ట్రంగా ఉందన్నారు. దీనిపై వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ హర్షం వ్యక్తం చేశారు.

# రైలుపట్టాలపై గర్భిణి ప్రసవం

**తల్లీ బిడ్డా క్షేమంతో ఆస్పత్రికి తరలింపు**

**రైలులోనే నొప్పులు రాగా.. తరలించే లోపు ప్రసవం**

**పార్వతీపురం :** రైలు పట్టాలపై ఓ నిండు గర్భిణి ప్రసవించిన సంఘటన పార్వతీపురం మన్యం జిల్లాలో చోటు చేసుకుంది. తల్లీబిడ్డా క్షేమంగా ఉండడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. వారిని వెంటనే సమీప ఆస్పత్రిలో చేర్పించారు. వివరాల్లోకి వెళితే..ఒడిశాలోని బరంపూర్‌కు చెందిన ప్రియ పాత్ర.. నిండు గర్భిణీ. కొద్ది రోజుల్లో ఆమెకు నెలలు నిండనున్నాయి. మంగళవారం ఉదయం అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఆమె సూరత్‌కు బయలుదేరింది. ఈ క్రమంలో రైలులో పురిటి నొప్పులు ప్రారంభమయ్యాయి. దీంతో సహచర ప్రయాణికులు వెంటనే అప్రమత్తమయ్యారు. ఈ విషయాన్ని టీసీ ద్వారా గార్డుకు తెలియజేశారు. పార్వతీపురం సమీపంలోకి రైలు వచ్చే సరికి.. ఆమె పరిస్థితి ఆందోళనకరంగా మారింది. దీంతో సమీపంలోని బెలగాం స్టేషన్ వద్ద రైలును అత్యవసరంగా నిలిపివేశారు. అనంతరం కుటుంబ సభ్యులు, మహిళా ప్రయాణికుల సహాయంతో రైలు నుంచి ప్రియా పాత్రను కిందకు దింపారు. తర్వాత.. రైలు పట్టాల పైనుంచి ఆమెను దాటిస్తుండగా.. ఆమెకు నొప్పులు అధికమయ్యాయి. ఇంతలో పట్టాలపైనే ఆమె ప్రసవమయింది. అనంతరం.. తల్లీబిడ్డను ఆమె కుటుంబ సభ్యులతో కలిసి స్థానికులు సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. తల్లిబిడ్డా క్షేమంగా ఉన్నట్టు వైద్యులు వెల్లడించారు. దీంతో ప్రియ పాత్ర కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.

# ఎమ్మెల్యే ప్రసాద్ గన్‌మెన్ షేక్ షావలిపై సస్పెన్షన్ వేటు

**అనంతపురం :** అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గన్‌మెన్ షేక్ షావలిని సస్పెండ్ చేస్తూ జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాలు జారీ చేశారు. ఎగ్జిబిషన్ నిర్వాహకుడు ఫక్రుద్దీన్‌పై.. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అనుచరులు దాడి చేసిన ఘటనలో షేక్ షావలి కూడా ఉన్నట్లు ఎస్పీకి ఫిర్యాదు అందింది. ఫిర్యాదుతో పాటు ఎమ్మెల్యే అనుచరులు దాడులు చేస్తున్న వీడియోలను బాధితుడు పోలీసులకు అందజేశారు. దీంతో ఎమ్మెల్యే గన్‌మెన్‌తో పాటు మరికొందరిపై నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన గన్‌మెన్ షేక్ షావలిని సస్పెండ్ చేస్తూ జిల్లా ఎస్పీ ఆదేశాలు జారీచేశారు.

# కడియంలో మొక్కలతో సంక్రాంతి శోభ

**కడియం :** తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం కడియంలోని పల్ల వెంకన్న నర్సరీలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ప్రత్యేక మొక్కల ఆకృతి సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. సంక్రాంతి శోభను ప్రతిబింబించేలా భోగి, సంక్రాంతి, కనుమ పర్వదినాల ప్రత్యేకతను మొక్కల ద్వారానే రూపుదిద్దారు. ఆకృతిలో భోగి మంటలో పొంగుతున్న పాల కుండ, పతంగి, ఎద్దు, కోడిపుంజు వంటి పండుగకు ప్రతీకలైన అంశాలను సృజనాత్మకంగా మొక్కలతో తీర్చిదిద్దారు. అలానే చివరలో 'హ్యాపీ పొంగల్' అంటూ శుభాకాంక్షలు చెప్పడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ వినూత్న రూపకల్పనను పల్ల వెంకన్న నర్సరీ అధినేత పల్ల సత్యనారాయణ మూర్తి (సత్తిబాబు) కుమారులు, యువ రైతులు పల్ల వెంకటేష్, పల్ల వినయ్ కుమార్ రూపొందించారు. సంప్రదాయ పండుగ సంస్కృతిని పర్యావరణహితంగా ప్రజలకు చేరువ చేయాలన్న ఉద్దేశంతో ఈ ప్రయత్నం చేశామని వారు తెలిపారు.

# 55 ఏళ్లకు రోడ్డు పనులకు మోక్షం

**పనులు పూర్తి కావడంతో గ్రామస్థుల హర్షం**

**పార్వతీపురం :** బలిజిపేట మండల కేంద్రంలోని కొత్తగళావల్లి గ్రామంలో 55 ఏళ్ల తర్వాత రోడ్డు నిర్మాణ పనులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఆ గ్రామస్థుల దశాబ్దాల నాటి కల ఎట్టకేలకు నెరవేరింది. తారురోడ్డు నిర్మాణ పనులు మంగళవారం పూర్తి కావడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొత్తగళావల్లి ప్రజలు దాదాపు 55 ఏళ్ల నుంచి రోడ్డు కావాలని అధికారులకు విన్నవించుకున్నారు. ఇప్పటివరకు ఎవరూ రోడ్డు నిర్మాణానికి ముందుకు రాలేదు. ఈ విషయాన్ని తెదేపా నేత, స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆయన ఏడాది క్రితం రెండు కిలోమీటర్ల మేర తారురోడ్డు, కల్వర్టు నిర్మాణానికి రూ.2 కోట్లు నిధులను మంజూరు చేయించారు. దీంతో ఈ పనులు నేటితో పూర్తవడంతో గ్రామస్థులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే విజయచంద్ర మంగళవారం వెంగాపురంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన 'ఐ లవ్ వెంగాపురం' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బలిజిపేట మండలంలోని అనుసంధాన రోడ్లతో పాటు గ్రామీణ రహదారులన్నింటినీ అభివృద్ధి చేసా–న్నారు. అందుకోసం నిధులు మంజూరు చేసి రోడ్ల అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని హామీ ఇచ్చారు.

# ప్రారంభానికి సిద్ధంగా ప్రధాని కార్యాలయం

## సర్వాంగ సుందరంగా రూపు దిద్దుకున్న కొత్త ఆఫీస్

## సేవాతీర్థ్‌లోకి త్వరలోనే మారనున్న మోడీ

**న్యూఢిల్లీ :** ఢిల్లీలో ప్రతిష్టాత్మక సెంట్రల్ విస్టా ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన ప్రధానమంత్రి కొత్త కార్యాలయం ప్రారంభానికి సిద్ధ మైంది. రైసినా హిల్ సమీపంలో అత్యాధునిక సౌకర్యాలతో రూపుదిద్దుకున్న ఈ భవన సముదాయంలోకి ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెలలోనే మారే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. నిర్మాణ దశలో 'ఎగ్జిక్యూటివ్ ఎన్‌క్లేవ్' గా పిలిచిన ఈ సముదాయానికి కేంద్ర ప్రభుత్వం 'సేవా తీర్థ్' అని నామకరణం చేసింది. ఈ ప్రాంగణంలో మొత్తం మూడు మెయిన్ బిల్డింగులు ఉన్నాయి. ఒకదాంట్లో ప్రధానమంత్రి కార్యాలయం(పీఎంవో) ఉంటుంది. రెండో భవనం నుంచి కేబినెట్ సెక్రటేరియెట్ విధులు సాగుతాయి. మూడో భవనంలో జాతీయ భద్రతా మండలి సెక్రటేరియట్(ఎన్ఎస్‌సీఎస్)తో పాటు జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ దోవల్ కార్యాలయం ఉంటుంది. కొత్త కార్యాలయంలో విదేశీ ప్రముఖులు, అతిథులతో సమావేశమయ్యేందుకు వీలుగా హై-ఎండ్ రూమ్‌లను రూపొందించారు. ఇవి అత్యాధునిక సాంకేతికతను కలిగి ఉండటమే కాకుండా.. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఉన్నాయి. ముఖ్యంగా కేబినెట్ సమావేశాల కోసం ఒక హాలును సిద్ధం చేశారు. అధికారుల మధ్య సమన్వయం పెంచేందుకు 'ఓపెన్ ఫ్లోర్' మోడల్‌ను ఇక్కడ అమలుచేస్తున్నారు. కాగా.. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు ప్రధానమంత్రి కార్యాలయం సౌత్ బ్లాక్ నుంచే పనిచేస్తున్నది. తాజా మార్పుతో దశాబ్దాల చరిత్రకు తెరపడనుంది. నార్త్ బ్లాక్, సౌత్ బ్లాక్‌లలో ఉన్న హోం, ఫైనాన్స్, విదేశీ వ్యవహారాలు, రక్షణ శాఖలు ఇప్పటికే కొత్తగా నిర్మించిన 'కర్తవ్య భవన్' కు తరలివెళ్లాయి. ఖాళీ అయిన ఈ పురాతన కట్టడాలను భారీ మ్యూజియంగా మార్చనున్నారు. సేవా తీర్థ్ సమీపంలోనే ప్రధాని కొత్త నివాసం కూడా నిర్మాణం అవుతున్నది. ప్రస్తుతం 7 లోక్ కల్యాణ్ మార్గ్‌లో ఉన్న ప్రధాని నివాసాన్ని కూడా అక్కడికే మార్చనున్నారు.

# పది నిముషాల ఛాలెంజ్‌కు చెక్

## గిగ్ వర్కర్లపై ఒత్తిడి తగ్గించే విధంగా కీలక నిర్ణయం

**న్యూఢిల్లీ :** టెన్ మినట్స్ ఛాలెంజ్‌పై కేంద్రం తీవ్రంగా స్పందించింది. దీనిని తొలగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఇటీవల బ్లింకిట్, జెఎ÷-టో ఇతర క్విక్ కామర్స్, ఫుడ్ డెలివరీ సంస్థలు కేవలం పది నిమిషాల్లో డెలివరీ సదుపాయాన్ని అందిస్తున్నామని ప్రకటనలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నిర్ణయంపై గిగ్ వర్కర్స్(డెలివరీ ఏజెంట్స్) తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాహనాల రిపేర్, ట్రాఫిక్ వల్ల తమకు ఇబ్బందులు కలుగుతున్నాయని వాపోతున్నారు. ఈ అంశంపై కేంద్రం ప్రభుత్వం తాజాగా కీలక ఆదేశాలు జారీ చేసింది. క్విక్ కామర్స్ ప్లాట్ ఫామ్‌లైన బ్లింకిట్, జెప్టో, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ సంస్థలకు '10 నిమిషాల డెలివరీ' విధానం తొలగించాలని కేంద్ర ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది.కేంద్ర కార్మిక మంత్రి మన్సుఖ్ మాండవీయ.. బ్లింకిట్, జెప్టో, స్విగ్గీ సహా ఇతర క్విక్ కామర్స్ ప్రతినిధులతో సమావేశమై డెలివరీ భాగస్వాముల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని చర్చించారు. కేంద్రం ఆదేశాల మేరకు బ్లింకిట్ వంటి ఈ-కామర్స్ ఫాట్ ఫామ్‌లు 10 నిమిషాల డెలవిరీ క్లెయిమ్‌లను తొలగించినట్లు సమాచారం. ఇతర కంపెనీలు తమ బ్రాండ్ ప్రకటనలు, సోషల్ మీడియా ఎ÷-లాట్ ఫామ్‌ల నుంచి ఈ డెలివరీ ప్రకటన తొలగిసా-మని ప్రభుత్వానికి హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. డెలివరీ ఏజెంట్లు ఇటీవల చేస్తున్న ఆందోళన దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకోవడం గిగ్ వర్కర్లకు ఊరట కలుగినట్టు పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

# ఇరాన్ ఆందోళనల్లో భారీగా మరణాలు

## వేలల్లో ఉంటుందన్న వార్తలతో ఆందోళన

**న్యూఢిల్లీ :** ఇరాన్‌లో అక్కడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొనసాగుతున్న ఆందోళనల్లో భారీ సంఖ్యలో మరణాలు చోటుచేసుకున్నట్లు ఆందోళన కలుగుతోంది. ఇప్పటివరకు ఆరు వందల మందికి పైగా చనిపోయినట్లు అధికారిక సమాచారం రాగా.. ఈ సంఖ్య రెండు వేల వరకు ఉండొచ్చని ఇరాన్ అధికారులు సంకేతాలిచ్చారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనల్లో పౌరులతో పాటు భద్రతా సిబ్బంది ప్రాణాలు కోల్పోయినట్లు ఓ అంతర్జాతీయ మీడియా సంస్థతో ఇరాన్ అధికారులు వెల్లడించారు. అక్కడ పెరుగుతోన్న హింస చాలా భయపెడుతోందని ఐరాస మానవ హక్కుల సంఘం కూడా ఆందోళన వ్యక్తం చేసింది. ఇదే సమయంలో ఇరాన్‌కు చెందిన వెబ్‌సైట్ మాత్రం ఇటీవల ఆందోళనల్లో పది వేల మందికిపైగా ప్రాణాలు కోల్పోయినట్లు సంచలన కథనంలో పేర్కొంది. ఈ మరణాల వెనక ఉగ్రవాదులు ఉన్నారని ఆరోపించారు. మరోవైపు ఇటీవల ఘర్షణల్లో 12 వేల మంది చనిపోయినట్లు 'ఇరాన్ ఇంటర్నేషనల్' కథనం పేర్కొంది. భద్రతా సంస్థలు, అధ్యక్ష కార్యాలయం, ప్రత్యక్ష సాక్షులు, వైద్యాధికారులు.. తదితర వర్గాల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా ఈ అంచనా వేసినట్లు తెలిపింది. జనవరి 8, 9 తేదీల్లోనే ఈ మరణాలు చోటుచేసుకున్నాయని, ఓ ప్రణాళిక ప్రకారమే ఈ హింసాత్మక ఘటనలు జరిగాయని వెల్లడించింది. ఆధునిక ఇరాన్ చరిత్రలో ఈ తరహా హింస ఎన్నడూ చోటుచేసుకోలేదని పేర్కొంది. దేశవ్యాప్తంగా 31 ప్రావిన్సుల్లో 600లకుపైగా ప్రదేశాల్లో నిరసనలు కొనసాగినట్లు అమెరికా కేంద్రంగా నడిచే మానవ హక్కుల కార్యకర్తల వార్తా సంస్థ పేర్కొంది. వందలాది మంది మృతి చెందగా, 10వేలకు పైగా నిరసనకారులను అక్కడి పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిపింది. అయితే, ఈ భయంకరమైన హింసాత్మక ఘటనలు ఇలాగే కొనసాగితే చాలా కష్టమని.. ఇరాన్ పౌరుల న్యాయమైన డిమాండ్లను తప్పక వినాల్సిందేనని ఐరాస మానవ హక్కుల హైకమిషన్ పేర్కొంది. మరణాలు వందల సంఖ్యలో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయని ఆ సంస్థ అధికార ప్రతినిధి జెరెమి లారెన్స్ పేర్కొన్నారు. అంతేకాదు.. అరెస్టైన వారిలో అనేక మందికి మరణశిక్ష పడవచ్చనే ఆందోళన వ్యక్తం చేశారు.

# ఆగని బంగారం పరుగులు

## రోజురోజుకూ గరిష్ఠ ధరలు నమోదు

**న్యూఢిల్లీ :** వరుసగా పెరుగుతూ వస్తున్న బంగారం, వెండి ధరలు మంగళవారం కూడా భారీ పెరుగుదల నమోదు చేశాయి. భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గు చూపుతుండడంతో బంగారం, వెండిపై మదుపర్లు దృష్టి సారిస్తున్నారు. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి క్షీణిస్తుండడం కూడా బంగారం, వెండి ధరల డిమాండ్‌కు కారణంగా కనిపిస్తోంది.

ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం 6:30 గంటల సమయంలో హైదరాబాద్‌లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 1,42,160కి చేరింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,30,310కి చేరింది. ఇక, దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి రేటు రూ. 1,42,310కి చేరుకోగా, 22

క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ ధర రూ. 1,30,460కి చేరుకుంది. మరోవైపు వెండి కూడా భారీగా పెరిగింది. ఈ నేపథ్యంలో దేశంలోని పలు ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలు అమాంతంగా పెరిగాయి.

# వీధి కుక్కల బాధ్యత రాష్ట్రాలదే!

- ఒక్క కరిచినా అందుకు బాధ్యత వహించాల్సిందే
- అందుకు విధించే జరిమానాలకు సిద్ధంగా ఉండండి
- వీధి కుక్కలకు ఆహారం పెట్టేవారు కూడా దోషులే
- ఘాటు హెచ్చరిక చేసిన సుప్రీం కోర్టు




**న్యూఢిల్లీ :** వీధి కుక్కల అంశంపై సుప్రీంకోర్టు మరోసారి కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ వ్యవహారంపై మంగళవారం విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం.. కుక్కల బెడదను అరికట్టేందుకు చర్యలు తీసుకోకపోతే ఆయా రాష్ట్రాలపై భారీ జరిమానాలు వేస్తామని హెచ్చరిం చింది. ప్రతి కుక్క కాటు కు పరిహారం చెల్లించాల్సిందేనని స్పష్టంచేసింది. వీధి కుక్కల బెడదను నివారించేందుకు రాష్ట్రాలు తగిన చర్యలు చేపట్టాలి. లేదంటే ప్రతి కుక్క కాటుకు, కుక్కల దాడిలో జరిగిన ప్రతి మరణానికి గానూ ఆయా రాష్ట్రాలపై మేం నిర్దేశించిన భారీ పరిహారాలను చెల్లించాలని న్యాయస్థానం స్పష్టం చేసింది.కుక్క కరిచిన ప్రభావం బాధిత వ్యక్తిపై జీవితకాలం ఉంటుందని న్యాయస్థానం పేర్కొంది. ఈ సందర్భంగా వీధి కుక్కలకు ఆహారం పెడుతున్న వారిపైనా కోర్టు అసహనం వ్యక్తం చేసింది. ఏదైనా సంస్థ ఆహారం పెడుతున్న కుక్కల దాడిలో ఓ చిన్నారి మరణిస్తే.. అప్పుడు ఎవరిని బాధ్యుల్ని చేయాలి? ఆ ప్రాణనష్టానికి సదరు సంస్థ బాధ్యత వహించదా అని ప్రశ్నించింది. ఇక, వీధికుక్కలకు ఆహారం పెట్టే వారి గురించి మాట్లాడుతూ.. మీకు శునకాలపై అంత ప్రేమ ఉంటే.. వాటిని మీ ఇంటికి తీసుకెళ్లి పెంచుకోండి. వీధి కుక్కల సమస్య భావోద్వేగభరిత అంశమని అంటున్నారు. మీ భావోద్వేగం కేవలం కుక్కల పైన మాత్రమేనా? మేం మనుషుల గురించి కూడా సమానంగా ఆందోళన చెందుతున్నాం. కుక్కలు వీధుల్లో తిరుగుతూ ప్రజలను భయపెట్టే పరిస్థితిని మేం ఆమోదించబోం అని ధర్మాసనం వెల్లడించింది. దేశవ్యాప్తంగా వీధి కుక్కల దాడుల ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో గతేడాది నవంబరులో సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. విద్యాసంస్థలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, క్రీడా సముదాయాలు, ఇతర బహిరంగ ప్రదేశాల సమీపంలోని వాటిని షెల్టర్లకు తరలించాలని ఆదేశించింది. ఈ అంశంపై సుప్రీంకోర్టులో విచారణ కొనసాగుతోంది.



# ఇరాన్‌తో వ్యాపార దేశాలపై ట్రంప్ అక్కసు

## 25శాతం సుంకాల విధిస్తామని తాజాగా హెచ్చరిక

## ట్రంప్ బెదిరింపులకు లొంగబోమన్న ఖొమేనీ

**వాషింగ్టన్ :** ఆర్థిక సంక్షోభం, అంతర్గత తిరుగుబాటు సమస్యలతో సతమతమవుతున్న ఇరాన్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో పిడుగు వేశారు. ఇరాన్‌తో వాణిజ్యం చేసే దేశాలపై 25 శాతం సుంకాలను విధిస్తామని హెచ్చరించారు. అమెరికా జోక్యం, ట్రంప్ హెచ్చరికలపై ఇరాన్ సుప్రీం లీడర్ ఆయుతొల్లా ఖమేనీ తాజాగా స్పందించారు. అమెరికాకు వార్నింగ్ ఇస్తూ సోషల్ మీడియాలో ఓ పోస్ట్ చేశారు. శత్రువుల ముందు తలొగ్గేది లేదని గతంలో పలుసార్లు చాటి చెప్పాం. ఇప్పటికైనా అమెరికా మోసపూరిత చర్యలకు దూరంగా ఉండాలి. మా దేశానికి ద్రోహం చేస్తున్న కిరాయి మూకలపై ఆధారపడడం మానెయ్యాలి. ఇరాన్ చాలా బలమైన, శక్తివంతమైన దేశం. శత్రువు గురించి మాకు తెలుసు. వారిని ఎలా ఎదుర్కోవాలో మాకు తెలుసు. వారిని ఎదుర్కోవడానికి మేం ఎల్లప్పుడూ సిద్ధంగానే ఉంటాం' అని ఖమేనీ పోస్ట్ చేశారు. ప్రజలు చేస్తున్న నిరసనలు హింసాత్మకంగా మారడంతో ఇరాన్‌పై సైనిక చర్యను చేపట్టడం గురించి అమెరికా ఆలోచిస్తోంది. ఇరాన్‌పై వైమానిక దాడులు చేయడం ఒక ఆప్షన్‌గా ఉందని ట్రంప్ యంత్రాంగం ఇటీవల ప్రకటించింది. అలాగే ఇరాన్‌తో వాణిజ్యం చేసే దేశాలపై 25 శాతం సుంకాలు విధిస్తున్నట్టు తాజాగా ట్రంప్ ప్రకటించారు. ఇరాన్‌తో వాణిజ్యం చేసే దేశాల్లో చైనా, తుర్కియే, యూఏఈ, భారత్ ముందు వరుసలో ఉన్నాయి.

# బెంగళూరులో దారుణ ఘటన

## కామంతో యువతిపై టీనేజర్ దాడి

## తిరస్కరించడంతో చంపేసి ఇంటికి నిప్పు

## దర్యాప్తులో బయటపడ్డ అసలు వ్యవహారం





**బెంగళూరు :** బెంగళూరులో దారుణ ఘటన వెలుగు చూసింది. పక్కింట్లో ఉన్న ఓ అమ్మాయిపై బలాత్కారానికి పాల్పడ్డ ఇంటర్ విద్యార్థి, ఆమె తిరస్కరించడంతో కత్తితో పొడిచి చంపాడు. అంతేగాకుండా ఇంటిని తగులబెట్టాడు. అంతా అగ్నిప్రమాదమని భావించినా, పోలీసుల దర్యాప్తులో అసలు నిజం బయటపడింది. చిరుప్రాయంలోనే ఆ యు-వకుడి ఆలోచనలు అదుపు తప్పాయి. పక్కింటి యువతి ఒంటరిగా ఉన్నవేళ కామంతో అఘాయిత్యానికి తెగించాడు. ఆమె ప్రతిఘటించడంతో చివరకు హత్య చేసి, ఆధారాలు చెరిపేసేందుకు ఇంటికే మంటపెట్టాడు. ఆమె అగ్ని ప్రమాదంలో మరణించినట్లుగా తొలుత భావించినప్పటికీ.. పోస్టుమార్టం నివేదిక, సాంకేతిక ఆధారాలతో యువకుడి పాత్ర బయటపడింది.బెంగళూరులో జరిగిన ఈ దారుణంపై పోలీసుల కథనం.. కర్ణాటకలోని మంగళూరుకు చెందిన షర్మిల కుశాలప్ప (34) బెంగళూరులోని ఓ సాఫ్ట్‌వేర్ సంస్థలో ఇంజినీర్‌గా పని చేసేవారు. రామ్మూర్తినగర ఠాణా పరిధి సుబ్రహ్మణ్య లేఅవుట్‌లోని ఓ ఫ్లాట్‌లో తన స్నేహితుడితో కలిసి ఉండేవారు. ఈనెల 3న షర్మిల ఒంటరిగా ఉన్నవేళ ఫ్లాట్‌లో ఆకస్మికంగా మంటలు చెలరేగగా, ఆమె మరణించినట్లు ఫిర్యాదు అందింది. పోలీసులూ ఆ కోణంలోనే దర్యాప్తు చేపట్టారు. అయితే, ఇది సాధారణ మరణం కాదని ఫోరెన్సిక్ నివేదికలో తేలింది. ఆమె శరీరానికి నిప్పు అంటుకోకముందే చేతిపై గాయాలయ్యాయని, ఆపై ఊపిరాడక చనిపోయినట్లు వైద్యులు తేల్చారు. దీంతో పోలీసులు అక్కడి సీసీ కెమెరాల ఫుటేజ్‌లు సేకరించారు. ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారించారు. షర్మిల, ఆమె మిత్రుడు ఉండే ఫ్లాట్ పక్కనే కొడగు జిల్లా విరాజ్‌పేటెకు చెందిన ఇంటర్ సెకండియర్ విద్యార్థి కర్నల్ కురై (18) తల్లితో కలిసి ఉంటున్నాడు. ఈ నెల 3న షర్మిల స్నేహితుడు ఇంట్లో లేని సమయంలో కురై ఆమె ఉండే గదిలోకి కిటికీలోంచి దూరాడు. లైంగిక కోర్కె తీర్చాలని ఒత్తిడి తేవడంతో షర్మిల గట్టిగా అరుస్తూ తోసివేశారు. కోపం పట్టలేని ఆ యువకుడు.. వంటగదిలోని కత్తితో ఆమెపై దాడి చేశాడు. ఆమె పరుపుపై పడిపోగా, మరోసారి కొట్టాడు. అరవొద్దంటూ నోటిని దిండుతో గట్టిగా మూయడంతో షర్మిల ఊపిరాడక చనిపోయారు. ఆపై సాక్ష్యాలను నాశనం చేసేందుకు రక్తపు మరకలున్న ఆమె దుస్తుల్ని తీసి, అదే గదిలో నిప్పంటించి కాల్చేశాడు. మంటలు వ్యాపించడంతో అక్కడి నుంచి పారిపోయేందుకు మళ్లీ కిటికీలోంచి దూకేశాడు. ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించి ఆమె మరణించిందని, సహజ మరణంగా చూపేందుకు ఇలా చేసినట్లు నిందితుడు పోలీసుల విచారణలో అంగీకరించాడు. షర్మిల సెల్‌ఫోన్‌లోని వివరాలు ఈ కేసు దర్యాప్తునకు ఉపకరించాయి. మృతురాలి స్నేహితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# ఉగ్రవాదానికి తెగిస్తే గట్టిగా బుద్ధి చెబుతాం



- ఆపరేషన్ సిందూర్‌లో భూతల దాడులకు కూడా సిద్ధపడ్డాం
- భద్రతా సవాళ్లను ఎదుర్కోవడంలో భారత్ సైనిక సంసిద్ధత
- షక్సాగామ్ వ్యాలీ ఎప్పటికీ భారత్‌లో భాగమే
- మీడియా సమావేశంలో ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది

**న్యూఢిల్లీ :** ఉగ్రవాదులు తెగిస్తే గట్టిగా బుద్ధి చెబుతామని, ఆపరేషన్ సిందూర్ కొనసాగుతోందని, త్రివిధ దళాల సమన్వయానికి ఇది నిదర్శనమని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది అన్నారు. దిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆయన ..భద్రతా సవాళ్లను ఎదుర్కోవడంలో భారత్ సైనిక సంసిద్ధత దీనిద్వారా స్పష్టమైందని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్‌ను చాలా కచ్చితత్వంతో అమలుచేశాం. 88 గంటల పాటు సాగిన ఆ ఆపరేషన్‌లో మన సైనిక దళాలు అత్యంత స మర్థంగా పనిచేశాయి. ఉగ్ర శిబిరాలను నేలమట్టం చేయ గలిగాం. దాదాపు 100 మంది ఉగ్రవాదులను హతమార్చాం. ఆ సమయంలో పెద్దఎత్తున బలగాలను సరిహద్దులకు తరలించాం. పాకిస్థాన్ చిన్న తప్పు చేసినా.. భూతల దాడులను ప్రారంభించేందుకు కూడా నాడు మేం పూర్తి సన్నద్ధంగా ఉన్నాం అని ఆర్మీ చీఫ్ నాటి పరిస్థితులను వివరించారు. అలాగే ఈశాన్య సరిహద్దులో పరిస్థితులు స్థిరంగానే ఉన్నాయని, అయితే అప్రమత్తంగా ఉండటం కీలకమని వెల్లడించారు. చైనా సరిహద్దులోని భద్రత గురించి మాట్లాడుతూ.. భారత మోహరింపులు బలంగా ఉన్నాయని చెప్పారు. భవిష్యత్‌లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు ఎదురైనా వాటిని సమర్థవంతంగా ఎదుర్కొంటామని పాకిస్థాన్‌కు పరోక్షంగా గట్టి హెచ్చరికలు చేశారు. జమ్మూకశ్మీర్‌లో పరిస్థితులు సున్నితంగానే ఉన్నా.. ప్రస్తుతం అవి నియంత్రణలోనే ఉన్నాయన్నారు. ఇక వివాదాస్పద షక్సాగామ్ వ్యాలీలోని ప్రాంతం తమ దేశంలో భాగమేనని చైనా చేసిన వాదనను భారత్ మరోసారి తిప్పికొట్టింది. ఆ వ్యాలీ అప్పగింతకు సంబంధించి 1963లో పాకిస్థాన్, చైనా మధ్య జరిగిన ఒప్పందం చట్టవిరుద్ధమని జనరల్ ఉపేంద్ర ద్వివేది వెల్లడించారు. ఈ వివాదం పై స్పందించారు. 'షక్సాగామ్ వ్యాలీని చైనాకు అప్పగిస్తూ బీజింగ్‌తో పాకిస్థాన్ చేసుకున్న ఒప్పందం చెల్లదు. ఆ ప్రాంతంలో జరిగే ఏ కార్యకలాపాలను మేం గుర్తించబోం. చైనా-పాక్ ఆర్థిక కారిడార్ విషయానికొస్తే.. అది ఆ రెండు దేశాలు సంయుక్తంగా చేస్తోన్న చట్టవిరుద్ధమైన చర్యగానే మేం పరిగణిస్తాం' అని జనరల్ ఉపేంద్ర ద్వివేది స్పష్టం చేశారు. షక్సాగామ్ వ్యాలీ ప్రాంతంలో చైనా చేపట్టిన అభివృద్ధి పనులపై ఈ నెల 9న భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. 'పాకిస్థాన్-చైనా పేర్కొంటున్న 1963 నాటి సరిహద్దు ఒప్పందాన్ని మేం ఎప్పటికీ గుర్తించబోం. దీనిపై మా నిర్ణయంపై మారదు. షక్సాగామ్ వ్యాలీ మా దేశంలో భాగమే అని స్పష్టం చేసింది. దీనిపై చైనా స్పందిస్తూ.. భారత్‌పై అక్కసు వెళ్లగక్కింది. ఆ ప్రాంతం తమ దేశంలో భాగమేనని, అక్కడ తాము చేపడుతున్న అభివృద్ధి పనులపై భారత్ అభ్యంతరం చెప్పడానికి అవకాశం లేదని పేర్కొంది. షక్సాగామ్ వ్యాలీ కీలకమైన కారకోరమ్ రహదారిలో ఉంది. స్వాతంత్ర్యం రాగానే పాకిస్థాన్ దీన్ని ఆక్రమించుకుంది. అనంతరం దీనికి చైనాకు ధారాదత్తం చేసింది. భారత్‌కు చెందిన ప్రాంతాన్ని ఆక్రమించుకుని మరొక దేశానికి ఇవ్వడం అంతర్జాతీయ చట్టాల ప్రకారం విరుద్ధం. ఈ వ్యాలీని బీజింగ్‌కు అప్పగించడం ద్వారా పాకిస్థాన్‌తో చైనాకు రహదారి సౌకర్యం ఏర్పడింది. దీని మీదుగానే చైనా-పాకిస్థాన్ ఆర్థిక నడవాను బీజింగ్ నిర్మిస్తోంది.



సంపాదకీయం

# తెలుగు లోగిళ్లలో భోగి.. భాగ్యం!

భారతీయ సంస్కృతిలో పండగలది విశేష స్థానం. ప్రత ఇపండగకూ పరమార్థం ఉంది. ఇందులో కాలనుగుణంగా పండగలను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. భోగి,సంక్రాంతి, కనుమ అన్నవి దక్షిణాయం నుంచి ఉత్తరాయణ ప్రయణానికి సూచికగా గుర్తించాలి. సూర్య గమనం ముందు ఇదో విశేషం.దక్షిణాయనంలో సూర్యుడు రోజు రోజుకి భూమికి దక్షిణం వైపుగా కొద్ది కొద్దిగా దూరమవుతూ దక్షిణ అర్ధగోళంలో భూమి కి దూరం అవుట వలన భూమిపై బాగా చలి పెరుగుతుంది. ఈ చలి వాతావరణాన్ని తట్టుకునేందుకు ప్రజలు సెగ కోసం భగభగ మండే చలి మంటలు వేసుకునేవారు, ఉత్తరాయణం ముందురోజుకి చలి విపరీతంగా పెరగడం ఈ చలిని తట్టుకునేందుకు భగ భగ మండే మంటలు అందరు వేయటం వలన ఈ రోజుకు భోగి అనే పేరు వచ్చిందనే ప్రచారం ఉంది. భుగ్ అనే సంస్కృత పదం నుంచి భోగి అనే పదం వచ్చిందని చరిత్ర ద్వారా తెలుస్తోంది. భోగం అంటే సుఖం. పురాణాల ప్రకారం, శ్రీ రంగనాథ స్వామిలో గోదాదేవి లీనమై భోగాన్ని పొందిందని.. దానికి సంకేతంగానే భోగి పండుగ ఆచరణలో వచ్చినట్లు పెద్దలు చెబుతారు. మరో కథనం మేరకు.. శ్రీ మహా విష్ణువు వామనుడి అవతారంలో వచ్చి బలి చక్రవర్తిని పాతాళంలోకి తొక్కింది కూడా భోగి రోజునే. ఇంకోవైపు ఇంద్రుడి పొగరును అణచివేస్తూ గోవర్ధన పర్వతం ఎత్తిన పవిత్రమైన రోజు కూడా భోగి రోజే అని పెద్దలు చెబుతారు. అంతేకాదు రైతుల కోసం ఈశ్వరుడు నందిని భూమికి పంపిన పవిత్రమైన రోజునే భోగి రోజు అని.. అందుకే ఈరోజు భోగి పండుగను జరుపుకుంటారు. జనవరి నెలలో చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది కాబట్టి సాధారణంగా చలి మంటలను వేసుకుంటారు. కానీ భోగి మంటలనేవి కేవలం చలి తీవ్రత నుంచి తప్పించుకునేందుకు మాత్రమే కాదు.. ఆరోగ్య ప్రయోజనాల కోసం కూడా వేస్తారు. సంక్రాంతి పండక్కి సరిగ్గా నెలరోజుల ముందు ధనుర్మాసం ప్రారంభమవుతుంది. ఈ సమయంలో ఇంటి ముందు పెట్టిన గొబ్బెమ్మలను పిడకలుగా చేస్తారు. వాటినే భోగి మంటల్లో వేస్తారు. వీటిని కాల్చడం వల్ల గాలి శుద్ధి అవుతుంది. సూక్ష్మ క్రిములు నశిస్తాయి. మనకు శ్వాసకోశకు సంబంధించిన అనేక రోగాల నుంచి ఉపశమనం లభిస్తుంది. భోగి మంటల్లో పిడకలతో పాటు రావి, మామిడి, మేడి, ఔషధ చెట్ల కలప, ఆవు నెయ్యి వేస్తారు. ఆవు నెయ్యి, ఆవు పిడకలను మంటల్లో వేయడం వల్ల శక్తివంతమైన గాలి విడుదలవుతుంది. అందుకే భోగి మంటలను ప్రతి పలెటూళ్లో విధిగా వేస్తారు. అంతేకాదు ఊళ్లో ఉండే వారందరినీ కులాలకు అతీతంగా అందరినీ ఒకేచోట చేర్చి, ఐక్యమత్యం పెంచడంలో కూడా భోగి ఎంతగానో ఉపయోగపడుతుంది. అంతేకాదు అగ్నిదేవుడిని ఆరాధిస్తూ.. వాయుదేవునికి గౌరవం ఇచ్చినట్టు భోగి పండుగ రోజున సాయంత్రం వేళలో బొమ్మల కొలువు నిర్వహిస్తారు. ఇదే రోజున చిన్నారుల తలపై భోగి పళ్లను పోస్తారు. ఇదే రోజున బదరీ వనంలో శ్రీహరిని పిల్లాడిగా మార్చి దేవతలంతా బదరీ పళ్ల(రేగు పళ్లు)తో అభిషేకం చేశారు. అవే కాలానుగుణంగా వచ్చిన మార్పులో భోగి పళ్లుగా మారాయి. వీటితో పాటు పూలు, శనగలు కూడా కలిపి చిన్నారులపై వేయడం వల్ల వారు ఆయురారోగ్యాలతో వర్ధిల్లుతారని చాలా మంది నమ్ముతారు. సంక్రమణ మహాపర్వానికి ముందు రోజుకి ఒక ప్రాధాన్యం ఉంది. దీనికి భోగిపర్వం అని పేరు. అయితే భోగము అనే మాటకు అర్థం ఏమిటంటే అనుభవము అని. ఆనందంగా దేనిని అనుభవిస్తామో లేదా దేనిని అనుభవించడం వల్ల ఆనందం పొందుతామో దానిని భోగము అనాలి. అలాంటి భోగములు అనుభవించవలసిన రోజుని భోగి అంటారు. నిజమైన ఆనందాన్ని అనుభవించడమే నిజమైన భోగం. ఒక్కొక్కరికి ఒక్కొక్కటి ఆనందం. సామాన్యుల ఆనందాలు వేరు. వాళ్ళకి లౌకిక విషయాలు దొరికితే అది భోగం. ఆ విషయంతో విసుగు కలిగితే మరో విషయం లభించాలని. కానీ ఏది లభిస్తే మరి ఇంకేదీ కావాలని అనిపించదో, ఏది పరిపూర్ణమైన ఆనందమో అదే నిజమైన భోగం. అలాంటి భోగం యోగం వల్లనే లభ్యం అవుతుంది. అందుకే యోగులే భోగులు కాగలరు. అలాంటి దివ్య భోగం ఈరోజున అమ్మ గోదాదేవి ఆండాళ్ళమ్మ పొందినది. అదేమిటంటే పరమాత్మ ప్రాప్తి. రంగనాథుని చేపట్టినది. రంగనాథుని అనుగ్రహాన్ని పొందినది. రంగనాథుని సాంగత్యం అనబడేటటువంటి ఆ కైవల్యానందం అనే భోగాన్ని అమ్మ పొందినది కనుక ఈరోజు భోగి అనే పేరు భక్తి సాంప్రదాయం పరంగా నిర్వచించేవారు చెబుతారు. సరిగ్గా ఈ రోజుతో ధనుర్మాసం పూర్తి అవుతున్నది. తర్వాతు రీహ్యా నుంచి మకర మాసం వస్తున్నది సౌరమానం ప్రకారంగా. ఈ ధనుర్మాస వ్రతమంతా ఈరోజు పూర్తీ జరిగి దాని ఫలితంగా అమ్మవారు స్వామియొక్క అనుగ్రహాన్ని పొందినది.భోగి లేదా భోగి పండుగ అనునది ఆంధ్రులు జరుపుకునే ఒక ముఖ్యమైన పండుగ. ఆంధ్రులు పెద్ద పండుగగా జరుపుకునే మూడు రోజుల సంక్రాంతి పండుగలో మొదటిరోజును భోగి అంటారు. చలికాలంలో అత్యంత చలిగా ఉండే రోజు భోగి. ఈ రోజున ఆంధ్రులు మంటలు వేసి చలికాచుకుంటారు, ఈ మంటలనే భోగి మంటలు అంటారు. భోగిమంటలకు ఎక్కువగా తాటిఆకులను ఉపయోగిస్తారు. ఈ ఆకులను భోగికి కొన్ని రోజుల ముందే కొట్టుకొని తెచ్చి భోగిమంటల కొరకు సిద్ధం చేసుకుంటారు. అనేక ప్రాంతాలలో ప్రత్యేకంగా భోగిమంటల కొరకు తాటాకు మోపులను ఇళ్ళవద్దకే తెచ్చి విక్రయిస్తున్నారు. వీటితో పాటు మంటలలో మండగల పనికిరాని పాత వస్తువులను ముందురోజు రాత్రికి సిద్ధం చేసుకుంటారు. తెల్లవారుజామున సాధారణంగా 3 గంటల నుంచి 5 గంటల మధ్యన ఎవరి ఇంటి ముందువారు ఈ మంటలు వేయడం ప్రారంభిస్తారు. పండుగ నెలలో ముగ్గులు ప్రతిరోజు వేస్తారు, కాని భోగి రోజు ముగ్గు ఒక ప్రత్యేకత. రోజు వేసే ముగ్గుల కన్నా ఈ రోజు మరింత అందంగా రంగు రంగుల రంగవల్లికలేస్తారు. భోగి పండుగ రోజు పిల్లలపై భోగి పలు పండ్లు పోసి ఆశీర్వదిస్తారు, అందుచేత ఈ పళ్ళను భోగి పళ్ళు అంటారు, భోగి పళ్ళ ఆశీర్వాదాన్నీ శ్రీమన్నారాయణుడి ఆశీస్సులుగా భావిస్తారు. కొన్ని ప్రాంతాలలో భోగి రోజున రైతులు తమ సాగుభూమికి ఆనవాయితీగా కొంతమేర సాగునీరు పారించి తడి చేస్తారు, ఒక పంట పూర్తయిన తదుపరి మళ్ళీ పంట కొరకు సాగుభూమిలో నీరు పారించడాన్ని పులకేయడం అంటారు, ఆనవాయితీగా భోగి రోజున పులకేయడాన్ని భోగి పులక అంటారు.



కంచర్ల అచ్యుత్ రావు
ఎడిటర్

# ప్రైవేట్ ట్రావెల్స్ అధిక ఛార్జీలపై కఠిన చర్యలు

## జిల్లా రవాణా శాఖ సంయుక్త కమిషనర్ ఎ. మోహన్





**విజయవాడ:** సంక్రాంతి పండుగ సందర్భంగా స్వగ్రామాలకు వెళ్లే ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగిన నేపథ్యంలో, ప్రైవేట్ బస్సులు అధిక ఛార్జీలు వసూలు చేయకుండా నియంత్రించేందుకు రవాణా శాఖ కఠిన చర్యలు చేపట్టిందని జిల్లా రవాణా శాఖ సంయుక్త కమిషనర్ తెలిపారు. గత ఐదు రోజులుగా ఆర్టీజీఎస్ పర్యవేక్షణతో పాటు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఫేర్ మానిటరింగ్ టీమ్స్ ద్వారా అన్ని ఆన్‌లైన్ బుకింగ్ ప్లాట్‌ఫార్మ్‌ల్లోని బస్సు ఛార్జీలను నిరంతరం పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. అధిక ధరలు వసూలు చేస్తున్నట్లు గుర్తించిన వెంటనే సంబంధిత ప్రైవేట్ బస్సు యజమానులతో అధికారులు సమన్వయం చేసి, ఛార్జీలను తక్షణమే తగ్గించి నియంత్రించే చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆర్టీసీ నిర్దేశించిన ఛార్జీలపై గరిష్టంగా 50 శాతం మాత్రమే అదనంగా వసూలు చేయాలని స్పష్టం చేస్తూ, దానికంటే ఎక్కువ ధరకు టికెట్లు విక్రయిస్తే సంబంధిత బస్సు యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రయాణికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్రవ్యాప్తంగా హెల్ప్‌లైన్ నెంబర్ 92816 07001ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బస్సు ఛార్జీలు లేదా ఇతర సమస్యలపై ఫిర్యాదులు అందిన వెంటనే అధికారులు స్పందించి తక్షణ పరిష్కారం అందిస్తారని చెప్పారు. ఈ హెల్ప్‌లైన్ నెంబర్‌ను ప్రతి ప్రైవేట్ బస్సులో తప్పనిసరిగా స్పష్టంగా ప్రదర్శించాలని బస్సు యజమానులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. అదే విధంగా మోటార్ వాహన తనిఖీ అధికారులతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తూ, అధిక ఛార్జీలు వసూలు చేస్తున్న ప్రైవేట్ బస్సులపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధిస్తున్నట్లు తెలిపారు. గత ఐదు రోజులగా జరుగుతున్న ఈ తనిఖీలలో అధిక ఛార్జీలు వసూలు చేసిన రెండు బస్సులపై కేసులు నమోదు చేసి రూ. 20 వేలు జరిమానా విధించామని, అలాగే పన్ను, పర్మిట్ వంటి ఇతర నిబంధనలు ఉల్లంఘించిన 92 బస్సులపై కేసులు నమోదు చేసి రూ. 3,43,650 జరిమానా విధించినట్లు తెలిపారు. ఈ ప్రత్యేక తనిఖీలు, పర్యవేక్షణ ప్రక్రియ ఈ నెల 18 వరకు కొనసాగుతాయని, పండుగ అనంతరం తిరుగు ప్రయాణాల సమయంలో కూడా ఇదే విధమైన కట్టుదిట్టమైన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన, భద్రతతో కూడిన ప్రయాణం అందించడమే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, పండుగ కాలంలో ప్రయాణికుల శ్రేయస్సు కోసం అన్ని అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా రవాణా శాఖ సంయుక్త కమిషనర్ ఎ. మోహన్ ఈ ప్రకటనలో తెలిపారు.

# ప్లాస్టిక్ సంచులు వినియోగంపై మున్సిపల్ అధికారులు చర్యలు



**నర్సీపట్నం:** పర్యావరణ పరిరక్షణలో భాగంగా మున్సిపాలిటీలో ప్లాస్టిక్ సంచుల నియంత్రణకు మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర ప్రత్యేక చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా మంగళవారం శానిటరీ ఇన్స్పెక్టర్ చిట్టిబాబు ఆధ్వర్యంలో ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంతంలో హొటళ్లు, పువ్వుల దుకాణాలు, జ్యూస్ షాపులు, స్వీట్ షాపులు తదితర వ్యాపార సంస్థలలో తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా శానిటరీ ఇన్స్పెక్టర్ చిట్టిబాబు మాట్లాడుతూ, ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపనకు పట్టణ ప్రజల సహకారం అత్యంత అవసరం అని తెలిపారు. 120 మైక్రాన్లు కంటే ఎక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ కవర్లను మాత్రమే వినియోగించుకోవచ్చని, అంతకంటే తక్కువ మైక్రాన్లు ఉన్న ప్లాస్టిక్ సంచులు ఉపయోగిస్తున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే పట్టణంలో ప్లాస్టిక్ కవర్ల విక్రయాలు చేస్తున్న హెూల్‌సేల్ దుకాణాలపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. పర్యావరణాన్ని కాపాడుకోవడానికి వ్యాపారులు, ప్రజలు స్వచ్ఛందంగా ప్లాస్టిక్ వినియోగాన్ని మానేసి ప్రత్యామ్నాయంగా కాగితపు, గుడ్డ సంచులు వినియోగించాలని చిట్టిబాబు విజ్ఞప్తి చేశారు. ఈ తనిఖీల్లో సచివాలయ సెక్రటరీలు, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

# పథకాలు అమలు చేయకుండా ప్రచారానికి రూ.20 కోట్లు కేటాయింపు అన్యాయం



నర్సీపట్నం: రాష్ట్ర భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నుండి ప్రభుత్వ ప్రచారానికి రూ.20 కోట్లను కేటాయిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని భవన నిర్మాణ కార్మికులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ మేరకు మంగళవారం భవన నిర్మాణ కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) జిల్లా అధ్యక్షులు కె. రామకృష్ణ మాట్లాడుతూ, సుమారు ఏడేళ్లుగా భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం అమలు చేయాల్సిన సంక్షేమ పథకాలు నిలిచిపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 30 లక్షల మంది కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వం, ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా కార్మికుల పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారని విమర్శించారు.భవన నిర్మాణదారుల నుండి వసూలు చేస్తున్న ఒక శాతం పన్నును కార్మికుల పిల్లల స్కాలర్ షిప్పులు, ప్రమాద బీమా, మెటర్నిటీ సదుపాయం, పనిముట్లు వంటి సంక్షేమ పథకాలకు వినియోగించాల్సి ఉండగా, ఆ నిధులను నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ ప్రచారాలకు వాడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకొని భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాల అమలుపై దృష్టి సారించాలని సిఐటియు డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు డి. శివ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో హెల్మెట్ వినియోగంపై అవగాహన ర్యాలీ

## సురక్షిత ప్రయాణానికి భద్రత నియమాలు తప్పక పాటించాలి

## ప్రాంతీయ రవాణా అధికారి రమేష్



**నర్సీపట్నం:** జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల కార్యక్రమంలో భాగంగా మంగళవారం ప్రాంతీయ రవాణా అధికారి రమేష్ ఆధ్వర్యంలో హెల్మెట్ వినియోగం ఆవశ్యకతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అలా చేయడం ద్వారా ప్రాణనష్టం తగ్గించవచ్చని పేర్కొన్నారు. రహదారి నియమాలు ప్రతి ఒక్కరి కర్తవ్యం అని, వాటిని పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాల నుండి రక్షణ పొందవచ్చునని తెలిపారు. సురక్షిత ప్రయాణానికి భద్రత నియమాలను తప్పక పాటించాలని సూచించారు. ర్యాలీ సందర్భంగా రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలు, ప్రమాదాల నివారణ మార్గాలు, డ్రైవింగ్ సురక్షా నిబంధనలు గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. జనవరి ఒకటి నుండి 31 వరకు నర్సీపట్నం రవాణా శాఖ ఆధ్వర్యంలో జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలలో భాగంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. రహదారి భద్రత నియమాలుపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టీఓ కార్యాలయ ఇన్స్పెక్టర్లు వెంకట్రావు, అప్పన్న, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కల్పనతో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# సంక్రాంతి శిగ... పసిడి రాశుల ధాన్యనగ



**కమ్మరి కొలిమి..కుమ్మరి చక్రం ..సాలెల మగ్గం... సమస్త వృత్తులు..సహస్ర చిహ్నం... అన్న శ్రీశ్రీ గ్రామీణ చేతివృత్తుల ఔన్నత్యాన్ని చెప్పారు. ఒక వ్యవసాయ పనిముట్టు తయారికి.....కమ్మరి....ఒక కుమ్మరి లేనిదే పనికాదు. వ్యవసాయ దేశంగా పేరుపొందిన మన దేశంలో ఎన్నో కులవృత్తులు ఆ రంగానికి సహాయ సహకారాలు అందిస్తూ ఆరుగాలం శ్రమపడే రైతుకు బాసటగా నిలుస్తాయి. అలాంటి రైతు కష్టం గడప చేరిన రోజున నిజమైన పండగే. ఆ మూలాల నుంచి వచ్చినవే మన వారసత్వ పండుగలు. అయితే సంక్రాంతి, పొంగల్ కేవలం పండుగలు కావు, అవి భారతీయ వ్యవసాయ సమాజం జీవన విధానాన్ని, సంస్కృతిని ప్రతిబింబిస్తాయి**

**విజయనగరం, జనవరి 13 (మనసు లో మాట):** భారతదేశంలో వ్యవసాయం కేవలం ఒక వృత్తి కాదు. అది ఒక జీవన విధానం. ఈ పండుగలు ప్రకృతిపై మన ఆధారపడటాన్ని, దానితో మనం పంచుకునే సహజీవన సంబంధాన్ని గుర్తు చేస్తాయి. మనం తినే ఆహారం పట్ల దానిని ఉత్పత్తి చేయడానికి అవిశ్రాంతంగా పనిచేసే రైతుల పట్ల కృతజ్ఞతను అవి మనకు బోధిస్తాయి. అంతేకాకుండా, అవి సంగీతం, నృత్యం, వంటకాల ఆనందాల ద్వారా భారతీయ సంప్రదాయాల గొప్పతనాన్ని ప్రదర్శిస్తాయి, ఇవన్నీ వ్యవసాయ చక్రం నుండి ప్రేరణ పొందాయి. భారతదేశం విభిన్న సంస్కృతులు, సంప్రదాయాలు పండుగలకు నిలయం. లెక్కలేనన్ని వేడుకలలో, పొంగల్ , లోహ్రి, మకర సంక్రాంతి ప్రత్యేక ప్రాముఖ్యతను కలిగి ఉన్నాయి ఎందుకంటే అవి మన వ్యవసాయ వారసత్వంలో లోతుగా పాతుకుపోయాయి. ఈ పండుగలు పంట కాలం రాకను సూచించడమే కాకుండా రైతుల కృషిని పంటల సమృద్ధిని కూడా జరుపుకుంటాయి. సంక్రాంతి/పొంగల్ పండుగలో వ్యవసాయ ప్రాముఖ్యత చాలా ఎక్కువ. ఇది పంట కోతల పండుగ, రైతులు తమ శ్రమకు తగిన ఫలం దక్కిందని సూర్య భగవానుడికి, భూమికి, పశువులకు కృతజ్ఞతలు చెప్పే పండుగ. ఈ పండుగ, శీతాకాలం ముగిసి, కొత్త పంటల సాగు మొదలయ్యే సమయాన్ని సూచిస్తుంది. వరి ధాన్యం, చెరకు, నువ్వులు వంటి పంటల రాబడితో ఇళ్లు కళకళలాడుతాయి, పొంగల్ వంటకాలు వండుకుంటారు, ఇది గ్రామీణ జీవనానికి, ఐక్యతకు ప్రతీక. భారతదేశ ఆర్థిక వ్యవస్థ చారిత్రాత్మకంగా వ్యవసాయాధారమైనది, నేటికీ, జనాభాలో గణనీయమైన భాగం వ్యవసాయంపై ఆధారపడి ఉంది. పొంగల్, లోహ్రి, మకర సంక్రాంతి వంటి పండుగలు జనవరి మధ్యలో జరుపుకుంటారు, ఇది శీతాకాలపు అయనాంతం ముగింపు మరియు పొడవైన పగటి ప్రారంభంను సూచిస్తుంది. ఈ కాలం వరి, చెరకు, గోధుమ మరియు నువ్వులు వంటి పంటల పంటను సూచిస్తుంది మరియు ఈ పండుగలు సమృద్ధిగా పంటను ఇచ్చినందుకు ప్రకృతికి, సూర్య భగవానుడికి కృతజ్ఞతా పూర్వకంగా పనిచేస్తాయి.పొంగల్ : తమిళనాడులో ప్రధానంగా జరుపుకునే పొంగల్, సూర్య భగవానుడికి అంకితం చేయబడిన నాలుగు రోజుల పండుగ. "పొంగలు అనే పేరుకు "మరిచిపోవడం" అని అర్థం, ఇది సమృద్ధి మరియు శ్రేయస్సును సూచిస్తుంది. రైతులు తాజాగా పండించిన బియ్యం, చెరకుతో ప్రత్యేక వంటకాలను తయారు చేస్తారు. ఇది ప్రధానంగా పంట చేతికొచ్చిన తర్వాత జరుపుకునే పండుగ, రైతుల కృషి ఫలించే సమయం ఇది. సూర్యుడు ఉత్తరాయణంలో ప్రవేశించడం, పంటలు బాగా పండటానికి తోడ్పడటం వల్ల సూర్య భగవానుడిని పూజిస్తారు.పశువుల పూజ (మట్టు పొంగల్): వ్యవసాయానికి ఉపయోగపడే పశువులకు కృతజ్ఞతలు తెలుపుతూ మట్టు పొంగల్ జరుపుకుంటారు. ఈ పండుగ భూమి, ప్రకృతి, పశువుల మధ్య అనుబంధాన్ని, వాటికి కృతజ్ఞత చెప్పే సంప్రదాయాన్ని గుర్తు చేస్తుంది.వరి, ఇతర ధాన్యాలతో చేసిన వంటకాలను పంచుకుంటూ, కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి ఆనందంగా జరుపుకుంటారు, ఇది సామాజిక బంధాలను బలపరుస్తుంది. ఈ పండుగ మరియు దాని ఆచారాలు ప్రాచీన భారతదేశంలో ఎంతో గౌరవించబడతాయి. ఇతర పండుగల మాదిరిగా కాకుండా దీనికి అపారమైన ప్రాముఖ్యత ఉంది మరియు ప్రజలు అంతర్లీన కారణాలను అర్థం చేసుకోకుండా సంప్రదాయాలను అనుసరిస్తారు.



మకర సంక్రాంతి సమయంలో, నువ్వులు, బెల్లం మరియు కిచిడి వంటి నిర్దిష్ట ఆహారాలను తీసుకుంటారు. ఈ ఆచారాలు రుచికి సంబంధించినవి మాత్రమే కాదు. అవి శీతాకాలపు పంటల కోతలో లోతుగా పాతుకుపోయాయి. ఆసక్తికరంగా, ఉత్తర భారతదేశంలో, ఈ పండుగను తరచుగా "ఖిచ్డి" అని పిలుస్తారు, ఇది దేశ సాంస్కృతిక పద్ధతుల్లోని వైవిధ్యాన్ని నొక్కి చెబుతుంది.ఈ ఆచారాల వెనుక ఉన్న శాస్త్రీయ ఆధారాలను మనం వెలికితీస్తున్నప్పుడు, మన సంప్రదాయాల గురించి ప్రశ్నించడం మరియు వాటి గురించి జ్ఞానం పొందడం చాలా అవసరం. భారతదేశంలో మకర సంక్రాంతికి అపారమైన ప్రాముఖ్యత ఉంది, జనవరి 14, 15, 16తేదీలలో వరుసగా మూడు రోజుల పాటు జరుగుతుంది, ప్రతి సంవత్సరం దాదాపు ఒకే తేదీలలో. ఇతర పండుగల మాదిరిగా కాకుండా, ఇది సాంస్కృతిక క్యాలెండర్‌లో విలక్షణమైన మరియు ప్రత్యేక స్థానాన్ని ఆక్రమించింది.బియ్యం పిండి మరియు బెల్లం నుండి తయారు చేయబడిన "అరిసలు" అనే మిఠాయిని తయారు చేస్తారు.ఇది అరిసలు మాత్రమే కాదు, పండుగల సమయంలో మనం తయారుచేసే స్వీట్లు చాలా ఉన్నాయి, ఎందుకంటే ఈ స్వీట్లు ఇంట్లో ప్రేమ మరియు వెచ్చదనంతో తయారు చేయబడతాయి, అవి మీ శరీరానికి హానికరం కాదు, అవి బయటి జంక్ ఫుడ్ లాగా కాకుండా పరిపూర్ణ ప్రోటీన్‌ను అందిస్తాయి. తయారుచేసిన ఆహారాలు దీర్ఘకాలిక ఉపయోగం కోసం నిల్వ చేయబడతాయి స్నేహితులు మరియు కుటుంబ సభ్యుల మధ్య బంధాన్ని తీసుకురావడానికి ఉత్ప్రేరకంగా పనిచేస్తాయి. ఒక సమాజంగా ఏర్పరుస్తుంది. మొదటి రోజును భోగి అని పిలుస్తారు మరియు ఇది ఇంటిని పూర్తిగా శుభ్రం చేయడానికి అంకితం చేయబడిరది.భోగి పండుగ సాధారణంగా ఇంటి ముందు ఏర్పాటు చేసే సాంప్రదాయ భోగి మంటలతో ప్రారంభమవుతుంది. ఈ భోగి మంటల ఆచారంలో వివిధ ఉపయోగించని వస్తువులను, ప్రధానంగా చెక్క వస్తువులను సేకరించి, వాటిని కాల్చడానికి కలిపి అమర్చడం జరుగుతుంది.జ్వాలలు నృత్యం చేస్తూ, మిణుకుమిణుకుమంటున్నప్పుడు, అగ్ని చుట్టూ ఒక సామూహిక సమావేశం ఏర్పడుతుంది. ఈ సామూహిక సమయంలో, మన జీవితాల నుండి అన్ని ప్రతికూల శక్తులు మరియు అవాంఛనీయ అంశాలను తొలగించాలని కోరుతూ దెవాన్ని ప్రార్థించడానికి ప్రార్ధనలు చేయబడతాయి.లోహ్రికి భాంగ్రా వంటి జానపద నృత్యాలు లేదా మకర సంక్రాంతికి గాలిపటాలు ఎగరవేయడం వంటి సాంప్రదాయ ఆటలను నిర్వహించడం ఆనవాయితీ.లోహ్రి : పండుగ యొక్క వెచ్చదనం దాని ఆహారంలో ప్రతిబింబిస్తుంది. ప్రజలు మక్కీ ది రోటీ (మొక్కజొన్న పిండి రొట్టె) ను సర్సన్ దా సాగ్ (ఆవాలు ఆకుకూరలు) తో ఆస్వాదిస్తారు. గజక్, రెవ్రి మరియు వేరుశెనగ చిక్కీ వంటి స్వీట్లు కూడా ప్రసిద్ధి చెందాయి. గొబ్బెమ్మలతో అలంకరణ, వీధులను ముస్తాబు చేసే రంగవల్లులు, ఆకాశాన్ని ఇంద్రధనస్సు తో చూపే గాలిపటాలు, ఇదేకదా మన సంస్కృతికి ప్రతిరూపాలు.



## దేమునిగుమ్మం శ్రీ వెంకటేశ్వరస్వామి కి కేజీ వెండి కిరీటం

### విజయవాడ కి చెందిన అడ్డూరి శ్రీనివాసరావు దంపతులు బహుకరణ

**అనకాపల్లి, జనవరి 13 (మనసులో మాట):..** అనకాపల్లి దేమునిగుమ్మం శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి మంగళవారం కేజీ వెండి కిరీటం ను విజయవాడ కి చెందిన అడ్డూరి శ్రీనివాసరావు దంపతులు బహుకరించడం జరిగింది. ముందుగా శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా దేవాలయం లో స్వామి వారిని దర్శించుకొని పూజించారు. అనంతరం ఒక కేజీ వెండి కిరీటం స్వామివారికి అలంకరణ నిమిత్తం ఉత్సవ కమిటీ ఛైర్మన్ బొలిశెట్టి శ్రీనివాసరావు, కార్యనిర్వహణాదికారి బి.మురళీకృష్ణ లకు అందజేశారు. వెండి కిరీటాన్ని దేవాలయం అర్చకులు స్వామివారి పాదాల చెంత ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదనంతరం వెండి కిరీటం తాలూకా వివరాలను ఆలయ రికార్డుల్లో నమోదు చేసి రిసిప్ట్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ ఇన్స్పెక్టర్ వసంత్ కుమార్, అర్చకులు పులకడం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## గవరపాలెం చినరామన్న కోవెల ఏరియాలో అంబరాన్ని అంటిన సంక్రాంతి సంబరాలు

### ముఖ్య అతిథిగా హాజరైన అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ



**అనకాపల్లి, జనవరి 13 (మనసు లో మాట):** అనకాపల్లి గవరపాలెం చిన్నరామ కోవెల ప్రాంతంలో మంగళవారం చిన్న రామ యువజన సేవా సంఘం, చిన్న రామ యంగ్ టైగర్ యూత్, రైతు సంఘం, కూటమి నాయకులు అధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. ముఖ్య అతిధి మాజీ మంత్రి, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ హాజరై వేడుకలను తిలకించారు. ముందుగా చిన్న రామ కోవెలలో రాముల వారి ని ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీ లను హరిదాసుల హరినామ స్మరణ ను, గంగిరెద్దు, కొమ్మదాసుడు విన్యాసం , కోలాటాలు ఎమ్మెల్యే రామకృష్ణ వీక్షించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా అన్ని పాడిపంటలను, పశువులను పూజించే నటువంటి గొప్ప సంస్కృతి మనదన్నారు. సంస్కృతిలో భాగం రైతులని గౌరవించుకోవడం తోపాటు పాదాభివందనాలు చేయవలసిన అవసరం ఉందని అన్నారు. వ్యవసాయదారులకు పంటలు బాగా పండించాలని కొత్త కొత్త రకాల వంగడాలు పండించాలని, యాంత్రికరణ వ్యవసాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. వ్యవసాయాన్ని పరిశ్రమగా గుర్తించి ప్రభుత్వ వ్యవసాయం చేయమని రైతులు చుట్టూ తిరిగే రోజు వస్తుందన్నారు. రైతు బాంధవుడు రైతు ప్రతినిధి, రైతు సమస్యలను ఢిల్లీ వరకు తీసుకెళ్లిన వ్యక్తి, సిద్ధాంతాలు కాపాడడానికి తన యావదాస్తిని వెచ్చించిన వ్యక్తి, ఢిల్లీలో పేరు ప్రఖ్యాతలతో కూడిన వ్యక్తి వివి రమణ ని గుర్తు చేస్తూ ఈ ప్రాంతంలో ఈ గడ్డపై పుట్టినందుకు మనం గర్వించాలన్నారు. షుగర్ ఫ్యాక్టరీలు ఇప్పటివరకు నడిచాయంటే ఆయన చేసిన కృషేనని అన్నారు. సాంప్రదాయాన్ని గుర్తుపరిచే విధంగా ముగ్గులు వేసిన వారందరికీ అభినందనలు తెలియజేశారు.



అనంతరం రైతులను, హరిదాసులను గౌరవించి సత్కరించారు. ముగ్గుల పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. తదనంతరం పండగ సందర్భంగా పేదలకు దుప్పట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకుడు పిల్లా కొండయ్య నాయుడు, గౌరీ పిఏసిఎస్ బ్యాంక్ ఛైర్మన్ కర్రి మహాలక్ష్మి నాయుడు, చెర్లోపల కాలువ ఛైర్మన్ బుద్ధ తాతారావు, ఎల్లయ్య కాలువ ఛైర్మన్ బుద్ధ మహాలక్ష్మి నాయుడు, చిన్న రామ స్వామి కోవెల ధర్మకర్త విల్లూరి మహాలక్ష్మి నాయుడు, 80 వ వార్డు తెలుగుదేశం పార్టీ ఇంచార్జి బి.ఎస్.ఎం.కె జోగినాయుడు, 80 వార్డు జనసేన పార్టీ ఇంచార్జ్ బుద్ధ శ్రీనివాస్ రావు, ఎన్టీఆర్ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ సూరిశెట్టి రాముడు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

### - జిల్లా కలెక్టరు ఎ ఎస్ దినేష్ కుమార్

పాడేరు రూరల్ జనవరి, 13 మనుసులో మాట సంక్రాంతి సందర్భంగా అల్లూరి సీతారామరాజు పాడేరు జిల్లా ప్రజలకు జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్ శుభాకాంక్షలు తెలియజేసారు. భారతీయ సంస్కృతి సంప్రదాయాలు తెలియజేసే పల్లెల పండుగ, రైతులు పండుగగా సంక్రాంతి నిలుస్తుందన్నారు. బంధు మిత్రులు అందరిని కలుసుకుని కనువిందులు చేసే అందరి పండుగ సంక్రాంతి అన్నారు. రైతులకు పంటలు చేతికి వచ్చే కాలం అని, ఆనందాన్ని కుటుంబంతో పంచుకుని సంతోషించే వేడుక సంక్రాంతి అన్నారు. సంక్రాంతి పండుగతో జిల్లాలోని ప్రతి ఇంటిలో సిరులు వెల్లివిరియాలని, అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్రంలో అల్లూరి సీతారామరాజు జిల్లాను ఆదర్శంగా నిలిచేలా సమిష్టి కృషిచేద్దామని జిల్లా కలెక్టరు ఎ ఎస్ దినేష్ కుమార్ పిలుపునిచ్చారు.


## ఘనంగా నిర్మలమ్మ జన్మదిన వేడుకలు...




**దుంబ్రిగుడ, జనవరి 13, (మనసులో మాట):** వైసిపి మండల నాయకురాలు కమ్మిడి, నిర్మల 38వ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె కేక్ కట్ చేసి కుటుంబ సభ్యులకు తినిపించారు. అనంతరం నిర్మలమ్మ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న మండల ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని అందరి మన్ననలు పొంది భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో ఎదగాలని మండల నాయకులు ఆమెకు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## అనకాపల్లి లో ఘనంగా కంచర్ల మీడియా గ్రూప్ నూతన సంవత్సర క్యాలెండర్స్, డైరీ లు అవిష్కరణ

### ముఖ్య అతిధిగా హాజరైన సిఇఓ కె. శంకర్ నాయుడు





**అనకాపల్లి, జనవరి 13 (మనసు లో మాట):** అనకాపల్లి వివేకానందనగర్ లోని సిపిఎం భవన్ మీటింగ్ హాల్ లో మంగళవారం కంచర్ల మీడియా గ్రూప్ నూతన సంవత్సర క్యాలెండర్స్, డైరీ లు ఆ గ్రూప్ సిఇఓ కె. శంకర్ నాయుడు ఘనంగా అవిష్కరించారు. ముందుగా సిఇఓ శంకర్ నాయుడు ను అనకాపల్లి, ఎఎస్ఆర్ జిల్లా ల విలేకరులు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం మనసులో మాట దినపత్రిక డెవలప్మెంట్ కు సహకరించడంలో అత్యంత ప్రతిభ కనబర్చిన మునగపాక విలేకరి మళ్ళ రాము, అరకులోయ విలేకరి బి. కొండ లను శాలువా లుతో సిఇఓ శంకర్ నాయుడు ఘనంగా సత్కరించారు. అంతకు ముందు కేక్ కట్ చేసి, స్వీట్స్ పంచుకొని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కంచర్ల మీడియా గ్రూప్ సిఇఓ కె. శంకర్ నాయుడు మాట్లాడుతూ జర్నలిస్ట్ ల శ్రేయస్సు తో పాటు ప్రజా ప్రయోజనాలే లక్ష్యం గా ఈ మనసులో మాట దినపత్రిక ను ఎండి, చీఫ్ ఎడిటర్ డాక్టర్ కంచర్ల అచ్యుతరావు ప్రారంభించడం జరిగిందన్నారు. ఆంధ్రప్రదేశ్ తో పాటు తెలంగాణ రెండు తెలుగు రాష్ట్ర లలో తనదైన శైలి లో పాఠకులకు తాజా సమాచారం చేరవేయలన్న సంకల్పం తో ఈ దినపత్రిక ను నడపడం జరుగుతుందని శంకర్ నాయుడు అన్నారు. అనకాపల్లి జిల్లా ఇంచార్జి పి. జోగినాయుడు మాట్లాడుతూ ఎటువంటి లాభాపేక్ష లేకుండా ఈ దినపత్రిక ను నడపాలన్నా సంకల్పం తో ప్రారంభించిన కంచర్ల మీడియా గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎడిటర్ డాక్టర్ కంచర్ల అచ్యుతరావు, డైరెక్టర్, సినీ నటులు కె. ఉపేంద్ర లకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో మార్కెటింగ్ ఏజిఎం రవీంద్ర, ఎఎస్ఆర్ జిల్లా ఇంచార్జి బి.లవకుశ, సీనియర్ జర్నలిస్ట్ లు వై.వి. రమణాజీ, పి.ఈశ్వరరావు, ఎన్.వి సత్యనారాయణ, పి.లోకేష్ , పి.ఎస్.వి. కె విశ్వనాధం, వేగి వంపాలక్ష్మి నాయుడు , ఎన్.ఎ.రామారావు, బి. సన్యాసిరావు, పి. అచ్చుతరామరాజు, కె. అనంత్ కుమార్, ఆర్. శ్రీనివాస్, బి. రమణ, పి. గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.



## 31 న ఘనంగా గవరపాలెం గౌరీపరమేశ్వరుల మహోత్సవం జరపడానికి సన్నహాలు

### అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ చే కరపత్రాలు అవిష్కరణ



**అనకాపల్లి, జనవరి 13 (మనసు లో మాట):** శతాబ్దన్నర సుదీర్ఘ చరిత్ర కలిగి ఉత్తరాంధ్ర లో ప్రసిద్ధిగాంచిన అనకాపల్లి గవరపాలెం శ్రీ గౌరీ పరమేశ్వర మహోత్సవం ఈనెల 31 న ఘనంగా నిర్వహించడానికి సన్నహాలు జరుగుతున్నాయి. అనకాపల్లి రింగు రోడ్డు లోని జనసేన పార్టీ కార్యాలయంలో మంగళవారం మాజీ మంత్రి, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఉత్సవ కరపత్రాలు అవిష్కరించారు. ఉత్తరాంధ్ర లోనే ఏకరాత్రోత్సవాలలో గుర్తింపు పొంది గత 140 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న గవరపాలెం శ్రీ గౌరీ పరమేశ్వర మహోత్సవం ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని కమిటీ సభ్యులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు కొణతాల సంతోష్ అప్పారావు నాయుడు, కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, కోశాధికారి కొణతాల నూక మహాలక్ష్మినాయుడు, ఉపాధ్యక్షుడు కొణతాల వెంకట వరప్రసాద్, సహాయ కార్యదర్శి పి.వి.రమణ, దాడి కృష్ణ,ఉప కోశాధికారి పెంటకోట వెంకట సత్యనారాయణ, కన్వీనర్ సూరిశెట్టి నరసింహారావు, మద్దాల శంకర్రావు, కమిటీ పర్యవేక్షకులు కొణతాల మురళీకృష్ణ, కొణతాల జగ్గయ్య నాయుడు, కాండ్రేగుల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## కరాటే అసోసియేషన్ సౌత్ ఇండియా జనరల్ సెక్రెటరీగా గడ్డం నగేష్ ఎన్నిక



**దేవరాపల్లి, జనవరి 13, (మనసులో మాట) :** భారత్ వడోకాయ్ కరాటే డు అసోసియేషన్ సౌత్ ఇండియా జనరల్ సెక్రెటరీగా గడ్డం నగేష్ ఎన్నికయ్యారు. భారత్ వడోకాయ్ కరాటే డు అసోసియేషన్ సౌత్ ఇండియా విభాగానికి సంబంధించి మంగళవారం నిర్వహించిన ఎన్నికల్లో అసోసియేషన్ సభ్యులందరూ ఆయనను జనరల్ సెక్రెటరీగా ఎన్నుకోవడం జరిగింది. తనకు ఈ పదవి రావడం గర్వకారణంగా భావిస్తున్నానని నగేష్ అన్నారు. ఈ అవకాశం కల్పించిన అసోసియేషన్ ప్రెసిడెంట్ సి.హెచ్. సతీష్ కుమార్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నాపై నమ్మకం ఉంచిన ప్రతి కరాటే సభ్యుడికి కృతజ్ఞతలు చెప్పారు. సినీ హీరో సుమన్ తల్వార్ చేతుల మీదుగా జనరల్ సెక్రెటరీ అపాయింట్మెంట్ లెటర్ అందుకోవడం మరింత ఆనందాన్ని కలిగిస్తోందని భవిష్యత్తులో కరాటే అభివృద్ధికి మరింత కృషి చేస్తానని ఈ సందర్భంగా నగేష్ చెప్పారు .




## నాతవరం జనసేన పార్టీ కార్యాలయంలో జనవాణి

### ప్రజల నుంచి వినతులు స్వీకరించిన నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి రాజాన వీరసూర్యచంద్ర

**నాతవరం జనవరి14( మనసులో మాట)** నాతవరం జనసేన పార్టీ కార్యాలయంలో మంగళవారం జనవాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నర్సీపట్నం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి రాజాన వీర సూర్యచంద్ర హాజరై మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల వినతులను స్వీకరించారు.

ఈ సందర్భంగా మొత్తం 7 వినతులు అందాయని సూర్యచంద్ర తెలిపారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు, వారి ఇబ్బందులకు పరిష్కారం చూపేందుకు జనవాణి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు. వచ్చిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సాధ్యమైనంత త్వరగా పరిష్కారం కోసం కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. జనసేన పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా ప్రజల పక్షాన నిలబడుతూ ఇటువంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. ప్రజలతో నేరుగా మమేకమై సమస్యలు తెలుసుకోవడమే జనసేన పార్టీ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ప్రగడ కృష్ణ, మాకిరెడ్డి వెంకటరమణతో పాటు పార్టీ కార్యకర్తలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా సంక్రాంతి సంబరాలు



**కోటవురట్ల (మనసులో మాట) జనవరి 13:** కోటవురట్ల మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మంగళవారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. తెలుగు సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా నిర్వహించిన సంక్రాంతి సంబరాలను భోగిమంటతో ప్రారంభించారు. మహిళలకు ముగ్గులు పోటీ ఏర్పాటు చేశారు. యువతకు ఆటల పోటీలు నిర్వహించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్వాడి కార్యకర్తలు సంక్రాంతి పిండి వంటల ప్రదర్శన నిర్వహించారు. అలాగే ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన స్టాల్ ఏర్పాటు చేశారు. ఎంపీడీవో చంద్రశేఖర్ మాట్లాడుతూ హోంమంత్రి వంగలపూడి అనిత ఆదేశాల మేరకు సంక్రాంతి సంబరాలు నిర్వహించామన్నారు. వివిధ పోటీల్లో విజేతలైన వారికి బహుమతులు అందజేసామన్నారు. తహసిల్దారు తిరుమలబాబు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు మండల టిడిపి అధ్యక్షులు లింగన్నాయుడు స్థానిక సర్పంచ్ అనిల్ కుమార్ ఎంపీటీసీ బాబు తదితరులు పాల్గొన్నారు.

## పేకాట, కోడిపందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

### - పెదబయలు ఎస్సై. టి. వెంకటేష్



**పెదబయలు , జనవరి 13(మనసులో మాట):** పెదబయలు మండలంలోని పోలీస్ పరిధిలోని పేకాట, కోడిపందాలు, ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని పెదబయలు ఎస్సై టి. వెంకటేష్ స్థానిక విలేకరులకు తెలిపారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా అరికట్టేందుకు ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఆకస్మిక వాహన తనిఖీలు, ఎక్కడైనా పేకాట, కోడిపందాలు, నాటు సారా, గుల్లి ఆట కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్కు కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని ఎస్సై తెలిపారు.

### లచ్చన్నపాలెంలో వైఎస్సార్ పార్టీ ఆధ్వర్యంలో

# సంక్రాంతి కానుకల పంపిణీ



**మాకవరపాలెం, జనవరి 13 (మనసులో మాట):** మాకవరపాలెం మండలం లచ్చన్నపాలెం గ్రామంలో మంగళవారం ఉదయం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు పోలిరెడ్డి శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను దృష్టిలో పెట్టుకొని సంక్రాంతి కానుకల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. లచ్చన్నపాలెం గ్రామంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మాజీ శాసనసభ్యులు పెట్ల ఉమా శంకర్ గణేష్ ముఖ్య అతిథిగా హాజరై, శ్రీరామ్ మూర్తి సొంత నిధులతో సమకూర్చిన నిత్యావసర సరుకులను 150 మంది పేద కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ మాట్లాడుతూ, వైఎస్సార్ పార్టీ ఎల్లప్పుడూ పేదల పక్షాన నిలబడి పనిచేస్తుందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంక్షేమ పాలనకు అనుగుణంగా పార్టీ శ్రేణులు సేవా కార్యక్రమాలు చేపడుతున్నాయని పేర్కొన్నారు. పండుగల సందర్భంగా పేదల ముఖాల్లో చిరునవ్వు చూడటమే పార్టీ లక్ష్యమని తెలిపారు. పోలిరెడ్డి శ్రీరామ్ మూర్తి మాట్లాడుతూ, వైఎస్సార్ పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా గ్రామస్థాయిలో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని, భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ పార్టీ నాయకులు, ఎంపీపీ రుత్తల సర్వం . మాజీ ఎంపీపీ రుత్తల సత్యనారాయణ మండల పార్టీ అధ్యక్షుడు చిటికెల రమణ . సర్పంచ్ బొడ్డు గోవింద, పార్టీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# దేవరాపల్లి స్మశానం అభివృద్ధికి నిధులు మంజూరు



**దేవరాపల్లి, జనవరి 13, (మనసులో మాట) :** మండల కేంద్రంలోని శారదా నదికి ఆనుకొని ఉన్న మెయిన్ స్మశాన వాటిక అభివృద్ధికి 15 లక్షలు నిధులు మంజూరు అయ్యాయని మేజర్ పంచాయతీ సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఉప సర్పంచ్ కిలపర్తి భాస్కరరావు తెలిపారు. పంచాయితీ పాలక వర్గ సభ్యులతో కలిసి స్థానిక సచివాలయం -2 వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేవరాపల్లి పంచాయతీ పాలకవర్గ సభ్యులు కోరిక మేరకు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి దీర్ఘకాలంగా ఉన్న స్మశాన వాటిక అభివృద్ధికి 15 లక్షలు మంజూరు చేశారన్నారు. వీటితో పాటు స్మశానం సమీపంలో విశ్రాంతి భవనం నిర్మాణానికి దేవరాపల్లికి చెందిన ఇద్దరు ఎంపీటీసీలకు చెందిన మండల పరిషత్ నిధుల నుంచి 6 లక్షలు మంజూరయ్యేయని తెలిపారు. ఈ నిధులతో త్వరితగతినని పనులు పూర్తి చేయడానికి కృషి చేస్తామన్నారు. దేవరాపల్లి అభివృద్ధికి నిధులు ఇచ్చి సహకరించిన స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి పంచాయతీ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అంతేకాకుండా గ్రామంలో వివిధ అభివృద్ధి పనులకు మరో 30 లక్షలు ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు చొక్కాకుల భవాని, కొల్లి ఈశ్వరరావు, దీవి శంకర్, సిమ్మ మణి, తామరపల్లి కళావతి, బంధం శ్రీదేవి, గుల్లిపల్లి అర్జున్, గుల్లిపల్లి మురళి, బంధం అప్పలరాజు, సబ్బవరపు మాలిబాబు, అల్లు అబద్దం, కిలాడీ జ్యోల తదితరులు పాల్గొన్నారు.

# హరిదాసు కు ఘన సన్మానం

### హిందూ దేవాలయ సాంప్రదాయాలు, పరిరక్షణ సమితి అధ్యక్షులు... ఆడారి కుమారస్వామి



**అనకాపల్లి టౌన్ జనవరి 13, మనసులో మాట..** హిందువుల అతిపెద్ద పండగ బోగీ సంక్రాంతి కనుమ పండుగకు మొదటిగా గుర్తు వచ్చేది హరిదాసే........... హిందూ దేవాలయాలు సాంప్రదాయాల పరిరక్షణ సమితి అధ్యక్షులు ఆడారి . కుమారస్వామి.. హరిదాస్ కు ఘణ సత్కారం చేశారు..... ధనుర్మాసం చివరి రోజులు అయినటువంటి మంగళవారం విజయరామరాజుపేట విజయ వినాయక దేవాలయం వద్ద ఘణంగా హరిదాసు కు సన్మానం జరిగినది విజయరామరాజుపేట పెద్దలు ఈ ప్రాంత ప్రజలు గ్రామ కమిటీ సభ్యులు అందరూ సంయుక్తంగా హరిదాసుని (హరిదాసు.అప్పారావు )ఘనంగా పూలమాలతో సాలువాళ్ళతో సత్కరించిరి. అనంతరం ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆడారి కుమారస్వామి గ్రామ కమిటీ డైరెక్టర్, హిందూ సంప్రదాయాలు దేవాలయాల పరిరక్షణ సమితి అధ్యక్షులు మాట్లాడుతూ నగర పురవీధులలో హరినామ స్మరణతో సాక్షాత్తు విష్ణుమూర్తి నారద రూపంలో భూలోకమునకు వచ్చిన వ్యక్తిగా హరిదాసుని కొలుస్తారని పురాణాలు తెలియపరచుచున్నది. హరి నామంతో ధనుర్మాసం 30 రోజులు ప్రతి వీధిలో కఠినదీక్షతో హరిదాసులు వీధిలో జైశ్రీరామ్, జై శ్రీమన్నారాయణ నామ జపంతో వీధుల్లో ప్రజలను కలవడం జరుగుతుంది భక్తులు తమకు తోచిన దనరూపాన, ధాన్య రూపానా మనము సహకరించాలి తప్ప వాళ్ళు మనలని కోరరు అని కనుమరుగవుతున్న హరిదాసు యొక్క ప్రాముఖ్యతను ప్రజలకు భక్తులకు తెలియపరచడమే ప్రధాన ఉద్దేశం గా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని ఆడారి కుమారస్వామి తెలిపారు. గ్రామ కమిటీ పెద్దలు . ఆళ్ల.సూర్య రామకృష్ణ, పలకా.రాము ,బొబ్బిలి అప్పారావు,. పిట్ల బుడ్డీశ్వరరావు విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు డి.డి నాయుడు. తదితర వక్తలు హిందూ సాంప్రదాయాలు సంస్కృతి హరిదాసు యొక్క ప్రాముఖ్యత పై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పలకా. సత్యనారాయణ బొట్టా. చిన్ని యాదవ్ ,దాడి జగన్, పసుపులేటి అప్పారావు, బొబ్బిలి సురేష్, కుండల రామకృష్ణ , బొట్టా ఆదినారాయణ, బొడ్డేడ ఈశ్వర్ ,దాడి ఆది గణేష్,ఆళ్ల.సంతోస్ ముగడ అప్పారావు, ఆడారి. జగ్గారావు యల్లపు. శివాజీ, విజయ వినాయక ఆలయం ప్రధాన అర్చకులు సంగమేశ్వర రావు ప్రజలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

### జి.భీమవరం గ్రామస్థుల దే

# గంగాదేవి ఆలయం నిర్వహణ

- అమ్మవారి పండుగకు అడ్డంకులు కల్పించే జీ సింగవరం గ్రామస్తుల నుండి రక్షణ కల్పించండి..
- ఆర్డిఓ కు వినతిపత్రం అందజేసిన జి భీమవరం గ్రామస్తులు..



**కశింకోట, జనవరి 13, మనసులోమాట..** గంగాదేవి ఆలయం జి భీమవరం గ్రామస్తులదేనని, అమ్మవారి పండుగకు అడ్డంకులు కల్పించడానికి చూస్తున్న జీ సింగవరం గ్రామస్తుల నుండి రక్షణ కల్పించాలని పండుగ సజావుగా జరిగేటట్లు సహకరించాలని ఆర్డీవోకు మంగళవారం వినతిపత్రం అందజేశారు . భీమవరం గ్రామస్తులు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జి.భీమవరం గ్రామానికి చెందిన “శ్రీ గంగాదేవి ఆలయం“ ను మా పెద్దలు సుమారు 70 సంవర్సరములు నుండి అమ్మవారిని పూజిస్తూ, పండగలు జరుపుకుంటున్నమన్నారు. అమ్మవారి ఆలయమును మా గ్రామ “రామాలయ కమిటి” ఆధ్వర్యంలో అభివృద్ధి చేస్తూ, నిర్వహిస్తున్నామన్నారు. ఈ పండగను మా చుట్టుపక్కల 12 గ్రామాల ప్రజలు కూడా అదేరోజు అనగా మా జి.భీమవరం గ్రామ “రామాలయ కమిటి పెద్దలు“ నిర్ణయించిన తేది న జరుపుకోనుటకు గత కొన్ని సంవత్సరాలుగా ఆచారముగా వస్తున్నది. ఈ విషయం గా మా చుట్టుపక్కల 12 గ్రామాల ప్రజలకు కూడా వాస్తవాలు తెలుసు. ఇటీవల కొంతకాలముగా మా జి.భీమవరం గ్రామ పంచాయతీ శివారు జి.సింగవరం గ్రామస్తులు దౌర్జన్యంగా ఆలయం వద్దకు వచ్చి “ఈ గుడి మా రెవిన్యూ ఫరిదిలో ఉందని చెప్పి” గుడి ని నిర్వహిస్తున్న మా గ్రామస్తుల పైన దౌర్జన్యం చేస్తున్నారు. ఈ విషయంగా పలుమార్లు మా గ్రామ సర్పంచ్ దృష్టి కి కూడా తీసుకువెళ్లామ న్నారు. ఇప్పుడు ఈ సంవత్సరం “ఏడాదిపండగ“ జనవరి 27 న మంగళవారం చేయుటకు మా యొక్క ఆలయ ధర్మకర్తలు, పెద్దలు నిర్ణయించినారు. ఈ నేపద్యములో అదే రోజున జి.సింగవరం గ్రామస్తులు ఆలయం వద్ద అల్లర్లు సృష్టించి భయభ్రాంతులు కు గురి చేయుటకు ప్రయత్నిస్తున్నారు. నేను పండగను సజావుగా జరుపుకునేలా చేసి మా యొక్క గ్రామ ప్రజల మనోభావాలను కాపాడుతారని కోరుతున్నామన్నారు.

## నాగయ్య పేటలో సత్యసాయి 101 భజన పాటల కార్యక్రమం



దేవరాపల్లి, జనవరి 13, (మనసులో మాట) : నాగయ్య పేట గ్రామంలో సంక్రాంతి సంబరాలను పురస్కరించుకొని ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా మేలుకొలుపు ఉత్సవాన్ని నెల రోజుల పాటు కార్యక్రమం చేసి మంగళవారం 2000 మందికి పైగా అన్న సమారాధన చేయడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తులు సత్యసాయి 101 భజన పాటల కార్యక్రమమును స్థానిక రామాలయంలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షులు కసిరెడ్డి అప్పలనాయుడు, జోన్ ఇన్చార్జి సీ.హెచ్.వి. రవిశంకర్ ,ఆదిరెడ్డి చిన్న కన్నబాబు, పెంటారావు, ములకలపల్లి భజన బృందం సభ్యులు, నాగయ్య పేట గ్రామస్తులు, మహిళా సేవాదళ సభ్యులు పాల్గొన్నారు.



## అంగన్వాడీలు సేవాభావంతో పనిచేయాలి

### - ఎమ్మెల్యే బండారు

**కే కోటపాడు -, జనవరి 13 ( మనసులో మాట) :** గ్రామాల్లో పనిచేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు సేవాభావంతో విధులు నిర్వహించాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. అంగన్వాడి కార్యకర్తలుగా ప్రభుత్వం పదోన్నతి కల్పించిన మినీ అంగన్వాడీ కార్యకర్తలకు నియామక పత్రాలను ఎమ్మెల్యే బండారు చేతుల మీదుగా మంగళవారం అందించారు. మాడుగుల క్యాంపు కార్యాలయంలో సమగ్ర శిశు అభివృద్ధి సేవ కేంద్ర ప్రాయోజిత పథకం ద్వారా కే కోటపాడు ఐసిడిఎస్ పరిధిలో కే కోటపాడు దేవరాపల్లి మండలాలలో పదవ తరగతి ఉత్తీర్ణత అయి మినీ అంగన్వాడీలుగా పనిచేస్తున్న ఎనిమిది మంది మినీ అంగన్వాడీలను అంగన్వాడీ కార్యకర్తలుగా ప్రభుత్వం నియమించింది. దీనికి సంబంధించిన నియామక పత్రాలను అంగన్వాడీ కార్యకర్తలకు అందజేసిన ఎమ్మెల్యే బండారు వారికి పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ లలిత కుమారి తదితరులు ఉన్నారు.

## దాడి భోగ లింగం, భోగి తీర్థానికి సన్నాహాలు



**అనకాపల్లి, టౌన్ జనవరి 13, మనసులోమాట..** గవరపాలెం పార్క్ సెంటర్ దాడి భోగ లింగంనాయుడు విగ్రహంవద్ద భోగి రోజున జరిగే పెద్దలపండుగ తీర్థానికి ఏర్పాట్లు పూర్తి చేశామని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా దాడి ఈశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఏడాది భోగి రోజున జరిగే పెద్దలపండుగ తీర్థానికి అనేక సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు రంగులు రాట్నాలు, తోడ పెద్ద సేవ మరియు పిల్లలకు ఆట వస్తువులు ఉచితంగా ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. పెద్దలు పిల్లలు ఈ తీర్థ మహోత్సవానికి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. భోగలింగం నాయుడు కి ఘన నివాళి ఇవ్వాలని కోరారు.అలాగే వీధి పెద్దలైన కొణతాల శ్రీరాములు, మల్ల రామారావు , దాడి బలరాముడు, సూరిశెట్టి రామ నర్సింగరావు, పెద్దల జ్ఞాపకార్థం పెద్దల పండుగను తీర్చిదిద్దామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొణతాల శ్రీనివాసరావు గారు ,మల్ల బుజ్జి ఎస్ఎం నాయుడు ,దాడి ఆదినారాయణ, దాడి శ్రీను,కొణతాల రాజశేఖర్, కొణతాల కుమార్,మల్ల తాతాజీ, పీల పాండు, అలీ భాయ్, శేఖర్ ,రమేష్, పోతురాజు, గిరి , మహదేవ్, అహ్మద్య పాల్గొన్నారు

తక్కువ సమయంలో ఎక్కువ యాడ్స్ సేకరించిన మల్ల రాముకు అభినందనలు

## కంచర్ల గ్రూప్ మీడియా సీఈవో శంకర్ నాయుడు అభినందనలు



**మునగపాక, జనవరి 13, మనసులో మాట..** కంచర్ల గ్రూప్ యాజమాన్యం క్యాలెండర్ యాడ్స్కు ఇచ్చిన తక్కువ సమయంలోనే ఎక్కువ యాడ్ సేకరించిన మునగపాక మనసులో మాట రిపోర్టర్ మల్ల రాముకు కంచర్ల గ్రూపు మీడియా సీఈఓ శంకర్ నాయుడు, ఏజీఎం రవీంద్ర, అనకాపల్లి జిల్లా మనసులో మాట దినపత్రిక ఇన్చార్జ్ పెంటకోట జోగినాయుడు, అల్లూరి జిల్లా మనసులో మాట దినపత్రిక ఇన్చార్జ్ లవకుశ యాజమాన్యం అభినందనలు తెలియజేస్తూ మల్ల రాముకుసత్కారం చేశారు. ఈ సందర్భంగా మనసులో మాట దినపత్రిక అనకాపల్లి జిల్లా ఇన్చార్జ్ పెంటకోట జోగినాయుడు మాట్లాడుతూ అనునిత్యం వార్తలు ఎక్కువ స్థాయిలో పంపిస్తూ పత్రిక అభివృద్ధికి పాటుపడుతూ, కంచర్ల గ్రూప్ క్యాలెండర్లకు అత్యధిక స్థాయిలో యాడ్స్ సేకరించి ఐదు జిల్లాలకే ప్రథమ స్థానం నిలిచిన మునగపాక రిపోర్టర్ రాముకు అభినందనలు తెలియజేస్తున్నామని జోగినాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంచర్ల మీడియా గ్రూప్ సీఈఓ శంకర్ నాయుడు , ఏజీఎం రవీంద్ర,అనకాపల్లి జిల్లా, అల్లూరి జిల్లా పత్రిక విలేకరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కంచర్ల గ్రూప్ ఆధ్వర్యంలో క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం అనకాపల్లి సిపిఎం పార్టీ ఆఫీసులో నిర్వహించారు. దీంతోపాటు కంచర్ల గ్రూప్ డైరీలు కూడా ఈ సందర్భంగా ఆవిష్కరించారు.

### విద్యుత్ టారిఫ్ ల పై

# ప్రజాభిప్రాయ సేకరణ

### - ఎస్ ఈ లక్ష్మణరావు

**విజయనగరం,(మనసులోమాట) జనవరి 13 :** ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ కమిషన్ ఆధ్వ ర్యంలో 202627 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రిటైల్ విద్యుత్ సరఫరా టారిఫ్ ధరఖాస్తులపై ప్రజా అభిప్రాయ సేకరణను హైబ్రిడ్ విధానంలో నిర్వహించనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ మువ్వల లక్ష్మణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రజా విచారణలు ఈనెల 20వ తేదీన తిరుపతి, 22, 23 తేదీలలో విజయవాడ, 27న కర్నూలు లో నిర్వహించబడతాయని చెప్పారు. ఉదయం 10.30 గంటల నుంచి 1.30 గంటల వరకు ప్రత్యక్షంగా, మధ్యాహ్నం 2.00 నుంచి 4.30 గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరుగుతాయని వివరించారు. ఈ కార్యక్రమం ఫేస్‌బుక్, ఎక్స్, యూట్యూబ్, టెలిగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయబడుతుందని, విద్యుత్ వినియోగదారులు మరియు ఆసక్తిగల ప్రజలు పాల్గొని తమ అభిప్రాయాలు తెలియజేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే

# కఠిన చర్యలు

**- జిల్లా ఎస్పీ శ్రీ తుహిన్ సిన్హా, ఐపీఎస్**

**అనకాపల్లి టౌన్, జనవరి 13 మనసులోమాట:** మకర సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రజలకు, పోలీస్ సిబ్బందికి మీడియా మిత్రులకు అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో నూతన కాంతులు, ఆనందాలు నింపాలని ఆయన ఆకాంక్షించారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ, కుటుంబ సభ్యులతో కలిసి పండుగను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా పండుగ ముసుగులో జరిగే చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ఎస్పీ కఠిన హెచ్చరికలు జారీ చేశారు: పండుగ ముసుగులో జరిగే కోడిపందేలు, జూదం వంటి సామాజిక అరిష్టాలపై పోలీస్ శాఖ ఉక్కుపాదం మోపుతుంది. పందేల నిర్వహణకు అవకాశం ఉన్న మారుమూల ప్రాంతాలు, పొలాలపై నిరంతరం డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా ఉంచడం జరుగుతుంది. జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాలు 24/7 పర్యవేక్షిస్తాయి అన్నారు. కోడిపందేలకు కత్తులు కట్టడం, భారీ ఎత్తున బెట్టింగ్‌లు నిర్వహించడం చట్టరీత్యా నేరం. పందేల ముసుగులో నిర్వహించే పేకాట, గుండాట, కోసు వంటి జూద క్రీడలపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. అన్నారు సంప్రదాయం పేరిట జీవ హింసకు పాల్పడితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోము. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేయడమే కాకుండా, పందేలలో వాడే కోళ్లు, కత్తులు నగదును తక్షణమే స్వాధీనం చేసుకుంటాం. నిందితులపై అవసరమైతే రౌడీ షీట్లు తెరిచేందుకు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. యువత ఇటువంటి వ్యసనాలకు దూరంగా ఉండి తమ భవిష్యత్తును పాడుచేసుకోవద్దని ఎస్పీ సూచించారు. సరదా కోసం చేసే పనులు జీవితకాలం ఇబ్బందులకు గురిచేస్తాయని గుర్తు చేశారు. చట్టాన్ని అతిక్రమిస్తే ఎంతటి వారైనా సరే ఉపేక్షించే ప్రసక్తే లేదు. సాంప్రదాయాలను గౌరవిస్తూ, చట్టబద్ధంగా పండుగను జరుపుకుందాం. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలనీ." తుహిన్ సిన్హా, తెలిపారు.

సంఘ సేవకులు

# బుద్ద వీరునాయుడు మృతి

**నివాళులు అర్పించిన ప్రముఖులు**




అనకాపల్లి రూరల్, జనవరి 13 (మనసులో మాట): స్టీల్ ప్లాంట్ ఉద్యోగ సంఘం నాయకులు, సంఘ సేవకులు బుద్ధ వీరునాయుడు(70) సోమవారం రాత్రి గుండె పోటు తో మృతి చెందారు. గవరపాలెం జగన్నాధ స్వామి గుడి సమీపంలో దర్శనార్ధం ప్రార్థిహ దేహాన్ని ఉంచారు. పట్టణానికి చెందిన ప్రముఖులు ముఖ్యంగా గౌరీ సేవా సంఘం సంఘం అధ్యక్షులు బుద్ధ శివాజీ, స్టీల్ ప్లాంట్ కాంగ్రెస్ ట్రేడ్ యూనియన్ నాయకుడు విల్లూరి మహాలక్ష్మి నాయుడు, బంగారం వర్తక సంఘం నాయకులు కొణతాల రాజేంద్ర, విల్లూరి శ్రీనివాసరావు, తెలుగుదేశం నాయకులు కొణతాల సత్యనారాయణ, కాంగ్రేగుల సత్యనారాయణ, బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర మాజీ కోశాధికారి భీమరశెట్టి ఆదినారాయణ, బిజెపి సీనియర్ నాయకులు పొలమరశెట్టి నాగేశ్వరరావు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షుడు మల్ల ఉమామహేశ్వరావు, ఉపాధ్యాయ సంఘం బుద్ధ కాశి, కే ఎన్ వి సత్యనారాయణ (పైసా), కేబుల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కేవీఎస్ ప్రకాష్ తదితరులు పార్థివదేహానికి నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.

## నేడు అప్పలరాజు పురం లో జిల్లాస్థాయి ముగ్గుల పోటీలు

చీడికాడ, జనవరి 13, (మనసులో మాట) మండలంలో అప్పలరాజు పురం గ్రామంలో బుధవారం సాయంత్రం జిల్లాస్థాయి ముగ్గుల పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు వారు మంగళవారం మాట్లాడుతూ మొదటి బహుమతి 7వేలు రెండవ బహుమతి 5వేలు మూడవ బహుమతి 3వేలు నాలుగో బహుమతి 2వేలు 5వ బహుమతి వెయ్యి రూపాయలు ఇవ్వడం జరుగుతుందన్నారు ఆసక్తిగల మహిళలు ఈ ముగ్గురు పోర్టులో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు

అనకాపల్లి ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రి అధికారులు,

# అభివృద్ధి కమిటీ తో సమీక్ష

**- అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ**



**అనకాపల్లి, జనవరి 13 (మనసులో మాట):** అనకాపల్లి ఎన్టీఆర్ జిల్లా హాస్పిటల్ లో నూతనంగా ఆర్ హెచ్ ఐ మిగ్నేసిత ఇండియా లిమిటెడ్ వారి సహకారంతో సిఎస్ఆర్ నిధులు సుమారు 1 కోటి 40 లక్షల రూపాయలతో డి అడిక్షన్ సెంటర్, మదర్ ఫీడింగ్ అండ్ వెయిటింగ్ హాల్ మరియు మోడరన్ మార్చురీ రూమ్ మూడు భవనాల మంజూరైన సందర్భంగా మంగళవారం ఆర్ హెచ్ ఐ మిగ్నేసిత మేనేజ్మెంట్ , హాస్పిటల్ అధికారులు, అభివృద్ధి కమిటీ తో మాజీ మంత్రి,అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ సమీక్ష నిర్వహించారు. ఈ నూతనంగా నిర్మించే భవనాలు యొక్క ప్లానింగ్, స్థల పరిశీలన, తాత్కాలిక మార్చురీ స్థల పరిశీలన సంబంధించిన వివరాలు అధికారులను అడిగి తెలుసుకుని తగు సూచనలు చేశారు. అనంతరం హాస్పిటల్ అత్యవసర విభాగాన్ని సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలు కోసం వైద్యులను, రోగులను వివరాలు అడిగి తెలుసుకుని పరిశుభ్రమైన వాతావరణంతో కూడిన, మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచన చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారావు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు ఆళ్ల రామచంద్రరావు, డాక్టర్ డి డి నాయుడు తదితరులు పాల్గొన్నారు .

పోలీసు పరేడ్ గ్రౌండులో

# మిన్నంటిన సంక్రాంతి సంబరాలు

- విజయనగరం జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్,ఐపిఎస్
- హెదాలకు అతీతంగా సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బంది, కుటుంబ సభ్యులు
- వేడుకల్లో సంప్రదాయ దుస్తుల్లో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బంది
- పోలీసు కుటుంబాల మహిళలు, మహిళా ఉద్యోగులకు ముగ్గుల పోటీలు, లెమన్ అండ్ స్పూన్, మ్యూజికల్ చైర్, టగ్ ఆఫ్ వార్ పోటీలను నిర్వహించిన అధికారులు



**విజయనగరం (మనసులో మాట) జనవరి 13 :**జిల్లా పోలీసుశాఖ అధ్వర్యంలో పోలీసు పరేడ్ గ్రౌండులో 'సంక్రాంతి సంబరాలు - 2026' ను జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, జనవరి 13న ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ గారి సతీమణి శ్రీమతి ఎ.ఆర్.రూపా నాయుడు గారు ముఖ్య అతిధిగా హాజరై, సంక్రాంతి సంబరాలను ప్రారంభించారు. సంక్రాంతి సంబరాల్లో పోలీసు అధికారులు, సిబ్బందితోపాటు పోలీసు కుటుంబాలను కూడా భాగస్వాములను చేసి నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. మహిళా పోలీసు ఉద్యోగులు, పోలీసు కుటుంబ మహిళలు వేసిన ముగ్గులను పరిశీలించారు.

జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, ఐపిఎస్ మాట్లాడుతూ - సంక్రాంతి వేడుకలను పండగ వాతావరణంలో నిర్వహించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల కలయికతో సంక్రాంతి నిర్వహించుకోవాలనే సదుద్దేశంతో పోలీసు పరేడ్ గ్రౌండులో 'సంక్రాంతి సంబరాలు 2026' ను నిర్వహించుకున్నామన్నారు. ఈ వేడుకల్లో పోలీసు అధికారులు, సిబ్బంది, హోంగార్డ్స్, మినిస్టీరియల్ స్టాఫ్ మరియు వారి కుటుంబ సభ్యులు ఎంతో ఉత్సాహంగా పాల్గొనడం శుభపరిణామమన్నారు. సంక్రాంతి పండగ అన్నది ఒక మతానికి, కులానికి చెందిన పండగ కాదని, వ్యవయసాయదారులు కష్టించి పండించిన పంట చేతికి రావడం, సిరి సంపదలు, ఆదాయం చేతికి అందడంతో, కుటుంబ సభ్యులతో తమ ఆనందాన్ని పంచుకుంటూ, జరుపుకొనే వేడుకని అన్నారు. ప్రజలు వండగ పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దని, పోలీసులకు సహకరించి పండగని సద్భావ వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా ప్రజలకు, పోలీసు కుటుంబ సభ్యులకు, పాత్రికేయులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ సతీమణి ఎ.ఆర్. రూపా నాయుడు మాట్లాడుతూ - సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించిన జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోధర్ కి, ఏర్పాట్లులో భాగస్వామ్యులైన ఇతర అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. సంక్రాంతి సంబరాలను పోలీసు కుటుంబాలతో కలిసి ఒకే వేదిక మీద జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. హెదాలకు అతీతంగా సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న పోలీసు కుటుంబాలు ఎంతో ఆనందంగా సొంత కుటుంబ సభ్యుల్లాగ కలిసిపోయి, ఆహ్లాదకరమైన వాతావరణంలో వేడుకలను జరుపుకున్నారన్నారు. ఈ సంక్రాంతి స్మృతులతో కుటుంబ సభ్యులతో ఆనందంగా జీవించాలన్నారు. ఇదే స్ఫూర్తితో రాబోయే రోజుల్లో మరిన్ని మంచి కార్యక్రమాలను నిర్వహించుకొని, పోలీసులంతా ఒకే కుటుంబం అన్న సదృభవ వాతావరణాన్ని నెలకొల్పేందుకు కృషి చెయ్యాలన్నారు. ఈ కార్యక్రమానికి వచ్చిన వారందరూ క్షేమంగా, సురక్షితంగా తిరిగి వారి ఇండ్లకు చేరుకోవాలని ఆకాంక్షించారు. న్నారు. అనంతరం, జిల్లా ప్రజలకు, పోలీసు కుటుంబ సభ్యులకు, మీడియా మిత్రులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

సంక్రాంతి సంబరాల్లో భాగంగా పోలీసు ఉద్యోగినులకు, పోలీసు కుటుంబాల మహిళలకు ప్రత్యేకంగా రంగోలి మ్యూజికల్ చైర్, లెమన్ అండ్ స్పూన్, టగ్ ఆఫ్ వార్ పోటీలను నిర్వహించారు. పోలీసుశాఖలో పనిచేస్తున్న మహిళలు, పోలీసు కుటుంబాలకు చెందిన మహిళలు, హోంగార్డ్సు మరియు వారి పిల్లలు ఎంతో ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని, భోగి, సంక్రాంతి, కనుమ పండగను ప్రతిబింబించే విధంగా ముగ్గులు వేసి, తమ సృజనాత్మకతను, క్రీడా ప్రతిభను ప్రదర్శించారు. విధి నిర్వహణలో భాగంగా ఎల్లప్పుడు ఖాకీ యూనిఫారం ధరించే పోలీసు అధికారులు, సిబ్బంది వారి కుటుంబ సభ్యులతో కలసి తెలుగుదనం ఉట్టిపడేలా సంప్రదాయ దుస్తులు ధరించి, వేడుకల్లో పాల్గొని, ప్రత్యేక ఆకర్షణ గా నిలిచారు. సంబరాల్లో హరిదాసు కీర్తనలు, బసవన్న విన్యాసాలు, కోలాట ప్రదర్శన, భరత నాట్యాలు, సంక్రాంతి గీతాలు అందరిని ఎంతగానో అలరించాయి. పోలీసు పిల్లలు గాలి పటాలు ఎగురవేసి, ఆనందంతో కేరింతలు వేసి, సంక్రాంతి సంబరాల్లో ఉత్సాహంగా గడిపారు. అనంతరం, జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ఆయన సతీమణి శ్రీమతి ఎ.ఆర్.రూపా నాయుడు, కుటుంబ సభ్యులతో కలిసి భోగి మంట వెలిగించారు. అనంతరం, ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్, లెమన్ అండ్ స్పూన్, టగ్ ఆఫ్ వార్, పాటల పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ఎస్పీ సతీమణి ఎ.ఆర్.రూపా నాయుడు బహుమతులను ప్రదానం చేసారు. ఈ సంక్రాంతి సంబరాల్లో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, డిఎస్పీలు ఆర్.గోవిందరావు, ఎన్.రాఘవులు, జి.భవ్య రెడ్డి, ఆర్.వీరకుమార్, పి.నారాయణరావు, ఇ.కోటిరెడ్డి, సిఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు మరియు పెద్ద సంఖ్యలో పోలీసు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సెన్సస్-2027 నిర్వహించడానికి

# సిద్ధంగా ఉన్నాం

**జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి**




**విజయనగరం,(మనసులోమాట) జనవరి 13:** జిల్లాలో జనగణన కార్యక్రమాలు పారదర్శకంగా నిర్వహించడానికి ప్రత్యేక ప్రణాళికలతో సిద్ధంగా ఉన్నామని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి ఇంచార్జ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కి ఎస్ ఎస్ రావత్ కు వివరించారు. మంగళవారం అమరావతి నుండి ఇన్చార్జి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అన్ని జిల్లాల కలెక్టర్లతో జనగణన కార్యక్రమాల అమలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఈ సర్వేకు ప్రజలు ప్రతి ఒక్కరు సహకరించాలని తెలిపారు ఆరు నెలల నుంచి ఎడాది పాటు జరిగే ఈ ప్రక్రియకు కాగిత రహితంగా డిజిటల్ యాప్ ద్వారా జనగణన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. స్టేజి 1 లో హౌస్ లిస్టింగ్ అండ్ హౌసింగ్ సెన్సస్, ఫేస్ 2 లో జనాభా గణన జరుగుతుందని సీఎస్ తెలిపారు. సెన్సెస్ డైరెక్టర్ జె.నివాస్ మాట్లాడుతూ అధికారుల పాత్ర, నియమ నిబంధనలు గురించి పవర్ పాయింట్ ద్వారా వివరించారు.

జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జనాభా లెక్కల అధికారిగా కలెక్టర్ వ్యవహరించడం జరుగుతుందని అదనపు జనాభా లెక్కల అధికారిగా జేసీ, నియమించడం జరిగిందని పేర్కొన్నారు.

జిల్లా జనాభా లెక్కల అధికారిగా డి.ఆర్.ఓ ను నియమించడం జరిగిందని, జిల్లా ప్లానింగ్ ఆఫీసర్, జిల్లా విద్యాశాఖాధికారి, జడ్పీ సీఈవో, సర్వే శాఖ ఏడీ, పంచాయతీరాజ్ అధికారి, జిల్లా ఫారెస్టు ఆఫీసర్లు జిల్లా అదనపు జనాభా లెక్కల అధికారులుగా . నియమించడం జరిగిందని వివరించారు. సమర్థంతంగా జనగణ జనగణన ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించడానికి ప్రత్యేక ప్రణాళికలు అమలు చేయుచున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి కొండల రావు, డి.ఆర్.ఓ మురళి, సి.పి.ఓ బాలాజీ, జిల్లా పరిషత్తు సి.ఈ.ఓ సత్యనారాయణ, డి.పి.ఓ మల్లిఖార్జున రావు,డి.ఈ.ఓ మణిక్యాల రావు, తదితరులు పాల్గొన్నారు.



సంక్రాంతి సెలవు దినాలలో తరగతులు నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై

# చర్యలు తీసుకోవాలి

- జిల్లా ఉప విద్యాశాఖ అధికారికి వినతి పత్రం అందజేసిన ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నాయకులు
- ఏ.ఐ.ఎస్.ఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్ విడుదల చేసిన జిల్లా ఉప విద్యాశాఖ అధికారి

**విజయనగరం ,(మనసులోమాట) జనవరి13 :** విజయనగరం జిల్లాలో పలు ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సంక్రాంతి సెలవు దినాలలో తరగతులు నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో జిల్లా ఉప విద్యాశాఖ అధికారి గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం ఏఐఎస్ఎఫ్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో డిప్యూటీ డిఈఓ గారి చేతుల మీదుగా ఏ ఐ ఎస్ ఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్ విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఏ.సుమన్, జిల్లా సహాయ కార్యదర్శి పి గౌరీ శంకర్, పట్టణ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు చైతన్య, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్. రాయవరంలో సంక్రాంతి వేడుకలు



**ఎస్. రాయవరం, జనవరి 13,(మనసులో మాట):** ఎస్. రాయవరం మండలపరిషత్ కార్యలయం సమీపంలో మంగళవారం అధికారులు, ప్రజాప్రతినిధులు సమక్షంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. హోంశాఖ మంత్రి అదేశాలుమేరకు సంక్రాంతి వేడుకలను నిర్వహించినట్లు ఎంపిడిఓ మీనాకుమారి తెలిపారు.దీనిలో భాగంగా భోగిమంటలు వేసి మహిళలకు ముగ్గులు పోటీలు, ఆటలుపోటీలు నిర్వహించారు.సంక్రాంతి పండుగ ముందస్తు వేడుకలలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని ఉత్సాహం గా గడిపారు.

# కోడిపందాల నిర్వహణ ఏర్పాట్లును అడ్డుకొన్న పోలీసులు

**పందాలు, జూదం నిర్వహిస్తే చర్యలు తప్పవంటూ సి ఐ హెచ్చరిక**



**ఎస్. రాయవరం, జనవరి 13(మనసులో మాట):** ఎస్. రాయవరం మండలం తిమ్మాపురం గ్రామంలో కోడిపందాలు నిర్వహణకోసం వేసిన టెంట్లను స్థానిక పోలీసులు తొలగించారు. పందాలు నిర్వహణకు ఎటువంటి అనుమతులులేనందున కోడిపందాలు, జూదం నిర్వహిస్తే కఠినచర్యలు తప్పవంటూ ఎస్ రాయవరం ఎస్ఐ విభీషణరావు పందాలునిర్వాహణ కోసం వేసిన షామియానాలు తొలగించారు. ఈ సందర్భంగా నక్కపల్లి సి ఐ రామకృష్ణ స్థానిక విలేకర్లు తో మాట్లాడుతూ పండుగ ప్రశాంతంగా, ఆనందంగా జరుపుకోవాలన్నారు. జూదం, పందాలుకు ఎటువంటి అనుమతులు లేవని, కోడిపందాలు, పేకాట, గుండాటలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పండుగకు ఊరువెళ్ళేవారు తగుజాగ్రత్తలు పాటించాలని, విలువైన వస్తువులుఇంటి లో ఉంచరాదని, సమాచారనిసమీప పోలీసు స్టేషన్ లోతెలియ చేయాలని సి ఐ సూచించారు.

మునగపాక అంగనవాడి కేంద్రాల ఆధ్వర్యంలో

# సంక్రాంతి సంబరాలు



**మునగపాక, జనవరి 13, మనసులో మాట..** మండల కేంద్రం మునగపాక లో గల 8 అంగన్వాడి కేంద్రాలు ఒక చోటికి చేరి మంగళవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ అన్నపూర్ణ మాట్లాడుతూ సంక్రాంతి సంబరాలు విశిష్టతను పిల్లలకు వివరించారు. భోగిమంటల వెలుగుల్లాగా మన జీవితమంతా నిత్యం కళకళలాడాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, విద్యార్థులు, ఆయాలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



గ్రామీణ యువజన మంత్రం ఆధ్వర్యంలో

## ఈనెల 15 ముగ్గులు పోటీ

**గ్రామీణ యువజన మందిరం అధ్యక్షులు ఆడారి శ్రీకాంత్ మునగపాక గ్రామీణ**

యువజన మందిరం ఆధ్వర్యంలో, సంక్రాంతి పురస్కరించుకొని జనవరి 15 వ తేదీ సాయంత్రం 6 గంటలకు నందీశ్వర కళావేదిక తులసి ప్రాంగణంలో మహిళలకు ముగ్గుల పోటీ నిర్వహించబడును. కావున గ్రామ ప్రజలు అందరూ కూడా ఈ ముగ్గుల పోటీ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయవలసిందిగా కోరుచున్నామని గ్రామీణ యువజన మంత్రి అధ్యక్షులు ఆడారి శ్రీకాంత్ తెలిపారు. ఈ పోటీలో పాల్గొన్న వారికి ఆకర్షణీయమైన బహుమతులు ఇవ్వబడుతుందని ఆయన తెలియజేశారు. మహిళలంతా ఈ పోటీల్లో పాల్గొని విజేతలు కావాలని ఆయన ఆకాంక్షించారు.

### విద్యుత్ చార్జీల (టారీఫ్) పై ఈనెల 20 నుండి

## బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ

**నర్సీపట్నం విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏ వి ఎన్ ఎం అప్పారావు**



నర్సీపట్నం రూరల్, జనవరి 13, ( మనసులో మాట) : విద్యుత్ చార్జీల (టారిఫ్) పై ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏ.పి.ఈ.ఆ ర్సీ) ఈ నెల 20 నుంచి బహిరంగ ప్రజా అభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు ఏపిఈపిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏ.వి.ఎన్.ఎమ్. అప్పారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2026-27 ఆర్థిక సంత్సరానికి గాను ఏ.పి.ఈ.ఆర్సీ. చైర్మన్ పి.వి.ఆర్.రెడ్డి ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు జరిగే ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నర్సీపట్నంలోని పెద్ద బొడ్డేపల్లి విద్యుత్ డివిజన్ కార్యాలయంవద్ద ఈనెల తేదీ: 20, 22,23, మరియు 27 తేదీలలో ఉదయం 10:30 నుంచి 01:00 వరకు (వ్యకిగతంగా) మరియు 2:00 నుండి సాయంత్రం 4:30 గంటల వరకు (వీడియో కాన్ఫరెన్స్ ద్వారా) జరుగుతాయన్నారు. అభిప్రాయాలు చెప్పదలుకున్నవారికి డివిజన్ ఆఫీస్, పెద బొడ్డేపల్లి, నర్సీపట్నం కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. ముందుగానే పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పేర్లు నమోదు చేసుకోని వారు కూడా విద్యుత్ నియంత్రణ మండలి అనుమతితో అభిప్రాయాలు తెలియచేయవచ్చారన్నారు. ప్రజాభిప్రాయ సేకరణను ప్రజలు వీక్షించేందుకు వీలుగా ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు ఏ.పి.ఈ.పి.డి.సి.ఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏ.వి. ఎన్. ఎమ్. అప్పారావు తెలిపారు.

### పేకాట శిబిరాల పై

## పోలీసులు దాడి

**పోలీసుల అదుపులో 11 మంది**

రాంబిల్లి జనవరి 13 ( మనస్సు లో మాట ) మండలంలోని లోవపాలెం వాడపాలెం గ్రామాల్లో పోలీసు శిబిరాలపై దాడి చేసి మంగళవారం 11 మందిని అదుపులోకి తీసుకొని 20వేల 380 రూపాయలు స్వాధీనం చేసుకున్నట్టు రాంబిల్లి ఎస్సై నాగేంద్ర తెలిపారు. గ్రామాల్లో అనుమతి లేకుండా జూదం, పేకాట వంటి బెట్టింగ్ కార్యకలాపాలు నిర్వహించడం చట్ట విరుద్ధమని, ఇటువంటి అక్రమ చర్యల వల్ల యువత చెడు మార్గంలోకి వెళ్లే ప్రమాదం ఉందని ఆయన అన్నారు. ప్రజల శాంతి భద్రతలకు భంగం కలిగించే ఇలాంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు.

భవిష్యత్తులో కూడా అనుమతి లేకుండా పేకాట, జూదం, కోడిపందాలు వంటి వి నడిపించిన చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. శాంతియుత వాతావరణాన్ని కాపాడేందుకు సహకరించాలని ఎస్సై కోరారు

సందడిగా అభిమానుల సమక్షంలో జనసేన నేత

# మొల్లేటి వెంకట బోగేష్ జన్మదిన వేడుకలు

**భోగేసును అభినందిస్తున్న కూటమి నేతలు**



**మునగపాక, జనవరి 13, మనసులో మాట ..** మండలంలో గల పాటి పల్లి గ్రామానికి చెందిన జనసేన నేత, బాపూజీ యువజన సంక్షేమ సంఘం అధ్యక్షులు మొల్లేటి వెంకట బోగేస్ జన్మదిన వేడుకలు వెంకటాపురం రిసార్ట్స్లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ జన్మదినం వేడుకల్లో కూటమి నేతలు పాల్గొని భోగేసుకు అభినందనలు తెలియజేశారు. సామాజిక కార్యకర్తగా ఉంటూ ఎంతో మంది పేద ప్రజల ఆకలి తీరుస్తూ, అభాగ్యులను అండగా చేర్చుకుంటూ వారికి తగిన వసతులు కల్పిస్తూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ పేదలకు సేవలు అందిస్తున్న భోగేసుకు ఆ భగవంతుడు నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కూటమి నేతలు ఆకాంక్షించారు. బోగేష్ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం ఉదయం పేదలకు బట్టలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షులు టెక్కలి పరశురాం, రాష్ట్ర తెలుగు రైతు ఆర్గనైజింగ్ కార్యదర్శి దాడి ముసిలి నాయుడు, ఎలమంచిలి నియోజకవర్గ టిడిపి నేత దొడ్డి శ్రీనివాసరావు, చొప్ప శ్రీను, శరగడం యోగి నాగేశ్వరరావు, ఆడారి గణేష్, మొల్లేటి ఆనంద్, ఆడారి భాస్కరరావు, పిఎస్ఎస్ఎన్ మూర్తి, పల్లా సన్యాసిరావు, ద్రాక్షారపు రామచంద్రరావు, గొల్లవిల్లి త్రిమూర్తులు, కోయిలాడ జగదీష్, కోయిలాడు లక్ష్మణరావు, రాపిటి అప్పలనాయుడు, బీశెట్టి అప్పలనాయుడు, కోయిలాడ రమణ పెద్ద ఎత్తున కూటమినేతల పాల్గొన్నారు.

మునగపాక వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో

# ముందస్తు సంక్రాంతి వేడుకలు





**మునగపాక, జనవరి 13, మనసులో మాట** మునగపాక వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మునగపాక వాడ్రాపల్లి మధ్యలో గల ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనునిత్యం మునగపాక నుండి వాడ్రాపల్లి గ్రామ వరకు నడిచి వెళ్లే వాకర్సు సభ్యులంతా ముందస్తుగా భోగి మంటలు వేసి సందడి చేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షులు సూరిశెట్టి శ్రీనివాస్, వానపల్లి తాతారావు, వానపల్లి కన్నారావు, సరగడం రాము, షేక్ రాము, కెవిఎస్ అప్పారావు, వేగి మల్లు నాయుడు, గుదే మహేష్, బీసెట్టి సూర్య, ఆడారి అప్పలనాయుడు, తిమ్మరాజుపేట వాకర్స్ పాల్గొన్నారు.

# అవినీతిపై ఉక్కుపాదం...

**అర్జీల పరిష్కారంలో, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు - జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్ హెచ్చరిక**



**పాడేరు,రూరల్ జనవరి 13 మనుసులో మాట..** అల్లూరి సీతారామరాజు జిల్లాలో పాలనను మరింత పారదర్శకంగా, వేగవంతంగా ప్రజలకు అందించడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఈ మేరకు మంగళవారం జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ మరియు ఐటిడిఏ పిఓ తిరుమాని శ్రీపుజ జిల్లా స్థాయి అధికారులు, తహసిల్దార్లు, ఎంపీడీఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లాలో అమలవుతున్న వివిధ ప్రభుత్వ పథకాలు, గ్రీవెన్స్ పరిష్కారం మరియు ఈ-ఆఫీస్ నిర్వహణపై కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రజల నుంచి వచ్చే పీజీఆర్ఎస్ గ్రీవెన్స్ అర్జీల పరిష్కారంలో ఎటువంటి అలసత్వం వహించకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ, పెన్షన్లు, వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహించినా, ఎవరైనా లంచం డిమాండ్ చేసినా లేదా అవినీతికి పాల్పడినా వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బాధితుల ఫిర్యాదులపై తక్షణమే ఎంక్వయిరీ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. తదనుగుణంగా తగు శాఖా పరమైన చర్యలకు వెనుకాడబోమని స్పష్టం చేశారు. ఇకపై జిల్లాలో మాన్యువల్ ఫైళ్లకు స్వస్తి పలకాలని, ప్రతి ఫైలు ఖచ్చితంగా ఈ-ఆఫీస్ ద్వారానే ప్రాసెస్ కావాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే ఈ-పీటీఎస్ పోర్టల్లో ఆయా శాఖలకు సంబంధించిన జీవోలు, మెమోలు, సర్క్యులర్లను, అన్ని విధాలైన ఉత్తర ప్రత్యుత్తరాలను వెంటనే అప్లోడ్ చేయాలని, ఇందులో వెనుకబడిన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారికి ఆదేశించారు.

రీ-సర్వే పూర్తయిన గ్రామాల్లో తహసిల్దార్లు ప్రతి పాస్ పుస్తకాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, తప్పులను సవరించిన తర్వాత గ్రామసభ లలో అందరూ లబ్ధిదారులు విధిగా హాజరు అయ్యేట్లు నిర్వహించి ప్రణాళికా బద్ధంగా చేయాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. గ్రామ సభలు నిర్వహించి, ఎక్కడా పొరపాట్లు లేకుండా అర్హులైన రైతులందరికీ పాస్ పుస్తకాలు అందేలా చూడాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుండి వచ్చే ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా ప్రజలు అన్ని సేవల్లో తగు ఫీడ్బ్యాక్ ఇచ్చేలా వారికి అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. జిల్లాలోని మండల స్థాయి నుండి డివిజన్, జిల్లా స్థాయి వరకూ అన్ని శాఖలు తమ కీ-పెర్ఫార్మింగ్ ఇండికేటర్స్ నివేదికలను ప్రతి నెలా 9వ తేదీ లోపు సిపిఓ కార్యాలయానికి అందజేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్లోని ప్రత్యేక మానిటరింగ్ టీమ్ ఈ గ్రీవెన్స్ పరిష్కారాలను నిరంతరం పర్యవేక్షిస్తుందని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో సబ్ కలెక్టర్ లు, డీఆర్వో అంబేద్కర్, పాడేరు ఆర్డీఓ లోకేశ్వరరావు, జిల్లా స్థాయి వివిధ శాఖల అధికారులు, మండల స్థాయి అధికారులు, తహసిల్దార్లు, ఎంపిడిఓ లు పాల్గొన్నారు.

# బైకుచోరీ కేసులో ఇద్దరు ముద్దాయిలు అరెస్టు



**ఎస్. రాయవరం, జనవరి 13,(మనసులోమాట):** ఎస్. రాయవరం మండలం పెనుగొల్లు హైవే వద్దగతనెల 22 వతేదీ చోరీకి గురైన గ్లామర్ బైక్ తోపాటు యలమంచిలిదొంఖలించబడిన డియె బైకుచోరీకిపాల్పడిన ఇద్దరు ముద్దాయిలును మంగళవారం అరెస్టుచేసినట్లు సి ఐ రామకృష్ణ తెలిపారు.బైకు దొంగతనం ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా మంగళవారం మాకు అందిన సమాచారం మేరకు అడ్డరోడ్డు బ్రిడ్జి వద్ద గల ఆటో స్టాండ్ వద్ద ఇద్దరు వ్యక్తులను, దొంగిలించబడిన గ్లామర్ బైక్ పట్టుకున్నట్లు సి ఐ తెలిపారు.నిందితులు వద్ద గ్లామర్ బైక్ తో పాటుగా ఎలమంచిలి టౌన్ లో దొంగతనం చేసిన డియో బైక్ స్వాధీనంచేసుకున్నట్లు తెలిపారు. రాజమండ్రి కిచెందిన కొసిరెడ్డిశ్రీనివాసరావు కుమారుడు కొసిరెడ్డిప్రేమ్ కుమార్ ( 20) అనే వ్యక్తితో పాటుమరొక జువైనల్ తో కలిసి గత నెల21వ తేదీన ఇరువురు కలిసి రైలులో వచ్చి ఎలమంచిలి టౌన్ లో డియో బైక్ దొంగిలించి వస్తున్న మార్గమధ్యంలో పెనుగోళ్ళు హైవే వద్ద గ్లామర్ బైక్ దొంగలించినట్లునిందితులు తెలిపారని, దొంగిలించిన బైకులు రెండిటిపై ఏజెన్సీ కి వెళ్లి గంజాయి కొనుక్కునేందుకు వెళు తుండగా మార్గమధ్యంలో పట్టుబడినట్లు తెలిపారు. దొంగలించిన బైకులు స్వాధీనం చేసుకొని కసిరెడ్డి ప్రేమ్ కుమార్ ను రిమాండ్ కు తరలించామని,మరో ముద్దాయిని జువైనల్ హోమ్ కు తరలించి నట్లు ఎ స్ ఐ విభీషణరావుతెలిపారు.ముద్దాయి ప్రేమ్ కుమార్ పైపదికిపైగా దొంగతనం కేసులు ఉన్నాయని, జూవైనల్ పై 18 కేసులు ఉన్నట్లు సి ఐ తెలిపారు.

# బైకుచోరీ కేసులో ఇద్దరు ముద్దాయిలు అరెస్టు




**పాడేరు రూరల్ (అరుకు) జనవరి 13 మనుషులు మాట..** అరకు వ్యాలీ పోలీస్ స్టేషన్ ఎదుట ఘనంగా మగ్గుల పోటీలు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ అల్లూరి సీతారామరాజు జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం అరకు వ్యాలీ పోలీస్ స్టేషన్ ఎదుట మగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ శ్రీ అమిత్ బర్దార్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నిర్వహించిన ఈ మగ్గుల పోటీలలో సుమారు 50 మంది పోలీసులు, స్థానిక ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి మొదటి, రెండో, మూడో బహుమతులను జిల్లా ఎస్పీ గారు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీ అమిత్ బర్దార్ సంప్రదాయ గిరిజన ధీమ్సా నృత్యం చేసి అందరినీ ఆకట్టుకున్నారు. అనంతరం భోగి మంటను వెలిగించి సంక్రాంతి పండుగ శుభారంభం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్నవారు పండుగ వాతావర ణంలో ఆనందోత్సాహాలతో మునిగిపోయారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ, తెలుగు ప్రజలందరూ సంక్రాంతి పండుగను తమ కుటుంబ సభ్యులతో ఆనందంగా, ఐక్యతతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. అలాగే జిల్లాలోని ప్రజలకు, పోలీస్ సిబ్బందికి మరియు వారి కుటుంబ సభ్యులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి మొజురు తేజోవతి,విజయనగరం జోనల్ ఆర్టిసి రీజనల్ చైర్మన్ టిడిపి అరకు ఇన్చార్జి సియ్యారి.దొన్ను దొర, సీఐ ఎల్. హిమగిరి, ఎస్ఐ గోపాలరావుతో పాటు పోలీస్ సిబ్బంది, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# 29 మంది మినీ అంగన్వాడీలకు పదోన్నతి

**నియామక పత్రాలు అందజేసిన స్పీకర్ సతీమణి కౌన్సిలర్ చింతకాయల పద్మావతి**

నర్సీపట్నం రూరల్, జనవరి 13, ( మనసులో మాట) : నర్సీపట్నం నియోజకవర్గ పరిధిలోని 29 మంది మినీ అంగన్వాడీ కార్యకర్తలకు మెయిన్ అంగన్వాడీ కార్యకర్తలుగా పదోన్నతి లభించింది. మంగళవారం నర్సీపట్నంలోని స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో గౌరవ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుని సతీమణి మున్సిపాలిటీ కౌన్సిలర్ చింతకాయల పద్మావతి పదోన్నతి పత్రాలను అందజేశారు. నియోజకవర్గంలోని రెండు ఐసిడిఎస్ ప్రాజెక్టుల పరిధిలో మొత్తం 29 అంగన్వాడీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా అప్గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో నర్సీపట్నం ప్రాజెక్ట్ పరిధిలోని నర్సీపట్నం మండలంలో ఇద్దరు మాకవరపాలెం మండలంలో ఎనిమిది మంది కార్యకర్తలు ఉన్నారు. అలాగే గొలుగొండ ప్రాజెక్ట్ పరిధిలోని గొలుగొండ మండలంలో ఎనిమిది మంది , నాతవరం మండలంలో పదకొండు మంది, కార్యకర్తలకు ఈ పదోన్నతి దక్కింది.

గతంలో మినీ అంగన్వాడీలుగా వీరు రూ. 7,000 వేతనం పొందుతుండగా, మెయిన్ వర్కర్లుగా పదోన్నతి పొందడంతో ఇకపై వీరి వేతనం రూ. 11,500లకు పెరగనుంది. ఈసందర్భంగా స్పీకర్ సతీమణి పద్మావతి మాట్లాడుతూ..అంగనవాడి కార్యకర్తలు అంకితభావంతో పనిచేసి చిన్నారులు, తల్లుల ఆరోగ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. తమకు పదోన్నతి లభించడం పట్ల అంగన్వాడీ కార్యకర్తలు స్పీకర్ అయ్యన్నపాత్రుడుకు, పద్మావతికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాతవరం మండలం టిడిపి పార్టీ అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ, సి డి పి ఓ జి.వి రమణి, కె శ్రీగౌరీ, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

### బూరుగుపాలెం, పైడిపాల గ్రామాల్లో

# పొలం పిలుస్తోంది




**మాకవరపాలెం, జనవరి 13, ( మనసులో మాట) :** పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా బూరుగుపాలెం మరియు పైడిపాల గ్రామాల్లో వ్యవసాయ అధికారి డి.అప్పారావు పర్యటించి రెండవ పంట అనగా రబీ సీజన్లో కూడా ఈ పంట నమోదు చేసుకోవాలని తెలిపినారు.ప్రతి రైతు కూడా రెండో పంట వేసినవారు వేసిన పంటలు వరి, అపరాలు, నువ్వులు, కూరగాయలు మరియు వేరుశనగ పంటలు వేసిన రైతులు తప్పనిసరిగా రబి సీజన్లో కూడా ఈ పంట లో మీ యొక్క భూమి వివరాలు నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి తెలిపినారు .ఏ రైతులయితే ఈ పంటలో నమోదు అవుతారో ఆ రైతులకు మాత్రమే ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు అనగా పంట నష్టం ,పంటల బీమా పథకం, ధాన్యం కొనుగోలు మరియు బ్యాంకులో లోన్ పొందాలన్నా తప్పనిసరిగా ఈ పంట లో నమోదు చేసుకోవాలని, దాని కొరకు రైతులు మీ యొక్క పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు మీ యొక్క రైతు సేవ కేంద్రం ఇన్చార్జిలకు అందించి పంట నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి తెలిపారు. గ్రామ పెద్దలు , రైతులు, రైతు సేవ కేంద్రం ఇన్చార్జి లు పాల్గొన్నారు.

## రోలుగుంట మండలంలో ధనుర్మాస భక్తి మేల్కొలుపుల దినోత్సవం



**రోలుగుంట మనసులో మాట జనవరి 12..** అనాకాపల్లి జిల్లా రోలుగుంట మండలంలో ధనుర్మాసం ఆఖరి రోజు ఒక అపూర్వ భక్తి ఉత్సవంగా మారింది. తెల్లవారుజాము నుంచే మండలంలోని అనేక గ్రామాలు మేల్కొలుపుల ధ్వనులతో రాగి మెరిసినట్టు మేల్కొన్నాయి. రోలుగుంట, కొవ్వూరు, కొమరవోలు, వెలమకాయలపాలెం, కొండపాలెం, కుసర్లపూడి, బలిజిపాలెం వంటి గ్రామాల్లో భజన బృందాలు వీధి వీధుల్లోకి దూసుకొచ్చాయి., ఖర్జూరాలు, ఈణలు, సరాలు కలిసిన ఈ బృందాలు ‘ఓం నమో నారాయణ‘ అనే పవిత్ర నాదంతో ప్రజల ఇంటి ముంగిట నిటారుగా నిలబడి, భక్తి సంగీతంతో నిద్రాంధులను మేల్కొల్పారు.ఈ మేల్కొలుపులు మన హైందవ సంప్రదాయాల్లోని ధనుర్మాస మహిమకు అద్దం పడతాయి. ధనుర్మాసంలో సూర్యుడు ధనువు రాశిలో ప్రవేశించడంతో ఈ కాలం భక్తి సాధనకు పరమ పవిత్రమైనది. ఆగమ శాస్త్రాల ప్రకారం, ఈ రోజుల్లో హరి నామస్మరణ ఫలితం లక్షల యజ్ఞాలకు సమానం. గ్రామీణ తెలుగు సంస్కృతిలో ఈ మేల్కొలుపులు ఒక రకంగా ‘భక్తి జాగరణం‘ రాత్రి నిద్రను విడిచి, దైవ నామంతో రోజును ప్రారంభించడం. భజనల్లో ‘ధనుర్మాస మహిమ‘ గీతాలు, ‘వేంకటరమణ స్తోత్రాలు‘, ‘గోదాదేవి ఆరతి‘ కీర్తనలు ప్రతిధ్వనించాయి. పిల్లలు, ముసలివాళ్లు, యువకులు కలిసి ఈ బృందాల్లో చేరి, హరినామ జపంతో వీధులు పుష్పవృష్టి చేశారు.ముఖ్యంగా రోలుగుంటలో భజన బృందాలు , ప్రత్యేక గోదాదేవి పూజలు నిర్వహించారు. దీపారాధనలు, పుష్పార్చనలు, తృప్తి ప్రదానాలతో ఆ తల్లిని స్తుతించారు. కొవ్వూరు, కొమరవోలులో మహిళలు ముందుంచి, ‘అందలో అందలో ఆకాశరామ‘ లాంటి భక్తి గీతాలతో ఇళ్ల ముందు ఆగి పాడారు. వెలమకాయలపాలెం, కొండపాలెంలో యువకులు ఢమ్, నగరాలతో రిథమ్ బద్దలు కొట్టి, గ్రామవాసులను ఆనందోద్రేకాలకు గురిచేశారు. కుసర్లపూడి, బలిజిపాలెంలో మొక్కుబడి మేల్కొలుపులు జరిగి, గ్రామ పంచాయతీ సభ్యులు కూడా చేరి పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలు కేవలం భక్తి కాదు, గ్రామీణ ఐక్యతకు, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలిచాయి.ఈ దృశ్యాలు చూస్తే మన తెలుగు సంప్రదాయాల గొప్పతనం గుర్తొస్తుంది. ఆధునిక జీవితాల్లో కూడా ఇలాంటి మేల్కొలుపులు ఆధ్యాత్మిక శక్తిని, సామూహిక భావాన్ని నింపుతాయి. రోలుగుంట మండలం ఈ ధనుర్మాస ఉత్సవంతో మరింత భక్తి ముఖరంగా మారింది.

మనసులో మాట

KANCHARLA

సంచలన తెలుగు దిన పత్రిక

కోస్తాంధ్ర

| | | |
|---|---|---|
| తూర్పు గోదావరి | పశ్చిమ గోదావరి | కృష్ణా |
| గుంటూరు | ప్రకాశం | నెల్లూరు |

బుధవారం 14 జనవరి 2026






## ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ పర్యాటక కేంద్రంగా

# తీర్చిదిద్దుతాం

- ▶▶ మంత్రి కందుల దుర్గేష్
- ▶▶ కోనసీమలో వైభవంగా సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ సంక్రాంతి సంబరాలు
- ▶▶ పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా- పెట్టుబడులకు స్వర్గధామంగా ఏపీ
- ▶▶ పడవ పందేలు ద్వారా విశ్వవ్యాప్తమైన ఆత్రేయపురం పేరు : మంత్రి దుర్గేష్



**ఆత్రేయపురం (కొత్తపేట), మనసులో మాట, జనవరి 13:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో పర్యాటక రంగానికి పూర్వవైభవం వచ్చిందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మంగళవారం ఆత్రేయపురంలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ సంక్రాంతి సంబరాలు - 2026", బోట్ ఫెస్టివల్ ను మంత్రులు వంగలపూడి అనిత, కొండపల్లి శ్రీనివాస్ తో కలిసి తిలకించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ కీలక అంశాలను ప్రస్తావించారు.

**ఆత్రేయపురం గుర్తింపు..**

దేశ వ్యాప్తంగా కోనసీమ గొప్పతనాన్ని చాటిచెప్పేలా పడవ పందాలను నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఆత్రేయపురం పేరును విశ్వ వ్యాప్తం చేయాలన్న ఎమ్మెల్యే సత్యానందరావు కృషిని ప్రతి ఒక్కరూ అభినందించాలని మంత్రి దుర్గేష్ అన్నారు.

**పర్యాటక అభివృద్ధి..**

గత ఐదేళ్లలో కుదేలైన పర్యాటక రంగాన్ని పునరుద్ధరిస్తున్నాం అన్నారు. ఒకప్పుడు పర్యాటకం అంటే కేరళ, రాజస్థాన్ గుర్తొచ్చేవని, కానీ నేడు ఆంధ్రప్రదేశ్ పర్యాటకానికి చిరునామాగా మారిందన్నారు.

**డబుల్ ఇంజన్ సర్కార్..**

ప్రధాని మోడీ, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమంలో దూసుకుపోతోందని అన్నారు.

**పారిశ్రామిక హోదా..**

పర్యాటక రంగానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పారిశ్రామిక హోదా కల్పించారని, దీని వల్ల పరిశ్రమలకు అందే రాయితీలు పర్యాటక ఇన్వెస్టర్లకు కూడా అందుతున్నాయని తెలిపారు.

**పర్యాటక పాలసీ 2024-29..**

ద్వారా వేలాది కోట్ల పెట్టుబడులు వచ్చాయని, ప్రముఖ స్టార్ హోటళ్లు, రిసార్టులు రాష్ట్రానికి వస్తున్నాయి అన్నారు.

**భవిష్యత్తు ప్రణాళిక..**

ఎకో టూరిజం, టెంపుల్ టూరిజం, అడ్వెంచర్, క్యారావాన్ టూరిజం వంటి విభిన్న పాలసీలతో ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ స్థాయి పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దుతామని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హోం మంత్రి వంగలపూడి అనిత, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



## ఇందిరా నగర్ సమస్యలపై

# ఎంపీ ఉదయ శ్రీనివాస్ ఆరా!

**పిఠాపురం, (మనసులో మాట) జనవరి 13:** ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం శాసనసభ్యులు పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు, కాకినాడ ఎంపి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, జనసేన జిల్లా అధ్యక్షుడు మంగళవారం పిఠాపురం పట్టణంలోని ఇందిరా నగర్ కాలనీలో పర్యటించారు. ఇటీవలే పవన్ కళ్యాణ్ పిఠాపురంలో పర్యటించిన సమయంలో, సదరు ప్రాంతంలో అపరిశుభ్ర వాతావరణం పై తీవ్రంగా మండిపడిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఎంపీ తంగేళ్ల ఉదయ శ్రీనివాస్ పర్యటన లో అక్కడ పారిశుధ్య సమస్యలకు పరిష్కారం చూపాలంటూ ఆ ప్రాంతవాసులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ నేపథ్యంలో డిసిసిబి అధ్యక్షులు తుమ్మల బాబుతో కలిసి ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ కాలనీలోని ప్రతి వీధిని పరిశీలించారు. స్థానికులతో నేరుగా మాట్లాడి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.

ముఖ్యంగా వర్షపు నీరు నిలిచిపోకుండా డ్రైనేజీ వ్యవస్థను ప్రక్షాళన చేయాలని, కాలనీలో పారిశుద్ధ్య పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ కనకారావును ఎంపీ ఆదేశించారు. ప్రజా సమస్యల విషయంలో నిర్లక్ష్యం వహించరాదని, ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, మున్సిపల్ అధికారులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.




## జూద క్రీడలతో..

# సంక్రాంతి పరువు తీయకండి

## సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడండి

- కోడి పందాలు పేకాట, గుండాట తదితర జూద క్రీడలు ఆడితే కఠిన చర్యలే
- కుటుంబ సమేతంగా పండుగను జరుకోండి
- జిల్లా ఎస్పీ డీ నరసింహా కిశోర్

**రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 13:** సంస్కృతి సాంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచే సంక్రాంతి పండుగ రోజుల్లో జూద క్రీడలు ఆడి పండుగకు ఉన్న విలువలను మంటకలపవద్దని జిల్లా ఎస్పీ డీ నరసింహ కిశోర్ జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం సాయంత్రం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. జిల్లా ప్రజలకు, మీడియా మిత్రులకు, పోలీసు అధికారులకు, సిబ్బందికి, వారి కుటుంబాలకు భోగి, సంక్రాంతి శుభాకాంక్షలను ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తెలుగుదనాన్ని చాటుతూ, మన సాంప్రదాయాన్ని తెలుపుతూ, మీలోని చెడును, వ్యసనాలను భోగి మంటల్లో వేసి, మీ జీవితంలోకి కొత్త వెలుగులకు ఆహ్వానం పలుకుతూ, ఈ పండుగ చెరుకులోని తీయదనం, పాలలోని తెల్లదనం, గాలిపటంలోని రంగుల అందం... మనందరి జీవితాల్లో ఆనందాన్ని నింపాలని ఆకాంక్షించారు. సంక్రాంతి పండుగలో ప్రజలు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా, కుటుంబ సమేతంగా పండుగను సంతోషంగా జరుపుకోవాలని కోరారు. సంక్రాంతి పండుగ సందర్భంగా జిల్లాలో కోడి పందాలు, పేకాట, గుండాట వంటి నిషేధిత జూద క్రీడలు నిర్వహించడం, ఆడటం, ఆడించడటం చట్టరీత్యా నేరమన్నారు. అట్టి వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా పోలీస్ శాఖ తరపున పటిష్ట నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు.

ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ డ్రోన్ కెమెరాలు, సోలార్ సీసీ కెమెరాల సహాయంతో గతంలో కోడి పందాలు, పేకాట వంటివి నిర్వహించిన ప్రదేశాలు, నిర్వాహకులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఎవరైనా జూద శిబిరాలు నిర్వహించినా, కోడి పందాలు ఏర్పాటు చేసినా, పందేల కోసం స్థలాలు లేదా పొలాలు ఇచ్చినా, కోళ్లకు కత్తులు కట్టినా, వాటిని తయారు చేసినా లేదా సరఫరా చేసినా వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ డీ నరసింహ కిశోర్ హెచ్చరించారు.

# ఇంటింటా గొబ్బెమ్మల సందడి..

## - సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీక.. సంక్రాంతి వేడుకలు







**రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 13:** "కొలని దోపరికి గొబ్బిళ్ళో..యదుకుల సామికి గొబ్బిళ్ళో".. ఇది అన్నమయ్య పాట. ఇటువంటి జానపద పాటలతో ఇంటింటా సంక్రాంతి సందడి కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. సంక్రాంతికి ముందు ఒక నెల రోజుల కాలాన్ని ధనుర్మాసం అని పిలుస్తారు. ఈ ధనుర్మాసంలో ముఖ్యంగా సంక్రాంతి పర్వదినాలలో గొబ్బి పాటలు వినసొంపుగా ఉంటాయి. జానపద వ్మాయంలో ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఇంకో విషయం ఏమిటంటే.. గోపికలనే వ్యవహారంలో గొబ్బెమ్మలుగా భావిస్తారు. ఈ ధనుర్మాసంలో మహిళలు..ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో వేకువజామునే లేచి ఇంటి ముందు పేడనీళ్ళు చల్లి ముగ్గులు వేసిన తరువాత పేడతో చేసిన ముద్దలను గొబ్బెమ్మలుగా భావించి ఆ ముగ్గుల మధ్యభాగంలో ఆ ముద్దలను పెట్టి వాటికి అలంకారంగా పువ్వులు పెడతారు. సాయంత్రమయ్యాక పేడతో గాని, పసుపుతో కానీ గొబ్బెమ్మలను చేసి ఒక పెద్ద పళ్ళెంలో ఉంచుతారు. నగరాల్లో అక్కడక్కడా ఈ సందడి కనిపించేది. ప్రస్తుతం ఈ గ్రామీణ ప్రాంతాలకు దీటుగా పట్టణాలు, నగరాలలో కూడా ఈ గొబ్బెమ్మల సందడి కనిపిస్తోంది. ఇంటింటా గొబ్బెమ్మల పాటలతో ఉత్సాహ పూరిత వాతావరణం కనిపిస్తోంది. గొబ్బెమ్మలను రకరకాలుగా అలంకరించి, ఇంటి ముంగిట గొబ్బెమ్మను పళ్ళెంతో సహా ఉంచి..గొబ్బెమ్మ చుట్టూ లయబద్ధంగా తిరుగుతూ, చేతులతో చప్పట్లు తడుతూ పాటలు పాడతారు. చివరి రోజు కనుమ నాడు పాటలు పాడటం పూర్తయ్యాక గొబ్బెమ్మలను నీటిలో నిమజ్జనం చేస్తారు.

**లలితా నగర్ సీతారామ నిలయంలో..**

మంగళవారం లాలా చెరువు హౌసింగ్ బోర్డు కాలనీ లలితా నగర్ పార్క్ గ్రౌండ్ పక్కన సీతారామ నిలయంలో ఈ గొబ్బెమ్మల పాటలతో బాలికలు సందడి చేశారు. చిన్నారులు, యువతులు భక్తి శ్రద్ధలతో గొబ్బిళ్లు పెట్టి పూజలు నిర్వహించారు. పూలతో, పసుపు- కుంకుమలతో చూడ ముచ్చటగా అలంకరించి "గొబ్బియల్లో గొబ్బియల్లో.." అని రాగయుక్తంగా పాడుతూ సందడి చేశారు. శ్రీనిధి, ఉజ్జల లక్ష్మి సాయి, మైథిలి, పూజిత శ్యామల, లాస్య తదితరులు గొబ్బెమ్మల పేరుతో చేసిన సందడి చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ చిన్నారుల ఉపాధ్యాయురాలు స్వప్న 'గొబ్బెమ్మల' సంస్కృతి సాంప్రదాయాలను, విశిష్టతను వివరించారు. పాల్గొన్న బాలికలకు పెద్దలు దీవెనలు అందించారు.

## సంక్రాంతి సంబరాలు కోనసీమ జిల్లా యొక్క సాంస్కృతి సాంప్రదాయాలు

# ఐక్యతను ప్రతిబించేలా జరుపుకోవాలి

## - జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్




**అమలాపురం (మనసులో మాట) జనవరి 13:** సంక్రాంతి సంబరాలు కోన సీమ జిల్లా యొక్క సుప్రసిద్ధ సాం స్కృతి సాంప్రదాయాల ను ఐక్యత ప్రతిబింబించేలా నిర్వహించుకోవాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ సిబ్బందికి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సందడిగా సంక్రాంతి వేడుకలను సంక్రాంతి సాంస్కృతి సాంప్రదాయా లు ఉట్టిపడే విధంగా ఘనంగా అధికారిక శైలిలో ముందస్తుగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగ ణంలో సంప్రదాయ పండు గను ఐక్యత, సంక్రాంతిని ప్రతిబిం బించే పండుగ వాతావర ణంలో జరుపు కోవడం ప్రత్యేక ఆకర్ష ణగా నిలిచిందన్నారు.ఈ వేడుకలలో కార్యాలయ సిబ్బంది, కుటుంబ సభ్యులతో సహా పెద్ద సంఖ్యలో హాజరయ్యారు చిన్నారులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొని పండుగ సందడిని మరింత పెంచారన్నారు. కార్యాలయ ప్రాంగణాన్ని సంక్రాంతి సాంప్రదాయం ఉట్టిపడేలా అలంకరణలతో ముస్తాబు చేయగా, పండుగ వాతావరణం నెలకొందన్నారు.సంక్రాంతి పండుగ ప్రాధాన్యతను తెలియ జేసే విధంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఉద్యోగుల మధ్య స్నేహభావం, ఐక్యతను పెంపొందించేలా ఈ సంబరాలు సాగాయన్నారు. సంక్రాంతి వంటి సంప్రదాయ పండుగలు ఉద్యో గుల మధ్య ఐక్యతను బలోపే తం చేస్తాయని, పరస్పర అవగాహనతో ప్రజలకు మెరుగైన సేవలు అందించేకు దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రభుత్వ సేవల్లో నిబద్ధతతో పని చేసి ప్రభుత్వ సేవలు పట్ల ప్రజలలో విశ్వా సాన్ని మరింత పెంపొందించాల ని ఆయన సూచించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ నిశాంతి ప్రసం గిస్తూ ప్లాస్టిక్ ను పూర్తిగా నిరోధిం చేందుకు ఎకో ఫ్రెండ్లీ ప్రకృతి సంరక్షణ పద్ధతులను ప్రతి ఒక్కరూ అవలంబించాలని సూచించారు. స్థానిక కలెక్టరేట్లో ఎకో ఫ్రెండ్లీ విధానానికి నాంది పలుకుతూ తొలి దశలో ప్లాస్టిక్ వాటర్ బాటిల్ కు ప్రత్యామ్నా యంగా స్టీల్ వాటర్ బాటిల్స్ ఉచితంగా అందించామని రెండో దశలో నేటి సంక్రాంతి రోజున మట్టి పాత్రలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. స్థానిక కలెక్టరేట్ నందు టీ గ్లాసులు మట్టి వి ఉపయోగించడం వచ్చే సోమ వారం నుంచి ఆరంభించను న్నట్లు తెలిపారు సంప్రదాయ విలువలు, సాంస్కృతిక వైభ వాన్ని ప్రతిబింబించేలా నిర్వ హించిన ఈ సంక్రాంతి సంబరాలు పాల్గొన్న వారందరికీ మధుర జ్ఞాపకంగా నిలిచా యన్నారు. డి ఆర్ ఓ కే మాధవి మాట్లాడుతూ మూడు రోజుల పాటు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో రంగవల్లులు, గొబ్బెమ్మలు, గంగిరెద్దులు, పశువుల ముంచెత్తుల వంటి సాంప్ర దాయ కార్యక్రమాల ద్వారా అంగరంగ వైభవంగా జరుపుకోవాలని ఆయన ఆదే శించారు సంక్రాంతి పండుగ సంబరాలు శాంతియుతంగా, క్రమ శిక్షణతో జరపాలని అధికారులు ఆదేశించారు. కోడి పందాలు, జంతు హింస సంబంధిత కార్య క్రమాలు నిషేధించబడ్డాయన్నారు ప్రజలు సంయమనం పాటించి ప్రభుత్వ యంత్రాంగానికి సహకరించాల ని, ట్రాఫిక్ నిబంధనలు పాటిం చాలని ఆయన పిలుపునిచ్చారు

రంగవల్లులు, పట్టు వస్త్రాలు, పశువుల అలంకరణ లు సాంప్రదాయాన్ని కాపాడుకుం టూ సంతోషదాయకంగా జరుపుకోవాలన్నారు. గాలిప టాల పోటీలు, సాంస్కృ తిక కార్యక్రమాలు జిల్లా స్థాయి కమిటీల పర్యవేక్షణలో జర గాల న్నారు. చివరిగా ఎడ్ల బండి పై జిల్లా జాయింట్ కలెక్టర్ డిఆర్ఓలు కలెక్టరేట్ ప్రాంగ ణంలో పయనించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు ఈ కార్యక్ర మంలో డీఎస్ఓ అడపా ఉదయభాస్కర్, ఏవో కాశీ విశ్వేశ్వరరావు వికాస జిల్లా మేనేజర్ జీ రమేష్ ,కలెక్టరేట్ సిబ్బంది భరత్ తదితరులు పాల్గొన్నారు.

## అధిక ఛార్జీలపై ఫేర్ మానిటరింగ్ టీమ్‌లతో

# నిరంతర నిఘా

- ▶▶ సంక్రాంతి ప్రయాణాల్లో ప్రైవేట్ బస్సుల అధిక ఛార్జీలపై ఉక్కుపాదం..కఠిన చర్యలు
- ▶▶ ఆర్టీసీ ఛార్జీలకు మించి వసూలు చేస్తే చట్టపరమైన చర్యలు
- ▶▶ ప్రయాణికుల రక్షణే లక్ష్యం - జిల్లా రవాణా శాఖ అధికారి సురేష్



**రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 13:** సంక్రాంతి పండుగ సందర్భంగా స్వగ్రామాలకు వెళ్లే ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగిన నేపథ్యంలో ప్రైవేట్ బస్సులు అధిక ఛార్జీలు వసూలు చేయకుండా నియంత్రించేందుకు ఆంధ్రప్రదేశ్ రవాణా శాఖ కఠిన చర్యలు చేపట్టిందని తూర్పు గోదావరి జిల్లా రవాణా శాఖ అధికారి ఆర్ సురేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఐదు రోజులుగా ఆర్టీజీఎస్ పర్యవేక్షణ వ్యవస్థతో పాటు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఫేర్ మోనటరింగ్ టీమ్స్ ద్వారా అన్ని ఆన్‌లైన్ బుకింగ్ ప్లాట్‌ఫార్ములు (అభిబస్, రెడ్‌బస్ తదితర యాప్‌లు)లో ప్రైవేట్ బస్సుల ఛార్జీలను నిరంతరం పరిశీలిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అధిక ధరలు వసూలు చేస్తున్నట్లు గుర్తించిన వెంటనే సంబంధిత ప్రైవేట్ బస్సు యజమానులతో అధికారులు సమన్వయం చేసి, ఛార్జీలను తక్షణమే తగ్గించి నియంత్రించే చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆర్టీసీ నిర్దేశించిన ఛార్జీలపై గరిష్టంగా 50 శాతం మాత్రమే అదనంగా వసూలు చేయాలని, దానికంటే ఎక్కువ ధరలకు టికెట్లు విక్రయిస్తే సంబంధిత బస్సు యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని ఆయన స్పష్టం చేశారు. ప్రయాణికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర వ్యాప్తంగా 24x7 హెల్ప్ లైన్ నెంబర్ 92816 07001ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బస్సు ఛార్జీలు, టికెట్ ధరలు లేదా ఇతర సమస్యలపై ఫిర్యాదులు అందిన వెంటనే అధికారులు స్పందించి తక్షణ పరిష్కారం అందిస్తారని చెప్పారు. ఈ హెల్ప్‌లైన్ నెంబర్‌ను ప్రతి ప్రైవేట్ బస్సులో తప్పనిసరిగా స్పష్టంగా ప్రదర్శించాలని బస్సు యజమానులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. అదే విధంగా మోటార్ వాహన తనిఖీ అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి క్షేత్ర స్థాయిలో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అధిక ఛార్జీలు వసూలు చేస్తున్న ప్రైవేట్ బస్సులపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధిస్తున్నట్లు వెల్లడించారు.

గత ఐదు రోజులుగా నిర్వహించిన ఈ తనిఖీలలో అధిక ఛార్జీలు వసూలు చేసిన 13 బస్సులపై కేసులు నమోదు చేసి రూ. 1.3 లక్షలు జరిమానా విధించామని, అలాగే పన్ను, పర్మిట్ తదితర నిబంధనలు ఉల్లంఘించిన 18 బస్సులపై కేసులు నమోదు చేసి రూ.64,300 లు జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు. ఈ ప్రత్యేక తనిఖీలు, పర్యవేక్షణ ప్రక్రియ జనవరి 18 వరకు కొనసాగుతుందని, పండుగ అనంతరం తిరుగు ప్రయాణాల సమయంలో కూడా ఇదే విధమైన కట్టుదిట్టమైన చర్యలు కొనసాగుతాయని జిల్లా రవాణా శాఖ అధికారి ఆర్ సురేష్ స్పష్టం చేశారు. ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన, భద్రతతో కూడిన ప్రయాణం అందించడమే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, పండుగ కాలంలో ప్రయాణికుల శ్రేయస్సు కోసం అన్ని అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.




## నేడు రాకా సంక్రాంతి పురస్కార మహోత్సవం

### నూజెళ్ళ శ్రీనివాస్, పళని స్వామిలకు ప్రదానం

**రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 13:** రాజమహేంద్రవరం ఆర్ట్స్ క్రియేటివ్ కల్చరల్ అసోసియేషన్ (రాకా) సంక్రాంతి పురస్కార మహోత్సవాన్ని బుధవారం పెద్ద ఎత్తున నిర్వహిస్తోంది. నగరంలోని గోకవరం బస్టాండు క్రాంతి నర్సింగ్ హోమ్, 2వ అంతస్తు 'బాలు సాంస్కృతిక మందిరం'లో నేటి (బుధవారం) ఉదయం 10.30 గంటలకు 'రాకా' పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమం ప్రారంభమవుతుందని రాకా అధ్యక్షుడు డాక్టర్ కంటే వీరన్న చౌదరి తెలిపారు. ఆంగ్ల ఉపన్యాసకులు, 'మేము గోదారోళ్ళమండి' పాట రచయిత డాక్టర్ నూజెళ్ళ శ్రీనివాస్, సినీ నటుడు- ఆరోగ్యకరమైన వంటల నిపుణుడు పళని స్వామి (భాగవతి శివప్రసాద్) లకు 'రాకా' పురస్కారాలతో సత్కరించనున్నామని సంస్థ ప్రధాన కార్యదర్శి జీవీ రమణ తెలిపారు.

## కాకినాడ జిల్లా ప్రజల అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు

### - జిల్లా ఇన్చార్జి కలెక్టర్ అపూర్వ భరత్



**కాకినాడ (మనసులో మాట) జనవరి 13..** భోగి, సంక్రాంతి, కనుమ పండుగల సందర్భంగా జిల్లా ప్రజలందరికీ ఇన్చార్జి జిల్లా కలెక్టర్ అపూర్వ భరత్ శుభాకాంక్షలు తెలియజేసారు. జిల్లా ప్రజలందరి జీవితాలలో సుఖ సంతోషాలు, భోగభాగ్యాలు పొంగి పొర్లాలని, పాడి పంటలతో జిల్లా సుభిక్షంగా విలసిల్లాలని ఆయన ఆకాంక్షించారు. సంక్రాంతి పండుగ తెచ్చిన నూతన ఉత్తేజంతో జిల్లా ప్రగతికి అందరం సమిష్టిగా కృషి చేద్దామని పిలుపు నిచ్చారు.

## పి నాయకంపల్లిలో సత్తెమ్మ తల్లి తీర్థం



**గండేపల్లి (మనసులో మాట) జనవరి 13..** కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారు గండేపల్లి మండలం పి నాయకంపల్లి గ్రామం లో వెలసిన శ్రీ సత్తెమ్మతల్లి అమ్మవారు తీర్థశీ నిర్వహిస్తున్నారు. దివంగత మలిరెడ్డి వెంకట్రావు తనయుడు గ్రామ వైస్సార్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు మలిరెడ్డి పాపారావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ఈ నెల 14,15,16 తేదీల్లో మూడు రోజుల పాటు జరగనున్నాయి. మూడు రోజుల పాటు కళ్ళు మిరుమిట్లు గొలిపే కాంతుల్లో నిర్వహించే ఈ జాతర మహోత్సవాలను ప్రతి ఒక్కరు తిలకించి,సత్తెమ్మతల్లి చల్లని ఆశీస్సులు పొందాలన్నారు.

# ప్రజా రాజధానిపై జగన్ కుట్ర బట్టబయలు : వర్మ

### ఇద్దరు ఉండే జగన్ కుటుంబానికి వేల ఎకరాలా..? ఐదు కోట్ల ప్రజలకు రాజధాని వద్దా ?



**పిఠాపురం, (మనసులో మాట) జనవరి 13:** వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి పై పిఠాపురం మాజీ శాసనసభ్యుడు ఎస్ వి ఎస్ ఎన్ వర్మ తీవ్రంగా మండిపడ్డారు. అమరావతికి వ్యతిరేకంగా వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని ఆయన ఖండించారు మంగళవారం పిఠాపురం తెలుగుదేశం కార్యాలయం నందు ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఎస్వీఎస్ఎన్ వర్మ మాట్లాడారు..

జగన్ రెడ్డి ఆయన సతీమణి ఇద్దరు ఉండడానికి లోటస్ పాండ్ లో లక్ష చదరపు అడుగులు, బెంగళూరులో ఎలహంక ప్యాలస్ 30 ఎకరాలు, తాడేపల్లి ప్యాలస్ 87,120 చదరపు అడుగులు, కడపలో రాజ్ భవన్ 10 ఎకరాలు, ఇడుపుల పాయలో 350 ఎకరాలు, చెన్నైలో ప్యాలస్ 8 ఎకరాలు, ముంబాయి ఢిల్లీలో భవనాలు 7 ఎకరాలు, ఇద్దరు సభ్యులు ఉండే జగన్మోహన్ రెడ్డికి ఐదు వందల ఎకరాల పైగా విలాసవంతమైన భవనాలు ప్యాలస్ లు ఉండాలి. కోట్లాది మంది ప్రజలకు అవసరమయ్యే రాజధాని మాత్రం విశాలంగా ఉండకూడదా జగన్ ? ప్రజల ఇచ్చిన అధికారాన్ని అడ్డు పెట్టుకొని అమరావతి విధ్వంసానికి పాల్పడిన జగన్మోహన్ రెడ్డిని ప్రజలు ఇంటిలో కూర్చో బెట్టి 18నెలలు అయిన ఆయన తీరులో ఏటువంటి మార్పు రాలేదని తీవ్రంగా ధ్వజమెత్తారు. 175 నియోజకవర్గాల యువతకు ఉపాధే లక్ష్యంగా అమరావతి నిర్మాణం చేపడుతుంటే జగన్ రెడ్డి మరోసారి తప్పుడు ప్రచారానికి పాల్పడుతున్నాడని తెలిపారు. అమరావతి అభివృద్ధిని మొదటి నుంచి వ్యతిరేకిస్తున్న జగన్మోహన్ రెడ్డి.. నేషనల్ మీడియా సాక్షిగా మరోసారి తన వక్ర బుద్ధిని ప్రదర్శించాడన్నారు. అధికారంలో ఉన్నప్పుడు రాజ్యాంగ వ్యవస్థలను ధ్వంసం చేసిన జగన్. ఇవాళ రాజ్యాంగంలోని పదాలకు సరికొత్త అర్థాలను చెప్పడం హాస్యాస్పదమన్నారు.

అధికారంలో ఉన్నప్పుడు మూడు రాజధానులంటూ ఆటలు ఆడిన జగన్.. ఇప్పుడు అమరావతిపై విష ప్రచారం చేస్తున్నాడు. గతంలో ఇలానే వైసీపీ నాయకులు అనేక కేసులు వస్తే.. కోర్టులు మొట్టి కాయలు పెట్టిన సందర్భాలు మరిచిపోయినట్లు ఉంది.

జగన్ అండ్ కో వారికి అమరావతి అభివృద్ధి కనబడకపోతే బస్సులు పెట్టి తెలుగుదేశం అమరావతి ప్రాంతాన్ని వీక్షణకు తీసుకెళ్తామని వైసిపి శ్రేణులకు బహిరంగ సవాలు విసిరారు.

ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు పట్టణ అధ్యక్షుడు బొజ్జా సతీష్, సకుమళ్ళ గంగాధర్ రావు, బర్ల అప్పారావు, సోము సత్యనారాయణ, అనిశెట్టి సత్యానందరెడ్డి, పిల్లి చిన్న, మడికి ప్రసాద్, దేవరపల్లి రామారావు, అల్లవరపు నగేష్, కోరుప్రోలు శ్రీను, సాన రాంబాబు, పిల్ల సురేష్, అద్దూరి శ్రీను, ఎలుబండి బాబులు, కోలా రాజు, కేతరపు కృష్ణ, వరద సత్తిబాబు, వాసంశెట్టి సూరిబాబు, బండి నాగేంద్ర, నెక్కల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### రామచంద్రపురంలో అంగరంగ వైభవంగా ప్రారంభమైన

# కోనసీమ సంక్రాంతి ఉత్సవ్

- ప్రారంభించిన మంత్రి సుభాష్, ఎంపీ హరీష్, జిల్లా కలెక్టర్ మహేష్, ఎమ్మెల్యేలు
- మూడు రోజులపాటు అలరించనున్న సాంస్కృతిక కార్యక్రమాలు



**రామచంద్రపురం (మనసులో మాట) జనవరి 13..** సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక వి ఎస్ ఎం కళాశాల ప్రాంగణంలో 3 రోజులపాటు 13,14,15 తేదీల్లో నిర్వహిస్తున్న కోనసీమ సంక్రాంతి ఉత్సవ్ -2026 ను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్, జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్, ఎమ్మెల్యేలు వేగుళ్ళ జోగేశ్వరరావు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యంలు, కోనసీమ తెలుగుదేశం పార్టీ కార్యదర్శి గంధం పల్లంరాజు, జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ లు మంగళవారం జ్యోతి ప్రజ్వలన చేసి, బెలూన్ లు గాలిలో ఎగరవేసి ప్రారంభించారు. అనంతరం మంత్రి సుభాష్ మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అంటేనే పచ్చని పైర్లు, కొబ్బరి తోటలు, నిండైన నదులు, సంపన్నమైన సంస్కృతి అని, పంటలు చేతికి అందిన వేళ కోనసీ మలో సంక్రాంతి పండుగను ప్రజలంతా ఐక్యంగా ఎంతో ఆనందకరం జరుపుకోవా లని మంత్రి వాసంశెట్టి శుభాష్ అన్నారు. స్థానిక వి ఎస్ ఎం కళాశాల నందు మన సుభాష్- మన రామచంద్రపురం పేరిట ఏర్పాటుచేసిన సంక్రాంతి సంబరాలను రంగవల్లులు, ఎగ్జిబిషన్ స్టాల్స్ మంత్రి, ఎంపీ, జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలు ఆసక్తిగా పరిశీలించారు. ముగ్గుల పోటీలతో సాంస్కృతి సాంప్ర దాయాలు ఉట్టిపడే విధంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతుల కష్టానికి ఫలితం దక్కే ఈ పండుగ మన సంప్ర దాయాలు ఆచారాలకు ఎంతో ప్రతీక అన్నారు. గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల కీర్తనలు, ముగ్గుల అందాలు, గ్రామీణ క్రీడల ద్వారా కోనసీమ ప్రత్యేకతను చాటా లన్నారు. ఈ సంక్రాంతి ప్రతి కుటుంబానికి ఆరోగ్యం, శాంతి, సుభిక్షం తీసుకురా వాలని ఆకాంక్షిస్తున్నాన న్నారు. ప్రజలందరికీ హృదయపూర్వక సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కలెక్టర్ ప్రసంగిస్తూ ప్రకృతి సోయగాలతో అలరారే కోనసీమలో సంక్రాంతి సంబరాలు మన సంస్కృతి సాంప్రదాయ వైభవం ఉట్టిపడేలా ప్రతి బింబిస్తున్నాయన్నారు. పంటల పండుగగా, ఐక్యతకు ప్రతీకగా నిలిచే ఈ సంక్రాంతి పర్వదినాలు ప్రతి గ్రామం సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని ఆకాం క్షించారు. పర్యావరణ పరిరక్షణకు తోడ్పడే విధంగా, భద్రతా నియ మాలు పాటిస్తూ, ప్రజలం తా ఆనందంగా ఈ పండు గను జరుపుకోవాలని అభిలాషించారు. కోనసీమ ప్రజలందరికీ ఈ సంక్రాంతి కొత్త ఆశలు, కొత్త విజయా లు అందించాలని ఆకాంక్షించారు. కోనసీమ జిల్లా వ్యాప్తంగా లొల్ల లాకులు వద్ద సంక్రాంతి సంబరాలు సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ పడవల డ్రాగన్ పోటీలు మూడు రోజులు చేపట్టా మని చివరి దశగా చేరాయ న్నారు. ఈనెల 14, 15, 16 ఎస్ యానం గోవా కోకో సంక్రాంతి ఉత్సవాలు గోవా తరహాలో వివిధ రకాల పోటీలను నిర్వహించ నున్నట్లు తెలిపారు. ఈనెల 16వ తేదీ జగ్గన్న తోట ప్రభలు తీర్థాన్ని ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటిం చిందని ఈ తీర్థంలో 11 గ్రామాల నుండి ప్రభలు రానున్నట్లు లక్షలాదిమంది ఈ తీర్థంలో పాల్గొంటారని అందుకు తగ్గ ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. ఒక ఎన్ డి ఆర్ ఎఫ్ టీం ను భద్రతా చర్యల కొరకు నియమించడం జరిగిందన్నారు అన్ని పండుగల కన్నా సంక్రాంతి అంటేనే కోనసీమ ప్రజలకు ఎంతో ముఖ్యమైన పండగగా ఆయన అన్నారు. ఎంపీ హరీష్ మాట్లాడుతూ సంస్కృతి సాంప్రదాయాలను నేటి యువతకు పరిచయం చేస్తూ మంత్రి సుభాష్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు భారీ ఎత్తున సంక్రాంతి సంబరాలు నిర్వహించడం ఆనందకరమన్నారు. ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, వేగుళ్ల జోగేశ్వరరావు, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, తెలుగుదేశం పార్టీ కోనసీమ జిల్లా కార్యదర్శి గంధం పల్లంరాజు, ఆర్డిఓ దేవరకొండ అఖిల, డీఎస్పీ రఘువీర్, జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, రేవు శ్రీను తదితరులు మాట్లాడుతూ సంస్కృతి సంప్రదాయాలకు పుట్టినిల్లు మన భారతదేశమని అన్నారు. స్టాల్స్ ప్రదర్శన, రంగవల్లుల ముగ్గులు తెలుగుదనం ఉట్టిపడేలా రూపొందించిన ఫోటో ఎగ్జిబిషన్లో చిత్రీకరించిన ఫోటోలు, హరిదాసులు వేషధారణలు ఆహుతులను అందర్నీ విశేషంగా ఆకట్టుకున్నయన్నారు. టిడిపి పట్టణం ఉపాధ్యక్షులు చందమామ వాసు మంత్రి సుభాష్ పై రూపొందించిన పాటను ఆవిష్కరించారు. ఈ కార్య క్రమంలో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం, జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ పెంకే అన్నపూర్ణ, తాహసిల్దార్ బి మృత్యుంజయరావు, రామచంద్రపురం రామచంద్రపురం రూరల్, కాజులూరు, కే గంగవరం మండలాల టిడిపి అధ్యక్షులు ఉండవల్లి శివ, కొత్తపల్లి శ్రీనుబాబు, చవ్వాకుల నారాయణ మూర్తి, మేడిశెట్టి రవికుమార్ , గరికపాటి సూర్యనారాయణ, కూటమి పార్టీ నాయకులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

### సంక్రాంతి సంబరాలలో మద్యపాన ప్రియులకు

# చేదు కబురు ఇచ్చిన కూటమి సర్కార్




**కాకినాడ (మనసులో మాట) జనవరి 13..** రాష్ట్రంలో మద్యపాన ప్రియులకు చేదు కబురు ఇచ్చిన కూటమి ప్రభుత్వం. సంక్రాంతి జరుపుకోనున్న రాష్ట్ర ప్రజలకు మద్యంపై పది రూపాయలు అదనంగా వసూలు హుకుం చేసేందుకు కూటమి ప్రభుత్వం జారీచేసింది. దీనితో రాష్ట్రమంతటా మద్యం రేట్లపై పది రూపాయల పెరగడంతో రాష్ట్ర ఆదాయానికి సుమారు 1300 కోట్ల రూపాయలు వస్తున్నట్లు అధికార యంత్రాంగం వెల్లడించింది. దీంతో మద్యం ప్రియులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2024లో కూటమి ప్రభుత్వం మద్యం రేట్లు గణనీయంగా తగ్గిస్తామని ఎన్నికలకు ముందు అనేక సభల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్రమంత్రి నారా లోకేష్ , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చి ప్రస్తుతం మద్యంపై అధిక రేట్లు వసూలు చేయడంపై మద్యపాన ప్రియులు వ్యక్తం చేస్తున్నారు. అప్పటి జగన్ సర్కార్ లిక్కర్ రేట్లను గణనీయంగా పెంచడానికి దుమ్మెత్తి పోస్తూ, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ,పాత ధరలకే మద్యం విక్రయాలు జరిపిస్తామని ఆర్భాటంగా హామీ ఇచ్చారు. కానీ అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్, జగన్ ప్రభుత్వంలో పెంచిన మద్యం రేట్లను బాటిల్ కు 20 నుంచి 30 రూపాయలు వరకు తగ్గించింది. ఆరు నెలలు గడవనిచ్చి మళ్ళీ బాటిల్ కి పది రూపాయలు పెంచుతూ జీవో జారీ చేసింది. తర్వాత రాష్ట్రంలోని మద్యం వ్యాపారులందరూ సిండికేట్ అయి క్వార్టర్ మద్యం ఎమ్మార్పీ రేటు పై పది రూపాయలు అధనం గా వసూలు చేసి మద్యపాన ప్రియులను దోచుకోవటం మొదలెట్టారు. దీనిపై ఎందరు ఎన్ని ఫిర్యాదులు చేసినప్పటికీ, అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయం. అధికారులు ముడుపులు తీసుకుని మద్యం సిండికేట్ జోలికి వెళ్లడం లేదని ప్రజల్లో ఒక విశ్వాసం ఉంది. అయితే ఇప్పుడు మళ్లీ కూటమి సర్కార్ మద్యం రేట్లను బాటిల్ పై మరో 10 రూపాయలను పెంచుతూ జీవో జారీ చేసింది. దీంతో మద్యపాన ప్రియులు మరింత షాక్ కు గురయ్యారు. తమ ఆదాయం పెంచుకోవడం కోసం మద్యపానం అలవాటు ఉన్న పేదవారిని, దోచుకోవటం ఎంతవరకు సబవు అని సామాన్యులు ప్రశ్నిస్తున్నారు. లోగడ వైసిపి ప్రభుత్వం ఓడిపోవడానికి గల కారణాల్లో మద్యం రేట్లు విపరీతంగా పెంచడం కూడా ఒక కారణమే. ఆ విషయం కూటమి సర్కార్ విస్మరిస్తోందా? అని కూటమి పార్టీల అభిమానులు అనుకుంటున్నారు. ఈ విధమైన నిర్ణయాలు తీసుకుంటే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలోకూటమి ప్రభుత్వం పై తీవ్ర వ్యతిరేకత పెరుగుతుందని కూటమి నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.




### పేకాట కోడిపందాలు నిర్వహించే వారిపై

# కఠిన చర్యలు...

### - అనపర్తి ఎస్సై తాసిల్దార్ ఎండిఓ

**అనపర్తి (మనసులో మాట) జనవరి 13:** పేకాట,కోడిపందాలు నిర్వహించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, అనపర్తి తహసిల్దార్ డి.వి.ఎన్.అనిల్ కుమార్,ఎండిఓ మండ రామకృష్ణారెడ్డి,అనపర్తి ఎస్సై శ్రీను నాయక్ హెచ్చరించారు. అనపర్తి నాలుగో సచివాలయంలో సోమవారం, అనపర్తి తహసిల్దార్ డివిఎన్ అనిల్, ఎంపీడీవో రామకృష్ణారెడ్డి, ఎస్సై శ్రీను నాయక్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తహసిల్దార్ అనిల్ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై మండల వ్యాప్తంగా ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఎస్సై శ్రీను నాయక్ మాట్లాడుతూ, నిరంతర వాహన తనిఖీలు, గస్తీని ముమ్మరం చేయడం జరిగిందని తెలిపారు. పట్టుబడిన నిందితులపై చట్టపరంగా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని, ఇప్పటికే అధికారులందరికి ఆదేశాలివ్వడం జరిగిందన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి గురించి సమాచారం తెలిస్తే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ లో గానీ,లేదా డయల్ 100 ద్వారా సమాచారం అందించాలని ప్రజలను కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని అన్నారు.

### పీఎంపీల సేవలు

# అభినందనీయం

### - కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు



**కొవ్వూరు (రాజమండ్రి ప్రతినిధి), మనసులో మాట, జనవరి 13:** కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పీఎంపీ అసోసియేషన్) కొవ్వూరు మండలం ఆధ్వర్యంలో సభ్యులు కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చేతుల మీదుగా అవయవదానం, జీవన్ దాన్ అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఈ కరపత్రాలను ఆవిష్కరించడం చాలా శుభదినమని, గ్రామాల్లో పీఎంపీలు అందిస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. ప్రజా ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుక వెళుతున్నందుకు సంఘ పెద్దలను, సంఘ సభ్యులు అందర్నీ అభినందించచారు. జిల్లా అధ్యక్షుడు బళ్ళా శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పీ దేవానందం లు మాట్లాడుతూ గ్రామాల్లో అసోసియేషన్ ద్వారా ఈ ఏడాది అంతా అవయవదానం పై అవగాహన కల్పించడం జరుగుతుందని, దీనిలో భాగంగా సోమవారం స్థానిక ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావును కలవడం తద్వారా ఈ నియోజకవర్గంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పోతుల సత్య వర ప్రసాద్, కార్యదర్శి పాండ్రాకుల వీర వెంకట సత్యనారాయణ, కోశాధికారి పేరూరి శంకరం, రవి, ప్రసాద్, సత్యనారాయణ మూర్తి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాద బాధితులకు ఆపన్న హస్తం

### అందించిన వరుపుల సత్యప్రభ, ముద్రగడ గిరిబాబు



**రౌతులపూడి, (మనసులో మాట) జనవరి 13:** మండలంలోని ఉపప్రణాళిక ప్రాంతమైన రాఘవపట్నం గ్రామపంచాయతీలో ఉన్న సార్లంక గ్రామంలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాద బాధితులకు ప్రత్తిపాడు నియోజకవర్గ శాసన సభ్యురాలు వరుపుల సత్య ప్రభ ఆధ్వర్యంలో సహాయక చర్యలు ముమ్మరం చేశారు. అగ్ని ప్రమాదంలో 23 గృహాలకు సంబంధించి 33 కుటుంబాలకు దుప్పట్లు రగ్గులు మరియు ప్రభుత్వం అందించిన 25 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని బాధితులకు అందజేశారు ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త మేడిశెట్టి సూర్య కిరణ్, తుని బ్లాక్ ఆత్మ కమిటీ వైస్ చైర్మన్ కరణం సుబ్రహ్మణ్యం, తెలుగుదేశం నియోజకవర్గ నాయకులు యాళ్ల జగదీష్, జట్ల రాజా, కత్తిపూడి బుచ్చి సీతయ్యమ్మ సత్రం చైర్మన్ చంద్రమౌళి, రౌతులపూడి ఎంపీపీ గంటి మల్ల రాజలక్ష్మి, మాజీ ఎంపీపీ ఇట్టం శెట్టి భాస్కర బాబు, పైల వేణుగోపాల్, జనసేన నాయకులు జయ గంట, శరణం జయబాబు, తలపంటి బుజ్జి పాల్గొన్నారు.

**ముద్రగడ గిరిబాబు చేయూత :**

ప్రతిపాడు నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ కన్వీనర్ ముద్రగడ గిరిబాబు ఆధ్వర్యంలో అగ్ని ప్రమాద బాధితులకు నిత్యవసర సరుకులు మరియు దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ సార్లంక గ్రామంలో జరిగిన ఈ అగ్ని ప్రమాదం సంఘటన విని హృదయం అల్లాడిందని ఇది చాలా బాధాకరమైన విషయమని గిరిబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి జమీల్, రౌతులపూడి జడ్పిటిసి గొల్లు చిన్న దివానం, రౌతులపూడి ఉప సర్పంచ్ వాసిరెడ్డి భాస్కర్ బాబు, బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గొల్లు వెంకటరమణ, సోమరౌతు వివేక్ కీర్తి, కేదార్ శెట్టి నాగేశ్వరరావు, రాపర్తి రామకృష్ణ పాల్గొన్నారు



### ఇన్-స్పేస్ ట్రైనింగ్ కు హాజరైన

# డాక్టర్ శీలం రాజ్యలక్ష్మి

**రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 13:** ఆదికవి నన్నయ్య విశ్వ విద్యాలయం రాజమహేంద్రవరానికి చెందిన ఫిజిక్స్ విభాగాధిపతి డాక్టర్ శీలం రాజ్యలక్ష్మి భారత ప్రభుత్వ అంతరిక్ష శాఖకు చెందిన ఇన్-స్పేస్ (ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ అథారిజషన్ సెంటర్) ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిష్ఠాత్మక తక్కువకాల శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. ఇన్ స్పేస్ నిర్వహించిన "ఫౌండేషన్ అఫ్ మిషన్ డిజైన్ అండ్ ఏవియానిక్స్ డెవలప్‌మెంట్ ఫర్ లాంచ్ వెహికల్" అనే శిక్షణా కోర్సు 2026 జనవరి 4 నుండి 9 వరకు బెంగళూరులోని ఇస్రో గెస్ట్ హౌస్, దేవనహళ్లిలో జరిగింది. ఈ కోర్సు ద్వారా లాంచ్ వెహికల్ డిజైన్, మిషన్ ప్లానింగ్, అవియానిక్స్ అభివృద్ధి, గైడెన్స్- నావిగేషన్-కంట్రోల్ (జీఎన్సీ), టెలిమెట్రీ, ట్రాకింగ్, కమాండ్ వ్యవస్థలపై విస్తృత అవగాహన కల్పించారని రాజ్యలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఇన్-స్పేస్ డైరెక్టర్ (ప్రమోషన్) డాక్టర్ వినోద్ కుమార్ డాక్టర్ శీలం రాజ్యలక్ష్మికి సర్టిఫికెట్ ప్రదానం చేశారు. ఈ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా విశ్వ విద్యాలయ వైస్-చాన్సలర్ ప్రొఫెసర్ సాతుపాటి ప్రసన్నశ్రీ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కేవీ స్వామి, ప్రిన్సిపాల్ డాక్టర్ పీ విజయ నిర్మల ఆమెను హృదయపూర్వకంగా అభినందించారు.

# హిందూ మతం విశిష్టతను చాటిచెప్పిన వివేకానంద

### - కంబాల శ్రీనివాసరావు





**గోకవరం (మనసులో మాట), జనవరి 13:** హిందూ మతం విశిష్టతను, వైభవాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటి చెప్పి, చిన్న వయసులోనే పేరు, ప్రఖ్యాతలు ఆర్జించిన ధన్యజీవి స్వామి వివేకానంద అని విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు, భారతీయ జనతాపార్టీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రమైన గోకవరంలోని తంటికొండ రోడ్డులోని సీఎండీ లే అవుట్లో కంబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్వామి వివేకానందుని జయంతి ఘనంగా నిర్వహించారు. అలాగే వివేకానందుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కంబాల మాట్లాడుతూ వివేకానందుని దేశభక్తి భారత గడ్డపై పుట్టిన ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. భారతదేశ గొప్పతనాన్ని ప్రపంచ దేశాలకు చాటి చెప్పి, భారత్ ను ప్రపంచ దేశాలు గుర్తించేలా చేసిన మహోన్నతమైన వ్యక్తి స్వామి వివేకానంద అన్నారు. 39 ఏళ్ల స్వల్పకాలంలోనే యావత్ ప్రపంచాన్ని తన జ్ఞానంతో ప్రభావితం చేసిన మేధావి స్వామి వివేకానంద అని, వివేకానందుని ఆశయాల సాధనే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని కంబాల శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు వరసాల ప్రసాద్, దాసరి ధర్మరాజు, బత్తుల నానాజీ, కంబాల యువసేన అధ్యక్షుడు ఉంగరాల మణిరత్నం, పెద్దాడ వెంకన్న దొర, గణేష్, నరేష్, దోసపాటి సుబ్బారావు, తాటికొండ సురేష్, మండల సోషల్ మీడియా కన్వీనర్ మణికంఠ, మందపాటి సతీష్, దుర్గారావు, సిబ్బంది పాల్గొన్నారు

### డ్రాగన్ పడవల పోటీలతో ఈ ప్రాంతంలో

# టూరిజం అభివృద్ధి వేగవంతం

### హోం మంత్రి వంగలపూడి అనిత, మంత్రులు కందుల దుర్గేష్, కొండపల్లి శ్రీనివాస్







**కొత్తపేట (మనసులో మాట) జనవరి 13..** ఆత్రేయపురం ఉత్సవం సంక్రాంతి సంబరాలతో కోనసీమకు మకర సంక్రాంతి మూడు రోజుల ముందే వచ్చిందని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర హోం శాఖ మాత్యులు వంగలపూడి అనిత వ్యాఖ్యానించారు. మంగళవారం లొల్లలాకుల వద్ద ఏర్పాటుచేసిన ఫుడ్ ఫెస్టివల్, ఎగ్జిబిషన్ లను పరిశీలించారు. అనంతరం డ్రాగన్ పడవల సెమీఫైనల్స్ పోటీలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా హోం మంత్రి మాట్లాడుతూ కేరళ మించిన అందాలు కోనసీమలో ఉన్నాయని ఆత్రేయపురం ఉత్సవం ప్రపంచానికి చాటిందని తెలిపారు. ఆత్రేయపురం పూతరేకులకు ప్రసిద్ధి అని చిన్న గ్రామం అయినా పూతరేకులతో తెలుగు సంస్కృతిలో ప్రత్యేక స్థానం సాధించిందని, దేశవ్యాప్తంగా పేరు ప్రఖ్యాతులు పొందిందని అన్నారు. ఈ ప్రాంతమంతా టెంపుల్ టూరిజం, ఎకో టూరిజం అభివృద్ధికి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు విశేషంగా కృషి చేస్తున్నారని తెలిపారు. వాడపల్లి వెంకటేశ్వర స్వామి వైభవంతో ఈ ప్రాంతమంతా అభివృద్ధి చెందుతుందని, టూరిజం అభివృద్ధికి అన్ని విధాల సహకరిస్తామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. లొల్ల లాకుల వద్ద శాశ్వతంగా టూరిజం అభివృద్ధికి కావలసిన కార్యక్రమాలు చేపట్టాలన్న ఆలోచనలకు సహకరిస్తామన్నారు. టూరిజం అభివృద్ధి చెందితే స్థానికులకు ఉపాధి లభిస్తుందని, యువతకు ఉద్యోగాలు వస్తాయని అన్నారు. కేరళలోనే కాకుండా కోనసీమలో సైతం పడవల పోటీలు అద్భుతంగా నిర్వహించవచ్చని ఈ ఉత్సవాల ద్వారా అందరికీ తెలిసిందన్నారు. సంక్రాంతి సంబరాలకు కోనసీమకు రావడం ఆనందంగా ఉందని, టూరిజం అభివృద్ధికి ఇక్కడ అన్ని అవకాశాలు ఉన్నాయని రాష్ట్ర ఎంఎస్ఎమ్ఈ, సెర్ప్, ఎన్నారై సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. అనంతరం హోంమంత్రి వంగలపూడి అనిత గాలిపటాలను ఎగురవేసి గాలిపటాల పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీ హరీష్ మాధుర్, ఎమ్మెల్యేలు వేగుళ్ళ జోగేశ్వరరావు ,దాట్ల బుచ్చిరాజు, రాజోలు తెదేపా ఇన్చార్జి గొల్లపల్లి అమూల్య, జిల్లా ఎస్పీ రాహుల్ మీనా తదితరులు పాల్గొన్నారు.

### సంక్రాంతి సంబరాల్లో భాగంగా..

# జిల్లా స్థాయిలో సంప్రదాయ క్రీడా పోటీలు

**- జిల్లా క్రీడా సాధికారిక అధికారి డీఎం ఎం శేషగిరి**

**- పిల్లల్లో శారీరక దారుఢ్యం, మానసిక పరిపక్వతకు గ్రామీణ క్రీడలు అవసరం : మెప్మా పీడీ టీ కనక రాజు**





**రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 13:** రాష్ట్ర ప్రభుత్వం సంప్రదాయ క్రీడలను ప్రోత్సహించే దిశగా సంక్రాంతి పండుగ సందర్భంగా "సంక్రాంతి సంబరాలు" నిర్వహించాలని జారీ చేసిన ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో వివిధ సంప్రదాయ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడా సాధికారిక అధికారి డీఎంఎం శేషగిరి తెలిపారు. మంగళవారం స్థానిక ఎస్కేవీటీ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో మెప్మా క్రీడా సాధికారిక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో కర్ర సాము, కత్తి సాము, కర్ర బిళ్ళ, ఏడు పెంకుల ఆట, గాలిపటాల ఎగరేవేత, స్కిప్పింగ్, టగ్ ఆఫ్ వార్ తదితర సంప్రదాయ క్రీడా పోటీలను నిర్వహించారు. భోగి మంటలు వేసి సంక్రాంతి పండుగ శోభను తీసుకువచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మెప్మా పీడీ టీ కనక రాజు మాట్లాడుతూ చిన్న పిల్లల్లో సహజంగా ఉన్న క్రీడా ఆసక్తిని గుర్తించి ప్రోత్సహించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం సమిష్టిగా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామీణ క్రీడలు ఆడటం వల్ల పిల్లల్లో సృజనాత్మకత పెరగడమే కాకుండా, ఓటమిని స్వీకరించి గెలుపు వైపు ప్రయాణించే మానసిక పరిపక్వత కూడా అలవడుతుందన్నారు. నేటి ఆధునిక కాలంలో అనేక ప్రైవేట్ పాఠశాలల్లో క్రీడా మైదానాల లేమి కారణంగా పిల్లలు తరగతి గదులకే పరిమితమవుతున్నారని, వందకి ఒకటి రెండు మార్కులు తగ్గినా పిల్లలను ప్రశ్నించే తత్వం నుంచి తల్లిదండ్రులు బయటికి రావాలని సూచించారు. పిల్లలకు మరింత ప్రోత్సాహం అందించే విధంగా తల్లిదండ్రులు, సంరక్షకులు ప్రవర్తించాల్సిన అవసరం ఉందన్నారు. మన గ్రామీణ సంస్కృతిలో భాగమైన సంప్రదాయ క్రీడల్లో పిల్లలను పాల్గొనేలా ప్రోత్సహించాలని కోరారు. "ప్రతి ఒక్కరికీ తల్లి లాంటిది పల్లె" అని అభివర్ణించిన ఆయన, ప్రతి ఒక్కరూ క్రీడలు ఆడటం ద్వారా శారీరక దారుఢ్యంతో పాటు మానసిక పరిపక్వతను సాధించగలరన్నారు. చిన్న చిన్న సంఘటనలు, ఓటములను తట్టుకునే స్థాయి లేకపోవడం వల్ల చిన్నపిల్లలు ఆత్మహత్యలకు పాల్పడుతున్న సంఘటనలు చూస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రోజు ఇక్కడ జరుగుతున్న క్రీడలను చూస్తుంటే తన చిన్నతనం మరోసారి గుర్తుకు వచ్చిందని తెలిపారు. గ్రామీణ క్రీడలు ఆడటం వల్ల శారీరకంగా ఎంతో దృఢంగా ఉండేవారమని గుర్తు చేశారు. ఈ సందర్భంగా జిల్లా క్రీడా సాధికారిక అధికారి డీఎంఎం శేషగిరి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని మన సంప్రదాయ క్రీడలను ప్రోత్సహించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం సంక్రాంతి సంబరాలను చేపట్టడం అభినందనీయమన్నారు. అంతరించిపోతున్న సంప్రదాయ క్రీడలకు తిరిగి గుర్తింపు తీసుకురావాలనే ఉద్దేశంతో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం ప్రశంసనీయం అన్నారు. తొక్కుడు బిళ్ళ, తాళ్ల ఆట (టగ్ ఆఫ్ వార్), కర్ర బిళ్ళ, కత్తి సాము, కర్ర సాము, గోటి బిళ్ళ, గాలిపటాలు, స్కిప్పింగ్ వంటి క్రీడల్లో పిల్లలు, తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొనడం ఆనందకరమన్నారు. ఈ క్రీడలను పిల్లలకు అలవాటు చేయడంతో పాటు, వాటి వల్ల కలిగే ప్రయోజనాలను కూడా వివరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాచీన క్రీడలు కేవలం అమ్మవారి జాతర్లకే పరిమితం అవుతున్న పరిస్థితి ఉందని, వాటికి తగిన గుర్తింపు, ప్రోత్సాహం అందించే బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. సంక్రాంతి సంబరాలు క్రీడా పోటీలలో విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రజలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## కాకినాడ బార్ అసోసియేషన్ మహిళా న్యాయవాదులకు ముగ్గుల పోటీలు




**కాకినాడ (మనసులో మాట) జనవరి 13..** కాకినాడ బార్ అసోసియేషన్ లో సంక్రాంతిను పురస్కరించుకుని మహిళా న్యాయవాదులకు ముగ్గుల పోటీలు మంగళవారం నిర్వహించారు. బార్ అసోసియేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మహిళా న్యాయవాదులు ఉత్సాహంగా పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలుగా కాకినాడ జిల్లా మహిళా న్యాయమూర్తులు వి.సాహితీ, ఏ నాగమల్లేశ్వరి, ఎస్.కె షరీన్ వ్యవహరించారు. మహిళలు పెట్టిన ముగ్గులను గమనించి విజేతలను ప్రకటించారు. మొదటి బహుమతి పుట్ట మహాలక్ష్మి, రెండవ బహుమతి గీతిక అండ్ టీం, మూడో బహుమతి సునీత అండ్ టీం దక్కించుకున్నారు. వీరందరికీ కాకినాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలూరి సుబ్రహ్మణ్యం , జిల్లా మహిళ న్యాయమూర్తులు చేతుల మీదుగా బహుమతులు విజేతలకు అందజేశారు. మంగళవారం ఉదయం నుంచి కమిటీ సభ్యులు దగ్గరుండి ముగ్గుల పోటీలు నిర్వహించడంలో ప్రత్యేక శ్రద్ధ చూపించారు.

## జగ్గంపేటలో ఘనంగా మెల్విన్ జోన్స్ జయంతి వేడుకలు



**జగ్గంపేట (మనసులో మాట) జనవరి 13..** లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపక అధ్యక్షుడు మెల్విన్ జోన్స్ జయంతి వేడుకలను లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జగ్గంపేట లైన్స్ కంటి ఆసుపత్రి ఆవరణలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఫౌండర్ మెల్విన్ జోన్స్ విగ్రహానికి లైన్స్ క్లబ్స్ చైర్మన్ కొత్త వెంకటేశ్వరరావు (కొండబాబు) పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసిన లైన్స్ డిస్టిక్ చైర్మన్ కొత్త కొండబాబు ఈసందర్భంగా ఆయనమాట్లాడుతూ మెల్విన్ జోన్స్ లైన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఏర్పాటు చేసి ప్రపంచవ్యాప్తంగా 210 దేశాలలో 14 లక్షల సభ్యులు గల ఏకైక సంస్థ లైన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ సంస్థ భారతదేశంలో 487 డిస్టిక్ సంస్థ ఉన్నాయనిమెల్విన్ జోన్స్ స్ఫూర్తి తో జగ్గంపేటలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లైన్స్ కంటి ఆసుపత్రి డాక్టర్ దయానా వేములపల్లి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



### రామవరంలో వెంకాయమ్మ, కృష్ణారెడ్డి లను పరామర్శించిన

# రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్

**అనపర్తి (మనసులో మాట) జనవరి 13:** ఇటీవల గుండెకు స్టెంట్ వేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, తూర్పుగోదావరి జిల్లా వైయస్ఆర్‌సీపీ అధికార ప్రతినిధి సబ్బెళ్ళ కృష్ణారెడ్డి ని, అలాగే ఇటీవల అనారోగ్యానికి గురైన రామవరం గ్రామ మాజీ సర్పంచ్ శ్రీమతి సత్తి వెంకాయమ్మ ని (స్వర్గీయ సత్తి వీర్రెడ్డి భార్య) వైయస్ఆర్‌సీపీ సీనియర్ నాయకులు, ఆంధ్రప్రదేశ్ మాజీ ఉప ముఖ్యమంత్రి, మాజీ మంత్రివర్యులు, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ మంగళవారం రామవరంలో పరామర్శించారు. ఈ సందర్భంగా వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రాయవరం మాజీ ఎంపీపీ కోట వెంకట్రావు, రామచంద్రపురం మున్సిపల్ కౌన్సిలర్ శీలం గంగరాజు, ప్రముఖ వాస్తు నిపుణులు, వైయస్ఆర్‌సీపీ నాయకులు మేడపాటి శేషారెడ్డి, అనపర్తి మండల వైయస్ఆర్‌సీపీ అధికార ప్రతినిధి నల్లమిల్లి వెంకటరెడ్డి, వైయస్ఆర్‌సీపీ బీసీ విభాగం నాయకులు మురముళ్ళ చిన్న వెంకటరావు, పార్టీ గ్రామ కమిటీ నాయకులు నల్లమిల్లి అచ్చిరెడ్డి పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాద బాధితులను పరామర్శించిన ఎంపీ తంగళ్ళ ఉదయ్ శ్రీనివాస్



**రౌతులపూడి, (మనసులో మాట) జనవరి 13:** మండలంలోని సార్లంక అగ్ని ప్రమాద బాధితులను కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగళ్ళ ఉదయ శ్రీనివాస్ ప్రత్తిపాడు నియోజవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త మేడిశెట్టి సూర్యకిరణ్ తో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధితుల కుటుంబాలకు ఎమ్మెల్యే వరుపు ల సత్య ప్రభ రాజా తో కలిసి 33 కుటుంబాలకు 25 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ ఉదయ శ్రీనివాస్ మాట్లాడుతూ అగ్ని ప్రమాద సంఘటన గురించి తెలిసిన వెంటనే సహాయక చర్యలు ప్రారంభించిన ప్రతిపాడు నియోజకవర్గ శాసన సభ్యురాలు వరుపుల సత్య ప్రభ రాజాకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని ఉదయ్ శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు తలపంటి బుజ్జి, శరణం జయబాబు, జయ గంట, వినోద్, షేక్ సలీమ్, పెద్దాపురం డివిజన్ ఆర్డిఓ శ్రీరమణి, రౌతులపూడి తహసీల్దార్ ఎస్ వి నరేష్, ఎంపీడీవో శివరామకృష్ణయ్య, ఐసిడిఎస్ నాగమణి, మరియు అధికారులు నాయకులు పాల్గొన్నారు.

## సంక్రాంతికి గ్రామాలు పరిశుభ్రంగా ఉంచండి



**గండేపల్లి (మనసులో మాట) జనవరి 13..** సంక్రాంతి పండుగకి గ్రామాలు పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీవో హరికృష్ణ సత్య రెడ్డి అన్నారు. గండేపల్లి మండలం జెడ్ రాగంపేట గ్రామంలో మంగళవారం పర్యటించి పంచాయతీ పారిశుద్ధ సిబ్బందితో గ్రామంలో ఉన్న చెత్తాచెదారాన్ని శుభ్రపరిచి పంచాయతీ వాహనం ద్వారా సంపద కేంద్రాలకు తరలించే చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతికి దూర ప్రాంతాలకు ఉద్యోగ ఉపాధి నిమిత్తం వెళ్లేవారు సొంత గ్రామానికి వస్తారని గ్రామాలన్నీ పరిశుభ్రంగా ఉంచాలని వారి పంచాయతీ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమం లో కార్యదర్శి తరంగిణి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆదిత్యలో ఆంధ్ర బెటాలియన్ ఎన్సిసి శిబిరం



**గండేపల్లి (మనసులో మాట జనవరి) 13..** గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ లో 18వ ఆంధ్ర బెటాలియన్ ఎన్సి సి శిబిరంలో మేజర్ మహమ్మద్ ఆసిఫ్ అలీ ఆధ్వర్యంలో ఐదవ రోజు ఎన్సిసి కేడెట్ల జ్ఞానాన్ని పెంపొందించడానికి మరియు తక్షణ స్పందన పట్ల వారి ఉత్సాహాన్ని ప్రోత్సహించడానికి అగ్నిమాపక శాఖ ద్వారా ఒక లెక్చర్‌కమ్‌డెమోన్స్ట్రేషన్ నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక చర్యలు మరియు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు.ఈ సెషన్ ఎంతో సమాచారాత్మకంగా మరియు ప్రాయోగికంగా సాగింది.తరువాత పెద్దాపురంకి చెందిన డా విజయలక్ష్మి ద్వారా హైజీన్ మరియు శానిటేషన్ పై ఒక ప్రత్యేక ఉపన్యాసం నిర్వహించబడింది.క్యాంప్ రోజువారీ కార్యక్రమంలో భాగశీ గా, క్రమశిక్షణ మరియు శారీరక దృఢత్వాన్ని పెంపొందించేందుకు ఉదయం ఫిజికల్ ట్రైనింగ్ మరియు ఫైరింగ్, అలాగే వాలీబాల్,ఖో-ఖో వంటి క్రీడలు మరియు సాయంత్రం వినోద కార్యక్రమాలునిర్వహించబడ్డాయని సుబేదార్ మేజర్ శ్రీనివాసరావు తెలిపారు.



### రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు జిల్లాలో నేటి నుండి 18 వ తేదీ వరకు ఎటువంటి జంతు హింస జూద కార్యక్రమాల నిర్వహించిన

# కఠిన చర్యలు

### కాకినాడ జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ అపూర్వ భరత్

**కాకినాడ (మనసులో మాట) జనవరి 13..** రాష్ట్రంలో సంక్రాంతి పండుగలు సందర్భంగా కోడిపందాలను ఖచ్చితంగా నిషేధించాలన్న రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాలకు అనుగుణంగా జిల్లా లో అధికార యంత్రాంగం సమర్ధవంతమైన సమన్వయం, పర్యవేక్షణ సత్వర ప్రతిస్పందనను నిర్ధారించడానికి జనవరి 13 వ తేది నుండి 18 వ తేది వరకు కలెక్టరేట్, కాకినాడలో జిల్లా స్థాయి కంట్రోల్ రూమ్ (0884 - 2356801)ను ఏర్పాటు చేస్తూ ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ అపూర్వ భరత్ ఉత్తర్వులు జారీ చేశారు.

జిల్లా స్థాయి కంట్రోల్ రూమ్ సమాచారం ఫిర్యాదులను స్వీకరించడం, ఉమ్మడి తనిఖీ బృందాలు క్షేత్ర అధికారులతో సమన్వయం చేసుకోవడం సంబంధిత విభాగాలు తక్షణ చర్య తీసుకునేలా చూసుకోవడం వంటి బాధ్యతలను కలిగి ఉంటుందన్నారు. కంట్రోల్ రూమ్‌ను రెవెన్యూ, పోలీసు పశుసంవర్ధక శాఖల అధికారులు సిబ్బంది

కోడి పందాల నిర్వహణకు సంబంధించిన సమాచారం, ఫిర్యాదులు ఇన్‌పుట్‌లను స్వీకరించి అటువంటి సమాచారాన్ని సంబంధిత తహశీల్దార్లు, స్టేషన్ హౌస్ అధికారులు, జాయింట్ ఇన్స్పెక్షన్ బృందాలు డిపార్ట్‌మెంటల్ అధికారులకు సత్వర చర్య కోసం వెంటనే తెలియజేయాలన్నారు.

క్షేత్రస్థాయి అధికారులు తీసుకున్న ప్రతిస్పందన చర్యలను పర్యవేక్షిస్తు,తదుపరి చర్యలను తీసుకోవాలన్నారు.

ఫిర్యాదు సమాచార రిజిస్టర్, తీసుకున్న చర్య రిజిస్టర్ సమన్వయ లాగ్‌ను నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.రోజువారీ ఏకీకృత నివేదికను జిల్లా కలెక్టర్ వారికి కు సమర్పించాలని ఆదేశించారు.కాకినాడ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ జాయింట్ డైరెక్టర్, పశు సంవర్ధక శాఖ కాకినాడ జిల్లా రెవెన్యూ డివిజనల్ అధికారులు తహశీల్దార్లు స్టేషన్ హౌస్ అధికారులు కంట్రోల్ రూమ్‌తో సజావుగా సమన్వయం చేసుకుని, కంట్రోల్ రూమ్ ద్వారా అందే సమాచారం ఫిర్యాదులను సత్వరమే పాటించేలా చూడాలన్నారు.కంట్రోల్ రూమ్ నుండి అందిన సమాచారానికి ప్రతిస్పందించడంలో లేదా క్షేత్రస్థాయి మద్దతును అందించడంలో ఏదైనా లోపం, ఆలస్యం లేదా నిర్లక్ష్యం జరిగితే దానిని తీవ్రంగా పరిగణించి నిబంధనల ప్రకారం క్రమశిక్షణా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ అపూర్వ భరత్ ఈ సందర్భంగా హెచ్చరించారు.

### మన శంకర వరప్రసాద్ పండక్కి

# సూపర్ హిట్ ఇచ్చారు..

- చిరంజీవి కామెడీ టైమింగ్స్ డాన్స్ అదుర్స్
- థియేటర్ల వద్ద ఫ్యామిలీ యూత్ ముందస్తు సంక్రాంతి సంబరాలు...
- ఉమ్మడి గోదావరి జిల్లాల సీనియర్ జనసేన నాయకుడు శ్రీనివాస్ బాబు



**కాకినాడ ( మనసులో మాట) జనవరి 13..** మన శంకర వరప్రసాద్ పండక్కి సూపర్ హిట్ ఇచ్చారని, బాక్సాఫీస్ మెగాస్టార్ చిరంజీవి షేక్ చేశారని కాకినాడ రూరల్ చిరంజీవి అభిమాన సంఘాల నాయకుడు రాధా రంగా ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు సీనియర్ జనసేన నాయకులు సలాది శ్రీనివాస్ బాబు మంగళవారం అన్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో మెగాస్టార్ చిరంజీవి నయనతార జంటగా నటించిన యూత్ ఫుల్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ మన శంకర వరప్రసాద్ చిత్రం విడుదల సందర్భంగా మొదటి ఆటతోనే సూపర్ హిట్ టాక్ కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా కాకినాడ వాకలపూడి సూర్య మాక్స్ థియేటర్ వద్ద చిత్రం చూసిన సలాది శ్రీనివాస్ బాబు అండ్ ఫ్రెండ్స్ సర్కిల్ మీడియాతో మాట్లాడుతూ ఈ చిత్రంలో చిరంజీవి డైలాగ్స్ కామెడీ టైమింగ్స్ అదుర్స్ అని, 70 లో కూడా 25 లా ఉన్నారని, చిరు నడక, డాన్సులో గ్రేస్ ఎక్కడా తగ్గేదేలే అనే విధంగా నటించారని ఈ చిత్రం ఈ సంక్రాంతికి సూపర్ డూపర్ హిట్ గా నిలుస్తుందని ఆనందం వ్యక్తం చేశారు. థియేటర్ల వద్ద ఫ్యామిలీ యూత్ కేరింతలు తో ముందుగానే సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు.

# పచ్చని కోనసీమను సర్వనాశనం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

- కేజీ బేసిన్ సంపదలో 50 శాతం తక్షణమే అమలు చేయాలి
- ఓఎన్ జీసీ కేంద్ర కార్యాలయాన్ని చెన్నై నుండి రాజమండ్రికి తరలించండి
- ఓఎన్ జీసీ ఉద్యోగాల్లో ఆంధ్రప్రదేశ్ యువతకు 50 శాతం రిజర్వేషన్ అమలు చేయండి
- ఆర్పీసీ వ్యవస్థాపక అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ డిమాండు



**రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 13:** ఆంధ్రప్రదేశ్ లో వంట గ్యాస్ సిలెండర్ ను రూ.200 లకే సరఫరా చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (ఆర్పీసీ) వ్యవస్థాపక అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ డిమాండు చేశారు. నగరంలోని ఆ పార్టీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ఆర్పీసీ వారాంతపు సమావేశంలో మేడా శ్రీనివాస్ మాట్లాడారు. గతంలో పాశర్లపూడి బ్లో ఓట్, నగరం లో అగ్నికి ఆహుతై ప్రాణాలు కోల్పోయిన ఘటన, నేడు ఇరుసుమండలో మరో బ్లో ఔట్.. ఇలా పచ్చని కోనసీమ ను కేంద్ర రాష్ట్ర రాజకీయ అవసరాలకు, అవినీతి దాహానికి సర్వనాశనం చేస్తున్నారని మండిపడ్డారు. కోనసీమ నుండి లక్షల కోట్లు విలువ చేసే సంపదను దోచుకు పోతున్నారని ఆరోపించారు. కోనసీమ ప్రాంతం మొత్తం పర్యావరణాన్ని విషతుల్యంగా మార్చేస్తున్నారన్నారు. గాలి, నీరు కలుషితమయ్యి ఆ ప్రాంత ప్రజలు తీవ్రమైన అనారోగ్య సమస్యలతో నిత్యం బాధలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇరుసుమండలో 100 అడుగుల దాటి ఎగసిపడిన అగ్ని కీలలను చూసి ప్రజలు భయాందోళనలతో తమ బిడ్డలను పుచ్చుకుని పరుగులు పెట్టారని, నిజానికి తరచూ ఈ ప్రమాదాల వెనుక ఒక పెద్ద మాఫియా ప్రమేయం దాగి వుందనే అనుమానాన్ని మేడా వ్యక్తం చేశారు. అధికారులు, ప్రైవేట్ మాఫియా వ్యక్తులు కలసి దోచుకునే ప్రయత్నంలో భాగమే ఈ తరహా ప్రమాదాలకు కారణాలు కావొచ్చునని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. 12 వ ఆర్థిక సంఘం సిఫార్సు మేరకు కేజీ బేసిన్ సంపదలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి 50 శాతం వాటాను కేటాయించమని స్పష్టమైన ఆంక్షలు ఉన్నప్పటికీ, అనాదిగా ఆంధ్రప్రదేశ్ కు అన్యాయం జరుగుతూనే ఉందన్నారు. ఆంధ్రుల హక్కు కోసం ఆంధ్రప్రదేశ్ నుండి పార్లమెంట్ లో ప్రశ్నించే దమ్మున్న పార్లమెంటేరియన్ లేకపోవటం ఆంధ్రులు దురదృష్టం అని వ్యాఖ్యానించారు. నాటి నుండి నేటి వరకు కోనసీమ ప్రాంతం నుండి అసెంబ్లీ, పార్లమెంట్ కు ఎంపికైన ఏ ఒక్క ప్రజాప్రతినిధి ఈ ప్రాంత అభివృద్ధి కోసం, హక్కుల కోసం ప్రశ్నించిన నేతలు కోనసీమ నుండి లేరన్నారు. ప్రమాదం జరిగిన తదుపరి సొల్లు ప్రకటనలతో ప్రజలను మభ్య పెట్టడమే ఈ నేతల కాలక్షేప రాజకీయాలన్నారు. కేజీ బేసిన్ అవినీతిలో గల అధికారులు, ప్రైవేట్ మాఫియా సైన్యం ఇక్కడ ఖనిజ ముడిసరుకులో మత్తు భాగస్వాలుగా కొనసాగుతున్నారని ఆరోపించారు. కోనసీమను అగ్ని గుండంగా మార్చటమే ఈ ప్రైవేట్ మాఫియా ప్రధాన కుట్ర అని, కోనసీమ ప్రాంతానికి అత్యంత ప్రమాదం పొంచి వుందని నిపుణులు గుర్తించాలని మేడా శ్రీనివాస్ హెచ్చరించారు. కోనసీమ నుండి నేటి వరకు చట్ట సభల్లో ప్రాతినిధ్యం వహించిన కార్పొరేట్ వ్యాపార రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు అవినీతికి బానిసలుగా మారిపోయారన్నారు. అభివృద్ధిని, ప్రజల భవిష్యత్తును, భద్రతను గాలికి వదిలి అవినీతి మత్తులో జోగుతు దద్దమ్మలు వలే వారి ఉనికిని చాటుకుంటున్నారన్నారని మండిపడ్డారు. అధికార దుర్వినియోగం, నేతల అవినీతి, ప్రైవేట్ మాఫియా కేజీ బేసిన్ అక్రమాలను శాసిస్తున్నాయన్నారు. కోనసీమ భూ గర్భం నుండి బంగారం పట్టుకు పోతున్నారని, ఆ ప్రాంతానికి మాత్రం బూడిద కూడా మిగల్చటం లేదన్నారు. ప్రమాదకరమైన కాలుష్యంతో కోనసీమ ప్రజలను అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయని, ఆ కారణంగా మరణాలు సంబవిస్తున్నాయని మేడా తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

బావుల్లో గ్యాస్, క్రూడాయిల్ నిల్వలు వేల కోట్ల విలువైన సంపద ఉన్నప్పటికీ, బావులు ఖాళీ అయిపోయినట్టు అవినీతి అధికారులు తప్పుడు నివేదికలు సమర్పిస్తున్నారని, నిబంధనలకు విరుద్ధంగా త్రవ్వకాలు సాగిస్తుండటమే ఈ తరహా ప్రమాదాలకు కారణమన్నారు. ప్రైవేట్ మాఫియా రెచ్చిపోతు కోనసీమ ప్రమాదాలకు కారకులవుతున్నారని ధ్వజమెత్తారు. కేజీ బేసిన్ త్రవ్వకాల కారణంగా కోనసీమ నష్టపోతోందని, నేతలు అక్రమార్జనతో వందల కోట్లు దోచుకుంటున్నారని, కేజీ బేసిన్ నుండి భారీగా సంపదను తరలించుకు పోతున్నారన్నారు. ఆ సంస్థ కార్యాలయాలు మాత్రం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో కాకుండా చెన్నై లో పాలనా కార్యాలయం ఉండటం విడ్డూరమని, ప్రమాదాలు జరగకుండా నిత్యం పర్యవేక్షణ కూడా నిర్వహించకపోవటం వీరి అధికార సోమరితనానికి నిదర్శనం అన్నారు. కోనసీమ లో ప్రమాదాలు జరిగితే గుజరాత్, ఢిల్లీ ప్రాంతాల నుండి ప్రత్యేక బృందాలను రప్పిస్తుండటం అనేక అనుమానాలకు తావిస్తోందని ఆయన సూటిగా ఆరోపణ చేశారు. 'ఖలేజా' సినిమాలో ఖనిజ సంపద కోసం ఒక గ్రామాన్నే ఖాళీ చేయించే కుట్ర వలే ప్రస్తుతం కోనసీమ ప్రాంతం పై జరుగుతున్నట్టుగా కనపడుతోందన్నారు. కొన్ని కార్పొరేట్ కంపెనీలు, ప్రైవేట్ మాఫియా, వ్యాపార రాజకీయ శక్తులు బాగుపడటం కోసం కోనసీమ ప్రజల ప్రాణాలను బలితీసుకోవటం క్షమించరాని నేరం అన్నారు. కోనసీమ నుండి విలువైన సంపద పట్టుకుపోతున్నారని, కనీసం కోనసీమ ప్రజలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి ఏ ప్రయోజనాలు లేకపోతున్నాయన్నారు. కోనసీమ నుండి ఇప్పటి వరకు అధికారికంగా పట్టుకుపోయిన సంపద వెలకట్టలేని లెక్కకు మించిన లక్షలు కోట్లను దోచుకు పోయారన్నారు. పచ్చటి పర్యావరణం, సముద్ర జలాలు, అపార ఖనిజ వనరులు కోనసీమకు ప్రకృతి ప్రసాదించిన వరం అన్నారు. కేజీ బేసిన్ నుండి పట్టుకుపోతున్న గ్యాస్ వనరులను ఇతర రాష్ట్ర రాజకీయ అవసరాలకు రాయితీలుగా ప్రకటించుకుంటూ రాజకీయ ఉనికిని చాటుకుంటున్నారని మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్ కు చట్ట బద్ధంగా రావాల్సిన 12 వ ఆర్థిక సంఘం సిఫార్సు మేరకు 50 శాతం లాబాల వాటాను ఆంధ్రప్రదేశ్ సర్కార్ కేంద్ర ప్రభుత్వం నుండి వసూలు చేయాలని, వంట గ్యాస్ సిలెండర్ ను 200 లకే ఆంధ్ర రాష్ట్ర కుటుంబాలకు సరఫరా చేయాలని ఆర్పీసీ అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండు చేశారు. ఈ సమావేశానికి ఆర్పీసీ సీనియర్ నేత పెండ్యాల కామరాజు అధ్యక్షత వహించారు. సమావేశంలో శ పార్టీ నేతలు డీవీఆర్ మూర్తి, సిమ్మా దుర్గారావు, కారుమూరి యుగంధర్, గుడ్ల సాయి దుర్గా ప్రసాద్, బసా సోనియా, మాసా అప్పాయమ్మ, చల్లా సాంబశివరావు, కాకర్ల ప్రసాద్, చల్లా అఖిల్, సుంకర వెంకట బాస్కర రంగారావు, కందివలస రమణ, కూరాకుల నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# కోడిపందాలకు సర్వం సిద్ధం

- పందాలు గుండాటలకు వేలంపాటలు పూర్తి - పోలీసులు కేవలం
- ప్రకటనలకే పరిమితం - ముమ్మిడివరం లో జోరుగా పందెం బరులు



**ముమ్మిడివరం (మనసులో మాట) జనవరి 13:** సంక్రాంతి పండుగ సమీపించటంతో గ్రామాల్లో సాంప్రదాయం ముసుగులో కోడిపందాలు నిర్వహణకు సమాయత్తమవుతున్నారు. పండగ మూడు రోజులు కోడిపందాలు గుండాట వంటి వాటిని నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేసుకుంటూ పోతున్నారు. కోడిపందాలు గుండాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడరాదని సాంప్రదాయ క్రీడలతోనే పండగ జరుపుకోవాలని పోలీసులు ఆదేశాలు జారీ చేస్తున్న వాటిని ఖాతరు చేయకుండా జూధాల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను చకచగా చేసుకుపోతున్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలో రాజుపాలెంలో ప్రతి ఏటా ఈ జూదాలు భారీస్థాయిలో నిర్వహిస్తూ వస్తున్నారు గ్రామంలో క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో కోడిపందాల నిర్వహణ జరుగుతూ వస్తున్నాయి. ఆ గ్రామంలో దేవాలయాల అభివృద్ధికి కొంత మొత్తాన్ని కేటాయిస్తారు. పండగ మూడు రోజులు జూదాల నిర్వహణకు పాట నిర్వహిస్తారు. ఎవరు ఎక్కువ మొత్తానికి పాడుకుంటే వారికి అనుమతిస్తారు. అయితే ఈ ఏడాది ఆ గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు5.50 లక్షలకు పాటను దక్కించుకున్నాడు. కోడిపందాలు నిర్వాహకులతో పది లక్షలకు ఆ నాయకుడు ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం. అలాగే మండలంలో గేదెల్లంక గ్రామంలో జనసేన పార్టీ నాయకుడు ఆధ్వర్యంలో భారీ ఎత్తున కోడిపందాలు నిర్వహించేం దుకు ఏర్పాట్లు సాగుతున్నాయి. అన్నంపల్లి, కొత్తలంక, అయినా పురం గ్రామాల్లో కోడిపందాలు గుండాట్ల వంటి వాటిని నిర్వహించేందుకు ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. మూడు రోజులు ఈ జూదాల నిర్వహణకు అడ్డు తగలకుండా రెవిన్యూ పోలీసులను మేనేజ్ చేసేందుకు కొంత మొత్తాన్ని కూడా కేటాయించినట్లు సమాచారం. ఈ ఏడాది కూటమి నాయకుల ఆధ్వర్యంలో జూదాలు భారీ స్థాయిలోనే జరుగుతాయని అంచనా వేస్తున్నారు.ఎటువంటి జూదాలు జరగనివ్వమని పోలీసులు బల్లగుద్ది మరీ ప్రకటించిన విషయం తెలిసిందే... చూద్దాం పోలీసులు గెలుస్తారో... కోడి గెలుస్తుందో.

# భోగిపిడకలతో ప్రకృతి వ్యవసాయ క్షేత్రం నమూనా



**తాళ్ళరేవు (మనసులో మాట), జనవరి 13:** మండల పరిధిలోని పి. మల్లవరం లో ప్రకృతి వ్యవసాయ రైతు ధూళిపూడి వెంకటరమణ (బాబి) గృహం వద్ద గోవు పేడ తో తయారు చేసిన భోగిపిడకలుతో పాక, రైతేరాజు, ప్రకృతి వ్యవసాయ క్షేత్రం, పి. మల్లవరం అని పేర్పించిన అక్షరాలు ఆకట్టుకున్నాయి. అంతే కాకుండా ప్రకృతి క్షేత్రంలో పండించిన దేశీవాళి ధాన్యం రకాలు బర్మా బ్లాక్, రత్నచోడి, ఘని, రక్త శాలి, బహురూపి, కుజిపటాలియా, మైసూర్ మల్లిగే, కుండలలో వేసి ప్రదర్శించారు. ధాన్యం కుచ్చులు, చెరుకు గెడలు, అరటి గెలలు, పూల మొక్కలు, ముగ్గులుతో నారుమడి తో 2026 అంటూ అలంకరించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ రైతు విళ్ళ సత్యనారాయణ ను సన్మానించారు. అనంతరం కోడి పుంజులతో సరదాగా పందెంకి సైరన్ మోగించారు. అక్కడ కు వచ్చిన అందరికి ప్రకృతి వ్యవసాయం ప్రాముఖ్యత తెలియజేసారు. ఈ కార్యక్రమంలో దడాల సత్తికొండ, కిట్ట, ఉంగరాల వెంకటేశ్వరరావు, ధూళిపూడి సుబ్బారావు, అందే కాశీరాజు, గుత్తుల వెంకటరమణ, దున్నా సుబ్రహ్మణ్యం, రాయుడు సింహాచలం, డాక్టర్ బాబు, మూర్తి, యం. శ్రీను, సన్నీ, మనీష్, విష్ణు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ధనలక్ష్మి, సతీష్, ఝాన్సీ, అరుణ, వెంకటలక్ష్మి, భవాని, రవలి,వాడపల్లి, చిరంజీవి పాల్గొన్నారు.





# కత్తి కట్టి... నెత్తిరోడి

- పందేలు మాటున పైశాచికం
- కోట్ల వ్యాపారం... కానరాని జంతు ప్రేమికులు
- ప్రేమ గా పెంచింది...చావును చూపించడానికా!
- కోడి మాటల్లో... కోడి పుంజు ఆవేదన

**ముమ్మిడివరం (మనసులో మాట) జనవరి 13:** ఆయ్.. నేను పందెం పుంజునండీ.. పేరు డేగ.. మా ఈకల రంగు, శరీర తీరు బట్టి డేగ, నెమలి, పచ్చకాకి, నల్లకాకి, శవల, మైల, అబ్రాస్, సేతువ పేర్లు పెట్టి మురిసిపోతుంటారు. తేడా వస్తే కోజంటూ కర్రీ చేసుకుని లొట్టలేసుకుంటూ తింటారు. ఎంత రాజభోగం అనుభవించినా సంక్రాంతి వస్తోందంటే చిగురుటాకుల్లా వణికిపోతాం. ప్రాణాలు అరికాల్లో పెట్టుకుని పోరాడతాం. ఈ భోగం మూణ్ణాళ్ల ముచ్చటనేనని తెలిసొచ్చేసరికి మా ఊపిరి పోతుంది.

**బతికున్నంత కాలం దర్జానే:**

ఏమాటకామాట.. బతికున్నంత కాలం మా దర్జానే వేరు. పెద్ద పెద్ద లోగిళ్లు, మకాంలు మా నివాసాలు. మాలో కొందరికి ప్రత్యేకంగా పనివాళ్లు ఉంటారండోయ్. మా బాగోగులు చూస్తూ టైముకి మేత పెట్టేది వాళ్లే. అది ఆషామాషీ మేతనుకుంటే పొరపాటే. ఆ రాజభోగమే వేరు. అప్పుడప్పుడూ కాస్త 'చుక్క' కూడా పోస్తుంటారు. ట్రైనింగ్ మూడు నెలల్లో మా ఒక్కొక్కరిపై రూ.30 వేల వరకు ఖర్చు చేస్తుంటారు. ఇలా పెంచిన మమ్మల్ని పందెంరాయుళ్లు రూ.లక్షలు పెట్టి కొంటారు. పండుగల పేరు చెప్పి రూ.15 కోట్లకు పైనే మా గోదారి జిల్లా లో మాపై వ్యాపారం జరుగుతుందంటే మాకున్న డిమాండ్ అలాంటిది మరి. ఇవన్నీ చూసి ఎంతో సంబరపడతాం. జన్మంటూ ఉంటే ఇక్కడే పుట్టాలని కోరుకుంటాం. అందుకే మా గోదారోళ్లకు కావాల్సిన వారిపై కోపం వచ్చినప్పుడు నిన్ను పందెం కోడిని మేపినట్టు మేపానని దెప్పిపొడవడం మమ్మల్ని చూసే వచ్చిందంటండీ.. ఆయ్.

**ఈ ఆనందం క్షణకాలమేనా:**

ఈ ఆనందం క్షణకాలమేనని.. అమ్మవారికి బలిచ్చేముందు మేకపోతును మేపినట్టు.. పందెం బరి లో వదలడానికి మమ్మల్ని పెంచుతున్నారని తె లిసేసరికే భూమ్మీద మాలో చాలామందికి నూకలు చెల్లిపోతాయండి. మాకు ట్రైనింగ్ మొదలవుతుందంటేనే అర్థమవుతుంది సంక్రాంతి దగ్గరపడుతోందని. అప్పటి నుంచి దినదినగండమే. ఇన్నాళ్లూ అనుభవించిన ఆనందం, రాజభోగం అంతా ఇంకొంతకాలమేనని.

**మా గోడు వినేదెవ్వరూ:**

ఎన్ని చట్టాలుండి.. వాటిని రక్షించే వ్యవస్థలు ఎన్నుండి.. కోర్టులు ఎంత కన్నెర్ర చేసి ఏం లాభం... కంచే చేను మేసినట్టు చట్టాలు చేసే పెద్దలే చంకలో మమ్మల్ని పెట్టుకుని ఫొటోలకు పోజులిస్తూ మరీ బరులు ప్రారంభిస్తారు. మాలో మేమే కత్తులు దూసుకునేలా పందెంలో దింపి వేలల్లో, లక్షల్లో పందేలు కాసి ఆనందిస్తారు. మా తలపై నిమిరిన చేతులే మా కాళ్లకు కత్తులు కడతారు. వారికేం తెలుసు మా బాధ... పందెంలో దిగాక ఏం చేయలేని పరిస్థితి. చుట్టూ జనం, తప్పించుకునే వీలులేక మాలో మేమే ప్రాణాల కోసం తలపడాల్సిందే.

'కాళ్లకు కట్టిన పదునైన కత్తులు శరీర భాగాల్ని చీలుస్తూ ఛిద్రం చేస్తున్నా.. ఒళ్లంతా నెత్తురోడుతున్నా.. కనురెప్ప వాలిపోతున్నా.. రెక్కలు తెగిపడి కదలలేకున్నా.. గెంతేందుకు శరీరం సహకరించకున్నా.. జాలి లేని జనం కోసం, వారి పైశాచికానందం కోసం ఊపిరున్నంతసేపూ పోరాడతాం. చివరి క్షణాల్లో అప్పుడనిపిస్తుంది.. రెక్కలకి బలమొచ్చి పక్షుల్లా ఎగిరిపోతే ఎంత బాగుంటుందని'. మేం అనుభవించే నరకాన్ని చూస్తూ పైశాచిక ఆనందం పొందడానికి పనిగట్టుకుని ఎక్కడెక్కడి నుంచో గొప్పగొప్పోళ్లు వస్తుంటారు.

**ఆ మూడు రోజులూ ఏమైపోతారో:**

కోడిపందేలు నిర్వహిస్తే ఖబడ్దార్ అంటూ హెచ్చరించే పోలీసులు, జంతు సంక్షేమ సంఘం సమావేశాల పేరిట హడావుడి చేసే అధికారులు పండుగల మూడు రోజులూ ఏమైపోతారో తెలీదు. తర్వాత కొందరిపై ఏవో చిన్నచిన్న కేసులు పెట్టి చేతులు దులిపేసుకుంటుంటారు. ఇంకెవరికి చెప్పుకోవాలి మా బాధ... అదిగో అక్కడ బరి సిద్ధం చేసేశారు.. నన్ను పిలుస్తున్నారు.. బాయ్.. ఇక ఉంటాను. భూమ్మీద నాకింకా నూకలుంటే కొక్కొరోకో అంటూ తెల్లారి మిమ్మల్ని మేల్కొలుపుతాను.

**సంప్రదాయం అంటూ:**

ఒకరు కోడి పోటీలంటారు.. ఇంకొకరు సంప్రదాయం అంటారు. కత్తుల్లేని పందేలు జరపమంటే మాత్రం నో అంటారు. ఆ కొట్లాటలో మాలో ఎవరోకరి ప్రాణాలు పోవాల్సిందే. నేను నెగ్గితే సరేసరి... ఓడినా వదలరు. కోజంటూ కోసేసి ఆరగిస్తారు. బతికుండగా రూ.లక్షల ధర పలికే మేము చచ్చినా తగ్గేదేలే అన్నట్టే ఉంటాం. మూడు నుంచి ఐదు కేజీల వరకు బరువుండే మా శరీరాలను రూ.5 వేల నుంచి రూ.15 వేల వరకు కొని గల్లీ నుంచి ఢిల్లీ దాకా కావాల్సిన రాజకీయ నాయకులు, అధికారులకు కానుకగా పంపిస్తుంటారు. పండుగల మూడు రోజుల్లో కోజాల పైనే కోనసీమ జిల్లాలో రూ.5 కోట్ల పైనే వ్యా పారం జరుగుతుందంటుంటారు.ముమ్మిడివరం, మురముళ్ల, కాట్రేనికోన, తాళ్లరేవు మండలాల్లో గ్రామానికో బరి చొప్పున చాలా చోట్ల బరులు సిద్ధం చేస్తున్నారు. కొన్ని చోట్ల మంగళవారం సాయంత్రం నుండి కోడి పందేలు మొదలు పెట్టేసారు మరి నా పరిస్థితి ఏంటో చూడాలి మరి... థాంక్ యూ బ్రతికి ఉంటే మళ్ళీ కలుద్దాం.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



**గండేపల్లి, మనసులో మాట జనవరి 13.** గండేపల్లి మండలంలో మల్లేపల్లి జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన శీలం శివరామకృష్ణ(60) అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలప్రకారం సైకిల్ పై సంత మార్కెట్ జంక్షన్ నుండి డివైడర్ దాటుతుండగా జగ్గంపేట నుంచి రాజమండ్రి వైపు వెళ్లే లారీ అతనిని బలంగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే ఈ విషయం తెలుసుకున్న వెంటనే గండేపల్లి ఎస్సై శివ నాగబాబు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జెడ్ రాగంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపిస్తున్నారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



## వేణుగోపాలుని మాస కల్యాణం..

**పిఠాపురం, (మనసులో మాట) జనవరి 13:** స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో జరుగుతున్న ధనుర్మాస వేడుకల ముగింపు ఉత్సవాల్లో భాగంగా ఈనెల 15, 16 తేదీలలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు విజయ జనార్ధనాచార్యులు తెలిపారు.
ముఖ్యంగా ఈనెల 15వ తేదీ (బుధవారం) సాయంత్రం 6 గంటలకు భక్తుల గోత్రనామాలతో 'ఉచిత విశేష దీపోత్సవ సహిత మాస కల్యాణ వేడుక' కనువిందుగా జరగనుంది. అనంతరం 16వ తేదీన కనుమ పండుగను పురస్కరించుకుని ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, అనంతరం గరుడవాహనంపై స్వామివారి 'గ్రామోత్సవం' వైభవంగా నిర్వహించనున్నారు.
ఈ విశేష కల్యాణ వేడుకలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని, స్వామివారి తలంబ్రాలు స్వీకరించి తరించాలని ఆలయ కార్యనిర్వహణ అధికారిణి బి. ధనలక్ష్మి కోరారు.

## భోగిపిడకలతో ప్రకృతి వ్యవసాయ క్షేత్రం నమూనా



**తాళ్ళరేవు (మనసులో మాట), జనవరి 13:** మండల పరిధిలోని పి. మల్లవరం లో ప్రకృతి వ్యవసాయ రైతు ధూళిపూడి వెంకటరమణ (బాబి) గృహం వద్ద గోవు పేడ తో తయారు చేసిన భోగిపిడకలుతో పాక, రైతేరాజు, ప్రకృతి వ్యవసాయ క్షేత్రం, పి. మల్లవరం అని పేర్చించిన అక్షరాలు ఆకట్టుకున్నాయి. అంతే కాకుండా ప్రకృతి క్షేత్రంలో పండించిన దేశివాళి ధాన్యం రకాలు బర్మా బ్లాక్, రత్నచోడి, ఘని, రక్త శాలి, బహురూపి, కుజిపటాలియా, మైసూర్ మల్లిగే, కుండలలో వేసి ప్రదర్శించారు. ధాన్యం కుచ్చులు, చెరుకు గెడలు, అరటి గెలలు, పూల మొక్కలు, ముగ్గులుతో నారుమడి తో 2026 అంటూ అలంకరించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ రైతు విళ్ళ సత్యనారాయణ ను సన్మానించారు. అనంతరం కోడి పుంజులతో సరదాగా పందెంకి సైరన్ మోగించారు. అక్కడ కు వచ్చిన అందరికి ప్రకృతి వ్యవసాయం ప్రాముఖ్యత తెలియజేసారు. ఈ కార్యక్రమంలో దడాల సత్తికొండ, కిట్ట, ఉంగరాల వెంకటేశ్వరరావు, ధూళిపూడి సుబ్బారావు, అందే కాశీరాజు, గుత్తుల వెంకటరమణ, దున్నా సుబ్రహ్మణ్యం, రాయుడు సింహాచలం, డాక్టర్ బాబు, మూర్తి, యం. శ్రీను, సన్నీ, మనీష్, విష్ణు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ధనలక్ష్మి, సతీష్, ఝాన్సీ, అరుణ, వెంకటలక్ష్మి, భవాని, రవలి,వాడపల్లి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## కోనసీమ ఆంధ్ర- గోవా బీచ్ పిస్టవల్ కు ప్రత్యేక బస్సులు

**అమలాపురం( మనసులో మాట) జనవరి 13..** కోనసీమ సంక్రాంతి సంబరాల్లో భాగంగా కోనసీమ లో ఆంధ్ర గోవా బీచ్ ఫెస్టివల్ ఉప్పలగుప్తం మండలం ఎస్ యానాంలో అత్యంత వైభవంగా 14 ,15, 16 తేదీల్లో నిర్వహిస్తున్నారు. ఈ బీచ్ ఫెస్టివల్ కు ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించాలని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తు ఆనందరావు సూచనల మేరకు 14 15 16 తేదీల్లో అమలాపురం ఆర్టీసీ డిపో నుండి ప్రతి అరగంటకు ఒక బస్సు బీచ్ ఫెస్టివల్ ప్రాంతానికి నడపడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరిగిందని జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమలాపురం ఆర్టీసీ బస్టాండ్ నుండి ఉదయం 5 గంటల నుండి సాయంత్రం ఏడు గంటల వరకు అలాగే ఎస్ యానాం నుండి అమలాపురానికి ఉదయం 6 గంటల నుండి రాత్రి ఏడు గంటల వరకు అరగంటకు ఒక బస్సు చొప్పున ప్రత్యేక బస్సు సౌకర్యం ఉంటుందన్నారు. ఎమ్మెల్యే అయితా బత్తుల ఆనందరావు చొరవతో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆంధ్ర గోవా బీచ్ ఉత్సవాలకు కుటుంబ సమేతంగా తరలివచ్చి పండగ మూడు రోజులు ఆహ్లాదకరమైన వాతావరణంలో సంతోషంగా గడపాలని డిపిటిఓ శ్రీనివాసరావు తెలియజేశారు.

### వరకట్న నిషేధ చట్టం అమలుపై

# అవగాహన, సమన్వయం పెంచాలి

**- తూర్పు గోదావరి జిల్లా స్థాయిలో అడ్వైజరీ బోర్డు కమిటీ ఏర్పాటు - ఇంచార్జి కలెక్టర్ మేఘా స్వరూప్**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 13:** స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వరకట్న నిషేధ చట్టం1961ను సమర్థవంతంగా అమలు చేయడం, మహిళలపై వరకట్న వేధింపులను నివారించడం, బాధితులకు తక్షణ సహాయం అందించడమే లక్ష్యంగా జిల్లా అడ్వైజరీ బోర్డు కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని ఇన్‌చార్జ్ జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్ తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వరకట్న నిషేధ చట్టం1961 అమలు కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్, కమిటీ చైర్ పర్సన్ అధ్యక్షతన నిర్వహించారు.
ఈ కమిటీలో జిల్లా కలెక్టర్ చైర్‌పర్సన్‌గా, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారి – ప్రొహిబిషన్ ఆఫీసర్‌గా, జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, సభ్యులుగా, స్వచ్ఛంద సేవా సంస్థల నుంచి ఐదుగురు సామాజిక కార్యకర్తలు (సోషల్ వర్కర్స్) సభ్యులుగా నియమించబడినట్లు జిల్లా ఇన్చార్జి కలెక్టర్ మేఘా స్వరూప్ తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యుల నుంచి వచ్చిన సలహాలు, సూచనలను పరిశీలిస్తూ జిల్లా ఇన్చార్జి మేజిస్ట్రేట్, కలెక్టర్ వై మేఘా స్వరూప్ మాట్లాడుతూ వరకట్న నిషేధ చట్టంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం అత్యంత అవసరమన్నారు. చట్టం ఉద్దేశ్యం, శిక్షలు, బాధితులకు లభించే రక్షణ, సహాయక వ్యవస్థలపై గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు నిరంతర అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. వరకట్న వేధింపులకు గురైన మహిళలు లేదా వారి కుటుంబ సభ్యులు వెంటనే 'ఉమెన్ హెల్ప్‌లైన్ 181'కు సమాచారం అందించవచ్చని, అదే విధంగా మహిళలు శారీరక, మానసిక, సామాజిక వేధింపులకు గురైన సందర్భాల్లో 'సఖి వన్ స్టాప్ సెంటర్' ద్వారా ఉచితంగా అందించే న్యాయ, వైద్య, కౌన్సెలింగ్, పోలీసు సహాయ సేవలను వినియోగించుకోవచ్చని ఆయన తెలిపారు. ఈ కమిటీ సమావేశం ముఖ్య ఉద్దేశ్యం వరకట్న నిషేధ చట్టం అమలులో శాఖల మధ్య సమన్వయం పెంపొందించడం, పోలీసు, రెవెన్యూ, మహిళా శిశు సంక్షేమ శాఖలు ఒకే దిశలో పనిచేయడం అన్నారు. అదే సమయంలో క్షేత్ర స్థాయి సిబ్బందికి స్పష్టమైన మార్గనిర్దేశం అందించడం, ఫిర్యాదులు వచ్చిన వెంటనే తక్షణ చర్యలు చేపట్టే విధంగా వ్యవస్థను బలోపేతం చేయడం జరుగుతుందని తెలియజేశారు. వరకట్నానికి వ్యతిరేకంగా సామాజిక బాధ్యతను పెంపొందించడానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న సిబ్బందికి చట్టంలోని నిబంధనలు, బాధ్యతలను స్పష్టంగా తెలియజేయాలని, వరకట్నం ఇవ్వడం–తీసుకోవడం నేరమని ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ అధికారి టీ శ్రీదేవి, జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ప్రతినిధులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులైన ఐదుగురు సామాజిక కార్యకర్తలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

### కూటమి ఎన్నికల హామీ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలు

# అమలు చేయాలని డిమాండ్

**- తక్షణం పెండింగ్ క్లైముల పరిహారాలను కార్మికుల చెల్లించాలని నినాదాలు**

**- సిసిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజకుమార్**



**కాకినాడ (మనసులో మాట) జనవరి 13..** ఆంధ్రప్రదేశ్ కార్మిక శాఖ ప్రభుత్వ ప్రచారానికి భవన నిర్మాణ సంక్షేమ బోర్డు నిధులు 20 కోట్లు వాడాలని చేసిన నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో కాకినాడ కలెక్టరేట్ వద్ద మంగళవారం ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నిట్ల శ్రీను, రొంగల ఈశ్వరరావు, సిఐటియు అధ్యక్షులు దువ్వ శేషాబాబ్జి మాట్లాడుతూ కూటమి పెద్దలు ముఖ్యమంత్రి చంద్రబాబు, నారా లోకేష్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రాజకీయ ప్రచారానికి కార్మికుల దాచుకున్న సంక్షేమ బోర్డు నిధులు 20 కోట్లు వాడాలని నిర్ణయం చేయడం సిగ్గుచేటన్నారు. తక్షణం నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీ మేరకు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలు తక్షణం పునరుద్ధరించాలని లేనిపక్షంలో కూటమి బలపరిచిన పంచాయతీ అభ్యర్థులను ఓడించి బుద్ధి చెప్తామని హెచ్చరించారు. విగ్రహాల కోసం వెలకోట్లు ఖర్చు చేసేబదులు, 7 ఏళ్ల నుండి ప్రమాదాలలో, అనారోగ్యంతో మరణించిన భవన కార్మికుల కుటుంబాలకు పరిహారాలు చెల్లిస్తే రోడ్డున పడ్డ కుటుంబాలకు ఊరట లభిస్తుందన్నారు. ఒక్క రూపాయి ప్రభుత్వ ఖాజానపై భారం లేకుండా సంక్షేమ బోర్డు నిర్వహించే అవకాశం ఉన్నకుడా అమలు చేయడానికి కూటమి ప్రభుత్వానికి వచ్చిన అడ్డంకి ఏమిటని ప్రశ్నించారు.
ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్, ఏపీ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఓరుగంటి నందీశ్వరుడు, జిల్లా గౌరవ అధ్యక్షులు గడిగట్ల సత్తిబాబి, సలహాదారు కరణం విశ్వనాధం, కుంచె చిన్న, లోవబాబు, సిఐటియు వర్కింగ్ కమిటీ సభ్యులు పలివేల వీరబాబు, మెడిశెట్టి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్నేషనల్ లైన్స్ క్లబ్ ఫౌండర్ మెల్విన్ జోన్స్ పుట్టినరోజు వేడుక



**ఏలేశ్వరం( మనసులో మాట) జనవరి 13..** ఇంటర్నేషనల్ లైన్స్ క్లబ్ ఫౌండర్ మెల్విన్ జోన్స్ పుట్టినరోజు వేడుకని ఏలేశ్వరం ఏలేశ్వరం లైన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ అనసూయ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా మెల్విన్ జోన్స్ చిత్రపటానికి ఆయన పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం లైన్స్ క్లబ్ ప్రెసిడెంట్ డాక్టర్ అనుసూరి మాట్లాడుతూ నిరుపేదలకు అభాగ్యులకు మెల్విన్ జోన్స్ ఆధ్వర్యంలో ఆనాడు సేవలందించారన్నారు. మానవసేవే మాధవ సేవగా భావించి ఇంటర్నేషనల్ లైన్స్ క్లబ్బును ఆయన ప్రారంభించారన్నారు. లైన్స్ క్లబ్ ద్వారా ప్రపంచ దేశాలలో ఆయన ఎందరికో సేవలు అందించారని ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆనాడు ప్రారంభించబడిన లైన్స్ క్లబ్ ప్రపంచవ్యాప్తంగా ఎన్నో దేశాలలో పేద ప్రజలకు సేవ చేస్తూ ఇప్పటికీ ఆ సేవలను కొనసాగిస్తూ ఇంటర్నేషనల్ లైన్స్ క్లబ్ సేవా భావంతో పనిచేస్తుందన్నారు. మెల్విన్ జోన్స్ పుట్టినరోజు సందర్భంగా ఏలేశ్వరం లైన్స్ క్లబ్ నిరుపేదలకు 30 దుప్పట్లను క్లబ్ ప్రెసిడెంట్ అనుసూరి నాగేశ్వరరావు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు తాళ్లూరి గొల్లజీరావు జ్యోతుల నాగ సత్య శ్రీనివాస్ ఊరా రాజబాబు అలమండ దుర్గాప్రసాద్ గొల్లపూడి గణేష్ కప్పల నాగభూషణం తదితరులు పాల్గొని నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కాకి - డేగ మధ్య మాటలు పూర్తయ్యాయి

**అమలాపురంలో ఒకరోజు ముందే కోడి కూసింది - కోడి ముందు ఖాకి చేతులెత్తక తప్పలేదు.**



**అమలాపురం (మనసులో మాట) జనవరి 13..** సంక్రాంతి పండుగ నేపథ్యంలో కోడిపందాల నిర్వహణ కోసం వారం రోజుల నుంచి పోలీసులు భారీ హెచ్చరికలు, బరులు వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేసి పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని లౌడ్ స్పీకర్లతో మండలాలలో ప్రసారం జోరుగా సాగించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఒకరోజు ముందే కోడిపందాలు నిర్వహణ ప్రారంభించారు. దీంతో మూడు రోజులు పాటు హద్దు అదుపు లేకుండా విచ్చలవిడిగా కోడిపందాలు గుండాట, పేకాట నిర్వహణకు ఎటువంటి ఆటంకం లేదని నిర్ధారణ అయింది. కోడి ముందు ఖాకి చేతులెత్తక తప్పలేదు. జిల్లాలో అమలాపురం నియోజకవర్గంలో ఉప్పలగుప్తం మండలం ఎస్ యానాం వద్ద కోకో బీచ్ ప్రాంగణంలో కోడి పందాలు ఇతర కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి కోటి రూపాయలకు ఒక వ్యక్తి పాటలో దక్కించుకున్నట్లు సమాచారం. అలాగే ముమ్మిడివరం నియోజకవర్గంలో ఒక ప్రజా ప్రతినిధి అనుచరుడు మురమళ్ళ పరిసర ప్రధాన కేంద్రాల వద్ద కోడిపందాలు నిర్వహణ కోసం కోటి రూపాయలకు పాట దక్కించుకుని మొత్తం బరులు అతనే నిర్వహణకు ఆయనే చక్రం తిప్పుతున్నట్లు సమాచారం. సంక్రాంతి పండుగ మూడు రోజులు కోనసీమ జిల్లాలో వందల కోట్ల రూపాయలు చేతుల మారనున్నాయి. జిల్లాలో ఒక్క మండలానికి రెండు బరువు చొప్పున నిర్వాహకులు సిద్ధం చేసుకున్నారు. బరికొచ్చి మూడు నుండి నాలుగు లక్షల వరకు పోలీస్ స్టేషన్లకు ముడుపులు చెల్లించడానికి ఒప్పందం కుదిరినట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో కోడిపందాల నిర్వాహకులు భారీ ఎత్తున ఏర్పాట్లు సిద్ధం చేసుకున్నారు. కోడిపందాలు తిలకించడానికి గ్యాలరీలు తిరుణాళ్లను తలపించే విధంగా బరులు వద్ద ఏర్పాట్లు చేస్తున్నారు. ఇతర రాష్ట్రాలు విదేశాల నుండి గ్రామాలకు వచ్చిన వారు కోడిపందాలు చూడ్డానికి వారికి ప్రత్యేకమైన ఏర్పాట్లు చేసారు.



### వైద్యానికి ఆరోగ్యానికి

# ప్రభుత్వం పెద్దపీట వేస్తుంది

**- అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి**

అనపర్తి ( మనసులో మాట) జనవరి 13: అనపర్తి మండలం రామవరంలో 20 లక్షల రూపాయలతో నిర్మించబోయే హోమియోపతి ప్రభుత్వ ఆసుపత్రి భవనం కు శంకుస్థాపన చేసిన అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి. ఈ సందర్భంగా అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ,
ఈరోజు అనపర్తి మండలం రామవరం గ్రామంలో హోమియో హాస్పిటల్ నిర్మాణం నిమిత్తం శంకుస్థాపన చేయడం జరిగింది. 1983లో మూలారెడ్డి శాసనసభ్యునిగా గెలిచిన తర్వాత నియోజకవర్గంలో మూడు హోమియో హాస్పిటల్స్ ఏర్పాటు చేయడం జరిగింది. రామవరం, ఊలపల్లి, వెంటూరు గ్రామాల్లో ఈ హోమియో హాస్పిటల్స్ ని ఏర్పాటు చేయడం జరిగింది. మూడు హాస్పిటల్స్ కి వైద్యాధికారులను ఏర్పాటు చేయడం జరిగింది.
ముఖ్యంగా రామవరం గ్రామంలో చక్కటి వైద్యాధికారులు రావడంతో ప్రజలు కూడా హోమియో వైద్యానికి అలవాటు పడటం జరిగింది. కానీ తర్వాత రోజుల్లో ప్రభుత్వాలు హోమియో వైద్యాన్ని డిస్కరేజ్ చేయడంతో నెగిటివ్ ఫలితాలు వచ్చాయి. మందులు, డాక్టర్లు లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడటం గమనించి దీనిని రివైజ్ చేయడానికి ప్రయత్నాలు చేసాం. అయితే ఆనాడు ప్రభుత్వం ఒక పాలసీ తీసుకొని ఎక్కడైతే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయో వాటితో వీటిని మెర్జ్ చేయాలని చూసింది. అలా మెర్జ్ చేయడం వల్ల దీని ఐడెంటిటీ పోతుందని నేను మెర్జ్ కాకుండా కాపాడడం జరిగింది. కానీ తర్వాత ఐదు సంవత్సరాలు ఇది నిర్లక్ష్యానికి గురి కావడం 2024 మరలా నేను గెలిచిన తర్వాత, దీని ఆవశ్యకతను పెద్దలు నా దృష్టికి తీసుకురావడం ఆ సమయంలోనే మంత్రి సత్య కుమార్ గారు ఇక్కడికి రావడంతో వారికి వివరించడం జరిగింది. అప్పటివరకు వారికి హోమియో వైద్యంపై వారికి సరైన అవగాహన లేదు. కేంద్ర ప్రభుత్వం ఆయుష్ శాఖ హోమియోను ప్రోత్సహిస్తుందని చెప్పడంతో వారు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి రాష్ట్రంలో హోమియోని గానీ, ఆయుర్వేదాన్ని గానీ ప్రోత్సహించాలి అని, వారు కృషి చేయడం అందులో భాగంగానే డిప్యూటేషన్ పై డాక్టర్ దివ్య ని ఇక్కడికి తీసుకురావడం ఆమె కూడా చాలా చక్కగా వైద్యాన్ని అందిస్తూ ఉండడంతో ఇక్కడ ఓపి 50 వరకు పెరిగింది. అటువంటి పరిస్థితుల్లో ముఖ్యమంత్రి డిప్యూటేషన్స్ అన్నీ రద్దు చేయడంతో డాక్టర్ దివ్య గారు ఊలపల్లి వెళ్లడం జరిగింది. నేను మంత్రి గారిని కోరినప్పటికీ ముఖ్యమంత్రి గారి నిర్ణయాన్ని మార్చడానికి ఆయన సుముఖత చూపకపోవడంతో నేను నేరుగా ముఖ్యమంత్రి గారికి ఇక్కడ ఉన్న పరిస్థితిని వివరించి ఇక్కడ ప్రజలందరూ ఆ డాక్టర్ గారి కావాలని కోరుతున్నారని, ప్రజలందరూ ఆ డాక్టర్ గారు వైద్యం చేసే విధానానికి ఆకర్షితులై పేషెంట్స్ అందరూ ఊలపల్లి వరకు వెళ్లి వస్తున్నారని చెప్పగానే ముఖ్యమంత్రి గారు డిప్యూటేషన్ ని యాక్సెప్ట్ చేయడంతో ఆ డాక్టర్ గారిని మరలా ఇక్కడికి తీసుకురావడం జరిగింది. ఈ కార్యక్రమంలో అధికారులు, అనపర్తి మండల,రామవరం గ్రామ కూటమి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

### కేంద్ర మంత్రి వర్మను కలిసిన

# బిజెపి ముఖ్య నేతలు



**అమలాపురం (మనసులో మాట) జనవరి 13..** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా గెద్దనపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో భాగంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన కేంద్ర సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ ను భారతీయ జనతా పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా మాజీ అధ్యక్షులు యాళ్ల దొరబాబు, బిజెపి మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు, బిజెపి జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు దూరి రాజేష్ తదితరులు మంత్రి వర్మకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారందరూ కలిసి గ్రామంలో జరిగిన సంక్రాంతి సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. మన సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకైన సంక్రాంతి వేడుకలను పల్లెటూరి వాతావరణంలో జరుపుకోవడం ఆనందబదాయకమని మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ పేర్కొన్నారు. కోనసీమ సంప్రదాయ పద్ధతుల్లో మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిజెపి నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామ పెద్దలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# పేదల అండగా ముఖ్యమంత్రి సహాయనిధి



**పిఠాపురం, ( మనసులో మాట) జనవరి 13:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేద ప్రజలకు ఇంట్లో పెద్ద కొడుకులా అండగా నిలుస్తున్నారని మాజీ ఎమ్మెల్యే వర్మ పేర్కొన్నారు. మంగళవారం పిఠాపురం పట్టణంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన సుమారు 2 లక్షల రూపాయల విలువైన చెక్కులను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఆయన అందజేశారు. శ్రీను, పితాని నాగేశ్వర రావు, రొంగల గంగరాజు, మొహమ్మద్ ఆర్మన్, హారిస్, షేక్ బీబిజాన్ తదితరులకు ఈ చెక్కులను అందజేశారు.. అనారోగ్యంతో ఇబ్బంది పడే పేదలను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం ముందుంటుందని వర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బొజ్జా సతీష్, కౌన్సిలర్ కోళ్ళ బంగారు బాబు, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



## చిలకలూరిపేట అగ్ని హర్షిదాతు ఎం.ఎస్.ఎం.ఈ పార్కుకు ఆమోదం

**- పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా**

**పల్నాడు, జనవరి 13,( మనసులో మాట):** పల్నాడు జిల్లాలోని చిలకలూరిపేట నియోజకవర్గం లోని యడ్లపాడు మండలం, కొండవీడు గ్రామంలో అగ్ని హర్షిదాతు ఎమ్.ఏస్.ఎం.ఇ పార్క్ కు జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లా ఆమోదం తెలిపారు.పల్నాడు జిల్లా కలెక్టర్ బంగ్లా లోని జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ డి.ఐ.పి.ఈ.సి సమావేశం జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లా అధ్యక్షతన జరిగింది.నానో టెక్నాలజీ ఆఫ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి, కావలసిన అన్ని అనుమతులను కేటాయిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. పల్నాడు జిల్లాలోని నరసరావుపేట, పెదకూరపాడు నియోజకవర్గాలలో త్వరగా పార్కులును ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ జిల్లా పరిశ్రమల, ప్రోత్సాహక కమిటీకి సూచించారు.ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ జి.ఎం బి. శ్రీనివాస్ రావు, పీ.సీ పల్నాడు జిల్లా అభివృద్ధి కమిటీ జి సుబ్బారెడ్డి, అసిస్టెంట్ కమర్షియల్ ఆఫీసర్ జి. ఆనంద్ కుమార్, ఎల్.డి.ఎం రామ్ ప్రసాద్,జిల్లా రవాణా శాఖ అధికారి సంజీవ్ కుమార్, భూగర్భ జలాల అధికారి కె. రాణా బాబు రెడ్డి, జిల్లా ఫైర్ ఆఫీసర్ ఎం శ్రీనివాస్ రావు, లీగల్ మెట్రాలజీ అభివృద్ధి అధికారి జి.ఎస్ సునీల్ రాజు, లేబర్ డిపార్ట్ మెంట్ కే మహబూబ్ సుభాని, నర్సరావుపేట మున్సిపల్ అధికారి జి రవికుమార్,సిక్కి వి.రాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రయాణికులకు కష్టాలు,వ్యాపారస్తులకు నష్టాలతో సంక్రాంతి సంబరాలా ?

**- పాటంశెట్టి సూర్యచంద్ర**



**జగ్గంపేట (మనసులో మాట) జనవరి 13..** సోమవరం సంత రోజున జగ్గంపేట సెంటర్లో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు వల్ల ప్రయాణికులు చిరువ్యాపారస్తులు ఎన్నో కష్టాలు ఇబ్బందులు పడ్డారని కొంతమంది సంతోషాల కోసం వేలాది మంది ప్రజలకు అసౌకర్యం కలిగించడం మంచి విధానం కాదని పాటంశెట్టి సూర్యచంద్ర తెలిపారు. జగ్గంపేటలో ప్రతి సోమవారం సంత రోజున జగ్గంపేట అర్ టీ సీ కాంప్లెక్స్ సెంటర్ ప్రయాణికులతో చాలా రద్దీగా ఉంటుందని పండగ ముందు రోజు వచ్చిన సోమవారం సంత మరింత రద్దీగా ఉంటుందని తెలిసి కూడా ట్రాఫిక్ డైవర్ట్ చేసి ప్రయాణికులను సంచులు పిల్లలతో కిలోమీటర్ల కొలది నడిపించి జగ్గంపేట సెంటర్లో పండగ చేసుకోవడం నిజమైన సంక్రాంతి పండుగేనా అని పాటంశెట్టి సూర్యచంద్ర అధికారులను పాలకులను ప్రశ్నించారు. సంక్రాంతి సంబరాలు చేసుకోవడం శుభ పరిణామం అని దానికి మేము వ్యతిరేకం కాదు అని నిర్వహించిన ప్లేస్ కరెక్ట్ కాదు అని అన్నారు. హైస్కూల్ గ్రౌండ్, కాపు కల్యాణ మండపం ప్రాంతం, శ్రీ చైతన్య స్కూల్ ఎదురుగా ఉన్న స్థలం వంటి ఎన్నో బహిరంగ ప్రదేశాలు ఉన్నా సరే ఆర్భాటం,హడావుడి,పబ్లిసిటీ కోసం ఐదు గంటలు ట్రాఫిక్ డైవర్ట్ చేసి సెంటర్లో పెట్టడం వల్ల మీరు చేసిన సంక్రాంతి సంబరాలు వల్ల సంతోషించిన వారి కంటే వందరెట్లు ప్రజలు తిట్టుకుంటూ నడుస్తూ ఎన్నో అవస్థలు పడ్డారని సూర్యచంద్ర తెలిపారు. ప్రజలకు,ప్రయాణికులకు వ్యాపారస్తులకు అసౌకర్యం కలగకుండా సంక్రాంతి సంబరాలు నిర్వహించాల్సిన బాధ్యత ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ దని అటువంటిది ముందు రోజు ఆదివారం వారే స్వయంగా స్థలం పరిశీలించి ఏర్పాట్లు పర్యవేక్షణ చేసి ప్రయాణికులు, వ్యాపారస్తులకు ఇబ్బందులు కలిగేలా చేయడం బాధాకరమని ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి పాటంశెట్టి సూర్యచంద్ర తెలిపారు.

# చంద్రబాబు అప్పులు ప్రజలకు తిప్పలు

**(జగన్మోహన్ రెడ్డి అమలు చేసింది సంక్షేమ, అభివృద్ధి క్యాలెండర్**

**- కూటమి ప్రభుత్వానిది అప్పుల క్యాలెండర్**

**- పిఠాపురం వైసిపి ఇన్చార్జి, మాజీ ఎంపీ వంగా గీతా విశ్వనాథ్**



**పిఠాపురం,(మనసులోమాట) జనవరి 13:** ఆంధ్రప్రదేశ్ రోజురోజుకు అప్పుల ఊబిలో కూరుకు పోతుందని, మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అభివృద్ధి సంక్షేమ క్యాలెండర్ ను అమలు చేస్తే, ప్రస్తుత చంద్రబాబు నేతృత్వంలోనే కూటమి ప్రభుత్వం అప్పుల క్యాలెండర్ ను అమలు చేస్తుందని మాజీ ఎంపీ వంగా గీతా విశ్వనాథ్ విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం పాత్రికేయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఇప్పుడు ఏ సంక్షేమ పథకం ఇవ్వాలి, ఎప్పుడు ఏ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ఒక క్రమ పద్ధతిలో క్యాలెండర్ ను విడుదల చేసి పక్కాగా అమలు చేశారని, కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎప్పుడు ఎక్కడనుండి ఎంత అప్పు తేవాలని క్యాలెండర్ వేసుకుని అప్పులు చేస్తూ... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెడుతున్నారని విమర్శించారు. శాంతి భద్రతలపై ప్రస్తుత కూటమి ప్రభుత్వం పట్టుకోల్పోయిందని, రాష్ట్రంలో ఎక్కడ చూసినా... అనేక దారుణాలు జరుగుతు న్నాయన్నారు. నాయకులు పర్యటించేటప్పుడు ప్రజా ప్రతినిధులను హౌస్ అరెస్టు చేసి పర్యటించిన దాఖలాలు పిఠాపురంలో గతంలో ఎప్పుడూ చూడలేదని, ఇటీవల ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిఠాపురంలో పర్యటించినప్పుడు ప్రజలచే ఎన్నుకోబడిన కౌన్సిలర్లనుప్రజలచే ఎన్నుకోబడిన కౌన్సిలర్లను, నాయకులను కట్టుబట్టలతో ఉన్నఫలంగా అదుపులోకి తీసుకుని వివిధ పోలీస్ స్టేషన్లలో నిర్బంధించారని, రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఎక్కడుందని, ప్రజాస్వామ్ రాష్ట్రంలో లేదు అనడానికి మొన్న పిఠాపురంలో జరిగిన సంఘటనే ఉదాహరణ అన్నారు. స్కూల్ లు, కాలేజీలు హాస్టల్ వంటి వాటిని సైతం ప్రైవేటు పరం చేసే దిశగా అడుగులు వేస్తున్నట్లు వార్తలు వినవస్తున్నాయని, అది ఎంతవరకు నిజమో తెలియదు గాని అదే నిజమైతే బ్రిటిష్ పాలన మరొకసారి తెచ్చినట్లేనని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## బీమా భాయ్ మహిళా మండలి సేవలు భేష్: ఎమ్మెల్యే దాట్ల

**- రోగులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ**



**తాళ్ళరేవు (మనసులో మాట), జనవరి 13:** ఏడు మండలాలలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న బీమా భాయ్ మహిళా మండలి సేవలు అభినందనీయమని ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు అన్నారు. తాళ్లరేవులోని మహిళా మండలి కేంద్ర కార్యాలయంలో జరిగిన రోగనిరోధక శక్తి లోపించిన బాధితులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఒకవైపు ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలకి ఇలాంటి స్వచ్ఛంద సంస్థల తోడ్పాటు అవసరమని ఆయన అన్నారు. గత 30 సంవత్సరాలుగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్న మహిళా మండలి వ్యవస్థాపకురాలు వాసంశెట్టి నందివర్ధనను ఆయన అభినందించారు. మెంథా తుఫాను సందర్భంగా ఇవ్వాల్సిన ఈ పౌష్టికాహారాన్ని ఇప్పుడు పంపిణీ చేసినట్లు నందివర్ధన తెలిపారు. 7 మండలాల పరిధిలోని అనేకమంది మంది రోగ నిరోధక శక్తి లోపించిన బాధితులకు పౌష్టికాహార కిట్లు అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు టేకుమూడి లక్ష్మణరావు, ఉంగరాల వెంకటేశ్వరరావు, ధూళిపూడి వెంకట రమణ, నడింపల్లి వినోద్, వాసంశెట్టి శ్రీనివాస్, జక్కల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**భారత జనగణన 2027కు**

## జిల్లాలో సన్నాహక చర్యలు ప్రారంభం

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలు మేరకు సెన్సస్ అధికారులు నియామకం.**



**ఏలూరు, జనవరి 13(మనసులో మాట)..** భారత జనగణన 2027 నిర్వహణకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన మార్గదర్శకాలను అనుసరించి జిల్లాలో అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి తెలిపారు. మంగళవారం న్యూ ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమీక్షా సమావేశంలో కేంద్ర ప్రభుత్వ డైరెక్టరు ఆఫ్ సెన్సెస్ జె.నివాస్ పాల్గొనగా, అమరావతి నుంచి సర్వీసెస్ ప్రత్యేక చీఫ్ కార్యదర్శి శ్రీ ఎస్.కె.రావత్ పాల్గొని జిల్లా కలెక్టర్లుకు దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ జనగణన2027కు జిల్లాలో అధికార యంత్రాంగం సిద్ధం చెయ్యడం జరుగుతుంది అని తెలియ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన మార్గదర్శకాలను పూర్తిగా అమలు చేస్తూ జనగణన 2027ను విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తుందని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో ఛార్జ్ సెన్సస్ ఆఫీసర్లుగా మున్సిపల్ కమిషనర్లను, గ్రామీణ ప్రాంతాల్లో తహశీల్దార్లను నియమించనున్నట్లు వివరించారు. జిల్లా, ఉప విభాగ, మండల, పట్టణ స్థాయిల్లో సెన్సస్ అధికారులుగా వివిధ శాఖల అధికారులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయాన్ని జిల్లా కలెక్టరు పేర్కొన్నారు.పోలవరం సంబంధించిన కొన్ని గ్రామాలు, ఆర్&ఆర్ కాలనీలో ఉన్న ఇబ్బందులను గైడ్లెన్స్ ప్రకారం ప్లాన్ చేసుకుని జనాభా లెక్కలు మొదటివిడత కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని తెలిపారు.

## ఎస్. యానం బీచ్‌లో సంక్రాంతికి బందోబస్తు పరిశీలన

**- పర్యాటకుల భద్రతకు ప్రాధాన్యం: ఎస్పీ రాహుల్ మీనా**



**అమలాపురం (మనసులో మాట) జనవరి 13..**సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఉప్పలగుప్తం మండలం ఎస్ యానం బీచ్ వద్ద గోవా ఫెస్టివల్ ను ఈనెల 14 15 16 నిర్వహించనున్న నేపథ్యంలో ఎస్. యానం బీచ్‌లో చేపట్టిన భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ రాహుల్ మీనా మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పండుగ రోజుల్లో పర్యాటకులకు ఇబ్బంది కలగకుండా, అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వాహనాల రద్దీ వల్ల అంతరాయం కలగకుండా ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు ఎస్పీ సూచించారు. మహిళలు, పిల్లల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించి ఆకతాయిల పట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. బీచ్ సేఫ్టీ: సముద్ర స్నానాల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని ఎస్పి సూచించారు. ఆయన వెంట అమలాపురం ఎమ్మెల్యే ఆనందరావు,డిఎస్పి టి.ఎస్.ఆర్.కే. ప్రసాద్, రూరల్ సీఐ ప్రశాంత్ కుమార్, ఎస్సై రాజేష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ప్రజలు పోలీస్ సూచనలు పాటిస్తూ పండుగ జరుపుకోవాలని ఎస్పీ కోరారు.

## పిఠాపురంలో కోడిపందాలు జుధాలపై కఠిన నిఘా

కాకినాడ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, సంక్రాంతి పండుగ సందర్భంగా పిఠాపురం మండలంలో కోడిపందాలు, జూద క్రీడల నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలని అధికారులు నిర్ణయించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ పి.వి.వి.గోపాల కృష్ణ అధ్యక్షతన ముందస్తు నివారణ చర్యలపై మండల స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు.

**హాట్‌స్పాట్‌ల గుర్తింపు - ప్రత్యేక బృందాల ఏర్పాటు**

గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, మండలంలో కోడిపందాలు నిర్వహించే అవకాశం ఉన్న కొన్ని ప్రాంతాలను 'హాట్‌స్పాట్‌లు'గా గుర్తించినట్లు తహశీల్దార్ తెలిపారు . వీటిని కట్టడి చేసేందుకు మండల, గ్రామ స్థాయిల్లో సంయుక్త తనిఖీ బృందాలను ఏర్పాటు చేశారు . జూదాలు, కోడిపందాలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని, నిబంధనలు ఉల్లంఘించే నిర్వాహకులపై బైండోవర్ కేసులు నమోదు చేయాలని పోలీసు శాఖను ఆదేశించారు.

**డిజిటల్ బెట్టింగ్‌లపై నిఘా:**

కేవలం మైదానాల్లోనే కాకుండా, ఆన్‌లైన్ బెట్టింగ్, లైవ్ స్ట్రీమింగ్, ఆన్‌లైన్ నగదు బదిలీల ద్వారా సాగే జూద ప్రక్రియపై కూడా పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సదస్సులు నిర్వహించాలని, హెచ్చరికలను బేఖాతరు చేస్తే కఠినమైన చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో పిఠాపురం పట్టణ, గ్రామీణ పోలీసు అధికారులు, పశు సంవర్ధక శాఖ అధికారులు, జంతు హింస నివారణ సంఘ సభ్యులు పాల్గొని, సమన్వయంతో పనిచేయాలని నిర్ణయించారు. ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరించి ఎవరైనా జుధాలను నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



**వీరులమ్మ తల్లి దీవెనలతో**

## 'రక్ష' షార్ట్ ఫిలిం ప్రారంభం

**భక్తిభావంతో షార్ట్ ఫిలిం రూపకల్పన.. దర్శకుడు ఎస్వీ త్రివర్ రెడ్డి**



**అనపర్తి ( మనసులో మాట) జనవరి 13:** రాష్ట్రవ్యాప్తంగా ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న అనపర్తి గ్రామదేవత వీరులమ్మ తల్లి మహత్యాన్ని చాటిచెప్పేందుకు దర్శకుడు ఎస్వీ త్రివర్ రెడ్డి శ్రీకారం చుట్టారు. మంగళవారం స్థానిక ఆలయ పరిసరాల్లో "రక్ష" అనే షార్ట్ ఫిలిం చిత్రీకరణను స్థానిక నేత్ర వైద్యులు డాక్టర్ తేతలి సత్యనారాయణ రెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా దర్శకుడు ఎస్వీ త్రివర్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రం నలుమూలల నుండి భక్తులు తరలివచ్చే వీరులమ్మ తల్లి జాతర వైభవాన్ని, అమ్మవారి రక్షణ కవచంలాంటి కృపాకటాక్షాలను, ఈ చిత్రం ద్వారా ఆవిష్కరిస్తున్నట్లు తెలిపారు. తన స్నేహితులు, బంధువుల కోరిక మేరకు, గ్రామ దేవతపై ఉన్న అమితమైన భక్తితో ఈ లఘుచిత్రాన్నిరూపొందిస్తు నట్లు పేర్కొన్నారు. నటీనటులు,ఈ చిత్రంలో విక్రమ్ మహాదేవ్ కథానాయకుడిగా, లక్ష్మి కథానాయికగా నటిస్తున్నారు. బుధ గురు శుక్రవారాలలో జరగనున్న వీరులమ్మ తల్లి జాతర సమయంలో, అశేష భక్తజనవాహిని మధ్యే కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నట్లు, చిత్ర యూనిట్ వెల్లడించింది. ఈ చిత్ర నిర్మాణానికి సహకరిస్తున్న వీరులమ్మ ఆలయ కమిటీ (స్థానిక కమిటీ) సభ్యులకు దర్శకుడు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనపర్తి ప్రాంత సంస్కృతిని, వీరులమ్మ తల్లి విశిష్టతను ప్రతిబింబించేలా సాగే ఈ 'రక్ష' షార్ట్ ఫిలిం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుందిఅని తెలిపారు. ఈ కార్యక్రమంలో తమలంపూడి సుధాకర్ రెడ్డి నల్లమిల్లి నాగిరెడ్డి, కళ్యాణ్ రెడ్డి, షార్ట్ ఫిలిం లో నటించే నటీనటులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్ర మంత్రి కొలుసు పార్ధసారధి రాష్ట్ర ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు



**ఏలూరు/ నూజివీడు,జనవరి 13(మనసులో మాట)** రాష్ట్ర ప్రజలకు రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్ధసారథి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్ధసారథి మాట్లాడుతూ భారతీయ సంస్కతి, సంప్రదాయాలను ప్రతిబింబించే పండుగ సంక్రాంతి అని అన్నారు. తమ స్వగ్రామాలకు తిరిగి వెళ్ళి, తమ కుటుంబ, సాంస్కృతిక మూలాలకు



విలువనిచ్చే పెద్ద పండుగ సంక్రాంతి అని, భోగి మంటలు, రంగ వల్లులు, హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దులు ఆటలు, గాలి పటాల సందళ్ళు, రైతు లోగిళ్ళలో ధాన్యం రాసులు, పిండి వంటలు, బంధు మిత్రుల సందళ్ళతో కనువిందు చేసే మనందరి పండుగ సంక్రాంతి అన్నారు. వ్యవసాయ ప్రధానమైన మనదేశంలో పంటలు చేతికి వచ్చే కాలం ఇది అని, సంపదను, ఆనందాన్ని కుటుంబంతో, సమాజంతో పంచుకుని సంతోషించే వేడుక సంక్రాంతి అన్నారు. పాడి పంటలు సమృద్ధిగా ఇళ్లకు వచ్చే కాలం కావడంతో భోగి అంటే భోగ భాగ్యాలను అనుభవించే రోజుగా ఉంటుందన్నారు. పాతకు స్వస్తి చెప్పి నూతనత్వానికి స్వాగతం పలుకుతూ ప్రతి ఇంటి ముందు భోగి మంటలు, రంగవల్లుల శోభతో దివ్యత్వం, కళా నైపుణ్యం గోచరిస్తాయాన్నారు. స్నానం, దానం, పితృతర్పణం, దేవతలను పూజించడం వంటివి సంక్రాంతి పండుగలో భాగంగా ఉంటాయన్నారు. సంక్రాంతి పండుగతో రాష్ట్రంలో ప్రతి ఇంటిలో సిరులు వెల్లివిరియాలని మంత్రి కొలుసు పార్ధసారథి ఆకాంక్షించారు.

**టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన**

## యువ నాయకుడు మనోజ్ రెడ్డి



**అనపర్తి (మనసులో మాట) జనవరి 13:** అనపర్తి మండలం రామవరంలో కుతుకులూరు వైస్సార్సీపీ నాయకులు మాజీ ఉపసర్పంచ్, ఆత్మ కమిటీ మాజీ మెంబర్ పడాల శ్రీనివాసరెడ్డి, వైస్సార్సీపీ కుతుకులూరు గ్రామ శాఖ అధ్యక్షులు కొవ్వూరి సత్యనారాయణరెడ్డి (పెద్దోడు), మరియు 15 కుటుంబాలకు టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన యువ నాయకులు మనోజ్ రెడ్డి. ఈ కార్యక్రమంలో అనపర్తి మండలం టిడిపి నాయకులు, కుతుకులూరు గ్రామ టిడిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# గాదె ఇన్నయ్య ఆశ్రమం, ఇంట్లో ఎన్ఐఏ సోదాలు



**జనగామ, జనవరి 13:** సామాజిక ఉద్యమకారుడు గాదె ఇన్నయ్యకు చెందిన జాఫర్‌ఘడ్ ప్రాంతంలోని మాఇల్లు అనే పేరుతో ఉన్న అనాథశ్రమంలో మంగళవారం ఉదయం నుంచి నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఎన్ఐఏ సిబ్బందితో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. అనాథాశ్రమంలో మంగళవారం ఉదయం నుంచే ఎన్ఐఏ అధికారులు బృందాలుగా విడిపోయి.. ఆశ్రమంలోని రికార్డులు, కంప్యూటర్లు, ఇతర పత్రాలను నిశితంగా పరిశీలించారు. ఎన్ఐఏ సోదాలు చేస్తుండటంతో మీడియా ఆ ప్రాంతానికి చేరుకుంది. అయితే సోదాలు జరుగుతున్న సమయంలో సమాచారం బయటకు రాకుండా మీడియాను లోపలికి అనుమతించకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. ఇన్నయ్యను ఎన్ఐఏ ఇప్పటికే అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఆయనపై ఉపా చట్టం కింద కేసు నమోదు చేశారు. రిమాండ్‌లో ఉన్న ఇన్నయ్యను ఎన్ఐఏ విచారిస్తోంది. ఈ విచారణలో పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. విచారణలో భాగంగానే ఇన్నయ్యకు సంబంధించిన అనాథాశ్రమంలో జరిగే కార్యకలాపాలు, ఆర్థిక లావాదేవీలు తదితరాలను పరిశీలిస్తున్నట్లు సమాచారం. జనగామ జిల్లా జాఫర్‌గఢ్‌లో జరుగుతున్న ఈ పరిణామాలు సంచలనం రేపుతున్నాయి. ఎన్ఐఏ అధికారులు ఒక అనాథాశ్రమంపై దృష్టి సారించడం, 'ఉపా' చట్టం కింద చర్యలు తీసుకోవడం ఈ కేసు తీవ్రతను తెలియజేస్తోంది.

# పరేడ్ గ్రౌండ్స్ వేదికగా కైట్ ఫెస్టివల్



### 19 దేశాల నుంచి కైట్ ఫ్లయర్స్ హాజరు

**హైదరాబాద్, జనవరి 13:** కనువిందు చేసే కైట్లు, నో రూరించే స్వీట్లతో.. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ వేదికగా జరుగుతున్న ఇంటర్నేషనల్ స్వీట్స్ అండ్ కైట్స్ ఫెస్టివల్ మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమం నగర వాసులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. తెలంగాణా పర్యాటక శాఖ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోన్న ఈ గ్రాండ్ ఈవెంట్‌కు దాదాపు 19 దేశాల నుంచి కైట్ ఫ్లయర్స్ హాజరయ్యారు. ఇక దేశంలోని వివిధ నగరాలకు చెందిన దాదాపు 50 మంది నేషనల్ కైట్ ఫ్లయర్స్, జంట నగరాలతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన యువత సైతం భారీగా ఈ పంతగులు ఎగురవేసే కార్యక్రమానికి హాజరైంది. చిన్న స్థాయి నుంచి భారీ గాలి పటాలను పరేడ్ గ్రౌండ్స్ నుంచి ఎగురవేస్తున్నారు. థాయ్‌లాండ్, ఇండోనేషియా, ఆస్ట్రేలియా, నైజీరియా, కెనడా, జపాన్, ఫ్రాన్స్, ఇటలీ, రష్యా, స్విట్జర్లాండ్, మలేషియా తదితర దేశాలకు చెందిన కైట్స్‌తో స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఇవి ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటున్నాయి. మరోవైపు స్వీట్ ఫెస్టివల్‌లో భాగంగా 60స్టాల్స్ ఏర్పాటు చేశారు. దాదాపు 200 మంది పోలీసులతో పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటుచేశారు. కైట్‌ఫెస్టివల్ 3రోజుల పాటు అంటే.. జనవరి 13 నుంచి 15వ తేదీ వరకు జరగనుంది. ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఇక హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్‌ను హైదరాబాద్ శివార్లలోని మూడు ప్రదేశాలలో నిర్వహిస్తున్నారు. ఉదయం, సాయంత్రం పరేడ్ గ్రౌండ్స్‌లో వీటిని ఏర్పాటు చేయనున్నారు. జనవరి 16 నుంచి 19వ తేదీ వరకు రాత్రి 9:00 గంటల వరకు వీటిని నిర్వహించనున్నారు.

# మహిళా ఐఏఎస్‌ఇష్యూపై సజ్జనార్‌తో సిట్

- సీఎం ఫొటోల మార్ఫింగ్‌పై కూడా..
- 8 మంది సభ్యులతో ప్రత్యేక బృందం




**హైదరాబాద్, జనవరి 13:** హైదరాబాద్ సీసీఎస్‌తో పాటు నారాయణపేట జిల్లా మద్దూర్‌లో నమోదైన సంచలన కేసుల్లో తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి ప్రత్యేక దర్యాప్తు బృందంను ఏర్పాటు చేశారు. ఈ సిట్‌కు హైదరాబాద్ సీపీ సజ్జనార్ నాయకత్వం వహించనున్నారు. మొత్తం 8 మంది సభ్యులతో ఈ ప్రత్యేక బృందాన్ని డీజీపీ ఏర్పాటు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫొటోలను అసభ్యకరంగా పోస్ట్ చేసిన వ్యవహారంలో తెలంగాణా పబ్లిక్ టీవీ వాట్సాప్ గ్రూప్‌నకు చెందిన కావలి వెంకటేశ్‌పై కేసు నమోదైంది. కాంగ్రెస్ నేత గూళ్ల నరసింహ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ నెల 11న మద్దూర్ పోలీసులు కేసు నమోదు చేశారు.ాజాగా ఓ మహిళా ఐఏఎస్ అధికారిని కించపరిచే విధంగా వార్తలు టెలికాస్ట్ చేసిన వ్యవహారంలో హైదరాబాద్ సీసీఎస్‌లో మరో కేసు నమోదైంది. ఈ కేసులో రెండు తెలుగు న్యూస్ ఛానల్స్, ఏడు యూట్యూబ్ ఛానళ్లపై కేసులు నమోదు చేశారు. ఈ వ్యవహారంపై ఐఏఎస్ అధికారుల సంఘం కార్యదర్శి జయేశ్ రంజన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు చర్యలు చేపట్టారు. ఈ రెండు కీలక కేసుల్లో దర్యాప్తు బాధ్యతను సిట్‌కు అప్పగించారు. నారాయణపేట జిల్లా మద్దూర్, హైదరాబాద్ సీసీఎస్‌లో నమోదైన కేసులపై విచారణకు తెలంగాణ ప్రభుత్వం సిట్ ఏర్పాటుచేసింది. హైదరాబాద్ సీపీ సజ్జనార్ నేతృత్వంలో 8 మందితో సిట్ ఏర్పాటు చేస్తూ డీజీపీ శివధర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. కావలి వెంకటేశ్ అనే వ్యక్తి సీఎం ఫొటోలను అసభ్యకరంగా రూపొందించి వాట్సప్ గ్రూపులో పోస్ట్ చేశాడు. మహిళా ఐఏఎస్‌ను కించపరుస్తూ వార్తలను ప్రచారం చేయడంపై సీసీఎస్‌లో కేసు నమోదు చేశారు. ఐఏఎస్ అధికారుల సంఘం ఫిర్యాదు మేరకు రెండు తెలుగు న్యూస్ ఛానళ్లతో పాటు ఏడు యూట్యూబ్ ఛానళ్లపై కేసులు పెట్టారు. ఈ రెండు కేసుల వ్యవహారంపై సిట్ దర్యాప్తు చేయనుంది. సిట్‌లో సభ్యులుగా నార్త్ రేంజ్ జాయింట్ సీపీ శ్వేత, చేవెళ్ల డీసీపీ యోగేశ్ గౌతమ్, హైదరాబాద్ అడ్మిన్ డీసీపీ వెంకటలక్ష్మి, సైబర్ క్రైమ్ డీసీపీ అరవింద్ బాబు, విజిలెన్స్ అదనపు ఎస్పీ ప్రతాప్, సీసీఎస్ ఏసీపీ గురు రాఘవేంద్ర, సైబర్‌సెల్ ఇన్‌స్పెక్టర్ శంకర్‌రెడ్డి, సైబర్‌సెల్ ఎస్సై హరీశ్ ఉన్నారు.

# చైనా మాంజా విక్రయాలపై నివేదిక ఇవ్వండి

### హైదరాబాద్ సీపీని ఆదేశించిన మానవహక్కుల కమిషన్

**హైదరాబాద్, జనవరి 13:** చైనా మంజా విక్రయాలు, వినియోగంపై రాష్ట్ర మానవ హ క్కుల కమిషన్ సీరియస్ అయింది. దీనిపై ఫిబ్రవరి 26లోగా పూర్తి నివేదిక సమర్పించాలని హైదరాబాద్ సీపీ సజ్జనార్‌ను ఆదేశించింది. తెలంగాణాలో బ్యాన్ చేసిన చైనా మాంజా వాడకం వల్ల జరుగుతున్న గాయాలు, మరణాలపై హ్యూమన్ రైట్స్ అడ్వకేట్ ఇమ్మానేని రామారావు తెలంగాణ స్టేట్ హ్యూమన్ రైట్స్ కమిషన్‌లో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. డిసెంబర్ 30న దాఖలైన ఈ పిటిషన్‌లో.. చైనా మాంజా పూర్తిగా నిషేధించాలని, విక్రయాలు, ఉపయోగంపై కఠిన చర్యలు తీసుకోవాలని రామా రావు కోరారు. పిటిషన్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం.. రాష్ట్రవ్యాప్తంగా చైనా మాంజా వల్ల తీవ్రమైన గాయాలు, మరణాలు సంభవిస్తున్నాయి. కీసరలో జశ్వంత్ రెడ్డి అనే ఓ బాలుడు తీవ్ర గాయాలపాలయ్యాడు, షమ్షేర్‌గంజ్‌లో జమీల్ అనే వ్యక్తి మెడచుట్టూ లోతైన కోతపడి సుమారు 22 కుట్లు పడ్డాయి. ఈ మాంజా గాజు లేదా మెటల్ కోటింగ్ తో తయారవుతుంది. దీనిని పతంగుల పోటీల్లో ఉపయోగిస్తుంటారు. ఇది చాలా ప్రమాదకరమైనది అని పిటిషనర్ విన్నవించారు. చైనా మాంజాపై పూర్తి నిషేధం అమలు చేయాలని.. ఈ-కామర్స్ వెబ్‌సైట్లలో దీని అమ్మకాలపైనా చర్యలు తీసుకోవాలని పిటిషనర్లు కోరుతున్నారు. కాగా.. ఇటీవల హైదరాబాద్ పోలీసులు చైనా మాంజా విక్రయాలపై దాడులు చేసి, రూ.1.24 కోట్ల విలువైన స్టాక్ సీజ్ చేశారు. 143 మందిని అరెస్ట్ చేశారు.



# కుంభమేళాను మించి మహాజాతర

### రూ.250 కోట్లకుపైగా నిధులతో పనులు

- సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక పర్యవేక్షణ
- మేడారం జాతర ఏర్పాట్లపై మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, సీతక్క

**హైదరాబాద్, జనవరి 13:** ఈ నెల 28వ తేదీ నుండి 31వ తేదీ వరకు జరిగే మే డారం సమ్మక్క, సారలమ్మ జాతరకు ఈసారి గతంకన్నా రెట్టింపు సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున ప్రభుత్వంలోని వివిధ శాఖలు సమన్వ యంతో పనిచేసి భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని మంత్రులు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, సీతక్క అన్నారు. మేడారం జాతరపై స చివాలయంలో జరిగిన ఉన్నత స్థాయి సమీక్ష సమావేశంలో మంత్రులు, అధికారులు పాల్గొన్నారు. ప్రభుత్వ ప్ర ధాన కార్యదర్శి రామకృష్ణరావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు అరవింద్ కుమార్, సబ్యసాచి ఘోష్, అడిషనల్ డీజీలు విజ య్ కుమార్, స్వాతి లక్రా, వివిధ శాఖ కార్యదర్శులు,ములుగు జిల్లా కలెక్టర్ దివాకర తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ, గత జాతరకు కోటిన్నర మంది హాజరుకాగా, ఈసారి గతంలో ఎన్నడూ లేనివిధంగా రూ.150 కోట్ల నిధులను మంజూరు చేసి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నందున ఈసారి దాదాపు మూడు కోట్ల మంది భక్తులు హాజరవుతారని అంచనా వేస్తున్నామని వివరించారు. సమ్మక్క-సారలమ్మ జాతరను కుంభమేళాకు మించి అద్భుతంగా నిర్వహించి, రాష్ట్ర ప్రభుత్వానికి జాతీయస్థాయిలో మంచి పేరు తీసుకు రావాలని అడ్లూరి పిలుపునిచ్చారు. ఈ మహాజాతరను విజయవంతంగా నిర్వహించడం ప్రతి అధికారికి ఒక బాధ్యతగా తీసుకుని, ఏ చిన్న లోపం కూడా లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆయన సూచించారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి నాయకత్వంలో ఈ జాతరకు రూ.150 కోట్లకుపైగా నిధులు కేటాయించి అత్యంత ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. ఈ నిధులతో మౌలిక వసతులు, భద్రత, రవాణా, పారిశుద్ధ్యం, వైద్య సేవలు వంటి అన్ని విభాగాల్లో సమగ్ర ఏర్పాట్లు చేయనున్నట్లు చెప్పారు. ఏ ఒక్క భక్తుడికి కూడా ఇబ్బంది కలగకూడదన్నదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేసిన మంత్రి, జాతరకు వచ్చే భక్తులు సులభంగా గమ్యానికి చేరుకునేలా అన్ని ప్రధాన రహదారులు, అంతర్గత మార్గాల్లో స్పష్టమైన దిశా సూచిక బోర్డులు, బ్యానర్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తులు ఎలాంటి అయోమయానికి గురికాకుండా ట్రాఫిక్ నియంత్రణ పటిష్టంగా ఉండాలని, ప్రత్యేక రూట్ మ్యాప్‌లతో పాటు అవసరమైన చోట వన్‌వే వ్యవస్థ అమలు చేయాలని సూచించారు. ఈ జాతరపై క్యాబినెట్ మొత్తం ప్రత్యేక దృష్టి సారించిందని, మంత్రులందరూ సమన్వయంతో పనిచేస్తూ ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నారని తెలిపారు. ఇలాంటి స్థాయి సమిష్టి పర్యవేక్షణ గతంలో ఎప్పుడూ జరగలేదని ఆయన పేర్కొన్నారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్ సహా పలు రాష్ట్రాల నుంచి లక్షలాదిగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున, అందుకు అనుగుణంగా సౌకర్యాలను విస్తృతంగా ఏర్పాటు చేయాలని తెలిపారు. పార్కింగ్ విషయంలో వీఐపీలు,సామాన్య భక్తులు అనే తేడా లేకుండా, అందరికీ సమాన సౌకర్యాలు కల్పించాలని స్పష్టం చేశారు. రాష్ట్ర పంచాయితీ రాజ్, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) మాట్లాడుతూ, ఈసారి జాతర ఏర్పాట్లకు రూ.150కోట్లతోపాటు గ్దదెల పునరుద్ధరణ పనులకు రూ.101 కోట్లు మొత్తం 251 కోట్లను రాష్ట్ర ముఖ్యమంత్రి మంజూరు చేశారని వివరించారు. జాతరకు వచ్చే ప్రతీ భక్తులకు సాఫీగా దర్శనం లభించేలా ప్రాధాన్యత నిస్తున్నట్టు అన్నారు. ఇందుకు గాను ప్రతీ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. రాష్ట్ర స్థాయిలో వివిధ శాఖ కార్యదర్సులు, హెచ్‌ఓడీలతో ప్రత్యేకంగా వాట్స్-అప్ గ్రూప్‌ను ఏర్పాటు చేసి జాతర నిర్వహణపై ప్రత్యేకంగా పర్యవేక్షించాలని సీతక్క సూచించారు. జాతర సందర్భంగా గురు, శుక్ర వారాల్లోనే ప్రతి రోజు కనీసం 40 లక్షల మంది భక్తులు ఉంటారని, ఇందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. మేడారం జాతరకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 2010 నుండి ప్రతీ సం వత్సరం వస్తున్నారని, వచ్చే వందేళ్లకు సరిపడా అభివృద్ధి కార్యక్రమాలకు మొట్టమొదటిసారిగా పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేశారని సీతక్క గుర్తు చేశారు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు మాట్లాడుతూ, జాతర నిర్వహణ ఏర్పాట్లపై ముఖ్యమంత్రి నిరంతరం పర్యవేక్షి స్తున్నందున అన్ని శాఖల ఉన్నతాధికారులు జాతర పనులకు సకాలంలో పూర్తయ్యేలా ప్రత్యేక దృష్టి సాధించాలని పేర్కొన్నారు. జాతర సందర్భంగా భక్తులకు చేసిన ఏర్పాట్లు, రవాణా, ఇతర సౌకర్యాలు, భక్తులు పాటించాల్సిన సూచనలపై విస్తృత స్థాయిలో సమాచారాన్ని అందించాలని తెలిపారు. మేడారానికి వచ్చే ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ నియంత్రణకుగాను డ్రోన్ లను ఉపయోగించుకోవాలన్నారు. అదేవిధంగా, జాతర సమాచారాన్ని, నియమ నిబంధనలను తెలియచేసే ప్రత్యేక యాప్ ను/ క్యూ.ఆర్ కోడ్ రూపొందించి విస్తృతంగా ప్రచారం చేయాలని అన్నారు. పార్కింగ్ ఏరియాలలో కూడా ప్రత్యేకంగా వాటర్, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. శానిటేషన్, పరిశుభ్రతపై ప్రత్యేక ద్రుష్టి సాధించాలన్నారు. ప్రస్తుతం మేడారంలో జరుగుతున్న జాతర ఏర్పాట్లు, పురోగతి తదితర విషయాలను తెలియచేసే నివేదికను ప్రతీ రోజూ తమకు సమర్పించాలని సంబంధిత శాఖల కార్యదర్శులను కోరారు. ఈ సందర్భంగా, మేడారం జాతరకు వివిధ శాఖలు చేస్తున్న ఏర్పాట్లు, చేపట్టిన పనులు, వాటి పురోగతి పై ములుగు జిల్లా కలెక్టర్ దివాకర పవర్ పాయింట్ ప్రసెంటేషన్ ద్వారా వివరించారు. ఈసారి జాతరకు దాదాపు మూడు కోట్ల మంది హాజరవుతారని అంచనా వేసినట్లు తెలిపారు. తదితర ప్రారంభానికి ముందే దాదాపు 30 శాతం భక్తులు సందర్శిస్తారని అన్నారు. జాతర సమయంలో 60 శాతం నుండి 65 శాతం వరకు, జాతర అనంతరం 5 శాతం భక్తులు మేడారం సందర్శిస్తారని వివరించారు. మేడారం జాతరపై ములుగు జిల్లా యంత్రాంగం రూపొందించిన ప్రత్యేక లోగో, యాప్, వీడియోలను మంత్రులు సీతక్క, లక్షణ్ కుమార్, సి.ఎస్ రామకృష్ణరావులు ఆవిష్కరించారు.

## 18న మేడారంలో కేబినేట్ భేటీ?

**హైదరాబాద్, జనవరి 13:** రేవంత్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈ నెల 18న ములుగు జిల్లా మేడారంలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. రాజదాని వెలుపల కేబినేట్ భేటీ జరపాలని నిర్ణయించడం ఇటీవల ఇదే ప్రథమం. అయితే సీఎం షెడ్యూల్ కారణంగా అక్కడ నిర్వహించేందుకు నిర్ణయించినట్లు సమాచా రం. దీనిపై అధికారికంగా సమాచారం తెలియాల్సి ఉంది. 'సమ్మక్క సారలమ్మ మేడారం మహాజాతర' ఈ నెల 28న ప్రారంభం కానుండడంతో.. సంప్రదాయానికి భిన్నంగా ఈసారి మేడారంలో క్యాబినెట్ భేటీ నిర్వహించనున్నట్లు సమాచారం. 18న ఉదయం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పలు అభివృద్ధి పనులకు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపనలు చేస్తారు. అక్కడే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొంటారు. అనంతరం సీపీఐ వంద సంవత్సరాల వేడుకకు హాజరవుతారు. అదే రోజు సాయంత్రానికి ముఖ్యమంత్రి సహా మంత్రివర్గం మేడారం చేరుకుంటుంది. 5 గంటల తర్వాత క్యాబినెట్ సమావేశమయ్యే అవకాశాలున్నాయి. 19న ఉదయం అమ్మవార్ల నూతన ప్రాంగణ ప్రారం భోత్సవం, దర్శనం అనంతరం ముఖ్యమంత్రి హైదరాబాద్‌కు తిరుగు పయనమవుతారు. అదే రోజు రాత్రి దావోస్‌కు వెళ్తారు. 18న మేడారంలో నిర్వహించాలని యోచిస్తున్న మంత్రివర్గ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించనున్నారు. ముఖ్యంగా త్వరలో పురపాలక ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల కానున్న నేపథ్యంలో పట్టణాభివృద్ధి పథకాలపై చర్చించే అవకాశముంది. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలపైనా క్యాబినెట్ భేటీలో నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి. ఫిబ్రవరి 1న కేంద్ర బ్జడెట్ ప్రవేశపెట్టనుండడం తో అందుకు అనుగుణంగా శాఖల వారీగా రాష్ట్ర బడ్జెట్ రూపకల్పనపై ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేయనున్నట్లు తెలిసింది. రైతుభరోసా నిధుల విడుదల, హ్యామ్ రోడ్లు, తదితర అంశాలపైనా నిర్ణయాలు తీసుకునే అవకాశముంది.



# సీఎం రేవంత్‌పై వ్యాఖ్యలపై నొచ్చుకున్న తలసాని

## ఆవేశంతో చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నా

## సికింద్రాబాద్‌పై రాజీలేని పోరాటం చేస్తాం

## ఈ నెల 17న శాంతి ర్యాలీ చేపడున్నట్లు తలసాని ప్రకటన

**హైదరాబాద్, జనవరి 13:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారడంతో. దీనిపై తలసాని స్పందిస్తూ.. సీఎం రేవంత్ రెడ్డిపై తాను చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకుంటున్నట్లు తెలిపారు. మంగళవారం నాడు తలసాని మాట్లాడుతూ.. 'సికింద్రాబాద్‌ను ముక్కలు ముక్కలుగా చేస్తే ముక్కలుగా చేస్తా' అనే మాటల్లో ఆవేశం తప్ప వేరే ఉద్దేశం లేదని స్పష్టం చేశారు. రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్నవారంటే తనకు గౌరవం ఉందని ఆయన తెలిపారు. తమ ప్రాంతాన్ని కాపాడుకోవడం తప్ప వేరే ఉద్దేశం లేదని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తెలుసుకోవాలని సూచించారు. 220ఏళ్ల చరిత్ర గల సికింద్రాబాద్ ఇమేజ్‌ను దెబ్బతీసే కుట్రలు చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. సికింద్రాబాద్ అస్తిత్వాన్ని కాపాడుకోవడం కోసం పోరాటం చేస్తున్నామని వివరించారు. సికింద్రాబాద్‌ను ప్రత్యేక కార్పొరేషన్‌గా ప్రకటించి తీరాల్సిందేనని మాజీ మంత్రి డిమాండ్ చేశారు. ఈ అంశంపై నిరసనగా ఈ నెల 17న భారీ శాంతి ర్యాలీ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ ర్యాలీ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి ప్రారంభమై క్లాక్ టవర్, ప్యాట్నీ, ప్యారడైజ్ మీదుగా ఎంజీ రోడ్‌లోని గాంధీ విగ్రహం వరకు సాగుతుందని వెల్లడించారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి సికింద్రాబాద్ ప్రత్యేక కార్పొరేషన్ ప్రకటన సాధించేందుకు ఈ ర్యాలీ నిర్వహించనున్నట్లు తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు. సికింద్రాబాద్‌ను ముట్టుకోవడం లేదని సీఎం రేవంత్ రెడ్డి చెబుతున్నారని.. కానీ సికింద్రాబాద్‌లోని పలు పోలీస్ స్టేషన్లు మల్కాజిగిరి జోన్లో కలిపింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు తలసాని. అలాగే సికింద్రాబాద్ పరిధిలోని పలు డివిజన్‌లను మల్కాజిగిరి జోన్ పరిధిలోని బోయిన్ పల్లి సర్కిల్‌లో చేర్చారని ఆరోపించారు. సికింద్రాబాద్ జీహెచ్‌ఎంసీలోనే ఉందంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన తప్పుడు ప్రకటన ప్రజలను మభ్యపెట్టడానికే అంటూ విమర్శించారు.

# జనగామ జిల్లాలను రద్దు చేస్తే అగ్నిగుండమే

## ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర రెడ్డి హెచ్చరిక



**జనగామ, జనవరి 13:** జిల్లాల పునర్వ్యవస్థీకరణ పేరుతో జనగామ జిల్లాను రద్దు చేయాలని చూస్తే జిల్లా అగ్నిగుండం అవుతుందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి హెచ్చరించారు. జనగామలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని ఆరు జిల్లాలను కలిపి తిరిగి వరంగల్ జిల్లాగా ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేలు నాయుని రాజేందర్‌రెడ్డి, కడియం శ్రీహరి మాట్లాడు తున్నారని మండిపడ్డారు. పోరాడి సాధించుకున్న జనగామ జిల్లాను రద్దు చేయాలని చూస్తే ఇక్కడి ప్రజలు ఊరుకోరన్నారు. జిల్లాకు సర్వాయి పాపన్న పేరును పెడతామని కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టి, ఇప్పుడు ఏకంగా జిల్లానే లేకుండా చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. కడియం శ్రీహరి ముందు నుంచీ జనగామ జిల్లాను వ్యతిరేకించారని గుర్తు చేశారు. జనగామ జిల్లాను మూసేయాలని చూస్తే ప్రభుత్వమే మూత పడుతుందన్నారు. జనగామ జిల్లాను వరంగల్ కమిషనరేట్ పరిధి నుంచి తొలగించి ప్రత్యేకంగా ఎస్పీని కేటాయించాలన్నారు.

# బెట్టింగ్ యాప్‌కు మరో యువకుడు బలి

## చేసిన అప్పులు తీర్చలేక బలవన్మరణం

**నిజామాబాద్, జనవరి 13:** బెట్టింగ్ యాప్‌లను కట్టడి చేసేందుకు ప్రభుత్వం తన వంతు ప్రయత్నాలు చేస్తున్నా యువత మాత్రం పట్టించుకోవడం లేదు.. ఈ తరహా యాప్‌ల బారినపడవద్దంటూ యువతను గట్టిగా హెచ్చరిస్తోంది. అయినప్పటికీ కొందరు యువత వాటి కారణంగా బలవంతంగా ప్రాణాలు కోల్పోతున్నారు. తాజాగా ఈ తరహా ఘటన నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం కూనెపల్లిలో చోటు చేసుకుంది. 22 ఏళ్ల సంజయ్.. ఆన్‌లైన్‌లో బెట్టింగ్ ఆడడం కోసం భారీగా అప్పు చేశాడు. ఆ అప్పులు తీర్చాలంటూ అతడిపై ఒత్తిడి అధికమైంది. తాను బెట్టింగ్ కోసం భారీగా అప్పులు చేసిన విషయాన్ని కుటుంబ సభ్యులకు చెబితే.. తిడతారని సంజయ్ భయపడ్డాడు. దాంతో తీవ్ర ఆందోళన చెందిన అతడు గత్యంతరం లేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనతో అతడి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. సంజయ్ బలవన్మరణంపై పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి.. అతడి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్ట్‌మార్టం నిమిత్తం నిజామాబాద్ జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బెట్టింగ్ యాప్‌ల బారినపడి.. తెలుగు రాష్ట్రాల్లో వందల మంది యువకులు ఆత్మహత్యకు పాల్పడిన సంగతి తెలిసిందే. మరోవైపు బెట్టింగ్ యాప్‌ల ప్రచారం కేసులో పలువురు టాలీవుడ్ నటులను ఇప్పటికే సీఐడీ, సిట్ అధికారులు విచారించారు.. మరికొందరిపై ఇంకా విచారణ కొనసాగిస్తున్నారు. ఈ కేసులో ఇప్పటికే ప్రకాశ్ రాజ్, రాణా, మంచు లక్ష్మి తదితరులను సీఐడీ అధికారులు పలుమార్లు విచారించిన సంగతి తెలిసిందే. ఈ కేసు విచారణ ఇంకా కొనసాగుతోంది. బెట్టింగ్ యాప్‌ల జోలికి వెళ్లవద్దంటూ యువతకు టాలీవుడ్ నటులు స్పష్టమైన సూచనలు చేసిన విషయం విదితమే.

# గాంధీపేరుతో కాంగ్రెస్ నీచ రాజకీయం

- పథకాలతో సహా అన్నిటికి ఇందిరా, రాజీవ్ పేర్లేనా
- వాల్మీకి-అంబేడ్కర్ పేరున్న పథకం పేరు ఎందుకు మార్చారు
- కాంగ్రెస్ రాజకీయాలపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి
- కరీంనగర్ మున్సిపాలిటీలో బిజెపి జెండా ఎగరేస్తాం
- కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు



**కరీంనగర్, జనవరి 13:** ఉపాధి హామీ పథకం పేరు మార్చడంపై కాంగ్రెస్ చేస్తున్న రాజకీయాన్ని నీచ రాజకీయంగా కేంద్రమంత్రి బండి సంజయ్ అభివర్ణించారు. వాల్మీకీ-అంబేద్కర్ ఆవాస్ యోజన (వాంబే) పేరుతో వాజ్‌పేయి తీసుకొచ్చిన ఇండ్ల పథకాన్ని కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఎందుకు తీసేశారని ప్రశ్నించారు. వాల్మీకీ, అంబేద్కర్ పేర్లు తొలగించి ఇందిరా ఆవాస్ యోజనగా ఎందుకు మార్చారని, ఇది ఆ మహానుభావులను అవమానించడం కాదా అని విమర్శించారు. అలాగే గతంలో ఎన్టీఆర్ టెర్మినల్‌గా ఉన్న హైదరాబాద్ విమానాశ్రయ టెర్మినల్ పేరును తీసేసి రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుగా ఎందుకు మార్చారని బండి సంజయ్ ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలపై తీవ్ర విమర్శలు గుప్పించిన ఆయన.. గాంధీ పేరును వాడుకున్నారే తప్ప మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని కాంగ్రెస్ నేతలు పాతరేసి ఆయన ఆత్మను క్షోభకు గురిచేశారని ఆరోపించారు. వారసత్వ రాజకీయాలను గాంధీ వ్యతిరేకించారని గుర్తుచేశారు. అలాగే ఆయన పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ వ్యాఖ్యలపై స్పందించారు. రాముడి బాటలో నడుస్తామని, రాముడి ఆలయాలను నిర్మిస్తామని తాము చెప్పినప్పుడు కాంగ్రెస్‌కు నొప్పి ఎందుకు వస్తోందని ప్రశ్నించారు. ఉపాధి కూలీల వేతనాలను కూడా సకాలంలో ఇవ్వలేని కాంగ్రెస్ నేతలు మాట్లాడటం విడ్డూరమని విమర్శించారు. అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌కు మొత్తం రూ.50 కోట్లు విడుదల చేసినట్లు ఆయన వెల్లడించారు. ఇందులో కేంద్ర వాటా రూ.40 కోట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. ఈసారి కార్పొరేషన్‌పై కాషాయ జెండా ఎగరేయడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. అన్ని పార్టీల నేతలు బీజేపీలోకి రావడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. అవినీతి ఆరోపణలు లేదా రౌడీషీట్లు ఉన్నవారిని పార్టీలోకి తీసుకోమని తేల్చిచెప్పారు. ప్రజలకు మంచి జరుగుతుంటే కాంగ్రెస్‌కు ఎందుకు అక్కసు అని ప్రశ్నించిన బండి సంజయ్, గ్రామాల్లో ఆస్తులు నిర్మించడం తప్పా? రైతులకు మేలు చేసే పథకం కాదా? తెలంగాణకు అదనంగా రూ.340 కోట్లు వస్తుంటే వద్దంటారా? అంటూ నిలదీశారు. వీబీజీ రామ్ జీ పథకం కావాలా? వద్దా? కాంగ్రెస్ స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. 'వీబీ జీరామ్ జీ' పథకంతో ఉపాధి కూలీల ఆదాయం రెట్టింపు అవుతుందని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. 'ఈ పథకం ద్వారా ఏడాదికి 200 రోజుల ఉపాధి దొరుకుతుంది. పనుల విషయంలో కేంద్రం జోక్యం ఉండదు. ఈ పథకం కోసం గతంలో కంటే అదనంగా రూ.17 వేల కోట్లు వెచ్చిస్తున్నాం. తెలంగాణలో ఈ పథకం అమలుకు అదనంగా రూ.340 కోట్లు ఇవ్వబోతున్నాం. రైతులకు న్యాయం చేసేలా దీన్ని తీసుకొచ్చాం. వ్యవసాయ సీజన్‌లో ఈ పథకం పనులు జరగవు. దీంతో కూలీలు అందుబాటులో ఉంటారని తెలిపారు.

# కవితను కాంగ్రెస్‌లో చేర్చుకునే అవకాశమే లేదు



- బీఆర్ఎస్‌కు గతమే తప్ప భవిష్యతు లేదు.. రాదు
- కేసీఆర్ కుటుంబ అవినీతిపై కవిత వ్యాఖ్యలే నిదర్శనం
- మీడియాతో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

**హైదరాబాద్, జనవరి 13:** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నారంటూ కొద్దిరోజులుగా వస్తున్న వార్తలపై పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తోసిపుచ్చుతూ.. అలాంటిదేమీ లేదని అన్నారు. మంగళవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో పీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. కవితను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునే అవకాశమే లేదని స్పష్టం చేశారు. తెలంగాణాలో బీఆర్ఎస్ పార్టీకి గతం తప్ప.. భవిష్యత్తు లేదంటూ వ్యాఖ్యానించారు. కేసీఆర్ కుటుంబ అవినీతి గురించి కవిత నిజాలు చెప్తున్నారన్నారు. తాము చేసిన ఆరోపణలపై కవిత సమాధానం రూపంలో రుజువైందని చెప్పారు. కవిత మాటలతో కేసీఆర్ అవినీతి నిజమని ప్రజలు అర్థం చేసుకుంటున్నారని ఆయన చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణా ప్రయోజనాలే ముఖ్యమని.. ఒక్క నీటిబొట్టును కూడా వదలమని తేల్చిచెప్పారు. అజారుద్దీన్, కోదండరామ్ ఎమ్మెల్సీల విషయంలో మంచి స్పందన వస్తోందని నమ్ముతున్నట్లు తెలిపారు. ఏప్రిల్‌లో కార్పొరేషన్ ఛైర్మన్లను భర్తీ చేస్తామని ప్రకటించారు. పదవులు తక్కువ అయ్యాయని... ఆశావహులు ఎక్కువ అయ్యారని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల కోసం పార్టీ తరపున ఒక కమిటీ వేస్తామని.. సర్వేల ఆధారంగా టికెట్లు ఇస్తామని చెప్పారు. గెలిచే అభ్యర్థులకే టికెట్ ఇస్తామని మహేశ్ కుమార్ పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో పొత్తుపై పీఏసీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. బీజేపీని తెలంగాణాలో నమ్మే పరిస్థితి లేదన్నారు మహేశ్ కుమార్. మత రాజకీయాలు రాష్ట్రంలో నడవవని అన్నారు. రాముడికి, బీజేపీకి సంబంధమేంటి అని ఆయన ప్రశ్నించారు. తాము హిందూ ఆచారాలను పాటిస్తామని.. కానీ హిందూ సెంటిమెంట్‌తో ఓట్లు అడగమని తెలిపారు. తనకు, సీఎం రేవంత్ మధ్య మంచి సాన్నిహిత్యం ఉందన్నారు పీసీసీ చీఫ్. మంత్రులకు, సీఎంకు మధ్య ఎలాంటి గ్యాప్ లేదని మహేశ్ తేల్చిచెప్పారు. ఇతర మంత్రుల శాఖల్లో ముఖ్యమంత్రి తలదూర్చరన్నారు. మంత్రులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నారని వెల్లడించారు. డీ సెంట్రలైజేషన్ కోసమే మేడారంలో క్యాబినెట్ సమావేశం ఏర్పాటు చేస్తున్నారని పీసీసీ చీఫ్ తెలిపారు. కేసీఆర్.. కుమారుడికి ఒక జిల్లా, కూతురికి ఒక జిల్లా, అల్లుడికి ఒక జిల్లా ఇచ్చారని పీసీసీ చీఫ్ ఆరోపణలు గుప్పించారు. కేసీఆర్ అశాస్త్రీయంగా జిల్లాలను విభజించారని మండిపడ్డారు. శాస్త్రీయంగా జిల్లాల పునర్విభజన చేయాలని కమిటీ వేస్తున్నామని తెలిపారు. సికింద్రాబాద్‌ను ఎవరు ముట్టుకున్నారని తలసాని శ్రీనివాస్ యాదవ్ గాబరాపడుతున్నారని ప్రశ్నించారు. వ్యక్తిగత జీవితాలతో ఆడుకునే హక్కు ఎవరికీ లేదన్నారు. మహిళా అధికారులపై ఆధారాలు లేకుండా వార్తలు రాస్తే ఎంత ఇబ్బంది పడతారో అర్థం చేసుకోవాలన్నారు. సోషల్ మీడియాను కట్టడి చేయాలన్నారు. పదేళ్లలో వచ్చిన ఉద్యోగాలు ఎన్ని.. రెండేళ్లలో ఇచ్చిన ఉద్యోగాలు ఎన్నో నిరుద్యోగులు అర్థం చేసుకోవాలని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# వైద్యారోగ్య శాఖలో త్వరలో ఖాళీల భర్తీ

## జాబ్ నోటిఫికేషన్స్ ఇవ్వనున్నట్లు మంత్రి వెల్లడి

## ఉగాది నాటికి సనత్‌నగర్ టిమ్స్ ప్రారంభిస్తామన్న దామోదర




**హైదరాబాద్, జనవరి 13:** నిరుద్యోగులకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ గుడ్ న్యూస్ చెప్పారు. వైద్యారోగ్య శాఖలో త్వరలోనే మరిన్నీ జాబ్ నోటిఫికేషన్స్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆరోగ్య శాఖలో గత రెండేళ్లలోనే సుమారు 10 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని.. ఇంకో 7 వేలకుపైగా ఉద్యోగాలు భర్తీ అవుతున్నాయని చెప్పారు. మంగళవారం సనత్‌నగర్ టిమ్స్ హాస్పిటల్ నిర్మాణ పనులను మంత్రి దామోదర్ రాజనర్సింహ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉగాది నాటికి సనత్‌నగర్ టిమ్స్‌ను ప్రారంభిస్తామని చెప్పారు. హాస్పిటల్ బిల్డింగ్ నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయని.. ఎలక్ట్రికల్ వర్క్స్ కొన్ని పూర్తి కావాల్సి ఉందని తెలిపారు. ఆపరేషన్ థియేటర్లు, డయాగ్నస్టిక్స్, ఇతర ఎక్విప్‌మెంట్ ఏర్పాటు కూడా చివరి దశలో ఉందన్నారు. ఇప్పటికే అత్యాధునిక టెక్నాలజీతో కూడిన ఎంఆర్ఐ వంటి భారీ యంత్రాల ఫిట్టింగ్ పూర్తయిందని తెలిపారు. మాది ప్రచార ఆర్భాటం ఉండదని.. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నదే మా ఆరాటమని పేర్కొన్నారు. అన్నిరకాలుగా పూర్తి స్థాయి సౌకర్యాలతో ఉగాది నాటికి పేషెంట్లకు ఇక్కడ వైద్య సేవలు అందిస్తామని చెప్పారు. వెయ్యి బెడ్ల ఈ హాస్పిటల్‌లో అన్నిరకాల వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. గుండె సంబంధిత వ్యాధుల చికిత్సలకు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా సనత్‌నగర్ టిమ్స్ ఉంటుందని.. ఇక్కడే అవసరమైన రీసెర్చ్ జరుగుతుందని పేర్కొన్నారు. ఇక్కడే అత్యాధునిక ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అన్నిరకాల అవయవమార్పిడి సర్జరీలు చేసేలా అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు అందుబాటులో తెస్తున్నామన్నారు. డాక్టర్లు, నర్సులు, పారామెడికల్ సిబ్బందికి ఎలాంటి కొరత ఉండదని తెలిపారు.

# రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు

## 70.82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

## మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్, జనవరి 13 :** ధాన్యం కొనుగోలులో తెలంగాణ రికార్డు సృష్టించిందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ముందెన్నడూ లేని రీతిలో 70.82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రికార్డు నెలకొల్పిందని అన్నారు. 2025-26 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌లో రాష్ట్ర ప్రభుత్వం ముందెన్నడూ లేని రీతిలో 70.82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసిందని అన్నారు. గతంలో కొనుగోలు చేసిన 70.2 లక్షల మెట్రిక్ టన్నుల రికార్డును ఈ ఖరీఫ్ సీజన్‌లో అధిగమించిందని చెప్పారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో చారిత్రక మైలురాయి అని అభివర్ణించారు. పౌరసరఫరాల శాఖ, నీటిపారుదల శాఖలు సమన్వయం చేసుకోవడంతోపాటు రాష్ట్ర రైతుల భాగస్వామ్యంతోనే ఈ రికార్డు సాధ్యమైందని స్పష్టం చేశారు. ధాన్య సంపదకు ప్రతీకగా నిలిచే సంక్రాంతి పండగ చేసుకుంటున్న రైతులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం కొనుగోలు చేసిన 70.82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యంలో 32.45 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దొడ్డు రకం కాగా, 38.37 లక్షల మెట్రిక్ టన్నులు సన్నాలని మంత్రి వివరించారు. తెలంగాణలో సాధించిన దిగుబడికిగాను రాష్ట్రవ్యాప్తంగా 13.97 లక్షల మంది రైతులకు మద్దతు ధర అందించామన్నారు.

# 'అరైవ్ అలైవ్' నినాదం కాదు.. ఉద్యమం కావాలి!

- ప్రతి కుటుంబం ఆనందంగా జీవించడమే మా లక్ష్యం
- హెల్మెట్ అనేది చలానాల కోసం కాదు.. ప్రాణ రక్షణ కోసమే
- రోడ్డు ప్రమాదాల నివారణపై మద్నూర్ ఎస్సై రాజు అవగాహన




**జుక్కల్, జనవరి 13 (మనసులో మాట):**

"క్షేమంగా ఇంటికి చేరుకోవడం (అరైవ్ అలైవ్) అనేది కేవలం ఒక నినాదంలా మిగిలిపోకూడదు.. అదొక ఉద్యమంలా సాగాలి. ప్రతి వాహనదారుడు సురక్షితంగా గమ్యం చేరి, వారి కుటుంబాల్లో ఆనందం నింపాలన్నదే మా తపన" అని మద్నూర్ ఎస్సై రాజు అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మద్నూర్ మండలంలోని మేనూర్ గ్రామంలో వాహనదారులకు, ప్రజలకు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై రాజు మాట్లాడుతూ.. మేనూర్ గ్రామస్తులు ఒక్క రోడ్డు ప్రమాదం కూడా జరగకుండా జాగ్రత్తలు తీసుకుని ఆదర్శంగా నిలవాలనే ఉద్దేశంతోనే ఇక్కడి నుంచే ఈ 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. గతంలో జరిగిన ప్రమాద ఘటనలు కుటుంబాల్లో ఎంతటి విషాదాన్ని నింపాయో గుర్తుచేశారు. అలాంటి పరిస్థితి మరే కుటుంబానికి రాకూడదని, అందరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. ప్రాణకవచం రోడ్డు ప్రమాదాలు యాదృచ్ఛికంగా జరిగేవి కావని, అవి మన నిర్లక్ష్యం, అతివేగం వల్లే జరుగుతాయని ఎస్సై హెచ్చరించారు. హెల్మెట్ ధరించడం అనేది పోలీసుల చలానాల నుంచి తప్పించుకోవడానికి కాదని, అది ప్రాణాన్ని కాపాడే ఆయుధమని గుర్తించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని, ఆ కుటుంబాలు వీధిన పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, రాంగ్ రూట్లో వెళ్లడం, ఓవర్ స్పీడ్ వద్దని సూచించారు. ఆటో డ్రైవర్లు ప్రయాణికులను సురక్షితంగా గమ్యానికి చేర్చాలని తెలిపారు. "సేఫ్టీ ఫస్ట్.. మీ కోసం ఇంటి వద్ద మీ కుటుంబ సభ్యులు ఎదురుచూస్తుంటారు" అని వాహనదారులకు విజ్ఞప్తి చేశారు. ఈ నెల 24 వరకు మండలంలోని అన్ని పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ సభల్లో ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రజలంతా పోలీసులకు సహకరించి ప్రమాదరహిత సమాజానికి బాటలు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేనూర్ సర్పంచ్ అశోక్ పటేల్, మొఘ సర్పంచ్ బస్వంత్ హాళ్ళే, పోలీస్ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మా ఊరు కంగ్టిలోనే ఉండాలి.. తడ్కాల్‌లో కలపొద్దు!




- సుక్కల్ తీర్థ్ గ్రామస్తుల ఏకగ్రీవ తీర్మానం
- అధికారులకు వినతి
- విద్య, వైద్యం, వ్యాపార అవసరాలకు కంగ్టినే అనుకూలం
- కొత్త మండలంతో ఇబ్బందులు తప్పవని ఆవేదన
- ఎమ్మార్వో, ఎంపీడీవోలకు గ్రామస్తుల వినతి పత్రం
- ఏళ్లుగా కొనసాగుతున్న అనుబంధాన్ని తెంచొద్దని విజ్ఞప్తి

**కంగ్టి, జనవరి 13 (మనసులో మాట):**

తమ గ్రామాన్ని కొత్తగా ఏర్పాటు చేస్తున్న తడ్కాల్ మండలంలో కలపవద్దని, ప్రస్తుతం ఉన్న కంగ్టి మండలంలోనే కొనసాగించాలని కోరుతూ సుక్కల్ తీర్థ్ గ్రామస్తులు ఆందోళన బాట పట్టారు. ఈ మేరకు మంగళవారం వారు కంగ్టి మండల తహశీల్దార్ (ఎమ్మార్వో), ఎంపీడీవోలను కలిసి వినతి పత్రం అందజేశారు.

**అన్నింటికీ కంగ్టినే ఆధారం..**

ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా సుక్కల్ తీర్థ్ గ్రామానికి కంగ్టి మండలంతో విడదీయరాని అనుబంధం ఉందని గుర్తుచేశారు. విద్య, వైద్యం, వ్యాపారం.. ఇలా అన్ని రకాలుగా తమకు కంగ్టి మండలమే అందుబాటులో ఉందని, రవాణా పరంగానూ సౌకర్యవంతంగా ఉందని వివరించారు.

**తడ్కాల్ వద్దు..**

కొత్తగా ఏర్పాటు అవుతున్న తడ్కాల్ మండలంలో తమ గ్రామాన్ని కలిపితే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. దూరాభారం పెరగడంతో పాటు, పాలనాపరమైన సమస్యలు తలెత్తుతాయని ఆందోళన చెందుతున్నారు. దయచేసి అధికారులందరూ స్పందించి, క్షేత్రస్థాయి పరిస్థితులను గమనించి.. తమ గ్రామాన్ని కంగ్టి మండలంలోనే కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు.

# క్షేమంగా ఇంటికి చేరడమే లక్ష్యం

**నిబంధనలు పాటించాల్సిందే**

**తేలకుంటలో 'అరైవ్-అలైవ్' అవగాహన సదస్సు**

**ఎస్సై సనత్ కుమార్ హెచ్చరికలు**

**మైనర్లకు వాహనాలిస్తే తల్లిదండ్రులపై కఠిన చర్యలు**

**లైసెన్స్ లేకుండా బండి ముట్టుకోవద్దు**

**ఆటోల్లో పరిమితికి మించి ఎక్కించుకుంటే ఊరుకోం**



**పెద్దపల్లి, జనవరి 13 (మనసులో మాట):**

తెలంగాణ డీజీపీ ఆదేశాల మేరకు పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం తేలకుంట గ్రామంలో 'అరైవ్-అలైవ్' (క్షేమంగా ఇంటికి చేరడం) కార్యక్రమంలో భాగంగా పోలీసులు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై సిహెచ్. సనత్ కుమార్ గ్రామస్తులకు, వాహనదారులకు పలు కీలక సూచనలు చేశారు. మనం చేసే ప్రయాణం వల్ల ఎదుటివారికి గానీ, మనకు గానీ ఎలాంటి నష్టం జరగకూడదని గుర్తుంచుకోవాలన్నారు. ఎస్సై మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలని, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని స్పష్టం చేశారు. ముఖ్యంగా 18 ఏళ్లు నిండని పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని హెచ్చరించారు. ఒకవేళ మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే, వారి తల్లిదండ్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని తేల్చిచెప్పారు. వాహనదారులు సరైన పత్రాలు కలిగి ఉండాలని, రోడ్డుపై నెమ్మదిగా, పక్కవారికి ఇబ్బంది కలగకుండా వెళ్లాలని సూచించారు. ఆటో డ్రైవర్లు నిబంధనలకు విరుద్ధంగా, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోకూడదని, అలా చేస్తే చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



# జంగరాయిని జిల్లాలోనే అగ్రగామిగా నిలుపుతా

**మెదక్ జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ఆవుల గోపాల్ రెడ్డి**

**22 రోజుల్లోనే అభివృద్ధి పనులకు శ్రీకారం**

**ప్రజా బాటలో నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు**

**ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేల సహకారంతో ముందుకు వెళ్తామని వెల్లడి**

**చిన్నశంకరంపేట, జనవరి 13 (మనసులో మాట):**

మెదక్ జిల్లాలోని జంగరాయి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, జిల్లాలోనే అగ్రగామి గ్రామపంచాయతీగా నిలుపుతానని మెదక్ జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ఆవుల గోపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం 'ప్రజా బాట' కార్యక్రమంలో భాగంగా గ్రామంలో నూతనంగా విద్యుత్ స్తంభాలను (కరెంట్ పోల్స్) ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. తాను సర్పంచ్‌గా ప్రమాణ స్వీకారం చేసి కేవలం 22 రోజులే అవుతోందని గుర్తుచేశారు. అయినప్పటికీ, గత రెండేళ్లుగా పరిష్కారానికి నోచుకోని ప్రభుత్వ పాఠశాల పునరుద్ధరణ, విద్యుత్, రోడ్ల వంటి సమస్యలను గుర్తించి పరిష్కరిస్తున్నామని తెలిపారు. గ్రామాభివృద్ధికి తమ వద్ద ఇంకా చాలా సమయం ఉందని, స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, మాజీ ఎమ్మెల్యే హనుమంత రావు సహకారంతో జంగరాయిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని ఆయన స్పష్టం చేశారు.

# గ్రేడ్-2 ల్యాబ్ టెక్నీషియన్లుగా నరేష్, తుకారాం, ప్రవీణ్

**మంత్రి చేతుల మీదుగా నియామక పత్రాలు**



**జుక్కల్, జనవరి 13 (మనసులో మాట):**

కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గానికి చెందిన పలువురు ల్యాబ్ టెక్నీషియన్లు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మంగళవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా వీరు నియామక పత్రాలను అందుకున్నారు. 2017 నుంచి కాంట్రాక్ట్ పద్ధతిలో ప్రజలకు సేవలందిస్తున్న వీరు, వైద్య ఆరోగ్య శాఖ నిర్వహించిన పరీక్షల్లో మెరిట్ సాధించి గ్రేడ్-2 టెక్నీషియన్లుగా రెగ్యులర్ అయ్యారు. డి. నరేష్ కుమార్: మద్నూర్ మండలం పెద్ద ఎక్లరా గ్రామానికి చెందిన ఇతను జుక్కల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గ్రేడ్-2 టెక్నీషియన్‌గా నియమితులయ్యారు. బిచ్కుంద పట్టణానికి చెందిన ఇతనికి కామారెడ్డి కొనింటి తుకారాం మెడికల్ కాలేజీలో గ్రేడ్-2 టెక్నీషియన్‌గా పోస్టింగ్ లభించింది. లచ్చన్ గ్రామానికి చెందిన అమృత్వార్ ప్రవీణ్ కుమార్: కూడా కామారెడ్డి మెడికల్ కాలేజీలో ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2గా రెగ్యులర్ పే స్కేల్ ఉద్యోగం పొందారు. తమ బిడ్డలకు ప్రభుత్వ ఉద్యోగాలు రావడం పట్ల వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, మిత్రులు ఆనందం వ్యక్తం చేశారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలందించి మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు.

# కామారం తండాలో తీరిన తాగునీటి తిప్పలు

**సర్పంచ్ మోహన్ నాయక్ చొరవతో సమస్యకు శాశ్వత పరిష్కారం**

**మిషన్ భగీరథ ఏఈతో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన**

**యుద్ధప్రాతిపదికన మేజర్ మరమ్మతులు పూర్తి**

**సర్పంచ్, పాలకవర్గానికి కృతజ్ఞతలు తెలిపిన తండావాసులు**



**చిన్న శంకరంపేట, జనవరి 13 (మనసులో మాట):**

చిన్న శంకరంపేట మండలం కామారం తండా గ్రామ పంచాయతీ పరిధిలో గత కొద్ది రోజులుగా వేధిస్తున్న తాగునీటి సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. నీటి సరఫరా లేక ఇబ్బందులు పడుతున్నామని తండావాసులు చేసిన విజ్ఞప్తికి సర్పంచ్ మోహన్ నాయక్ తక్షణమే స్పందించారు. మంగళవారం ఆయన మిషన్ భగీరథ ఏఈ స్వప్నతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. సమస్యను గుర్తించిన వెంటనే పంచాయతీ పాలకవర్గ సభ్యుల సహకారంతో అవసరమైన మేజర్ మరమ్మతులను చేయించారు. దీంతో నీటి సరఫరా పునరుద్ధరణ జరగడంతో తండావాసులు ఊపిరి పీల్చుకున్నారు. తమ సమస్యను త్వరగా పరిష్కరించినందుకు సర్పంచ్ మోహన్ నాయక్‌ను, పాలకవర్గ సభ్యులను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మోహన్ నాయక్, పంచాయతీ కార్యదర్శి స్వర్ణలత, ఉప సర్పంచ్ విజయ, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఆపదలో అండగా 'ఆర్జీపీ' సేవా సమితి

**అనారోగ్యంతో మృతి చెందిన వెంకయ్య కుటుంబానికి ఆర్థిక చేయూత**

**రూ. 15,500 అందజేసిన దాతలు, యువకులు**

**'ఓదార్చే మాటల కన్నా.. సాయం చేసే చేతులే మిన్న' అని నిరూపణ**

**రాఘవపట్నంలో మానవత్వం చాటుకున్న గ్రామస్తులు**



**గొల్లపెల్లి, జనవరి 13 (మనసులో మాట):**

జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండలం రాఘవపట్నం గ్రామంలో మానవత్వం పరిమళించింది. గ్రామానికి చెందిన ఉతేమ్ వెంకయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయింది. ఈ విషయం తెలుసుకున్న ఆర్జీపీ సేవా సమితి సభ్యులు, గ్రామ యువకులు, ప్రజాప్రతినిధులు ఆ కుటుంబానికి అండగా నిలవాలని నిర్ణయించుకున్నారు. దయాగుణం కలిగిన దాతల సహకారంతో సేకరించిన రూ. 15,500 (పదిహేను వేల ఐదు వందల రూపాయలు) నగదును వెంకయ్య కుటుంబ సభ్యులకు అందజేశారు. "ఓదార్చే మాటల కన్నా సాయం చేసే చేతులే మిన్న" అనే సూక్తిని ఆచరణలో చూపిస్తూ యువకులు ముందుకు రావడం అభినందనీయం. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో ఆర్జీపీ సేవా సమితి ఎప్పుడూ ముందుంటుందని ఈ సందర్భంగా యువకులు హామీ ఇచ్చారు. తమ కష్టకాలంలో ఆదుకున్న దాతలకు, గ్రామస్తులకు బాధిత కుటుంబ సభ్యులు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గంగాదేవిపల్లె సర్పంచ్ కొలకాని జలంధర్, కాసారపు ప్రవీణ్ గౌడ్, ఆర్జీపీ సేవా సమితి అడ్మిన్ కాళ్ళ రమేష్, శ్రీపతుల శంకరయ్య, కొండ రాజు, రామ్, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# జుక్కల్ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

**బిచ్కుంద మార్కెట్ కమిటీ చైర్మన్ కవితా ప్రభాకర్ రెడ్డి**



**బిచ్కుంద, జనవరి 13 (మనసులో మాట):**

జుక్కల్ నియోజకవర్గ ప్రజలందరికీ బిచ్కుంద మార్కెట్ కమిటీ చైర్మన్ కవితా ప్రభాకర్ రెడ్డి మకర సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను పురస్కరించుకొని ఆమె మాట్లాడారు. మన సంస్కృతీ సంప్రదాయాలకు, సొంత ఊర్ల మీద ఉండే మమకారానికి, వ్యవసాయానికి ఈ పండుగ ప్రతీక అని పేర్కొన్నారు. ప్రకృతితో మమేకమైన రైతన్నల పండుగ ఇదని, భోగి మంటల వెలుగులతో ప్రతి ఇంటా ఆనందాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. పాడిపంటలతో పల్లెలు కళకళలాడుతూ.. రైతులు, సబ్బండ వర్ణాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. పండుగ సంబరాల్లో భాగంగా పతంగులు ఎగురవేసేవారు తగిన జాగ్రత్తలు పాటించాలని ఈ సందర్భంగా సూచించారు.

# మల్లన్న పట్నాల్లో పాల్గొన్న రఘువీర్ సింగ్

**జూలపల్లి మండల ప్రజల క్షేమాన్ని ఆకాంక్షించిన మాజీ చైర్మన్**



**జూలపల్లి, జనవరి 13 (మనసులో మాట):**

పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్ సింగ్ జూలపల్లిలో పర్యటించారు. మండల కేంద్రానికి చెందిన వంగపల్లి వెంకటరమణ నివాసంలో ఏర్పాటు చేసిన మల్లన్న పట్నాల వేడుకలో ఆయన పాల్గొన్నారు. వెంకటరమణ ప్రత్యేక ఆహ్వానం మేరకు హాజరైన రఘువీర్ సింగ్.. భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించి మల్లికార్జున స్వామి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూలపల్లి మండల ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని స్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, భక్తులు, స్థానికులు పాల్గొన్నారు.

# జూలపల్లి ఆసుపత్రిలో సర్పంచ్‌కు ఘన సన్మానం

**నూతన సర్పంచ్ అనూషను సత్కరించిన వైద్య సిబ్బంది**



**జూలపల్లి, జనవరి 13 (మనసులో మాట):**

జూలపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం జరిగింది. నూతనంగా ఎన్నికైన జూలపల్లి గ్రామ సర్పంచ్ పాటకుల అనూషను ఆసుపత్రి వైద్య సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఆమెను శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు. అనంతరం వైద్య సిబ్బంది ఆమెకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సంపత్ రెడ్డి, హెల్త్ సూపర్ వైజర్ వసంత, నర్సింగ్ ఆఫీసర్ అనీష్ ఫాతిమా, ఫార్మసిస్ట్ కవిత, హెల్త్ అసిస్టెంట్ అనంత రావు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపల్లి మార్కెట్ యార్డుకు 5 రోజులు సెలవులు

**14 నుంచి 18 వరకు పత్తి కొనుగోళ్లు బంద్ :కార్యదర్శి ప్రవీణ్ రెడ్డి**

**పెద్దపల్లి, జనవరి 13 (మనసులో మాట):**



సంక్రాంతి పండుగలు, వారాంతపు సెలవుల కారణంగా పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డుకు ఈ నెల 14 నుంచి 18 వరకు (బుధవారం నుంచి ఆదివారం వరకు) ఐదు రోజుల పాటు సెలవులు ప్రకటించారు. ఈ సమయంలో పత్తి కొనుగోళ్లు, క్రయవిక్రయాలు ఉండవని, తిరిగి 19వ తేదీ (సోమవారం) మార్కెట్ యథావిధిగా ప్రారంభమవుతుందని ఉన్నత శ్రేణి కార్యదర్శి ప్రవీణ్ రెడ్డి తెలిపారు. రైతులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

# మరో మూడేళ్ల వరకు కేసీఆర్ కనిపించడం కష్టమే!

- జీతభత్యాల కోసమే ఎమ్మెల్యే పదవి పట్టుకొని వేలాడుతున్నారు
- సీఎం రేవంత్ రెడ్డి సహకారంతోనే గజ్వేల్ ప్రగతి
- గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి



**గజ్వేల్, జనవరి 13 (మనసులో మాట):**

గజ్వేల్ ఎమ్మెల్యేగా ఉన్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని, మరో మూడేళ్ల వరకు ఆయన ఇక్కడ కనిపించడం కష్టమేనని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ఎద్దేవా చేశారు. కేవలం జీతభత్యాల కోసమే ఆయన ఎమ్మెల్యే పదవిని పట్టుకొని వేలాడుతున్నారని తీవ్ర స్థాయిలో విమర్శించారు. మంగళవారం గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో రూ. 18 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అంతర్గత రోడ్ల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అలాగే క్యాసారంలో ఇందిరమ్మ ఇంటిని లాంఛనంగా ప్రారంభించారు.

**గజ్వేల్ సొమ్ము.. సిద్దిపేట పాలు**

ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ.. గత పదేళ్లుగా కేసీఆర్ గజ్వేల్ సమస్యలను పట్టించుకోలేదని ఆరోపించారు. ఇక్కడికి మంజూరైన అభివృద్ధి నిధులు, పనులను సిద్దిపేట ప్రాంతానికి తరలించారని విమర్శించారు. కేసీఆర్‌కు ఓటు వేస్తే సిద్దిపేట మాత్రమే అభివృద్ధి చెందుతుందని, గజ్వేల్‌పై సిద్దిపేట పెత్తనం ఏమిటని నిలదీశారు. స్థానిక నాయకత్వంపై నమ్మకం లేకనే, బీఆర్ఎస్ నేతలు పొరుగు ప్రాంత పెత్తనానికి దాసోహమయ్యారని మండిపడ్డారు.

**కాంగ్రెస్‌తోనే ముంపు బాధితులకు న్యాయం**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గజ్వేల్ నియోజకవర్గ అభివృద్ధికి అడిగినన్ని నిధులు ఇస్తున్నారని నర్సారెడ్డి తెలిపారు. మున్సిపల్ పరిధిలో రోడ్లు అధ్వాన్నంగా మారాయని చెప్పగానే నిధులు మంజూరు చేశారని గుర్తు చేశారు. ముంపు బాధితుల సమస్యల పరిష్కారం, గజ్వేల్ సమగ్ర అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు మంజూరు చేస్తున్న తమ ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు అంక్షా రెడ్డి, ఏఎంసీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు అశోక్ రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు మొనగారి రాజు, నక్క రాములు గౌడ్, ఇతర నాయకులు సుఖేందర్ రెడ్డి, సయ్యద్ మతిన్, రవీందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, గుంటుకు శ్రీనివాస్, గాడిపల్లి శ్రీనివాస్, కొండల్ రెడ్డి, రమేష్ గౌడ్, నరేష్, లక్ష్మారెడ్డి, రాజశేఖర్ రెడ్డి, అజ్గర్, దప్పు గణేష్, కప్ప భాస్కర్, కప్ప మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# వడ్డే ఓబన్న పోరాట పటిమ.. భావితరాలకు ఆదర్శం



- తిమ్మాపూర్‌లో ఘనంగా 219వ జయంతి వేడుకలు
- క్రషర్ల వల్ల ఉపాధి కోల్పోతున్నాం.. ప్రభుత్వాలు ఆదుకోవాలి
- వడ్డెరలకు ఉపాధి కల్పించాలని వడ్డెర సంఘం నేతల డిమాండ్
- ఓబన్న చిత్రపటానికి నివాళులర్పించిన సర్పంచ్, సంఘం ప్రతినిధులు

**దుబ్బాక, జనవరి 13 (మనసులో మాట):**

స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జీవితాన్ని నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని తిమ్మాపూర్ సర్పంచ్ గుర్రాల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం దుబ్బాక మండలం తిమ్మాపూర్ గ్రామ పంచాయతీ ఆవరణలో వడ్డే ఓబన్న 219వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ గుర్రాల శ్రీనివాస్, సిద్దిపేట జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షులు కుంచం శేఖర్ ముఖ్య అతిథులుగా హాజరై ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**పోరాట యోధుడు ఓబన్న**

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బ్రిటిష్ కాలంలోనే సొంత సైన్యాన్ని ఏర్పాటు చేసుకుని, శిస్తుల వసూళ్లకు వ్యతిరేకంగా పోరాడిన ధీరుడు వడ్డే ఓబన్న అని కొనియాడారు. ఆయన పోరాట పటిమను భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని అన్నారు.

**యంత్రాలతో ఉపాధికి ఎసరు**

భవన నిర్మాణాలకు అవసరమైన రాయి కొట్టడమే వడ్డెర కులస్తుల ప్రధాన జీవనోపాధి అని, వారు కష్టార్జితంతోనే జీవనం సాగిస్తారని వడ్డెర సంఘం నేతలు పేర్కొన్నారు. అయితే ఆధునిక కాలంలో క్రషర్లు రావడంతో తమ కులవృత్తి దెబ్బతిని, జీవనోపాధి కష్టతరంగా మారిందని జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షులు కుంచం శేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు స్పందించి వడ్డెర కులస్తులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించి ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, వడ్డెర సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బోదాస్ యాదగిరి, ఉపాధ్యక్షుడు దృష్టి బిక్షపతి, జిల్లా యూత్ అధ్యక్షుడు కుంచం రవీందర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుంచం రవి, పట్టణ అధ్యక్షుడు ఇరగదిండ్ల తిరుపతి, గ్రామ పెద్దలు ఎర్ల మల్లేశం, ఎర్ల కనకరాజు, రవి స్వామి, ప్రశాంత్, రాజు, శ్రీకాంత్, దేశెట్టి యాదగిరి, అరవింద్, ఎర్ల మల్లయ్య, మహిళలు పాల్గొన్నారు.



# 108 వాహనాల ఆకస్మిక తనిఖీ

**మందులు, రికార్డులు, వైద్య పరికరాల తనిఖీ**

**విధుల్లో నిర్లక్ష్యం వద్దు**

**సిబ్బందికి ప్రోగ్రాం మేనేజర్ భూమా నాగేందర్ ఆదేశాలు**

**పెద్దపల్లి, జనవరి 13 (మనసులో మాట):**

పెద్దపల్లి జిల్లా కేంద్రంలో 108 అంబులెన్స్ వాహనాలను ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ భూమా నాగేందర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంగళవారం ఆయన వాహనాల్లోని వైద్య పరికరాలు, మందులు, నిర్వహణ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అంబులెన్స్‌లలో ఉండాల్సిన అత్యవసర మందుల నిల్వలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా భూమా నాగేందర్ సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. అత్యవసర పరిస్థితుల్లో సమాచారం అందిన వెంటనే స్పందించి, సంఘటన స్థలానికి చేరుకోవాలని ఆదేశించారు. ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులకు తక్షణ వైద్యం అందించి, వారిని వేగంగా ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించి ప్రాణాలు కాపాడాలన్నారు. సేవల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా బాధ్యతగా విధులు నిర్వర్తించాలని స్పష్టం చేశారు. ప్రజలకు మరింత మెరుగైన అత్యవసర వైద్య సేవలు అందించేందుకే ఈ ఆకస్మిక తనిఖీలు చేపట్టినట్లు నాగేందర్ తెలిపారు. జిల్లా ప్రజలు ఆపద సమయాల్లో 108 సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా కోఆర్డినేటర్ జంపల కుమారస్వామి, 108 సిబ్బంది పడదాం కుమార్, సురేష్, పూరెల్ల అఖిల్, షాగంటి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# సంక్రాంతి సంబురాలు.. పల్లెల్లో ఎడ్ల పందెం జోరు!

**పెద్దపురంలో ఉత్సాహంగా సాగిన పెసరి కొమురయ్య స్మారక టోర్నమెంట్**

**నరసింహ స్వామి ఆలయ ప్రాంగణంలో హోరాహోరీగా పోటీలు**



**జూలపల్లి, జనవరి 13 (మనసులో మాట):**

పల్లెటూరిలో సంక్రాంతి పండుగ వచ్చిందంటే ఆ సందడే వేరు. పూర్వీకుల నుంచి వస్తున్న ఆనవాయితీలో భాగంగా పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం పెద్దపురం గ్రామంలో ఎడ్ల పందేలు (బండ లాగుడు పోటీలు) అట్టహాసంగా జరిగాయి. పెసరి కొమురయ్య స్మారకార్థం నరసింహ స్వామి ఆలయం వద్ద నిర్వహించిన ఈ పోటీలను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు, రైతులు భారీగా తరలివచ్చారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కోడి పందేలు, పొట్టేళ్ల పందేలు నిర్వహించడం కొన్ని చోట్ల కనిపిస్తుండగా.. ఇక్కడ మాత్రం ఎడ్ల పందేలు నిర్వహించడం తరాల నుంచి ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది కూడా రైతులు తమ ఎడ్లతో ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. పోటీలు హోరాహోరీగా సాగడంతో పండుగ వాతావరణం నెలకొంది. పోటీల్లో గెలుపొందిన ఎడ్ల యజమానులకు నగదు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి: అమ్ముల మహేష్ (రూ. 3,016), ద్వితీయ బహుమతి: పెసర రాజు (రూ. 2,016), తృతీయ బహుమతి: ప్రవీణ్, అనిల్ (రూ. 1,016) బహుమతులను దాతలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తొగుర శ్రీనివాస్, వార్డు సభ్యులు తీగల అశోక్ గౌడ్, టోర్నమెంట్ నిర్వాహకులు, బీఆర్ఎస్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు సంఖ్యల లక్ష్మీ నరసయ్య, గ్రామ కుల పెద్దలు బుజ్జి చిన్నయ్య, ఇసుకల సాంబయ్య, చొప్పరి నర్సయ్య, ఉయ్యాల శ్రీనివాస్, రామ్, చంద్రయ్య, గుర్రం సామి, ప్రకాష్, నరేష్, వెంకటేష్, రమేష్, రాజేందర్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# సిద్దిపేట కలెక్టరేట్‌లో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: మంత్రి వివేక్ వెంకటస్వామి



**మనసులో మాట - సిద్దిపేట**

సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ ఆవరణలో నూతనంగా ప్రతిష్టించిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి మరియు ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి సోమవారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ తల్లి విగ్రహం మన రాష్ట్ర సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పడుతోందని అన్నారు. అందెశ్రీ రచించిన 'జయజయహే తెలంగాణ' గీతం, తెలంగాణ తల్లి విగ్రహాలు రాష్ట్రంలో సాగుతున్న ప్రజా పాలనను ప్రతిబింబించే ప్రతీకలుగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు.

ప్రజా సంక్షేమమే పరమావధిగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని, అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలను పారదర్శకంగా అందిస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలతో పాటు ఇందిరమ్మ ఇండ్లు, నూతన రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ వంటి అనేక పథకాలను పేద ప్రజల కోసం అమలు చేస్తున్నామని తెలిపారు. గతంలో కొందరికి మాత్రమే పరిమితమైన సంక్షేమ పథకాలు, ఇకపై అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

జిల్లాలో అభివృద్ధి పనుల గురించి వివరిస్తూ... ఇప్పటికే దుబ్బాక పట్టణంలో పది కోట్ల రూపాయలు, నాంచారిపల్లి గ్రామంలో పది కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని తెలిపారు. అలాగే త్వరలోనే సిద్దిపేట పట్టణంలో పదిహేను కోట్ల రూపాయల నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టనున్నట్లు మంత్రి ప్రకటించారు. జిల్లా కలెక్టర్ కె. హైమావతి నేతృత్వంలో జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తూ, సంక్షేమ పథకాలను ప్రజలకు వేగంగా చేరవేస్తున్నారని అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, ఆర్టీఏ కమిటీ సభ్యులు సూర్యవర్మ, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు, టీఎన్‌జీఓ నాయకులు మరియు తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు పాల్గొన్నారు.

# పుల్లూరు ఆలయ అభివృద్ధికి కె.వి.ఆర్ ఫౌండేషన్ చేయూత


## రూ.51,000 విరాళం అందజేసిన ఫౌండేషన్ సభ్యులు



**మనసులో మాట - సిద్దిపేట**

సిద్దిపేట జిల్లా రూరల్ మండలం పుల్లూరు గ్రామంలో వెలసిన శ్రీ స్వయంభూ లక్ష్మీ నరసింహ క్షేత్రం అభివృద్ధికి కె.వి.ఆర్ ఫౌండేషన్ తన వంతు సహకారాన్ని అందించింది. ఆలయ అభివృద్ధి కోసం బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, కె.వి.ఆర్ ఫౌండేషన్ చైర్మన్ కల్వకుంట్ల వంశీధర్ రావు ఆదేశాల మేరకు, ఫౌండేషన్ సభ్యులు సోమవారం నాడు ఆలయ నిర్వాహకులకు రూ.51,000 (యాభై ఒక్క వేల రూపాయల) ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ... పురాతనమైన, ప్రసిద్ధి గాంచిన ఆలయాలను పరిరక్షించుకోవడం, వాటిని అభివృద్ధి చేసి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే సదుద్దేశంతో ఈ సహాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. భక్తుల విశ్వాసానికి కేంద్రంగా ఉన్న ఇటువంటి ఆలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులతో పాటు పుల్లూరు గ్రామ సర్పంచ్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు మరియు భక్తులు పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధికి ఆర్థిక సాయం అందించినందుకు గ్రామస్థులు కె.వి.ఆర్ ఫౌండేషన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన మంత్రి వివేక్



## నిరుపేదలకు సొంత ఇల్లే ప్రభుత్వ లక్ష్యం

**మనసులో మాట - సిద్దిపేట**

సిద్దిపేట జిల్లా అర్బన్ మండలం వెల్గటూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని రాష్ట్ర కార్మిక, ఉపాధి, పరిశ్రమలు, భూగర్భ శాఖల మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి సోమవారం శుభప్రదంగా ప్రారంభించారు. గ్రామానికి చెందిన లబ్ధిదారులు పెయ్యల తారడ నర్సింహులు (మాజీ సర్పంచ్ మల్లయ్య కుమారుడు) నిర్మించుకున్న గృహప్రవేశ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులను శాలువాతో సన్మానించి, స్వీటు తినిపించి అభినందించారు. అలాగే ఇంట్లో ఏర్పాటు చేసిన డా. బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అనంతరం మంత్రి మాట్లాడుతూ... నిరుపేద ప్రజలు సౌకర్యవంతమైన సొంత ఇంటిలో నివసించాలనే గొప్ప ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తోందని తెలిపారు. లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణంలో ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకుండా, నిర్మాణ దశల వారీగా నిధులను నేరుగా వారి ఖాతాల్లోనే జమ చేస్తున్నట్లు వివరించారు. ప్రజలకు సంక్షేమ పాలన అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పనిచేస్తోందని పేర్కొన్నారు.

ఈ పర్యటనలో గ్రామస్తులు పలు అభివృద్ధి సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బొల్లు లక్ష్మి (నరేష్), స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బిచ్కుందలో రూ.15 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

## పనుల్లో నాణ్యత పాటించాలి: ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు



**జుక్కల్ - మనసులో మాట**

బిచ్కుంద మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు సోమవారం నాడు భారీ ఎత్తున అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. పట్టణ ప్రజల సౌకర్యార్థం కల్వర్టుల నిర్మాణం, వరద నీటి సమస్య పరిష్కారానికి నివారణ చర్యలు, మురికి నీటి కాలువల నిర్మాణం మరియు అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం వంటి పలు కీలక పనులకు ఆయన భూమిపూజ చేశారు. సుమారు రూ.15 కోట్ల భారీ వ్యయంతో ఈ అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెల్లడించారు. ఈ పనులు పూర్తయితే పట్టణ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు పెద్దపీట వేయాలని, పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలో నిరంతరం ప్రజలకు సేవలందిస్తున్న మున్సిపల్ సిబ్బందికి ఎమ్మెల్యే యూనిఫార్మ్‌లను అందజేశారు. ప్రజా సేవలో ముందుండే సిబ్బందికి అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిచ్కుంద మఠాధిపతి సద్గురు సోమలింగ శివచార్య మహారాజ్, మున్సిపల్ కమిషనర్ హయుం, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక మండల నాయకులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల -మనసులో మాట**

ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లి మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో కొనసాగుతున్న అదనపు గదుల నిర్మాణ పనులను ఆకస్మికంగా సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు అవసరమైన త్రాగునీరు, విద్యుత్, విద్యార్థినీ, విద్యార్థులకు వేరువేరుగా మూత్రశాలలు, ప్రహరీ గోడ ఇతర సదుపాయాలతో పాటు మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందిస్తూ విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించడం, నిష్ణాతులైన ఉపాధ్యాయుల ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

అనంతరం బెల్లంపల్లి పట్టణంలో గల శాసనసభ్యుల క్యాంపు కార్యాలయంలో శాసనసభ్యులు గడ్డం వినోద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేఖ లతో కలిసి అర్హులైన లబ్ధిదారులకు వ్యవసాయ పనిముట్లు/పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని వినూత్న సంస్కరణలతో అభివృద్ధి చేసేందుకు పంట సాగుకు అవసరమైన వ్యవసాయ అధునాతన పరికరాలను అర్హులైన రైతులకు అందించి పంట దిగుబడి పెంచేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ క్రమంలో వ్యవసాయ యాంత్రీకరణ కార్యక్రమం ఎస్.ఎం.ఎ.ఎం. 2025-26 లో భాగంగా అర్హులైన రైతులకు యాంత్రికరణ పరికరాలను అందించడం జరిగిందని తెలిపారు. బెల్లంపల్లి శాసనసభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వం వ్యవసాయ సాగు విస్తీర్ణాన్ని పెంపొందించి రైతులు అధిక దిగుబడి సాధించి ఆర్థికంగా లబ్ధి పొందేలా ప్రోత్సహిస్తుందని తెలిపారు. పంట ఉత్పత్తులను మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. వ్యవసాయ యాంత్రీకరణ కార్యక్రమంలో ప్రభుత్వం అందిస్తున్న ఆధునిక పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# ఘనంగా 85వ అఖిల భారత కళా ప్రదర్శన

## ఆకట్టుకుంటున్న సిద్దిపేట వాసి 'మహేష్' ఛాయాచిత్రం



**మనసులో మాట - సిద్దిపేట**

హైదరాబాద్ ఆర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే 85వ అఖిల భారత వార్షిక కళా ప్రదర్శన-2026 అట్టహాసంగా ప్రారంభమైంది. హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఉన్న ఆర్ట్ గ్యాలరీలో జనవరి 12న మొదలైన ఈ ప్రదర్శనలో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రముఖ చిత్రకారులు, ఫోటోగ్రాఫర్లు రూపొందించిన అద్భుతమైన కళాఖండాలను ప్రదర్శనకు ఉంచారు. విశేషమేమిటంటే, ఈ ప్రతిష్టాత్మక ప్రదర్శనకు సిద్దిపేట జిల్లాకు చెందిన సామేటి మహేష్ తీసిన ఛాయాచిత్రం ఎంపికైంది. పల్లె జీవనాన్ని, గ్రామీణ వాతావరణాన్ని మరియు సంస్కృతిని కళ్ళకు కట్టినట్లుగా సహజంగా ఆవిష్కరించిన ఈ చిత్రం సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. మహేష్ ప్రతిభపై పలువురు ప్రముఖ చిత్రకారులు ప్రశంసల వర్షం కురిపించారు. ఈ ప్రదర్శనను తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక మండలి వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, హైదరాబాద్ ఆర్ట్స్ సొసైటీ అధ్యక్షుడు రమణారెడ్డి, జే. వెంకటేశ్వర్లు, ప్రముఖ కళాకారులు కంది నరసింహులు, రాజేందర్, అనంతయ్య, సత్య గన్నోజు, మధు తదితరులు సందర్శించి కళాకృతులను ఆసక్తిగా తిలకించారు. ఈ కళా ప్రదర్శన ఈ నెల చివరి వరకు కొనసాగుతుందని, కళాభిమానులు, విద్యార్థులు, కళాకారులు పెద్ద సంఖ్యలో సందర్శించాలని నిర్వాహకులు కోరారు.

# ఐద్వా 14వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలి

## ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి నాగమణి




**మనసులో మాట - కరీంనగర్**

అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) 14వ జాతీయ మహాసభలు ఈ నెల 25 నుండి 28 తేదీల వరకు హైదరాబాదులోని ఆర్టీసీ కళ్యాణ మండపంలో వైభవంగా జరుగనున్నాయని, ఈ సందర్భంగా 25వ తేదీన హైదరాబాదు నగరంలోని ఎన్టీఆర్ గార్డెన్స్ ప్రాంగణంలో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేసినట్లు ఐద్వా జిల్లా కార్యదర్శి కోనేటి నాగమణి తెలిపారు. స్థానిక కోతి రాంపూర్ ముకుంద లాల్ మిశ్రా భవన్ లో. జాతీయ మహాసభల సందర్భంగా ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించడం జరిగింది ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల హక్కుల రక్షణ, సంక్షేమం, భద్రత, గౌరవం కోసం ఐద్వా నిరంతరం మిలిటెంట్ పోరాటాలను నడిపిందని,పసి పిల్లల నుండి వృద్ధుల వరకు మహిళలపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు, అత్యాచారాలు, వేధింపులపై రాజీ లేకుండా పోరాడిందని తెలిపారు.ప్రభుత్వాలు మహిళలను రెండవ పౌరురాలిగా చూస్తున్న పరిస్థితిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు కోనేటి నాగమణి తెలిపారు. స్త్రీ-పురుషులు సమానులే కానీ పాలక వర్గాలు మత భావాలను రెచ్చగొట్టి మహిళలను వంటింటికే పరిమితం చేయడానికి ప్రయత్నిస్తున్నాయని ,ఆ మనుస్మృతి మైండ్సెట్‌ను విసర్జించాలన్నారు.మహిళలకు 33% రిజర్వేషన్ పార్లమెంటు, అసెంబ్లీలలో అమలు చేయడంతో పాటు మహిళలకు పని ప్రదేశాలలో భద్రత కల్పించాలన్నారు.

# ఫార్మర్ రిజిస్ట్రీపై అపోహలు వద్దు..

- అది రైతుల మేలు కోసమే!
- గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి
- ప్రభుత్వ పథకాలు, రుణమాఫీ వర్తింపు కోసమే



**గజ్వేల్, జనవరి 13 (మనసులో మాట):**

"ఫార్మర్ రిజిస్ట్రీ" విధానంపై రైతులెవరూ ఆందోళన చెందవద్దని, కేవలం ప్రభుత్వ పథకాలను మరింత పకడ్బందీగా అమలు చేసేందుకే దీనిని తీసుకొచ్చామని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి స్పష్టం చేశారు. దీనిపై అనవసర గందరగోళం సృష్టించవద్దని సూచించారు. మంగళవారం మండల పరిధిలోని పిడిచెడ్ గ్రామంలో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, ఏడీఏ బాబు నాయక్‌తో కలిసి ఆయన ఎరువుల విక్రయ కేంద్రాన్ని ప్రారంభించారు.

### ఎరువుల నుంచి రుణమాఫీ దాకా..

ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. రబీ సాగుకు అవసరమైన ఎరువులను ప్రభుత్వం అందుబాటులో ఉంచిందని తెలిపారు. అయితే ఎరువులు పక్కదారి పట్టకుండా, దుర్వినియోగం కాకుండా ఉండేందుకే ఫార్మర్ రిజిస్ట్రీని తప్పనిసరి చేసినట్లు వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వ్యవసాయ పథకాలు, వివిధ రాయితీలు, రుణమాఫీ వంటివి అర్హులైన రైతులకు నేరుగా వర్తింపజేయడానికి ఈ యాప్ ఉపయోగపడుతుందని చెప్పారు. రైతులంతా వెంటనే వ్యవసాయ సిబ్బందిని సంప్రదించి, తమ వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఖరీఫ్ సీజన్‌లో రైతుల నుంచి సేకరించిన సన్నధాన్యానికి సంబంధించిన బోనస్ డబ్బులను విడుదల చేసినట్లు తెలిపారు. క్వింటాకు రూ. 500 చొప్పున అదనపు బోనస్‌ను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు వివరించారు. అన్నదాతల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు పెద్దిరెడ్డి అశోక్ రెడ్డి, నాయకులు సుఖేందర్ రెడ్డి, మొనగారి రాజు, రవీందర్ రెడ్డి, కొండల్ రెడ్డి, గాడిపల్లి శ్రీనివాస్, కరుణాకర్ రెడ్డి, నర్సింహారెడ్డి, రాజశేఖర్ రెడ్డి, పిడిచెడ్ గ్రామ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్యల పరిష్కారానికే 'ప్రజా బాట'

- గృహజ్యోతి లబ్ధిదారులకు ధ్రువపత్రాల పంపిణీ
- రూరల్ జోనల్ చీఫ్ ఇంజనీర్ బాలస్వామి
- పాత స్తంభాల తొలగింపు.. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు
- నిరంతర సరఫరాకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశం
- చిన్న శంకరంపేట మండలం జంగరాయిలో పర్యటన



**చిన్న శంకరంపేట, జనవరి 13 (మనసులో మాట):**

గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకే రాష్ట్ర ప్రభుత్వం 'ప్రజా బాట' కార్యక్రమాన్ని చేపట్టిందని తెలంగాణ రాష్ట్ర దక్షిణ జిల్లాల విద్యుత్ శాఖ రూరల్ జోనల్ చీఫ్ ఇంజనీర్ యు. బాలస్వామి తెలిపారు. మంగళవారం ఆయన చిన్న శంకరంపేట మండలం జంగరాయి గ్రామంలో పర్యటించి, ప్రజా బాట కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలోని విద్యుత్ సమస్యలపై సర్పంచ్ ఆవుల గోపాల్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాలస్వామి మాట్లాడుతూ.. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు అర్హులైన లబ్ధిదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ (గృహ జ్యోతి) ధ్రువపత్రాలను అందజేశామన్నారు. వినియోగదారులందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలు ఉంటే సిబ్బంది దృష్టికి తీసుకురావాలని, వాటిని వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలోని పలు వీధుల్లో ఉన్న పురాతన విద్యుత్ స్తంభాలను తొలగించి, వాటి స్థానంలో కొత్త స్తంభాలను బిగించినట్లు తెలిపారు. అలాగే నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశామన్నారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా నిరంతర పర్యవేక్షణ ఉండాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఆవుల గోపాల్ రెడ్డి, విద్యుత్ శాఖ ఎస్.ఈ., డి.ఈ రామేశ్వర స్వామి, ఏ.డి.ఈ మోహన్ బాబు, ఏ.ఈ దివాకర్, ఇతర విద్యుత్ శాఖ సిబ్బంది, ఉప సర్పంచ్ మహేష్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శ గ్రామాలే లక్ష్యంగా.. స్వచ్ఛభారత్

**చిన్నశంకరంపేట మండలంలో సర్పంచుల పారిశుధ్య పనులు**

**స్వయంగా పాల్గొన్న సర్పంచులు, పాలకవర్గ సభ్యులు**

**పలు గ్రామాల్లో వీధుల శుభ్రం**



**చిన్న శంకరంపేట, జనవరి 13 (మనసులో మాట):**

మండలంలోని గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా (మోడల్ విలేజ్) తీర్చిదిద్దడమే లక్ష్యంగా సర్పంచులు నడుం బిగించారు. ఇందులో భాగంగా మంగళవారం చిన్న శంకరంపేట మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. వాడవాడలా పరిశుభ్రత గజగట్లపల్లి, ఎస్. కొండాపూర్, ఖాజాపూర్, వెంకట్రావుపల్లి, మలుపల్లి, మిర్జాపల్లి, కామారం తండా తదితర గ్రామాల్లో ఈ కార్యక్రమం జరిగింది. ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ పాలకవర్గ సభ్యులతో కలిసి వీధులను, మురికి కాల్వలను శుభ్రం చేశారు. పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారానే ఆరోగ్యం సిద్ధిస్తుందని చాటిచెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు బండారి నాగభూషణం, బాలస్వామి, సునీత యాదగిరి, మోహన్ నాయక్, మల్లేష్, నరేష్, ఆయా గ్రామాల ఉప సర్పంచులు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

**రోడ్డు ప్రమాద మృతుడు కల్లప్ప పటేల్ కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే షిండే పరామర్శ**

**మద్నూర్ మండలం రాచూర్‌లో విషాదం**

**బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ తోడుంటుందని భరోసా**

**కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించిన హన్మంత్ షిండే**



**జుక్కల్, జనవరి 13 (మనసులో మాట):**

మద్నూర్ మండలం రాచూర్ గ్రామానికి చెందిన కల్లప్ప పటేల్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే అన్నారు. మంగళవారం ఆయన రాచూర్ గ్రామానికి వెళ్లి, కల్లప్ప పటేల్ కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి మనోధైర్యాన్ని కల్పించారు. ఈ సందర్భంగా షిండే మాట్లాడుతూ.. కల్లప్ప పటేల్ అకాల మరణం ఆ కుటుంబానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కష్టకాలంలో బీఆర్ఎస్ పార్టీ బాధితులకు అండగా నిలుస్తుందని, కుటుంబానికి అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మద్నూర్ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు బన్సీ పటేల్, బిచ్కుంద మాజీ సొసైటీ చైర్మన్ నాల్చర్ బాలాజీ (బాలన్న), తదితరులు పాల్గొన్నారు.

# జూలపల్లికి '108' కావాలి..

**కలెక్టర్‌కు సర్పంచ్ వినతి**

**13 గ్రామాల ప్రజల ఇబ్బందులను అధికారుల దృష్టికి తెచ్చిన అనూష**

**అత్యవసర సమయంలో ప్రైవేట్ వాహనాలే దిక్కు**

**పెద్దపల్లి, కరీంనగర్ వెళ్లాలంటే 30 కిలోమీటర్ల దూరం**

**వెంటనే వాహనాన్ని మంజూరు చేయాలని విజ్ఞప్తి**



**జూలపల్లి, జనవరి 13 (మనసులో మాట):**

పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండల కేంద్రంలో 108 అంబులెన్స్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని కోరుతూ గ్రామ సర్పంచ్ పాతకుల అనూష.. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (ఐవీ&ఎూ) డాక్టర్ ప్రమోద్‌లకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ అనూష మాట్లాడుతూ.. మండల పరిధిలోని 13 గ్రామాల ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంబులెన్స్ సౌకర్యం లేకపోవడంతో ఆపద సమయంలో, ప్రమాదాలు జరిగినప్పుడు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. మెరుగైన వైద్యం కోసం సుమారు 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న పెద్దపల్లి లేదా కరీంనగర్ ఆసుపత్రులకు వెళ్లాలంటే సమయం వృథా అయ్యి ప్రాణాల మీదికి వస్తోందని, ముఖ్యంగా రాత్రి వేళల్లో పరిస్థితి దారుణంగా ఉందని వివరించారు. ప్రజల ప్రాణాలను, క్షేత్రస్థాయి సమస్యలను దృష్టిలో ఉంచుకుని జూలపల్లికి తక్షణమే 108 వాహనాన్ని మంజూరు చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో జూలపల్లి మార్కెట్ కమిటీ తొలి చైర్మన్ పాతకుల అనిల్, సూర్య రిపోర్టర్ తాటిపెల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

**రుద్రారంలో అవగాహన సదస్సు - ఎస్సై నారాయణ గౌడ్**

**కుటుంబ సభ్యులను చైతన్యపరచాల్సిన బాధ్యత విద్యార్థులదే**


**వాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలి**

**రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా పోటీల నిర్వహణ**




**చిన్నశంకరంపేట, జనవరి 13 (మనసులో మాట):**

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని చిన్నశంకరంపేట ఎస్సై నారాయణ గౌడ్ సూచించారు. రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా మంగళవారం మండలంలోని రుద్రారం గ్రామంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో యువతకు, గ్రామస్తులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్నతనం నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలన్నారు. తద్వారా తమ ఇంట్లోని కుటుంబ సభ్యులను, తల్లిదండ్రులను చైతన్యపరిచే అవకాశం ఉంటుందని తెలిపారు. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, ఇది ప్రాణ రక్షణ కవచంలా పనిచేస్తుందని స్పష్టం చేశారు. మాసోత్సవాల్లో భాగంగా ప్రతి గ్రామంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని ఎస్సై తెలిపారు. అలాగే విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్‌పై డ్రాయింగ్, స్పీచ్ (ఉపన్యాస) పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సంతోష నవీన్ కుమార్, ఉప సర్పంచ్ నర్సింలు, వార్డు సభ్యులు, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



# మిర్జాపల్లిలో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి భూసేకరణ

**భారీ వాహనాల రాకపోకలకు ఇబ్బందులు**

**మరో మార్గం కోసం అధికారుల పరిశీలన)**

**కొత్త బ్రిడ్జి కోసం విజ్ఞప్తి చేసిన గ్రామస్తులు**

**రైల్వే, రెవెన్యూ అధికారుల క్షేత్రస్థాయి పర్యటన**

**స్థలాన్ని చూపిస్తే నివేదిక పంపుతామని అధికారుల వెల్లడి**

**చిన్నశంకరంపేట, జనవరి 13 (మనసులో మాట):**

చిన్న శంకరంపేట మండలంలోని మిర్జాపల్లి గ్రామానికి వెళ్లే మార్గంలో ఉన్న అండర్ రైల్వే బ్రిడ్జి నుంచి భారీ వాహనాలు వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రస్తుతం డబుల్ రైల్వే ట్రాక్ పనులు జరుగుతున్న నేపథ్యంలో, రవాణా సౌకర్యం కోసం మరో అండర్ గ్రౌండ్ రైల్వే బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్తులు ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. గ్రామస్తుల విజ్ఞప్తికి స్పందించిన రైల్వే అధికారులు మంగళవారం గ్రామంలో పర్యటించారు. తహసీల్దార్‌తో కలిసి రైల్వే అధికారులు బ్రిడ్జి నిర్మాణానికి, భూసేకరణకు అనువైన స్థలాన్ని పరిశీలించారు. అయితే, ప్రతిపాదిత స్థలంలో కొందరు భూయజమానులు స్థలాన్ని ఇచ్చేందుకు నిరాకరించారు. దీంతో గ్రామస్తులంతా ఏకమై చర్చించుకుని, ఏకాభిప్రాయంతో స్థలాన్ని చూపిస్తే.. భూసేకరణ ప్రక్రియ చేపట్టి రైల్వే ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని అధికారులు స్పష్టం చేశారు.

# రెండో వన్డేలో టీమిండియాలో భారీ మార్పులు

**నేడు రాజ్‌కోట్‌లో భారత్, న్యూజిలాండ్‌ల మధ్య రెండో వన్డే**




రాజ్‌కోట్‌లో భారత్, న్యూజిలాండ్‌ల మధ్య నేడు జరగనున్న రెండో వన్డే మ్యాచ్ చాలా ప్రత్యేకం. మొదటి మ్యాచ్ గెలిచిన ఇండియా ఇప్పటికే సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో ఉంది. శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలోని భారత జట్టు రెండో మ్యాచ్ కూడా గెలిస్తే, 3 మ్యాచ్‌ల సిరీస్‌లో 2-0తో తిరుగులేని ఆధిక్యాన్ని సాధిస్తుంది. మరో వన్డే మిగిలి ఉండగానే సిరీస్ సొంతం చేసుకుంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో భారత క్రికెట్ టీమ్ మేనేజ్‌మెంట్ పటిష్టమైన, బ్యాలెన్స్‌డ్ టీమిండియా ప్లేయింగ్ ఎలెవెన్‌ను బరిలోకి దించాలని చూస్తోంది. అయితే, రెండో వన్డేకి ముందు భారత జట్టుకు ఒక ఎదురుదెబ్బ తగిలింది. ఆల్ రౌండర్ వాషింగ్టన్ సుందర్ గాయం కారణంగా సిరీస్ నుంచి వైదొలిగాడు. వడోదరలో జరిగిన తొలి వన్డేలో బౌలింగ్ చేస్తుండగా సుందర్ కు సైడ్ స్ట్రెయిన్ సమస్య వచ్చింది. ఆ తర్వాత మెడికల్ టీం సలహా మేరకు మిగిలిన రెండు మ్యాచ్‌లకు విశ్రాంతి ఇచ్చారు. సుందర్ లేకపోవడం జట్టు కూర్పుపై కొత్త చర్చకు దారితీసింది. వాషింగ్టన్ సుందర్ సిరీస్ నుంచి దూరం కావడంతో భారత జట్టు 26 ఏళ్ల ఆయుష్ బదోనిని వన్డే జట్టులోకి తీసుకుంది. ఇప్పుడు రాజ్‌కోట్‌లో బదోనికి భారత్ తరపున వన్డేల్లో అరంగేట్రం చేసే అవకాశం లభించనుంది. ఇండియాకు 5వ స్థానంలో పరుగులు చేయగల, బౌలింగ్ లో కూడా సహాయపడే ఆల్ రౌండర్ అవసరం ఉంది. బదోని ఈ విభాగానికి సరిగ్గా సరిపోతాడు.ఆయుష్ బదోని దేశవాళీ క్రికెట్‌లో నిలకడగా రాణిస్తున్నాడు. విజయ్ హజారే ట్రోఫీ 2025-26లో ఢిల్లీ తరపున బ్యాట్, బాల్ రెండింటితోనూ సహకరించాడు. రైల్వేస్‌తో జరిగిన మ్యాచ్‌లో కీలక సమయాల్లో వికెట్లు తీసి తన ఆల్ రౌండ్ ప్రతిభను కూడా ప్రదర్శించాడు. అతని వద్ద ఆఫ్ స్పిన్ బౌలింగ్ ఎంపిక ఉంది, ఇది రాజ్‌కోట్ పిచ్‌పై ఉపయోగకరంగా ఉంటుంది. జట్టులో నితీష్ కుమార్ రెడ్డి, ధ్రువ్ జురెల్ వంటి ప్రత్యామ్నాయాలు కూడా ఉన్నాయి. అయితే రెడ్డి ఒక ఫాస్ట్ బౌలింగ్ ఆల్ రౌండర్ మరియు జట్టు ఇప్పటికే ముగ్గురు ఫాస్ట్ బౌలర్లతో బరిలోకి దిగే యోచనలో ఉంది. అదే సమయంలో, జురెల్ వికెట్ కీపర్-బ్యాట్స్‌మన్ మరియు బౌలింగ్ చేయడు, ఇది జట్టు సమతుల్యతను దెబ్బతీస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో బదోనికి ప్రాధాన్యత ఇవ్వడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది. రెండో వన్డే కోసం ఇండియా పెద్దగా మార్పులు చేసే మూడ్‌లో కనిపించడం లేదు. అంటే లెఫ్ట్ ఆర్మ్ ఫాస్ట్ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ మరోసారి ప్లేయింగ్ లెవన్ నుంచి దూరమయ్యే అవకాశం ఉంది.

**భారత్ ప్లేయింగ్ ఎలెవన్ అంచనా:**

రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), విరాట్ కోహ్లీ, శ్రేయాస్ అయ్యర్, కెఎల్ రాహుల్ (వికెట్ కీపర్), ఆయుష్ బదోని, రవీంద్ర జడేజా, హర్షిత్ రాణా, కుల్దీప్ యాదవ్, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ.

## రిటైర్మెంట్ ప్రకటించిన ఆస్ట్రేలియా కెప్టెన్ అలీసా హీలీ




ఆస్ట్రేలియా దిగ్గజ క్రికెటర్ అలీసా హీలీ తన రిటైర్మెంట్ ప్రకటించడం క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. భారత్‌తో జరగనున్న సిరీస్ తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్-బై చెప్పబోతున్నట్లు ఆమె స్వయంగా వెల్లడించింది. ఆటపై ఉండాల్సిన పోటీతత్వం తగ్గిందని భావించడం వల్లే ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు హీలీ పేర్కొంది. ఈ నిర్ణయాన్ని మంగళవారం జరిగిన ఓ పాడ్‌కాస్ట్‌లో తెలిపింది. ఫిబ్రవరి 15 నుంచి భారత్‌తో ప్రారంభమయ్యే సిరీస్ మ్యాచ్ ఆమెకు చివరిది. ఇందులోభాగంగా 3 టీ 20, 3 వన్డేలు, పెర్త్ వేదికగా 1 టెస్ట్ మ్యాచ్ ఆడనుంది. తన కెరీర్‌ను స్వదేశంలో భారత్ జట్టుపై ముగించడం ఆనందంగా ఉందని ఆమె ఆశాభావం వ్యక్తం చేసింది. "ఆస్ట్రేలియా తరఫున ఆడటం అంటే నాకు చాలా ఇష్టం. కానీ ఆటపై ముందు నుంచి ఉన్న పోటీ తత్వం ఇప్పుడు లేదు. అందుకే ఆట నుంచి రిటైర్ అవ్వాలని నిర్ణయించుకున్నాను. భారత్?తో ఇక ముందు జరిగే టీ 20 మ్యాచ్?లో నేను ఆడటంలేదు. కానీ స్వదేశంలో భారత్‌తో ఆఖరి సారిగా వన్డే ,టెస్ట్ మ్యాచ్?లను ఆడే అవకాశం నాకు లభించినందుకు చాలా సంతోషంగా ఉంది" అని అలీసా హీలీ తెలిపారు.హీలీ తమ టీమ్? అందరినీ, వారితో కలిసి ఆడే ఆటను, అలానే జెర్సీని ఎంతో మిస్? అవుతానని తెలిపింది." నా జట్టుతో కలిసి ఆడే ఆట, చేసే అల్లరిని, నా గేమ్?ను చాలా మిస్? అవుతాను. రిటైర్? అయిన తర్వాత నా దేశానికి ప్రాతినిధ్యం వహించే అవకాశం ఉండదు. చివరి సారిగా ఈ జెర్సీని ధరించి ఆడే అవకాశం లభించినందుకు నేను కృతజ్ఞురాలిని" అని హీలీ అన్నారు. తాను గత కొన్ని సంవత్సరాలుగా గాయాలతో పోరాడటం చేస్తున్నట్లు, అది మానసికంగా తీవ్ర ప్రభావం చూపిందని హీలీ చెప్పింది. "కొన్ని గాయాల కారణంగా, నేను కొన్నిసార్లు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. దాని కారణంగా ఆడేటప్పుడు శక్తి క్రమంగా తగ్గిపోయేది. ఈ క్రమంలో మళ్లీ పుంజుకోవడం కష్టంగా మారింది" అని తెలిపింది. వయసు పెరిగే కొద్దీ ఇంతకు ముందు ఉన్నంత పోటీ తత్వం తనలో లేదని క్రమంగా తగ్గుతుందని అమె అన్నారు. "నాలో మ్యాచ్ ఆడాలలన్న పోటీతత్వం ఉండేది. నేను పోటీపడాలనుకుంటాను, గెలవాలనుకుంటాను , మైదానంలో నన్ను నేను సవాల్ చేసుకోవాలనుకుంటాను. కానీ నాకు కొంచెం వయసు పెరిగే కొద్దీ, ఇంతకు ముందు ఉన్నంత పోటీ తత్వం నాలో లేదు. క్రమంగా తగ్గుతూ వస్తుంది" అని ఆమె స్పష్టం చేసింది. అలీసా హీలీ రిటైర్మెంట్ ప్రకటనపై క్రికెట్ ఆస్ట్రేలియా సీఈఓ టాడ్ గ్రీన్‌బర్గ్ స్పందించారు. మహిళా క్రికెట్ చరిత్రలో హీలీని అత్యుత్తమ క్రీడాకారిణిగా అభివర్ణించారు. "అలిస్సా ఈ ఆట చరిత్రలో అత్యుత్తమ క్రీడాకారిణులలో ఒకరు . తన 15 ఏళ్ల కెరీర్‌లో మైదానంలోనూ, బయట కూడా ఎంతో సహకారాన్ని అందించారు. ఆస్ట్రేలియన్ క్రికెట్ తరఫున, నేను అలిస్సాకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఎంతో మందికి స్ఫూర్తినిచ్చి, తనతో పాటు ఆట తీరును కూడా మార్చింది" అని గ్రీన్‌బర్గ్ అన్నారు. గత పది సంవత్సరాలుగా మహిళా క్రికెట్‌లో ఆస్ట్రేలియా ఆధిపత్యంలో హీలీ కీలక పాత్ర పోషించింది. ఎనిమిది ప్రపంచ టైటిళ్లను అందుకున్న జట్లలో ఆమె ఉన్నారు. వాటిలో ఆరు టీ20 ఫార్మాట్‌లో, రెండు వన్డే క్రికెట్లో విజయాలు ఉన్నాయి. ఆస్ట్రేలియా తరఫున హీలీ 10 టెస్టులు, 123 వన్డేలు, 162 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడింది. ఆమె ఇప్పటివరకు టెస్టుల్లో 30.56 సగటుతో 489 పరుగులు, వన్డేలలో ఏడు సెంచరీలతో 35.98 సగటున 3563 పరుగులు, టీ20లలో ఒక సెంచరీతో 25.45 సగటుతో 3054 పరుగులు చేసింది.

## జనవరి 15 నుంచి అండర్-19 వరల్డ్ కప్

**భారత్, పాకిస్థాన్, ఆస్ట్రేలియా టైటిల్ ఫేవరెట్లుగా బరిలోకి..**




క్రికెట్ లవర్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఐసీసీ మెన్స్ అండర్-19 క్రికెట్ ప్రపంచకప్ 2026 సమరం మరికొన్ని రోజుల్లో ప్రారంభం కానుంది. ఈసారి ఈ మెగా టోర్నీకి జింబాబ్వే, నమీబియా దేశాలు సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్నాయి. జనవరి 15న ప్రారంభం కానున్న ఈ టోర్నమెంట్ ఫిబ్రవరి 6 వరకు సాగనుంది. మొత్తం 16 జట్లు నాలుగు గ్రూపులుగా విడిపోయి టైటిల్ కోసం తలపడనున్నాయి. యువ క్రికెటర్ల ప్రతిభను ప్రపంచానికి చాటే ఈ వేదికపై భారత్ తన ఆధిపత్యాన్ని నిరూపించుకోవడానికి సిద్ధంగా ఉంది. ఈ టోర్నీలో పాల్గొనే 16 జట్లను ఐసీసీ నాలుగు గ్రూపులుగా విభజించింది. గ్రూప్-ూ లో ఆస్ట్రేలియా, ఐర్లాండ్, జపాన్, శ్రీలంక ఉండగా.. గ్రూప్-దీ లో డిఫెండింగ్ ఛాంపియన్ ఇండియా, బంగ్లాదేశ్, న్యూజిలాండ్, అమెరికా ఉన్నాయి. గ్రూప్-జ లో ఇంగ్లాండ్, పాకిస్థాన్, స్కాట్లాండ్, ఆతిథ్య జింబాబ్వే పోటీపడుతున్నాయి. గ్రూప్-ఐలో ఆఫ్ఘనిస్థాన్, సౌతాఫ్రికా, టాంజానియా, వెస్టిండీస్ జట్లు తలపడనున్నాయి. ప్రతి గ్రూప్ నుంచి మొదటి మూడు స్థానాల్లో నిలిచిన జట్లు సూపర్ సిక్స్ దశకు చేరుకుంటాయి. ఈ టోర్నీలో భారత జట్టు తన ప్రయాణాన్ని జనవరి 15న అమెరికాతో జరిగే మ్యాచ్‌తో ప్రారంభించనుంది. ఈ మ్యాచ్ బులవాయోలోని క్వీన్స్ స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జరగనుంది. ఆ తర్వాత జనవరి 17న బంగ్లాదేశ్‌తో, జనవరి 24న న్యూజిలాండ్‌తో టీమిండియా తలపడనుంది. గ్రూప్ దశలో భారత్ ఆడే మ్యాచులన్నీ బులవాయోలోనే నిర్వహించనున్నారు. అత్యంత విజయవం తమైన జట్టుగా పేరున్న భారత్, ఈసారి కూడా ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. ఈ ప్రపంచకప్ కోసం మొత్తం ఐదు స్టేడియా లను ఎంపిక చేశారు. జింబాబ్వేలోని హరారే స్పోర్ట్స్ క్లబ్, తకాషింగా స్పోర్ట్స్ క్లబ్, బులవాయోలోని క్వీన్స్ స్పోర్ట్స్ క్లబ్‌లో మ్యాచులు జరుగుతాయి. నమీబియాలోని వినోఅబశ్రీశ్రీక్‌లో ఉన్న నమీబియా క్రికెట్ గ్రౌండ్, హెచ్‌పీ ఓవల్‌లో మరికొన్ని మ్యాచులు నిర్వహిస్తారు. సూపర్ సిక్స్ దశ ముగిసిన తర్వాత టాప్-2 జట్లు సెమీ ఫైనల్స్‌కు చేరుకుంటాయి. మొదటి సెమీ ఫైనల్ ఫిబ్రవరి 3న, రెండో సెమీ ఫైనల్ ఫిబ్రవరి 4న జరగనుండగా.. గ్రాండ్ ఫినాలే ఫిబ్రవరి 6న హరారేలో జరగనుంది. గ్రూప్ దశ ముగిసిన వెంటనే జనవరి 25 నుంచి సూపర్ సిక్స్ మ్యాచులు ప్రారంభమవుతాయి. ఈ దశలో జట్లు తమ సత్తా చాటి సెమీస్ బెర్త్ దక్కించుకోవడానికి తీవ్రంగా శ్రమిస్తాయి. యువ ఆటగాళ్లు తమ కెరీర్‌ను మలుపు తిప్పుకునే గొప్ప అవకాశం కావడంతో ప్రతి మ్యాచ్ హోరాహోరీగా సాగే అవకాశం ఉంది. ముఖ్యంగా భారత్, పాకిస్థాన్, ఆస్ట్రేలియా వంటి జట్లు టైటిల్ రేసులో ముందు వరుసలో ఉన్నాయి. క్రికెట్ అభిమానులకు వచ్చే మూడు వారాల పాటు అసలైన వినోదం లభించనుంది.




## బెంగళూరు వరుసగా రెండో విజయం

మహిళల ప్రీమియర్ లీగ్?లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వరుసగా రెండో విజయం నమోదు చేసింది. యూపీ వారియర్స్‌తో జరిగిన మ్యాచ్?లో ఆర్సీబీ 9 వికెట్ల తేడాతో గ్రాండ్? విక్టరీ కొట్టింది. యూపీ నిర్దేశించిన 144 పరుగుల లక్ష్యాన్ని ఆర్సీబీ 12.1 ఓవర్లలో అలవోకగా ఛేదించింది. గ్రేస్ హారిస్ (85 పరుగులు; 40 బంతుల్లో) ధనాధన్ ఇన్నింగ్స్‌కు తోడు స్మృతి మంధాన (47లి పరుగులు) రాణించింది. యూపీ బౌలర్లలో షిఖా పాండేకు 1 వికెట్ దక్కింది. ఓ మోస్తారు ఛేదనలో ఆర్సీబీ దూకుడుగా ఆడింది. ముఖ్యంగా ఆర్సీబీ ఓపెనర్ గ్రేస్ (85 పరుగులు; 40 బంతుల్లో 10ఇ4, 5ఇ6) ధనాధన్ ఇన్నింగ్స్?తో రఫ్ఫాడించింది. ముఖ్యంగా డాటిన్ వేసిన ఆరో ఓవర్‌లో హారిస్ చెలరేగింది. వరుసగా 4, 6, 4, 6, 6, 4 బాది 22 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసింది. ఆమెకు తోడుగా స్మృతి కూడా ఆకట్టుకుంది. ఈ ఇద్దరి జోరుకు ఆర్సీబీ 10 వికెట్ల తేడాతో నెగ్గేలా కనిపించింది. కానీ జట్టు స్కోర్ 137 పరుగుల వద్ద హారిస్ భారీ షాట్?కు ప్రయత్నించి శిఖా బౌలింగ్?లో ఔటైంది. ఆ తర్వాత రిచా ఘోష్ (4) మ్యాచ్ పూర్తి చేసింది. అంతకుముందు యూపీ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 143 పరుగులు చేసింది. దీప్తి శర్మ (45లి పరుగులు; 35 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్), డియాండ్రా డాటిన్ (40లి; 37 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. మెగ్ లానింగ్ (14 పరుగులు), ఫోబ్ లిచ్‌ఫీల్డ్ (20 పరుగులు), హర్లీన్ డియోల్ (11 పరుగులు) పరుగులు చేశారు. ఒక దశలో 7 ఓవర్లకు 39/1తో ఉన్న యూపీ తర్వాత ఎనిమిది బంతుల వ్యవధిలో 4 వికెట్లు కోల్పోయింది. దీంతో యూపీ 50 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో దీప్తి, డాటిన్ యూపీని ఆదుకున్నారు. ఈ జోడీ ఐదో వికెట్‌కు 70 బంతుల్లో 93 పరుగులు జోడించింది. ఆర్సీబీ బౌలర్లలో నాడైన్ డి క్లెర్క్, శ్రేయాంక పాటిల్ చెరో 2, లారెన్ బెల్ 1 వికెట్ దక్కించుకుంది. ఆర్సీబీకి ఇది వం-సగా రెండో విజయం కాగా, యూపీకి వరుసగా రెండో ఓటమి.

## భారత్‌లో టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌లు ఆడబోము

**మరోసారి స్పష్టం చేసిన బంగ్లాదేశ్ ప్రభుత్వం**



వచ్చే నెల భారత్‌లో జరిగే టీ-20 ప్రపంచ కప్పులో పాల్గొనడంపై బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు వైఖరి మారడం లేదు. భారత్‌లో మ్యాచ్‌లు ఆడబోమని మరోసారి తేల్చిచెప్పింది. ఐసీసీతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఇదే విషయాన్ని స్పష్టం చేసినట్లు వెల్లడించింది. తాము ఆడే మ్యాచ్‌లను మరో దేశానికి తరలించాలన్న డిమాండ్‌ను పునఃపరిశీలించాలని బంగ్లాదేశ్‌ను ఐసీసీ కోరింది. భద్రతాపరమైన ఆందోళనలను మరోసారి ప్రస్తావిస్తూ ఈ విషయంలో తమ వైఖరి మారదని ఐసీసీకి చెప్పినట్లు దీజదీ తెలిపింది. తమ ఆటగాళ్ల భద్రతే తమకు ముఖ్యమని పేర్కొంది. టోర్నమెంట్ షెడ్యూల్ ఖరారు కావడం జట్లకు విమాన, హోటల్ గదుల టికెట్లు బుక్ చేయడంతో బీసీసీ తన వైఖరి పునఃపరిశీలించుకోవాలని ఐసీసీ విజ్ఞప్తి చేసింది. అయితే ఈ విషయంలో ఆమోదయోగ్యమైన పరిష్కారాల కోసం ఇరుపక్షాల చర్చలు కొనసాగుతాయని వెల్లడించింది. ఆటగాళ్ల భద్రతను కారణంగా చూపుతూ తమ మ్యాచ్‌లను మరో దేశానికి మార్చాలని కోరుతూ ఇప్పటికే పలుమార్లు ఐసీసీకి దీజదీ విజ్ఞప్తి చేసింది. ఐసీసీ ఆ విజ్ఞప్తులను తిరస్కరిస్తూ వస్తోంది. ఇదిలా ఉండగా, భారత్‌లో టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌లు ఆడడంలో బంగ్లా ఆటగాళ్లకు భద్రత పరంగా ఏ ఇబ్బందీ ఉండదని ఐసీసీ ఓ నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. అయితే భారత్‌కు తమ ఆటగాళ్లను పంపలేమనడానికి బీసీబీ చెబుతున్న కారణాల పట్ల సంతృప్తి చెందలేదని తెలుస్తోంది. బంగ్లా ఆటగాళ్లకు భారత్‌లో ముప్పు వాటిల్లేందుకు ఆస్కారం పెద్దగా లేదని ఐసీసీ నివేదికలో తేలింది. ఇక ఫిబ్రవరి 7న ఆరంభమయ్యే టీ20 ప్రపంచకప్‌నకు భారత్‌తో పాటు శ్రీలంక ఆతిథ్యమిస్తోంది. షెడ్యూల్ ప్రకారం టీ20 ప్రపంచ కప్‌లో బంగ్లాదేశ్ ఈడెన్ గార్డెన్స్ వేదికగా ఫిబ్రవరి 7న వెస్టిండీస్, 9న ఇటలీ, 14న ఇంగ్లాండ్, 17న వాంఖడేలో నేపాల్‌తో మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. గతేడాది ఛాంపియన్స్ ట్రోఫీ కోసం టీమ్?ఇండియా తమ దేశానికి రానందుకు, ఈ టోర్నీ కోసం పాక్ జట్టు భారత్?లో పర్యటించడం లేదు. తన మ్యాచ్?లను శ్రీలంకలో ఆడబోతోంది. మరోవైపు, కొద్దిరోజులుగా భారత్- బంగ్లా మధ్య దౌత్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ఆ దేశంలో హిందువులపై జరుగుతున్న దాడులు, ఈ క్రమంలో బంగ్లా పేసర్? ము-స్తాఫిజుర్‌ను ఐపీఎల్ జట్టు కోల్‌కతా నైట్‌రైడర్స్ వేలంలో ఎంచుకోవడంపై భారత అభిమానుల్లో తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. దీంతో బీసీసీఐ ఆదేశాల మేరకు కేకేఆర్ అతడిని విడుదల చేయడంతో, భారత్‌లో తమ ఆటగాళ్ల భద్రత మీద ఆందోళన వ్యక్తం చేస్తూ తమ మ్యాచ్?లను సైతం శ్రీలంకకు తరలించాలని బీసీబీ, ఐసీసీని కోరింది. కానీ, భారత్‌లో పరిస్థితులు, బంగ్లా ఆటగాళ్ల భద్రతపై తమ ప్రతినిధులతో అధ్యయనం చేయించింది ఐసీసీ. ఈ నేపథ్యంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పింది. ఇదే విషయాన్ని బీసీబీకి స్పష్టం చేయనున్న నేపథ్యంలో బంగ్లా జట్టు టీ20 ప్రపంచకప్ కోసం భారత్‌కు రానున్నట్లు తెలుస్తోంది. టోర్నీని బహిష్కరిస్తే ఆ జట్టు మ్యాచ్‌ల తాలూకు పాయింట్లు ప్రత్యర్థులకు వెళ్తాయి. అంతేకాదు ఐసీసీ క్రమశిక్షణ చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. అంతకుముందు, బంగ్లాదేశ్ పేసర్ ముస్తాఫిజుర్ రహమాన్?ను ఐపీఎల్ నుంచి తప్పించడంతో వివాదం ముదిరింది. భారత్ వేదికగా జరగనున్న టీ20 వరల్డ్?కప్ కోసం తమ జట్టును పంపేందుకు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు నిరాకరించింది. తమ జట్టు మ్యాచ్‌లను భారత్?లో కాకుండా శ్రీలంకకు షిఫ్ట్ చేయాలని ఐసీసీకి అధికారికంగా లేఖ రాసినట్లు బంగ్లా బోర్డు తెలిపినట్లు కథనాలు వెలువడ్డాయి. ఐపీఎల్ 2026 మినీ వేలంలో రికార్డు ధర రూ.9.2 కోట్లకు ముస్తాఫిజుర్‌ను కేకేఆర్ దక్కించుకుంది. రెహమాన్ 2016లో ఐపీఎల్‌లోకి ఎంట్రీ ఇచ్చాడు. 60 మ్యాచ్‌లాడి 65 వికెట్లు తీశాడు. కాగా, బంగ్లాదేశ్‌లో హిందువులపై వరుస దాడులు జరుగుతున్న నేపథ్యంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలోనే ఐపీఎల్‌లో బంగ్లాదేశ్ ఆటగాళ్లను తీసుకోవడంపై విమర్శలు వచ్చాయి. ఈ విషయంపై గురువారం బీసీసీఐ వర్గాలు స్పందించినట్లు వార్తలు వచ్చాయి.

# మనశంకరవరప్రసాద్.... తొలిరోజు 84 కోట్లు వసూళ్లు




'పండగకు వస్తున్నాం.. హిట్ కొడుతున్నాం..' అంటూ సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకువచ్చి సందడి చేశారు చిరంజీవి. అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన 'మన శంకరవరప్రసాద్ గారు' జనవరి 12న విడుదలైంది. ప్రీమియర్స్ నుంచే ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌కు హిట్ టాక్ రావడంతో మొదటిరోజు వసూళ్లపై అందరిలోను ఆసక్తి నెలకొంది. తాజాగా ఆ వివరాలను నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటించింది. ప్రీమియర్స్‌తో కలిపి మొదటి రోజు ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ.84 కోట్లు వసూలుచేసినట్లు వెల్లడించింది. 'మన శంకరవరప్రసాద్ గారు' బాక్సాఫీస్‌ను బద్దలు కొట్టేశారంటూ పోస్టర్‌ను పంచుకుంది. చిరంజీవి సరసన నయనతార నటించిన ఈ సినిమాలో వెంకటేశ్ అతిథి పాత్రలో సందడి చేశారు. కథేంటంటే..: శంకరవరప్రసాద్(చిరంజీవి)నేషనల్ సెక్యూరిటీ ఆఫీసర్. కేంద్రమంత్రి శర్మ (శరత్ సక్సేనా) రక్షణ బాధ్యతల్ని చూస్తుంటాడు. మంత్రి కూడా శంకరవరప్రసాద్‌ని తన కుటుంబసభ్యుడిలా చూస్తుంటాడు. భార్య శశిరేఖ (నయనతార) నుంచి వరప్రసాద్.. విడిపోయిన సంగతి తెలుసుకుని, ఓ బోర్డింగ్ స్కూల్‌లో చదువుతున్న తన పిల్లలతో కలిసి గడిపేలా ఏర్పాట్లు చేస్తాడు మంత్రి. పీఈటీగా ఆ స్కూల్‌లోకి అడుగుపెట్టిన శంకరవరప్రసాద్ తన పిల్లలకు చేరువయ్యాడా? అసలు భార్యతో ఎందుకు విడిపోయాడు? వాళ్ల పెళ్లి ఎలా జరిగింది? ఊహ తెలియని వయసులోనే తండ్రికి దూరమైన పిల్లలకు శంకరవరప్రసాదే తమ తండ్రి అనే విషయం ఎప్పుడు తెలిసింది?కర్ణాటకకు చెందిన మైనింగ్ బిజినెస్‌మ్యాన్ వెంకీ గౌడ (వెంకటేశ్)కీ, శశిరేఖకీ సంబంధం ఏమిటి? విడిపోయిన భార్యాభర్తలు తిరిగి కలుసుకున్నారా, లేదా? తదితర విషయాల్ని తెరపై చూసి తెలుసుకోవాల్సిందే.



## ఆనాటి ఘటన గుర్తు చేసుకున్న పార్వతి తిరువోతు

తమిళ నటి ఆ పార్వతి తిరువోతు ఓ సినిమా షూటింగ్ లో తనకు జరిగిన చేదు సంఘటన గురించి చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. తమిళ్ లో ధనుష్ హీరోగా 2013లో మరియన్ అనే సినిమా వచ్చింది. భరత్ బాలా దర్శకత్వం వహించిన ఈ సినిమా అప్పట్లో సూపర్ హిట్ గా నిలిచింది. ఈ సినిమా షూటింగ్ గురించి మాట్లాడుతూ ' నేను తమిళంలో 'మరియన్' అనే సినిమాలో నటించాను. షూటింగ్ మొదటి రోజు షూటింగ్ లో హీరో ధనుష్ తో లవ్ సీన్ చేస్తున్నాను ఆ సీన్ లో నన్ను పూర్తిగా నీళ్లలో ముంచేశారు. వాళ్ళు నాపై నీళ్లు పోస్తున్నారు. సీన్ సరిగా రాలేదని మళ్ళీ మళ్ళీ నీళ్లు పోస్తూనే ఉన్నారు. అప్పుడు చాలా ఇబ్బంది పడ్డాను. కానీ నా చుట్టూ ఎవరూ నన్ను జాగ్రత్తగా చూసుకోలేదు. ఒకానొక సమయంలో నేను వాళ్ళ దగ్గరికి తిరిగి వెళ్లి హోటల్ కి వెళ్లి బట్టలు మార్చుకుని వస్తాను కాస్త బ్రేక్ ఇవ్వండి అని చెప్పను. వాళ్ళు కాదు అది సాధ్యం కాదు అని అన్నారు. నాకు ఇంకా ఓపిక నశించి గట్టిగా అరుస్తూ ' నేను పీరియడ్స్ లో ఉన్నాను. నేను వెళ్లాలి అని అరిచాను. వాళ్ళు ఏమనుకుంటారోనని కూడా నేను అసలు ఆలోచించలేదు. అప్పుడు సెట్ లో 50 మంది ఉన్నారు. వాళ్ళలో ముగ్గురు మాత్రమే అమ్మాయిలు. అవేవి పట్టించుకోకుండా నేను వెళ్ళిపోయానన్నారు. బట్టలు మార్చుకుందామన్న అదనంగా డ్రెస్ తెచ్చుకోక పోవడంతో ఇబ్బంది పడ్డానని వివరించారు.




## వివాదంలో యశ్ టాక్సిస్

### మహిళా కమిషన్ నోటీసులు

కన్నడ స్టార్ నటుడు యశ్ హీరోగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న 'టాక్సిక్' చిత్రం ప్రస్తుతం వివాదంలో చిక్కుకుంది. ఈ సినిమా టీజర్‌ను ఇటీవల చిత్రబృందం విడుదల చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ సినిమా టీజర్‌లో అశ్లీలతతో పాటు అభ్యంతరకర సన్నివేశాలు ఎక్కువగా ఉన్నాయంటూ ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు కర్ణాటక రాష్ట్ర మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఆప్ రాష్ట్ర కార్యదర్శి ఉషా మోహన్ ఈ ఫిర్యాదులో పేర్కొంటూ.. టీజర్‌లోని దృశ్యాలు పిల్లల మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపేలా ఉన్నాయని, తక్షణమే ఈ టీజర్‌ను సామాజిక మాధ్యమాల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించిన మహిళా కమిషన్ వెంటనే రంగంలోకి దిగింది. టీజర్‌లోని అభ్యంతరకర దృశ్యాలను క్షుణ్ణంగా పరిశీలించి, తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా సెన్సార్ బోర్డుకు లేఖ రాసింది. అంతేకాకుండా, దీనిపై పూర్తిస్థాయి నివేదికను సమర్పించాలని ఆదేశించింది. 'ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోనప్స్' అనే ఉపశీర్షికతో రూపొందుతున్న ఈ చిత్ర గ్లింప్స్‌లో ఇంటిమేట్ సన్నివేశాలు ఎక్కువగా ఉండటంతో నెట్టింట పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. అయితే ఈ విమర్శలపై దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ కాస్త ఘాటుగానే స్పందించారు. ఒక మహిళా దర్శకురాలు అయ్యుండి ఇలాంటి సన్నివేశాలను ఎలా చిత్రీకరించారు అంటూ వస్తున్న కామెంట్లను చూసి తాను ఏమాత్రం ఆశ్చర్యపోవడం లేదని, ఆ విమర్శలను తాను చాలా తేలిగ్గా తీసుకుంటున్నానని ఆమె స్పష్టం చేశారు.

## మీనాక్షి చౌదరి పండగ సందడి

### అనగనగా ఒకరాజుతో మళ్లీ నేడు రాక

టాలీవుడ్‌లో 'లక్కీ హీరోయిన్'గా పేరు తెచ్చుకున్న అందాల భామ మీనాక్షి చౌదరి ప్రస్తుతం వరుస సినిమాలతో ఫుల్ జోష్‌లో కొనసాగుతోంది. గత ఏడాది సంక్రాంతికి విడుదలైన 'వస్తున్నాం' సినిమాతో భారీ విజయాన్ని తన ఖాతాలో వేసుకున్న ఆమె, ఇప్పుడు మరోసారి పండగ సీజన్‌ను టార్గెట్ చేస్తోంది. యంగ్ హీరో నవీన్ పోలిశెట్టితో కలిసి నటించిన తాజా చిత్రం 'అనగనగా ఒక రాజు' తో ఈసారి కూడా ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన టీజర్, ట్రైలర్, పాటలు మంచి స్పందన తెచ్చుకోగా, ప్రమోషన్స్‌లో మీనాక్షి చౌదరి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ముఖ్యంగా ప్రీ రిలీజ్ ఈవెంట్స్, ఇంటర్వ్యూల్లో ఆమె మాట్లాడిన సరదా వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.ఇటీవల ఓ ప్రమోషనల్ ఈవెంట్‌లో తనకు కాబోయే భర్త గురించి మాట్లాడిన మీనాక్షి చౌదరి, కొన్ని ఆసక్తికరమైన 'కండిషన్స్' పెట్టి అందరినీ నవ్వులు పూయించింది. తన భర్త డాక్టర్, నటుడు లేదా మిస్టర్ ఇండియా మాత్రం అసలు కాకూడదని స్పష్టం చేసింది. తాను ఇప్పటికే సినిమా రంగంలో ఉన్నానని, ఇంట్లో మరోసారి అదే ప్రొఫెషన్ అవసరం లేదని చమత్కారంగా వ్యాఖ్యానించింది. అంతేకాదు, తన జీవిత భాగస్వామికి 100 ఎకరాల పొలం ఉండాలి అంటూ చెప్పిన మాటలు ఈవెంట్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వ్యవసాయం, పల్లెటూరి వాతావరణం అంటే తనకు చాలా ఇష్టమని తెలిపింది. ఇక ఇంటి పనుల విషయంలో కూడా మీనాక్షి తన స్టైల్‌లో కండిషన్స్ పెట్టింది. వంట చేయడం, బట్టలు ఉతకడం, ఐరన్ చేయడం వంటి పనులు రావాలని చెప్పి నవ్వులు పూయించింది. అబ్బాయికి గతంలో బ్రేకప్స్ ఉన్నా తనకు ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే పొడవుగా ఉండాలని మాత్రం కచ్చితంగా చెప్పింది. రోజుకు రెండు మూడు సార్లు లవ్ ప్రపోజ్ చేస్తూ, గిఫ్ట్స్ ఇచ్చే వ్యక్తే తన 'రాజు' అంటూ సరదాగా పేర్కొంది. ఇటీవల కొంతకాలంగా మీనాక్షి చౌదరికి టాలీవుడ్ హీరోలతో ప్రేమాయణం ఉందంటూ పలు రూమర్స్ వినిపించాయి. అయితే వాటన్నింటినీ ఆమె ఖండిస్తూ, పూర్తిగా అబద్ధమని కొట్టి పారేసింది. ప్రస్తుతం తన పూర్తి ఫోకస్ సినిమాలపైనే ఉందని స్పష్టం చేసింది. 'అనగనగా ఒక రాజు' సినిమాతో పాటు మీనాక్షి చౌదరి ఇతర భాషల్లోనూ బిజీగా ఉంది. కోలీవుడ్ స్టార్ హీరో విక్రమ్ నటిస్తున్న 63వ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తోంది. అలాగే తమిళంలో 'వృషకర్మ' అనే చిత్రంలోనూ కీలక పాత్ర పోషిస్తోంది.



## జపాన్‌లో పుష్ప-2 విడుదల

### జపాన్ చేరుకున్న హీరో అల్లు అర్జున్

ఇండియన్ బాక్సాఫీస్‌ను షేక్ చేసిన 'పుష్పరాజ్' ఇప్పుడు జపాన్ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యాడు. జనవరి 16న జపాన్‌లో 'పుష్ప 2: ది రూల్' భారీ స్థాయిలో విడుదల కానున్న నేపథ్యంలో, ఈ చిత్ర ప్రమోషన్ల కోసం బన్నీ స్వయంగా రంగంలోకి దిగారు. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన కుటుంబంతో కలిసి జపాన్ రాజధాని టోక్యోకు చేరుకున్నారు. సోమవారం హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో భార్య స్నేహా రెడ్డి, పిల్లలు అయాన్, అర్హలతో కలిసి కనిపించిన బన్నీ టోక్యో చేరుకున్నట్లు తెలుస్తుంది. టోక్యోలోని తన హోటల్ గది నుంచి నగర అందాలను చూపిస్తూ అల్లు అర్జున్ సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటో ప్రస్తుతం వైరల్ అవుతోంది.సినిమా విషయానికి వస్తే.. జపాన్ పంపిణీ సంస్థలు 'గీక్ పిక్చర్స్', 'షోచికూ' సంయుక్తంగా ఈ చిత్రాన్ని అక్కడ విడుదల చేస్తున్నాయి. జపాన్ ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యేలా ఈ సినిమాను అక్కడ 'పుష్ప కున్రిన్' అనే టైటిల్‌తో విడుదల చేస్తున్నారు. ఇప్పుడు జపాన్ మార్కెట్‌ను కూడా కొల్లగొట్టడం ద్వారా ఇండియన్ సినిమా ఖ్యాతిని మరింత పెంచాలని మైత్రీ మూవీ మేకర్స్ ఎ÷-లాన్ చేస్తున్నారు.

## ఇద్దరు భామల పాత కథకు... కొత్త కథనం

### హాస్యోచితంగా భర్త మహాశయులకు విజ్ఞప్తి మూవీ



ఓ కుటుంబ కథని ఎంచుకుని రవితేజ చేసిన సినిమానే 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' సున్నితమైన కథలకు పెట్టింది పేరైన కిశోర్ తిరుమల దర్శకుడు కావడంతో రవితేజని కొత్తగా చూసే అవకాశం ఉంటుందనే ఆశ ప్రేక్షకుల్లో కలిగింది. రామ్ సత్యనారాయణ (రవితేజ), బాలామణి (డింపుల్ హయాతి) భార్యాభర్తలు. తన భర్త రామ్‌పై బాలామణికి ఎంతో నమ్మకం. తను తప్ప వేరే ప్రపంచం తెలియని మనిషి అనుకుంటుంది. తన కుటుంబానికి చెందిన వ్యాపార వ్యవహారాల్లో భాగంగా రామ్ స్పెయిన్ వెళ్లాల్సి వస్తుంది. అక్కడ అనుకోకుండా మానస శెట్టి (ఆషికా రంగనాథ్)తో బంధం ఏర్పడుతుంది. తనకి పెళ్లయ్యిందనే విషయాన్ని దాచి మరీ, తనని తాను సత్య అని పరిచయం చేసుకుని మానసకు దగ్గరవుతాడు. ఏమీ జరగనట్టే ఇంటికి తిరిగొచ్చిన రామ్ సత్యనారాయణ తనపై తన భార్య చూపిస్తున్న ప్రేమతో అప్పుడప్పుడూ అపరాధ భావానికి గురవుతుంటాడు. ఇంతలోనే స్పెయిన్ నుంచి మానస ఇండియాకి వస్తుంది. ఆమె వచ్చాక ఏం జరిగింది? ఇద్దరి మధ్య బంధం కొనసాగిందా? భార్య బాలామణికి ఈ విషయం తెలిసిందా?రామ్ అలియాస్ సత్యకు పెళ్లయ్యిందనే విషయం తెలిశాక మానస ఏం చేసింది? తదితర విషయాల్ని తెరపై హృద్యంగా చిత్రీకరించారు. ఇద్దరమ్మాయిల మధ్య నలిగిపోయిన చాలా మంది కథానాయకుల్ని, కథల్ని గుర్తు చేస్తుంది ఈ చిత్రం. కానీ, హాస్యంపై మాత్రం ప్రత్యేకంగా దృష్టిపెట్టారు. సందర్భోచితమైన హాస్యంతో సినిమా సరదా సరదాగా సాగుతూ, మంచి కాలక్షేపాన్నిస్తుంది. కిశోర్ తిరుమల సినిమాల్లో కథానాయకులు సరికొత్తగా కనిపిస్తుంటారు. ఈ సినిమా లోనూ అదే పునరావృతమైంది. రవితేజ కొత్తగానే కనిపించారు. ఆయన లుక్, పాత్రలో ఒదిగిపోయిన తీరు, అలవోకగా ఆయన వినోదం పంచిన తీరు బాగుంది. ఆయన గత సినిమాలతో పోలిస్తే ఇది ఎంతో ఉపశమనం. స్పెయిన్ నేపథ్యంలో కథ మొదలవుతుంది. సత్య, వెన్నెల కిశోర్, సునీల్ తదితరులతో రవితేజ చేసే హంగామా బాగా నవ్విస్తుంది. మానస శెట్టి ఇండియాకి వచ్చినప్పటి నుంచి సినిమా మరింత సందడిగా మారిపోతుంది. విరామ సన్నివేశాల వరకూ సినిమా ఆసక్తికరంగా అనిపిస్తుంది. ఆ తర్వాతే కథలో సంఘర్షణ తగ్గింది. మానస శెట్టికి తోడుగా మరో శెట్టి పాత్ర తోడై సన్నివేశాలు సాగిపోతాయే తప్ప కథలో మాత్రం కొత్తగా మారేదేమీ ఉండదు. తొలి సగభాగం తరహాలోనే కథానాయకుడు ఇద్దరు హీరోయిన్ల మధ్య నలిగిపోవడం కనిపిస్తుంటుంది. కాకపోతే బాబాయ్ అంటూ త్రినేత్ర పాత్ర చేసే హంగామా కాస్త నవ్వుల డోసుని పెంచుతుంది. స్పెయినా.. పెయినా.. అంటూ కథలో కొత్త టెన్షన్ మొదలవుతుంది. దాంతో పతాక సన్నివేశాల్లో సంఘర్షణ మోతాదు పెరుగుతుందేమో అనుకుంటాం. కానీ, అందుకు భిన్నంగా ఇలాంటి సమస్యలకు ఓ కొత్త పరిష్కారాన్ని చూపించి.. కథానాయకుడితో ఓ కొత్త విషయాన్ని చెప్పించి కథని ముగించారు. చాలా సార్లు చూసినట్టుగా, అసలు ఉందా లేదా అనిపించే కథతోనే దర్శకుడు నవ్వులు పండించాడు. సోషల్ మీడియాను అనుసరించే వాళ్లను ఇందులోని సంభాషణలు మరింత అలరిస్తాయి. పాటలకు తగ్గట్టుగా సన్నివేశాల రచన సాగలేదనిపిస్తుంది. మొత్తంగా కాలక్షేపానికి ఏమాత్రం ఢోకా లేదు. రవితేజ హుషారైన నటన ఈ సినిమాకి ప్రత్యేక ఆకర్షణ. పాత్రలో ఒదిగిపోయి, స్వేచ్ఛగా నవ్వులు పండించారు. ఆయన డ్యాన్సులు ఆకట్టుకుంటాయి. కథానాయికలు డింపుల్ హయాతి, ఆషికా రంగనాథ్ పర్వాలేదనిపిస్తారు. ఆషికా ట్రెండీగా కనిపించింది. 'వామ్మో వాయ్యో' పాటలో ఇద్దరి డ్యాన్స్ ఆకట్టుకుంటుంది. సునీల్, వెన్నెల కిశోర్, సత్య, మురళీధర్ గౌడ్, రోహన్.. పాత్రల నేపథ్యంలో పండిన కామెడీ ఈ సినిమాకి హైలైట్. సాంకేతిక విభాగాల్లో సినిమాటోగ్రఫీ, సంగీతం బాగా కుదిరాయి.

CHIEF EDITOR BY **KANCHARLA ATCHUTA RAO** PUBLISHED AND OWNED BY KANCHARLA UPENDRA. D.NO. 1-86-3/LIG-230/5, SECTOR 5, MVP COLONY, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 530017. RNI.Title.Code:-APTEL/25/42169. PRINTED BY **CHAITANYAVARADHI** PRINTERS D.NO. 3-39, BHARNIKAM VILLAGE & POST, PARAVADA MANDAL, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 531021. E-MAIL: kancharlamediaprint@gmail.com CELL: 8374758861